

ఈనాడు



విజయవాడ 30-1-2026 శుక్రవారం సిటీ సంపుటి 52 . సంచిక 170

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 12 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

రూ.4 లక్షల సమీపానికి కిలో వెండి



ఈనాడు వాణిజ్య విభాగం: బంగారం, వెండి ధరలు గురువారమూ గణనీయంగా పెరిగినా, తదుపరి కాస్త తగ్గాయి. అంతర్జాతీయంగా ఔన్సు (31.10 గ్రాముల) బంగారం ధర 25 డాలర్లు పెరిగి 5330 డాలర్లకు చేరగా, ఔన్సు వెండి ధర కూడా 1 డాలరు అధికమై 114 డాలర్లను మించింది. ఫలితంగా రాత్రి 11.55 గంటలకు హైదరాబాద్ బులియన్ విపణిలో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్ల) బంగారం ధర రూ.1,79,700 వద్ద, కిలో వెండి ధర రూ.3,99,600 వద్ద స్థిరపడ్డాయి. బుధవారం రాత్రి ఈ ధరలు రూ.1,73,300, రూ.3,79,700 కావడం గమనార్హం.

అనిశ్చితిలోనూ పరుగే!


వచ్చే ఏడాది ఆర్థిక వృద్ధి రేటు 6.8% నుంచి 7.2%

- వాణిజ్య ముప్పులు, అంతర్జాతీయ ఒడుదొడుకులున్నా ముందుకే..
- సామాజిక మాధ్యమాలపై వయసులవారీ నియంత్రణ అవసరం
- ఆరోగ్య సప్లిమెంట్లు ప్రత్యామ్నాయం కావు
- ప్రజల బ్యాలెన్స్ షీట్లు కళకళ ● ఆర్థిక సర్వేలో వెల్లడి
- పార్లమెంటులో ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్



దిల్లీ: అంతర్జాతీయంగా ఒడుదొడుకులు, వాణిజ్య ముప్పులు వెంటాడుతున్నా భారత్‌లో వచ్చే ఏడాది ఆర్థిక వృద్ధి రేటు పరుగులు తీయనుందని ఆర్థిక సర్వే వెల్లడించింది. అది ప్రపంచ సగటును మించి కొనసాగనుందని, అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న భారీ ఆర్థిక వ్యవస్థగా తన స్థానాన్ని భారత్ నిలబెట్టుకోనుందని వివరించింది. 2026-27 ఏడాదిలో ఆర్థిక వృద్ధి రేటు 6.8% నుంచి 7.2% మధ్య ఉండవచ్చని తెలిపింది. అయితే వినియోగం, పెట్టుబడుల్లో స్వల్ప తగ్గుదల కారణంగా ప్రస్తుత ఆర్థిక ఏడాది (2025-26) వృద్ధి రేటైన 7.4% కంటే వచ్చే ఏడాది స్వల్పంగా నెమ్మదించనుంది. ప్రధాన ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ ఆధ్వర్యంలో రూపొందించిన 739 పేజీల 2025-26 ఆర్థిక సర్వేను గురువారం (మిగతా 3లో)

అమరావతి నిర్మాణం..
అరుదైన అవకాశం



- ముందు నుంచే అద్భుతంగా డిజైన్ చేసుకోవచ్చు
- సులభతర జీవనానికి భవిష్యత్ నగరం: ఆర్థిక సర్వే

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి నగర నిర్మాణం ఒక అరుదైన అవకాశమని ఆర్థిక సర్వే(2025-26) పేర్కొంది. సులభతర జీవనానికి ఇది భవిష్యత్ నగరంగా నిలుస్తుందని తెలిపింది. ఒక నగరం కిక్కిరిసిపోయాక, సేవల కొరత ఏర్పడ్డాక, అనధికార నిర్మాణాలు పెరిగాక మార్పులు, చేర్పులు చేయడం కంటే.. గ్రీన్‌ఫీల్డ్ నగరం ఏర్పాటు ద్వారా అక్కడి జీవన వ్యవస్థని ముందు నుంచే ప్రణాళికాబద్ధంగా డిజైన్ చేసుకునే అవకాశం ఉంటుందని వివరించింది. భారీ మౌలిక సౌకర్యాలపై ఆధారపడే నగరాలకంటే.. విద్య, ఇతర రంగాల అనుసంధానంతో ఏర్పడే నగరాలే వేగంగా వృద్ధి (మిగతా 3లో)

చిన్నప్పన్న వెనుక ఉన్న ‘పెద్దప్ప’ ఎవరు?

కల్తీ నెయ్యి కేసులో కీలక సూత్రధారులను వదిలేశారా?

లంచాలను ధ్రువీకరించి, అంతిమ లబ్ధిదారును తేల్చని సిట్

ఈ ప్రశ్నలకు బదులేది?

? తితిదే నెయ్యి కొనుగోళ్ల టెండర్ నిబంధనల్ని 2019 ఆగస్టులో పటిష్ఠం చేస్తూ అప్పటి ఈవో ఉత్తర్వులిస్తే, ప్రైవేటు డెయిరీలకు మేలు చేసేందుకు నాలుగు నెలల్లోనే 2019 డిసెంబర్‌లో వాటిని సడలిస్తూ అప్పటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో తితిదే పాలకమండలి ఎందుకు నిర్ణయం తీసుకుంది? డెయిరీ సంస్థల వార్షిక టర్నోవర్, పాల సేకరణ, నెయ్యి ఉత్పత్తి సామర్థ్యాన్ని తగ్గించడం వెనుక మర్మమేంటి? తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీ, ఇతర అవసరాలకు ప్రైవేటు డెయిరీలు కల్తీనెయ్యి సరఫరా చేసింది ఆ నిర్ణయం వల్లే కదా? తద్వారా సహకార డెయిరీలకు దారులు మూసేసి, ప్రైవేటు డెయిరీలకు రాచబాట పరిచారని చెప్పిన సిట్.. దానికి సూత్రధారి ఎవరో ఎందుకు తేల్చలేదు?

? కల్తీ నెయ్యి కుంభకోణంలో అప్పటి తితిదే ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సహాయకుడు చిన్నప్పన్న కీలక పాత్ర పోషించినట్టు నిర్ధారించిన సిట్.. అతని వెనుక ఉన్న ‘పెద్దప్ప’ ఎవరో, ప్రైవేటు డెయిరీల నుంచి లంచాల రూపంలో చిన్నప్పన్న తీసుకున్న డబ్బు ఏ ‘అంతిమ లబ్ధిదారు’కి చేరిందో ఎందుకు తేల్చలేదు?

? పెద్దల అండ, ప్రమేయం లేకుండానే ఛైర్మన్ పీఏ.. ఒక డెయిరీ యజమానిని దిల్లీ పిలిపించుకుని పంచాయితీ పెట్టగలడా? రూ.50 లక్షల కమీషన్ డిమాండ్ చేయగలడా? (మిగతా 3లో)

ఈనాడు - అమరావతి

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన, కోట్ల మంది శ్రీవారి భక్తుల మనోభావాల్ని దెబ్బతీసిన కల్తీనెయ్యి కుంభకోణంలో సిట్ జరిపిన దర్యాప్తుపై ఎన్నో ప్రశ్నలు ఎదురవుతున్నాయి. భక్తుల మనోభావాలను గాయపరిచిన ఆ కుంభకోణానికి అప్పటి తితిదే పాలకమండలి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి పీఏగా పనిచేసిన చిన్నప్పన్నతో పాటు తితిదే కింది స్థాయి అధికారులు కొందరు, కల్తీ నెయ్యి సరఫరా చేసిన డెయిరీల యజమానులను బాధ్యులుగా సిట్ పేర్కొంది. కానీ, ఈ మొత్తం వ్యవహారం వెనకున్న అసలు సూత్రధారులు, అంతిమ లబ్ధిదారులెవరో నిగ్గు తేల్చలేదని, దర్యాప్తు అసంపూర్తిగా ముగించిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. చిన్నప్పన్న వెనుక ఉండి నడిపించిన ‘పెద్దప్ప’ ఎవరు? కేవలం ఛైర్మన్ పీఏ హోదాలో లంచం అడిగితే (మిగతా 3లో)



కల్తీ నెయ్యి.. ‘హవాలా’లో లంచమియ్యి

ఊరికో ఏజెంట్‌ను పెట్టుకున్న భోలేబాబా డెయిరీ

సిట్ దర్యాప్తులో గుట్టు రట్టు 8లో

క్షమార్హం కాని ఘోరాపచారమిది! సంపాదకీయం 4లో

అశ్రునయనాల మధ్య అజిత్ పవార్ అంత్యక్రియలు

‘దాదా’కు కన్నీటి వీడ్కోలు

హాజరైన వారిలో అమిత్‌షా, ఫడణవీస్, శరద్ పవార్, నారా లోకేశ్ 11లో

నేతన్నలకు ఉచిత విద్యుత్తు

- ఏప్రిల్ 1 నుంచి అమలు
- చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు
- రాష్ట్రవ్యాప్తంగా లక్ష మందికి లబ్ధి
- చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో నేతన్నలకు ఏప్రిల్ 1 నుంచి ఉచిత విద్యుత్తు అందించనున్నట్లు చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత వెల్లడించారు. చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు పథకాన్ని వర్తింపజేయనున్నట్లు తెలిపారు. ఈ పథకంతో రాష్ట్రవ్యాప్తంగా 1.03 లక్షల మంది నేతన్నలకు (మిగతా 3లో)

అట్టహాసంగా ప్రారంభమైన అరకు ఉత్సవ్


హాజరైన మంత్రులు దుర్గేష్, సంధ్యారాణి 12లో

కేంద్ర విధానాలతో వ్యవసాయ రంగానికి విఘాతం

అఖిలభారత కిసాన్‌సభ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ 8లో

2029 నాటికి రూ.1.4 లక్షల కోట్ల
ఎన్‌హెచ్ ప్రాజెక్టులు

కోడూరు-ముప్పవరం కారిడార్ వచ్చే ఏడాదికి సిద్ధం చేయాలి



- రాష్ట్రంలో ఎన్‌హెచ్‌లన్నీ 4, 6 వరుసలుగా విస్తరించేలా ప్రణాళిక
- పోర్టులన్నీ హైవేలతో అనుసంధానం కావాలి
- ఆర్‌అండ్‌బీ రోడ్లలో ఎక్కడా గుంతలు కనిపించకూడదు
- సమీక్షలో సీఎం చంద్రబాబు

ఈనాడు - అమరావతి

బెంగళూరు నుంచి రాజధాని అమరావతికి కనెక్టివిటీ కల్పించే కోడూరు-ముప్పవరం ఎకనమిక్ కారిడార్ (బెంగళూరు-కడప-విజయవాడ హైవే) నిర్మాణం వచ్చే ఏడాదికి పూర్తిచేసి, అందుబాటులోకి తీసుకురావాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతం చేపట్టిన, డీపీఆర్ దశల్లో ఉన్న రూ.1.40 లక్షల కోట్ల విలువైన జాతీయ రహదారుల ప్రాజెక్టులన్నీ 2029కి పూర్తికావాలని ఆదేశించారు. గురువారం క్యాంప్ కార్యాలయంలో జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల ప్రాజెక్టులపై (మిగతా 3లో)

వన్యప్రాణుల సంరక్షణకు ముందుకు రావాలి

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపు 12లో

విశాఖ జూ సందర్శన ● రెండు జిరాఫీల దత్తత



జూలో జిరాఫీలకు ఆకులు తినిపిస్తున్న పవన్ కల్యాణ్

ఇదీ సంగతి!



కల్తీ గురించి అడిగితే ‘నేతిబీరలో నెయ్యుంటుందా..? నేతిలడ్డూల్లో నెయ్యి ఉండటానికి..!?’ అని క్లాస్ తీసుకున్నా సార్!

రాజ్ కెసిరెడ్డికి
హైకోర్టులో ఎదురుదెబ్బ



- మద్యం కేసులో బెయిల్ పిటిషన్ కొట్టివేత
- సహ నిందితులతో కలిసి ఆయన కుట్రకు పాల్పడ్డారు
- తీర్పులో హైకోర్టు స్పష్టీకరణ
- ముప్పిడి అవినాష్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషనూ కొట్టివేత
- శ్రీధర్‌రెడ్డి, వెంకటేష్‌నాయుడు, చెవిరెడ్డిలకు షరతులతో బెయిల్

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో చోటు చేసుకున్న మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి (ఏ1)కి హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. బెయిల్ కోసం ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టేసింది. మరో నిందితుడు ముప్పిడి అవినాష్‌రెడ్డి (ఏ7) ముందస్తు బెయిల్ పిటిషన్‌నూ తోసిపుచ్చింది. సజ్జల శ్రీధర్‌రెడ్డి (ఏ6), చెరుకూరి వెంకటేష్‌నాయుడు (ఏ34), వైకాపా మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి (ఏ38)లకు కఠిన షరతులతో బెయిల్ మంజూరు చేసింది. హైకోర్టు న్యాయమూర్తి (మిగతా 3లో)

ఆదరణ 3.0లో టైలర్లకు ఆధునిక కుట్టు మిషన్లు

మంత్రి సవిత వెల్లడి



ఈనాడు, అమరావతి: ఆదరణ 3.0 పథకంలో బీసీలకు ప్రాధాన్యమిస్తామని, వారికి ఆధునిక కుట్టు మిషన్లు అందిస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రితో టైలర్ల ఫెడరేషన్ ఛైర్మన్ ఆకాశపు స్వామి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 'త్వరలో రూ.1,000 కోట్లతో ఆదరణ 3.0 పథకాన్ని అమలు చేయనున్నాం. టైలర్లలో అన్ని సామాజిక వర్గాల వారు ఉన్నారు. వారందరికీ మేలు చేసేలా చర్యలు తీసుకుంటాం' అని వివరించారు.

నకిలీ మద్యం కేసులో అద్దేపల్లి సోదరులకు బెయిలు

ఉత్తర్వులిచ్చిన విజయవాడ ఎక్సైజ్ కోర్టు

ఈనాడు, అమరావతి: నకిలీ మద్యం కేసులో అద్దేపల్లి జనార్దనరావు (ఏ1), అద్దేపల్లి జగన్మోహన్‌రావు (ఏ2), బాలాజీ (ఏ3)లకు బెయిల్ మంజూరు చేస్తూ ఎక్సైజ్ కోర్టు గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. వీరు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్లపై వాదనలు ఇటీవలే ముగిశాయి. దీంతో న్యాయాధికారి లెనిన్ బాబు ఈ మేరకు తీర్పు ఇచ్చారు. మరో నిందితుడు తలారి రంగయ్య బెయిల్ పిటిషన్ గురువారం కోర్టులో విచారణకు వచ్చింది. దీనిపై ఇరుపక్షాల వాదనలూ పూర్తి అయ్యాయి. తీర్పును వచ్చే నెల 5వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. జోజేష్ (ఏ24), శిబు (ఏ25) బెయిల్ పిటిషన్లపై ఎక్సైజ్ పోలీసులు కౌంటర్లు దాఖలు చేశారు. తదుపరి విచారణను వచ్చే నెల 4వ తేదీకి న్యాయాధికారి వాయిదా వేశారు.

గ్రూప్-1 ఎంపిక జాబితా విడుదలకు ఏపీపీఎస్సీ చర్యలు

ఈనాడు, అమరావతి: గ్రూప్-1 తుది ఎంపిక జాబితా విడుదలకు ఏపీపీఎస్సీ కసరత్తు చేస్తోంది. రిజర్వేషన్ రోస్టర్ కేసులో స్టే లేకపోవడం, న్యాయస్థాన ఆదేశాలకు లోబడి ఫలితాలు ఇవ్వనుండటం హైకోర్టు అనుమతించిన నేపథ్యంలో ఫలితాల విడుదలకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే అభ్యర్థులకు ఇంటర్వ్యూలు పూర్తి చేసింది. క్రీడా కోటాకు సంబంధించిన కేసు ఉన్నప్పటికీ దీనిపైనా స్టే లేదు. రెండు పోస్టులను రిజర్వు చేయాలని ఆదేశాలు ఇచ్చినందున ఏపీపీఎస్సీ వర్గాలు పేర్కొన్నాయి. దీంతో గ్రూప్-2లో పాటించిన విధానాన్నే గ్రూప్-1లోనూ అమలు చేయాలని నిర్ణయించింది. గ్రూప్-1లో 81 పోస్టులకు 2023 డిసెంబరు 8న ప్రకటన విడుదల చేయగా.. 2024 మార్చి 17న ప్రిలిమ్స్ నిర్వహించారు. 2025 మేలో మెయిన్స్ నిర్వహించి, జూన్‌లో ఫలితాలు విడుదల చేశారు. జూన్ 23 నుంచి 30 వరకు ఇంటర్వ్యూలు జరిగాయి. కోర్టు కేసుల కారణంగా ఫలితాల విడుదలలో ఏడు నెలలకు పైగా జాప్యమవుతూ వస్తోంది.

స్థానిక భాషలే సంప్రదాయ విలువల రక్షా కవచాలు

- అందుకే మాతృభాషలో విద్య తప్పనిసరి
- 'భవిష్య భారతం..' సదస్సులో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్



విజయవాడలో జరిగిన భవిష్య భారతం సదస్సులో మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్. చిత్రంలో హరిశంకర్‌రెడ్డి, దూసి రామకృష్ణ

ఈనాడు, అమరావతి: 'లౌకిక, సామ్యవాదం, ప్రజాస్వామ్యం అన్నింటికీ భారతీయ విలువలే రక్షా కవచం. ఆ సంప్రదాయ విలువలు తరతరాలకు అందించాలంటే మాతృభాషలో విద్య తప్పనిసరి. ఆంగ్లం కోసం పోటీపడుతూ స్థానిక భాషలను నిర్లక్ష్యం చేయడం ప్రమాదకరం' అని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. ఆర్ఎస్ఎస్ వందేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా వివిధ రంగాల్లోని అనుభవజ్ఞులతో విజయవాడలో నిర్వహించిన 'భవిష్య భారతం- దృష్టి దిశ' సదస్సులో భాగవత్ ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. 'పిల్లలు భారతీయ భాషల్లో చదివితే సంస్కృతి, భావోద్వేగాలు, నైతిక విలువలు సహజంగా అబ్బుతాయి. ఈ మార్పు ప్రతి కుటుంబం నుంచి మొదలవ్వాలి. స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహిస్తే స్థానిక ఉపాధి, ఆర్థిక వృద్ధి సాధ్యమవుతుంది' అని స్పష్టంచేశారు.

సజ్జనశక్తి ఏకమవ్వాలి..

'మన దేశం, ధర్మం, సమాజంపై అనేక కుట్రలు జరుగుతున్నాయి. అడ్డుకోవాలంటే సజ్జనశక్తి ఏకమవ్వాలి' అని భాగవత్ అన్నారు. 'దేశం కోసం నిజాయతీగా పనిచేసే ప్రతి ఒక్కరూ సజ్జనశక్తిలో భాగమే. సంఘటిత సమాజ శక్తితో దుర్మార్గ రక్షిస్తూ, దేశాన్ని గౌరవ శిఖరాలకు చేర్చే శక్తిని ఆ భగవంతుడు ప్రసాదించాలని కోరుతున్నా. మన దేశంలో చెడుకంటే మంచి 40 రెట్లు ఎక్కువ జరుగుతున్నా.. అది వెలుగులోకి రావడంలేదు. మంచి పనుల వెనుక ఉన్నదే సజ్జనశక్తి. దీన్ని సమ్మిళితంలో పెడితే భారీ మార్పులు వస్తాయి. అందుకే సంస్థాగత విస్తరణ అవసరం. దేశ జనాభా 142 కోట్లపైగా ఉన్నా.. సంఘటితంగా ఉన్నవారు తక్కువే. దీన్ని సరిచేయాల్సిన అవసరం ఉంది. సజ్జనశక్తి ద్వారా హిందూ సమాజ బలం, హిందుత్వం బలం అందరికీ చెప్పాలి' అని పేర్కొన్నారు.

మాతో చేరండి..

ఆర్ఎస్ఎస్‌ను అర్థం చేసుకోవాలంటే దూరం నుంచి కాదు.. లోపలికి వచ్చి వాస్తవాలు తెలుసుకోవాలని భాగవత్ అన్నారు. 'సమాజ శ్రేయస్సుకు మాత్రమే పనిచేసే స్వార్థ రహితులు, ప్రభుతో ప్రత్యక్ష సంబంధం ఉన్న వారు సంఘటితం కావాలి. అలాంటి వారిని తీర్చిదిద్దడమే ఆర్ఎస్ఎస్ ప్రధాన లక్ష్యం. దీన్నే 'వ్యక్తి నిర్మాణం' అంటారు. ఇలాంటి వ్యక్తుల వల్ల దేశంలో ఐక్యత సహజంగా సాగుతుంది. హిందూ భావన అంటే ఇతరుల మార్గాలను గౌరవించడం, అన్ని మార్గాలనూ సత్యంగా అంగీకరించడం. ఇదే భారత సంప్రదాయం. ధర్మం అంటే కేవలం మతం కాదు. జీవన విధానం. కలిసి జీవించడం, కలిసి అడుగులు వేయడం, కలిసి ముందు సాగడం ఇదే ధర్మం. ఈ భావన ఆధారంగానే భారతీయ జీవన సంప్రదాయం రూపుదిద్దుకుంది. హిందుత్వం అంటే ఏకత్వ భావన. ఈ స్వభావాన్ని మన రుషులు అనుభవంతో గ్రహించారు. దీని ఆధారంగా ఏర్పడిన జీవన ధారే భారతీయ సంస్కృతి. అందుకే, చరిత్రలో ఎన్నో దాడులు, మార్పులు వచ్చినా మన దేశం మౌలికమైన ధర్మ భావనను ఏనాడూ వదల్లేదు. అదే భారతీయ ధర్మ పరంపర బలం' అని వెల్లడించారు.

★ ఆర్ఎస్ఎస్ ప్రాంత సహ సంఘచాలక్, ప్రముఖ రాఘవేంద్ర అధ్యక్షతన సదస్సులో దక్షిణ మధ్య క్షేత్ర సహ సంఘచాలక్ డి.రామకృష్ణ, ప్రాంత సంఘచాలక్ ఎన్.హరిశంకర్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు మోహన్, మురళీకృష్ణ, రామకృష్ణ, భరత్‌కుమార్, వెంకటేశ్, వేణుగోపాల్ నాయుడు, విజయ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు. సదస్సుకు హాజరైన వారి ప్రశ్నలకు ఆర్ఎస్ఎస్ చీఫ్ సమాధానాలు చెప్పారు. వేదిక వద్ద 'పంచ్ ఆరెస్సెస్ ప్రస్థానం'పై చిత్ర ప్రదర్శన, ఏవీ ఏర్పాటు చేశారు.

అమరావతిలో రూ.165.33 కోట్లతో న్యాయ అకాడమీ

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని అమరావతి అభివృద్ధిలో కీలక ముందడుగు పడింది. రాజధాని స్పోర్ట్స్ సిటీ పరిధిలోని పిచుకలపాలెంలో న్యాయ అకాడమీ నిర్మాణానికి ప్రభుత్వం రూ.165.33 కోట్లకు పరిపాలనా అనుమతి ఇచ్చింది. ఇందులో న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయశాఖ అధికారులు ప్రపంచ స్థాయి శిక్షణ పొందేలా సదుపాయాలు కల్పించనున్నారు. ఈ విషయాన్ని సీఆర్‌డీఏ అధికారులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

జగన్ అధికారానికి తగరు

- మళ్లీ పాదయాత్ర అంటే ఎవరూ నమ్మరు
- రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి హామీ రక్షణ యాత్ర
- పీసీసీ అధ్యక్షురాలు షర్మిల



ఈనాడు, అమరావతి, గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: 'వైకాపా అధినేత జగన్‌కు అధికారం నప్పదు. తాను ముఖ్యమంత్రినైతే సంపూర్ణ మద్య నిషేధం అమలు చేస్తానని చెప్పి, కల్తీ మద్యం ప్రవేశపెట్టి, మాఫియాను సృష్టించారు. రుషికొండను బోడిగుండు చేశారు. అధికారంలోకి వస్తే ఆరు నెలల్లో నీటి పారుదల ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తానని చెప్పి మాట తప్పారని' మాజీ సీఎం జగన్‌పై పీసీసీ అధ్యక్షురాలు షర్మిల మండిపడ్డారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 'జగన్ ప్రజల్లో ఎప్పుడైనా తిరిగారా? కనీసం వాళ్ల పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులకైనా అందుబాటులో ఉన్నారా? ఎన్నికల ముందు సిద్ధం సభలు పెట్టి కొన్ని నెలలు తిరిగారు తప్పితే ఎప్పుడైనా కనిపించారా? ఏడాదిన్నర తర్వాత చేసే పాదయాత్రకు ఇప్పుడు ప్రకటనలు ఎందుకు? ఎవరిని మోసం చేద్దామని ఈ యాత్రలు? ఉపాధి హామీ పథకాన్ని చంపేయకుండా కేంద్రానికి వ్యతిరేకంగా యాత్ర చేయొచ్చు కదా?' అని నిలదీశారు. 'మనిషి నైజం తెలియాలంటే అధికారమిచ్చి చూడాలని అమెరికా మాజీ అధ్యక్షుడు అబ్రహాం లింకన్ అన్నారు. జగన్‌కు అధికారం ఇస్తే, రాష్ట్రం ఏమైందో చూశాం. అతనిలో స్వార్థం తగ్గి, మంచితనం పెరిగే వరకు దేవుడు, ప్రజలు ఆశీర్వదించరని' వ్యాఖ్యానించారు.

ఉపాధి హామీని పునరుద్ధరించాల్సిందే

ఉపాధి హామీ పథకాన్ని మళ్లీ అమలు చేయాలన్న డిమాండ్‌తో అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం బండ్లపల్లి నుంచి ఫిబ్రవరి 2న ఉపాధి హామీ రక్షణ యాత్ర ప్రారంభించనున్నట్లు షర్మిల వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పంచాయతీల మీదుగా సాగే ఈ యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను కాంగ్రెస్ నేతలతో కలిసి ఆమె ఆవిష్కరించారు. 'ఇదే బండ్లపల్లిలో 20 ఏళ్ల క్రితం అప్పటి యూపీఏ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించింది. దాని స్థానంలో తెచ్చిన వీబీ జీ రామ్ జీ బిల్లుకు రాష్ట్రంలోని కూటమి ఎంపీలు మద్దతిచ్చి, రాష్ట్ర వాటా నిధులు భరించడం భారమని కేంద్రానికి సీఎం చంద్రబాబు మొరపెట్టుకోవడం ద్వంద్వవైఖరి కాదా?' అని షర్మిల ప్రశ్నించారు.

301 బార్లకు లైసెన్సుల జారీకి మళ్లీ నోటిఫికేషన్

ఫిబ్రవరి 4వ తేదీ వరకూ దరఖాస్తులకు గడువు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో గతంలో మిగిలిపోయిన 301 బార్లకు లైసెన్సుల జారీ కోసం మళ్లీ నోటిఫికేషన్ విడుదల చేశామని.. ఆసక్తి కలిగిన వారు ఫిబ్రవరి 4వ తేదీ సాయంత్రం 6 గంటల వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్, హైబ్రిడ్ విధానాల్లో దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. 5వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఆయా జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో లాటరీ తీసి లైసెన్సుదారులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో 55, విశాఖపట్నం-52, గుంటూరు-42, నెల్లూరు- 27, పల్నాడు- 22, విజయనగరం, కృష్ణాలో 11 చొప్పున, శ్రీకాకుళంలో 10, బాపట్ల, కాకినాడలో 8 చొప్పున, అనంతపురం, ఏలూరు జిల్లాల్లో 7 చొప్పున, కడపలో 6, తూర్పుగోదావరి, డా.బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో 5 చొప్పున, చిత్తూరు, పార్వతీపురం మన్యం, తిరుపతి జిల్లాల్లో 4 చొప్పున, ప్రకాశం జిల్లాలో 3, అనకాపల్లి, కర్నూలు, శ్రీ సత్యసాయి జిల్లాల్లో 2 చొప్పున, నంద్యాల, అన్నమయ్య జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున బార్లకు లైసెన్సుల జారీ కోసం నోటిఫికేషన్ ఇచ్చామన్నారు.

హెచ్ఏఎల్ తదుపరి సీఎండీగా కోట రవి

ప్రభుత్వరంగ సంస్థల ఎంపిక బోర్డు సిఫార్సు



కోట రవి

ఈనాడు, దిల్లీ: దేశ వైమానిక రంగంలో ప్రముఖ ప్రభుత్వరంగ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ తదుపరి సీఎండీగా కోట రవి పేరును కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని ప్రభుత్వరంగ సంస్థల సెలక్షన్ బోర్డు నిర్ణయించింది. ప్రస్తుతం ఇదే సంస్థలో ఆపరేషన్స్ విభాగం డైరెక్టర్‌గా సేవలందిస్తున్న ఆయనకు సీఎండీగా పదోన్నతి కల్పించాలని గురువారం జరిగిన సమావేశంలో నిర్ణయించింది. ప్రస్తుతం ఈ పదవిలో ఉన్న డీకే సునీల్ పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో తదుపరి సీఎండీ ఎంపికపై సెలక్షన్ బోర్డు దృష్టి సారించింది. కోట రవి మెకానికల్ ఇంజినీరింగ్ చేశారు. అహ్మదాబాద్ ఐఐఎం పూర్వ విద్యార్థి. ఫ్రాన్స్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఏరోనాటిక్స్ స్పేషియల్‌లో శిక్షణ పొందారు. ఆయనకు వివిధ రంగాల్లో 30 ఏళ్ల అనుభవం ఉంది. ఎల్‌సీఏ తేజస్ నిర్వహణ బాధ్యతలను ఆయన నిర్వహించారు. 2024 నవంబరు నుంచి ఈయన హెచ్ఏఎల్ ఆపరేషన్స్ డైరెక్టర్ బాధ్యతల్లో ఉన్నారు. సీఎండీ పదవికి మొత్తం ఏడుగురు పోటీపడగా అందులో కోట రవిని బోర్డు ఎంపికచేసింది.

మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధికి కృషి

- ఆఫ్‌కాఫ్ ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి అచ్చెన్నాయుడు



మత్స్య సహకార సంఘాల సమాఖ్య ఛైర్మన్ రాంప్రసాద్, పాలకవర్గ సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు. చిత్రంలో మంత్రులు కొల్లు రవీంద్ర, సవిత, ఎమ్మెల్యే మాధవిరెడ్డి తదితరులు

విజయవాడ (కృష్ణలంక), న్యూస్‌టుడే: మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మత్స్య, పశు సంవర్ధక, వ్యవసాయ శాఖల మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య (ఆఫ్‌కాఫ్) ఛైర్మన్, పాలకవర్గ ప్రమాణస్వీకారం గురువారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగింది. ఆఫ్‌కాఫ్ ఛైర్మన్ యాటగిరి రాంప్రసాద్, వైస్ ఛైర్మన్, 11 మంది డైరెక్టర్లతో మంత్రి అచ్చెన్నాయుడు ప్రమాణం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం 35 ఏళ్ల పాటు మత్స్యకారులను కేవలం ఓటు బ్యాంకుగా పరిగణించారని, తెదేపా ఆవిర్భావం తర్వాతే ఎన్టీఆర్ వారికి రాజకీయ, ఆర్థిక, సామాజిక గుర్తింపు తెచ్చారని చెప్పారు. వైకాపా ప్రభుత్వం మత్స్యకారులకు డీజిల్ రాయితీ, ప్రమాద బీమా సరిగా ఇవ్వలేదని ఆరోపించారు. ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ 'ప్రతి మత్స్యకారుడిని ఒక పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. రాష్ట్రానికి ఉన్న సుదీర్ఘ తీరం వెంబడి లక్షల కుటుంబాలు మత్స్యకార వృత్తిలో జీవిస్తున్నాయి. వారి ప్రయోజనాలకు వ్యతిరేకంగా గత ప్రభుత్వం తెచ్చిన జీవో 217పై నాడు తెదేపా పోరాడింది. ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడ్డాక ఆ జీవోను రద్దు చేసింద'ని గుర్తుచేశారు. బీసీల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ, సీఎం చంద్రబాబు మత్స్యకారుల భృతిని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. సమాఖ్య నూతన ఛైర్మన్ యాటగిరి రాంప్రసాద్ మాట్లాడుతూ మత్స్యకార గ్రామాల్లో పర్యటించి, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మత్స్యశాఖ కమిషనర్ రామ్‌శంకర్‌నాయక్, ఎమ్మెల్యేలు మాధవిరెడ్డి, గుత్తా చైతన్యరెడ్డి, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి, కార్పొరేషన్ల ఛైర్మన్లు వీరంకి వెంకట గురుమూర్తి, ఎరుబోతు రమణారావు, పేరెపి ఈశ్వర్, పాపారావు, శ్రీధర్, జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



కోపంలోనూ పిల్లలను ఆ మాట అనకండి

కోపంలో అయినా సరే, పిల్లలను నువ్వెందుకూ పనికిరావని తిట్టకండి. అలా చేస్తే వారి ఆత్మవిశ్వాసం దెబ్బతింటుంది. నిజంగానే తాము అసమర్థులమన్న భావనతో వారు పెరుగుతారు. కాబట్టి మీ పిల్లలను తరచూ ప్రశంసిస్తూ, వారిలోని ప్రత్యేకతలేంటో వారికి గుర్తుచేస్తుండండి. దీనివల్ల ఎంతటి క్లిష్టమైన పరిస్థితులనైనా గెలవగలమన్న విశ్వాసం వారికి కలుగుతుంది.

– నిక్ హ్యూబర్, బిజినెస్ గ్రోత్ కోచ్



బాలల ప్రపంచ తెలుగు మహాసభల లోగోను ఆవిష్కరిస్తున్న పట్టాభిరామ్, సత్యకుమార్ యాదవ్, దామచర్ల జనార్దన్, గజల్ శ్రీనివాస్. వేదికపై కలెక్టర్ రాజాబాబు, ఆర్డీవో లక్ష్మీప్రసన్న తదితరులు

డిసెంబరులో బాలల ప్రపంచ తెలుగు మహాసభలు

ఒంగోలులో నిర్వహించాలని నిర్ణయం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: బాలల ప్రపంచ తెలుగు మహాసభలను ఈ ఏడాది డిసెంబరు 5, 6 తేదీల్లో ప్రకాశం జిల్లా ఒంగోలులో నిర్వహించాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన లోగోను మంత్రి సత్యకుమార్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు గురువారం ఆవిష్కరించారు. నగరంలోని కొప్పోలు రోడ్డులోగల నెక్స్ట్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూలులో ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఇప్పటివరకు ప్రపంచ తెలుగు మహాసభలు పెద్దలతో జరిగాయని, తొలిసారిగా 16 సంవత్సరాల లోపు బాలలతో నిర్వహిస్తున్నట్లు గజల్ శ్రీనివాస్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రహం అనుగ్రహం

30–1–2026 శుక్రవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, మాఘ మాసం, శుక్ల పక్షం

ద్వాదశి: ఉ.9-52 తదుపరి త్రయోదశి; **ఆర్ద్ర:** తె.3-04 తదుపరి పునర్వసు; **వర్జ్యం:** మ.12-25 నుంచి 1-55 వరకు; **అమృత ఘడియలు:** సా.5-41 నుంచి 7-11 వరకు; **దుర్ముహూర్తం:** ఉ.8-52 నుంచి 9-37 వరకు తిరిగి మ.12-36 నుంచి 1-21 వరకు; **రాహుకాలం:** ఉ.10-30 నుంచి 12-00 వరకు; **సూర్యోదయం:** ఉ.6.38; **సూర్యాస్తమయం:** సా.5.50

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	13.2	32.3
విజయనగరం	16.0	28.0
హైదరాబాద్	18.0	30.6
కడప	18.0	31.0
తాడేపల్లిగూడెం	18.0	33.0
అనంతపురం	18.0	34.3
విశాఖపట్నం	19.0	29.6
శ్రీకాకుళం	19.0	30.0
రాజమహేంద్రవరం	19.0	32.5
నల్గొండ	19.2	31.0
కర్నూలు	19.7	33.0
విజయవాడ	20.0	30.1
గుంటూరు	20.0	31.0
సూర్యాపేట	21.0	30.5
నరసాపురం	21.4	29.4
ఒంగోలు	21.6	30.3
నెల్లూరు	21.9	29.8

సమాజాన్ని చీల్చే ప్రమాదం

• యూజీసీ కొత్త నిబంధనలపై 'స్టే' విధిస్తూ సుప్రీంకోర్టు వ్యాఖ్య

దిల్లీ: ఉన్నత విద్యా సంస్థల్లో సమానత్వ భావనను పెంపొందించే లక్ష్యంతో విశ్వవిద్యాలయాల నిధుల సంఘం (యూజీసీ) ఇటీవల తీసుకొచ్చిన 'సమానత్వ కమిటీ'ల నూతన నిబంధనలపై సుప్రీంకోర్టు 'స్టే' విధించింది. కొత్త నిబంధనల్లో స్పష్టత కొరవడిందని, ర్యాగింగ్ సమస్యను చేర్చలేదని, వినియోగించిన భాష సరిగా లేదని అభిప్రాయపడింది. సమాజాన్ని చీల్చే ప్రమాదం కూడా ఉందని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ ధర్మాసనం గురువారం ఆందోళన వ్యక్తం చేసింది. నిబంధనల వివాదంపై దాఖలైన మూడు పిటిషన్లకు సంబంధించి మార్చి 19కల్లా స్పందనను తెలియజేయాలని కేంద్రం, యూజీసీలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు యూజీసీ(ఉన్నత విద్యాసంస్థల్లో సమానత్వ ప్రోత్సాహక) నిబంధనలు-2026 అమలును నిలిపివేయాలని ఆదేశించింది. అంతవరకు పాత నిబంధనలు(2012) అమల్లో ఉంటాయని పేర్కొంది. తదుపరి విచారణ మార్చి 19వ తేదీకి వాయిదాపడింది.



దుర్వినియోగానికి అవకాశం

సమానత్వ కమిటీ నూతన నిబంధనల్లోని కొన్ని అంశాలు తీవ్ర వివాదానికి దారి తీశాయి. ముఖ్యంగా జనరల్ కేటగిరీ విద్యార్థులకు ఫిర్యాదు చేసే హక్కు లేకపోవడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. పలు రాష్ట్రాల్లో విద్యార్థులు నిరసనలు చేపట్టారు. ఈ నేపథ్యంలో దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన ధర్మాసనం... 'మేము జోక్యం చేసుకోకపోతే ఇది ప్రమాదకర పరిణామాలకు దారి తీస్తుంది. సమాజాన్ని చీల్చే ప్రభావం చూపిస్తుంది' అని అభిప్రాయపడింది. యూజీసీ కొత్త నిబంధనలను నిపుణులు పునఃపరిశీలించి మార్పులు చేయాల్సిన అవసరం ఉందని జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. కొత్త నిబంధనల్లోని సెక్షన్ 3(సి) ప్రకారం కుల వివక్ష నిర్వచనాన్ని కేవలం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకే పరిమితం చేయడంపై ధర్మాసనం అభ్యంతరం తెలిపింది. ప్రాంతీయ తత్వంతో కొనసాగే వివక్షను విస్మరించడాన్ని, ర్యాగింగ్ సమస్యను చేర్చకపోవడాన్ని జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ప్రశ్నించారు. 2019లో రోహిత్ వేముల, పాయల్ తడ్వీ తల్లులు దాఖలు చేసిన పిల్ ఆధారంగానే నిబంధనలు రూపొందాయని సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ కోర్టుకు తెలిపారు. కుల వివక్షను పూర్తిగా నిర్మూలించాలన్న రాజ్యాంగ లక్ష్యంతోనే ఈ నిబంధనలు వచ్చాయని వాదించారు. సుప్రీంకోర్టు 'స్టే' ఉత్తర్వులను భాజపా, ఎస్పీ, బీఎస్పీ, టీఎంసీ తదితర పార్టీల నేతలు స్వాగతించారు.

చిన్నప్పన్న వెనుక ఉన్న పెద్దప్ప ఎవరు?

(మొదటి పేజీ తరువాయి)

ఏ డెయిరీ యజమానైనా ఎందుకిస్తారు? అతను నెయ్యి సరఫరా ఆర్డర్లు ఇప్పించగలడన్న ఆశయినా ఉండాలి. లేదా అనర్హత వేటు వేయించగలడన్న భయమైనా ఉండాలి. పెద్దల అండ లేకుండా ఛైర్మన్ పీఏ అవన్నీ చేయగలడంటే డెయిరీ యజమానులు నమ్మి, లంచాలిస్తారా? నకిలీ నెయ్యి కుంభకోణంలో 'పెద్దప్ప' పాత్రపై సిట్ లోతుగా దృష్టి సారించకపోవడం విస్మయం కలిగిస్తోంది. నకిలీ నెయ్యి కుంభకోణంలో చిన్నప్పన్న ఒక పావు మాత్రమేనని ఎవరికైనా అర్థమవుతుంది. మరి సిట్‌కు ఆ విషయం తెలియదా అన్నది ప్రశ్న. సిట్ దర్యాప్తు కొండనుతవ్వి ఎలుకను పట్టినట్టు ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఈ ప్రశ్నలకు బదులేది?

(మొదటి పేజీ తరువాయి)

? చిన్నప్పన్న వంటి ఒక సాధారణ కాంట్రాక్ట్ ఉద్యోగి, ఛైర్మన్ పీఏ.. తన ఇష్టానుసారం తితిదే అధికారుల్ని ప్రభావితం చేయగలడా? తనకు లంచం ఇచ్చేందుకు నిరాకరించిన ప్రైవేటు డెయిరీల్లో తనిఖీలు చేయించి, టెండర్లలో పాల్గొనకుండా అనర్హత వేటు వేయించగలడా? తనకు లంచం ఇచ్చిన డెయిరీకి టెండర్ దక్కేలా చేయగలడా? ఏ 'పెద్దప్ప' అండతో చిన్నప్పన్న అవన్నీ చేయగలిగాడు? దీనిపై సిట్ లోతుగా దర్యాప్తు జరిపిందా?

? ఒకవేళ ఎవరి అండా లేకుండానే చిన్నప్పన్న ఆ అరాచకాలన్నీ చేస్తే.. మరి తితిదే ఏం చేస్తోంది? ఛైర్మన్, బోర్డు సభ్యులు, ఈవో, అదనపు ఈవో, కొనుగోలు కమిటీ సభ్యులు, అధికారులు పట్టించుకోరా? అంత పెద్ద వ్యవస్థను కాదని, కనీసం తితిదే ఉద్యోగి కూడా కాని సామాన్యుడు చక్రం తిప్పగలిగితే.. .. అక్కడ పర్యవేక్షణ గాలికొదిలేసినట్టే కదా? దీనిపై సిట్ ఎందుకు దృష్టి పెట్టలేదు?

? చిన్నప్పన్న తమను కిలో నెయ్యికి రూ.25 చొప్పున లంచం అడిగాడని సుబ్బారెడ్డికి భోలేబాబా డెయిరీ డైరెక్టర్ పొమిల్ జైన్ ఫిర్యాదు చేసినట్టు చిన్నప్పన్న రిమాండ్ రిపోర్టులో పేర్కొన్న సిట్.. ఆ విషయాన్ని ఛార్జిషీట్‌లో ఎందుకు ప్రస్తావించలేదు? ఆ ఫిర్యాదుపై సుబ్బారెడ్డి ఏం చేశారు? ఎలాంటి చర్యలు తీసుకున్నారో సిట్ నిగ్గుతేల్చాలి కదా? ప్రీమియర్ అగ్రిఫుడ్స్‌కు 35 శాతం నెయ్యి సరఫరా ఆర్డర్లు దక్కేలా చేసి, ఆ సంస్థ ఎండీ జగన్‌మోహన్‌గుప్తా నుంచి చిన్నప్పన్న రూ.50 లక్షలు లంచం తీసుకున్నాడని సిట్ గుర్తించింది. అది ఎవరికి చేరిందో ఛార్జిషీట్‌లో ఎందుకు ప్రస్తావించలేదు?

? చిన్నప్పన్న బ్యాంకు ఖాతాలో రూ.కోట్లలో డబ్బు వచ్చి పడిందని, దాన్ని వేరే ఖాతాలకు మళ్లించారని, ఆయన విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో భారీగా స్థిరాస్తులు కొన్నారని, అవి ఆయనకు ఎలా వచ్చాయో లోతైన దర్యాప్తు చేసి నిగ్గు తేల్చాలని రిమాండ్ రిపోర్టులో పేర్కొన్న సిట్.. దాన్ని అక్కడితో వదిలేసింది. 'చిన్నప్పన్నకు 2019-24 మధ్య వేతనం ద్వారా రూ.65 లక్షలు ఆదాయం వచ్చింది. కానీ దిల్లీలోని ఏపీ భవన్ యూనియన్ బ్యాంకు బ్రాంచ్‌లోని అతని ఖాతాలోకి ఆ ఐదేళ్లలో రూ.4.69 కోట్లు జమయ్యాయి. దానిలో రూ.4.64 కోట్లు వివిధ ఖాతాలకు మళ్లించారు. సిట్ దర్యాప్తు చేసేనాటికి చిన్నప్పన్న ఖాతాలో క్లోజింగ్ బ్యాలెన్స్ రూ.4.98 లక్షలే మిగిలింది. చిన్నప్పన్న ఆదాయానికి, అతని ఆర్థిక లావాదేవీలకు, కొన్న ఆస్తులకు పొంతన లేదని, దీని వెనుక ఉన్న భారీ కుట్రను బయట పెట్టేందుకు లోతైన దర్యాప్తు జరపాల్సి ఉందని పేర్కొంది. కానీ ఛార్జిషీట్‌లో ఆ వివరాలేమీ లేవు.

నేడు గుంటూరుకు సీఎం చంద్రబాబు


కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం గుంటూరు నగరానికి రానున్నారు. గుంటూరు సర్వజనాసుపత్రి ఆవరణలో నిర్మించిన కాసూరు-జింకానా మాతా శిశు సంరక్షణ కేంద్రం(ఎంసీహెచ్) భవనాన్ని ప్రారంభించనున్నారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఉండవల్లిలోని నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి గుంటూరులోని పోలీసు కవాతు మైదానానికి 10.40 గంటలకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన 10.50 గంటలకు సర్వజనాసుపత్రికి చేరుకుని ఎంసీహెచ్ భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం 12.15 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి చిత్తూరు వెళ్లనున్నారు.

2029 నాటికి రూ.1.4 లక్షల కోట్ల ఎన్‌హెచ్ ప్రాజెక్టులు

(మొదటి పేజీ తరువాయి)

సీఎం సమీక్షించారు. ఆయన ఏమన్నారంటే..

- రహదారుల ప్రాజెక్టులు ఎంత ఎక్కువగా అందుబాటులోకి వస్తే.. అంతలా సరకు రవాణా వ్యయం తగ్గుతుంది. దీనికి అనుగుణంగా ప్రణాళికలు ఉండాలి.
- రాష్ట్రంలో ప్రస్తుతం రెండు వరుసలుగా ఉన్న ఎన్‌హెచ్‌లు అన్నింటినీ వాహనాల రద్దీని బట్టి నాలుగు, ఆరు వరుసలుగా విస్తరించేలా కార్యాచరణ సిద్ధం చేయాలి.



రాష్ట్రంలో జాతీయ రహదారులు, ఆర్అండ్‌బీ శాఖపై సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, జాతీయ రహదారుల సంస్థ ఉన్నతాధికారులు

పోర్టులతో ఎన్‌హెచ్‌ల అనుసంధానం

- మూలపేట, విశాఖపట్నం, కాకినాడ, మచిలీపట్నం, రామాయపట్నం, కృష్ణపట్నం పోర్టులను జాతీయ రహదారులతో అనుసంధానం చేయాలి.
- పొరుగు రాష్ట్రాల నుంచి ఏపీలోని పోర్టులకు కనెక్టివిటీ ఉండాలి.
- నాగ్‌పుర్ నుంచి విజయవాడ మీదుగా మచిలీపట్నం, జగదల్‌పుర్, రాయ్‌పుర్‌ల నుంచి మూలపేట పోర్టులకు అనుసంధానించేలా రహదారుల నిర్మాణం జరగాలి.
- ఖరగ్‌పుర్ నుంచి అమరావతి వరకు నిర్మించ తలపెట్టిన గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే డీపీఆర్‌లు త్వరగా సిద్ధం చేయాలి.
- ప్రాధాన్యక్రమంలో వివిధ ఎన్‌హెచ్ ప్రాజెక్టులకు అనుమతులన్నీ తీసుకొని, వేగంగా పనులు ఆరంభించాలి.

ఎక్కడా గుంతలు కనిపించకూడదు

- రాష్ట్రంలోని 45 వేల కి.మీ. మేర ఉన్న ఆర్అండ్‌బీలోని జిల్లా, రాష్ట్ర రహదారుల్లో ఎక్కడా గుంతలు లేకుండా చూడాలి.
- రోడ్ ఎసెస్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (రామ్స్) ద్వారా అన్ని రోడ్ల పరిస్థితులనూ నిరంతరం పర్యవేక్షించాలి.
- ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) కింద 12 రహదారుల విస్తరణ పనులు మొదలుపెట్టాలి.
- ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లోని రోడ్లు త్వరగా దెబ్బతినకుండా పటిష్ఠంగా నిర్మాణం చేపట్టాలి.

రాష్ట్రవ్యాప్తంగా రూ.2,500 కోట్లతో 6,054 కి.మీ. రహదారుల రెన్యువల్, నిర్మాణపనులు చేపట్టామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. డేనిష్ ఫైబర్, వేస్ట్ ప్లాస్టిక్ బిటుమిన్, నానో కాంక్రీట్ టెక్నాలజీలతో ప్రయోగాత్మకంగా పనులు చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, ఆ శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఎన్‌హెచ్ఏఐ ఆర్వో ఆర్కే సింగ్, ఈఎన్‌సీలు రామచంద్ర, వివేకానందరెడ్డి, సీఈలు శ్రీనివాసరెడ్డి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

నేతన్నలకు ఉచిత విద్యుత్తు

(మొదటి పేజీ తరువాయి)

లబ్ధి చేకూరుతుందన్నారు. పథకం అమలుకు ఏడాదికి రూ.85 కోట్లు ఖర్చవుతుందని వివరించారు. సచివాలయంలో ఆమె గురువారం విలేకరులతో మాట్లాడారు.

కల్తీకి కేరాఫ్ అడ్రస్ జగన్: కల్తీకి కేరాఫ్ అడ్రస్ జగన్ అని మంత్రి సవిత మండిపడ్డారు. కుట్రపూరిత ఆలోచనతోనే శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేయించారన్నారు. తిరుమల లడ్డూ కల్తీ జరిగిందని సిట్ స్పష్టం చేసిందన్నారు. ఆ తప్పును కప్పిపుచ్చుకోవడానికి జగన్ బ్యాచ్ బుకాయిస్తోందని మండిపడ్డారు.

అనిశ్చితిలోనూ పరుగే!

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టారు.

ముఖ్యాంశాలు..

- ఇటీవలి సంవత్సరాల్లో చేపట్టిన పాలసీ సంస్కరణల సంచిత ప్రభావం.. మధ్యకాలిక వృద్ధి అవకాశాలను 7శాతానికి దగ్గరగా చేర్చింది. దీంతో అంతర్జాతీయ అనిశ్చితిని తట్టుకుని ఆర్థిక వ్యవస్థ స్థిరమైన వృద్ధిని సాధిస్తోంది. అయినా జాగ్రత్తలు అనివార్యం.
- సుంకాలవల్ల దెబ్బతిన్న కార్మిక రంగానికి మోదీ ప్రభుత్వం పాలసీలు, పన్ను సంస్కరణలతో ఊతమిచ్చింది. జీఎస్టీ రేట్ల తగ్గింపు, ఆదాయ పన్ను మినహాయింపులు, కార్మిక చట్టాల సమూల ప్రక్షాళన ద్వారా వ్యాపారాలపై భారాన్ని తగ్గించడం, ఐరోపా కూటమితో కలిపి నాలుగు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై ముందుకు సాగడం కలిసి వచ్చాయి.
- ద్రవ్యోల్బణం తక్కువగా ఉండటంతో సంస్థలు, కుటుంబాల బ్యాలెన్స్ షీట్లు కళకళలాడాయి. వినియోగ డిమాండు స్థిరంగా కొనసాగుతోంది.
- అమెరికా సుంకాలవల్ల డాలరుతో పోలిస్తే రూపాయి 5శాతం పడిపోయింది. అయితే దాని విలువ భారత ఆర్థిక అద్భుత గణాంకాలను ప్రతిబింబించడం లేదు.
- భారీ సుంకాల ఒత్తిడి ఉన్నా భారత్ వృద్ధి రేటు వచ్చే ఆర్థిక సంవత్సరంలో 6.2%గా ఉండనుందని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) వెల్లడించింది.
- అమెరికాతో జరుగుతున్న చర్చలు ఈ ఏడాదిలో ఫలించి ప్రస్తుతం నెలకొన్న అనిశ్చితి తొలగిపోవచ్చు. అమెరికా సుంకాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో తీవ్ర ఇబ్బందులు కలగజేశాయి.
- స్వదేశీ ఉద్యమం ద్వారా అంతర్జాతీయ ఒత్తిళ్లను, తలనొప్పులనుతట్టుకునేలా చర్యలు చేపట్టాలి. అన్ని దిగుమతులకు ప్రత్యామ్నాయం లేకపోయినా స్వదేశీ మంత్రం అనివార్యం. జాతీయ ఇన్‌పుట్ వ్యయ నియంత్రణ వ్యూహాన్ని అమలు చేయాలి.
- ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న కొత్త ఆదాయ పన్ను చట్టంతో మరింత సరళత్వంతో పాటు పన్ను చెల్లింపుదారులకు నిర్మాణాత్మక స్పష్టత రానుంది. ఫలితంగా స్వచ్ఛందంగా పన్ను చెల్లించే విధానానికి ఊతం లభించనుంది.
- వ్యవసాయ, ఆక్వా ఉత్పత్తులు, ఆహారం, పానీయాల ఎగుమతులు వచ్చే నాలుగేళ్లలో 100 బిలియన్ల అమెరికా డాలర్లకు చేరనున్నాయి. అయితే పాలసీల్లో తరచూ మార్పులు, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు, అంతర్జాతీయంగా అనిశ్చితి, విదేశీ కొనుగోలుదారులు ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లడంవంటి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముంది.
- ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన డ్రోన్ ఆధారిత భూ సర్వే, మధ్యప్రదేశ్‌లో అమలు చేస్తున్న డిజిటల్ సేకరణ వేదికల ద్వారా వ్యవసాయ రంగంలో ఆవిష్కరణలు సానుకూల ఫలితాలను అందిస్తున్నాయి.
- ఇటీవలి కాలంలో పలు రాష్ట్రాలు వ్యవసాయ రంగంలో సంస్కరణలను చేపట్టాయి. భూ నిర్వహణ, మార్కెట్లు, నీటి నిర్వహణ, టెక్నాలజీ వినియోగం, భిన్న పంటల సాగువల్ల వ్యవసాయ దిగుబడులు పెరిగాయి.
- 2018 నుంచి స్థిరంగా ఉన్న యూరియా ధరలను పెంచాలి. అదే స్థాయిలో రైతులకు సబ్సిడీని బదిలీ చేయాలి.
- జీడీపీలో ద్రవ్య లోటును 4.4 శాతానికి తగ్గించే సరైన లక్ష్యం దిశగానే ప్రభుత్వం సాగుతోంది. రాష్ట్రాల రెవెన్యూ లోటు పెరుగుతున్నా. . అవి జీడీపీలో 2.4శాతం మూలధన వ్యయాన్ని కొనసాగించేలా కేంద్రం సహకరిస్తోంది.
- ఏఐలో భారత్ ఆలస్యంగానే ప్రవేశించినా లక్ష్యం దిశగా వేగంగానే సాగుతోంది. అయితే అందులో ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదమూ పొంచి ఉంది.
- నిజాయతీగా పనిచేసే అధికారులకు రక్షణ కల్పించే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. వేధించే విచారణల నుంచి వారికి రక్షణ కల్పించాలి.

రాష్ట్రాల వ్యయాలపై ఆందోళన

నగదు బదిలీల వంటి ఆర్థిక ప్రజాదరణ పథకాల వ్యయం మూల ధన వ్యయాన్ని మించడం ఆందోళన కలిగిస్తోంది. చాలా రాష్ట్రాల్లో బేషరతు నగదు బదిలీ (యూసీటీ) పథకాలు వేగంగా విస్తరిస్తున్నాయి. వాటి సంక్షేమ వ్యయంలో వీటి వాటానే అధికమవుతోంది.

- 2026 ఆర్థికసంవత్సరంలో మహిళలకు యూసీటీ కింద 1.7 లక్షల కోట్ల నగదు బదిలీ జరిగింది.
- రాష్ట్రాల రెవెన్యూ లోటు పెరగడమూ ఇబ్బందికరంగా ఉంది. రాష్ట్రాల ఆర్థిక క్రమశిక్షణ లేమి ప్రభావం రుణ వ్యయాలను పెంచుతుంది.

డిజిటల్ ఎడిక్షన్ తగ్గించాలి

- డిజిటల్ ఎడిక్షన్‌ను తగ్గించేందుకు వయసు ఆధారిత సామాజిక మాధ్యమాల అందుబాటు వ్యవస్థను ప్రవేశపెట్టాలి.
- ఆన్‌లైన్ బోధన టూల్స్‌పై ఆధారపడటాన్ని తగ్గించాలి. పిల్లలకు బేసిక్ ఫోన్ల వంటివే అందజేయాలి. చదువు కోసమే రూపొందించే ట్యాబ్‌లను ఇవ్వాలి. అల్ట్రా ప్రాసెస్డ్ ఆహార వాణిజ్య ప్రకటనలను ఉదయం 6 నుంచి రాత్రి 11 గంటల వరకూ నిషేధించాలి.
- సున్నిత సమాచారాన్ని మినహాయించేలా సమాచార హక్కు చట్టాన్ని పునర్వ్యవస్థీకరించాలి.

ఛార్జీల పెంపుతో లాభమే

- ప్రయాణికుల ఛార్జీల పెంపుతో సరకు రవాణాపై ఆధారపడే పరిస్థితి నుంచి రైల్వేశాఖ నెమ్మదిగా బయటకు వస్తోంది. ప్రస్తుతం సరకు రవాణా ఆదాయం 68 శాతం నుంచి 65శాతానికి తగ్గింది. అది భవిష్యత్తులో 62శాతానికి తగ్గనుంది.

పోషకాహార అంతరంతో వ్యాధులు

- పోషకాహార అంతరాలతో పెరిగి పోతున్న జీవన శైలి వ్యాధులను అరికట్టేందుకు ఆరోగ్య సప్లిమెంట్లపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ఇందుకోసం ఆహార సంబంధిత సంస్కరణలను తేవాలి. వైద్యపరంగా అందించే చికిత్సలకు ఎనర్జీ, పోషక పానీయాలు, ఒత్తిడి తగ్గించే సూత్రీకరణలు, బరువు తగ్గించే పానీయాలు సమానం కాదని ప్రజలకు తెలియజేయాలి.
- దేశంలోని చాలా మంది ప్రజలు.. సూచించినదాని కంటే అధికంగా తృణ ధాన్యాలను వినియోగిస్తున్నారు. తక్కువ రక్షణ కల్పించే ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకుంటున్నారు.
- దేశంలో స్థూలకాయం అనేది వయసులతో సంబంధం లేకుండా పెరుగుతోంది.

సబ్సిడీలతో మేలే..

ప్రభుత్వ సంక్షేమ చర్యలవల్ల పేదరికం తగ్గింది. అట్టడుగు స్థాయిలో ఉండే 5% నుంచి 10% మంది ప్రజల వినియోగ వ్యయం పెరిగింది.

- సబ్సిడీలు, పింఛన్లు, నగదు బదిలీలతోపాటు విద్య, వైద్యంపై ప్రభుత్వ వ్యయం పెరగడంవల్ల సానుకూల ఫలితాలొస్తున్నాయి.

యువతకు శిక్షణలో వెనుకబాటే

15, 29 ఏళ్ల మధ్య వయసున్న యువతలో కేవలం 4.9శాతం మందికే వొకేషనల్, టెక్నికల్ శిక్షణ అందుబాటులో ఉంటోంది. దీనిని విస్తరించాల్సిన అవసరముంది.

- పాఠశాలల్లోనే నైపుణ్య శిక్షణ అందించాలి.
- యువతలో నైపుణ్యాన్ని పెంపొందించడానికి ఏకీకృత అప్రెంటిస్‌షిప్ మిషన్‌ను చేపట్టాలి.
- 40శాతం గిగ్ వర్కర్లు.. నెలకు రూ.15వేల కంటే తక్కువ వేతనాన్నే పొందుతున్నారు.

రుగ్వేద నుంచి రామాయణందాకా..

ఆర్థిక సర్వేలో రుగ్వేద నుంచి రామాయణం దాకా, మార్క్ టులీ నుంచి వ్లాదిమిర్ ఇల్యిక్ లెనిన్‌దాకా ప్రస్తావనలున్నాయి.

- రుగ్వేదలోని మండల 10, సూక్త 191, వెర్స్ 2లను ఆర్థిక సర్వే ప్రస్తావించింది. అవి 'కలిసి సాగాలి. కలిసి మాట్లాడాలి. మనసులను దారికి తేవాలి' అని సూచిస్తాయి.
- రామాయణంలోని యుద్ధకాండలో రావణుడి ఓటమి.. తెలివి విషయంలో ఒక పాఠంగా ఆర్థిక సర్వే పేర్కొంది. రాముడి వివేకం.. ప్రతికూలత నుంచి విలువలు, పద్ధతుల నుంచి పక్కకు తప్పుకోకుండా ఎలా వ్యవహరించాలో నేర్పుతుందని వెల్లడించింది.

భారతీయ సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌ను ఆవిష్కరించింది: ప్రధాని

'పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే సంస్కరణల ఎక్స్‌ప్రెస్ సమగ్ర చిత్రాన్ని ఆవిష్కరించింది. సవాళ్లతో కూడిన అంతర్జాతీయ పరిస్థితుల్లోనూ స్థిరమైన అభివృద్ధిని సూచించింది. ఇది బలమైన స్థూల ఆర్థిక మూలాలను, స్థిరమైన వృద్ధి వేగాన్ని, దేశ నిర్మాణంలో ఆవిష్కరణలు, మౌలిక వసతుల కల్పనను ఆవిష్కరించింది' అని ప్రధాని మోదీ కొనియాడారు.

గతం కంటే బలంగా ఉన్నాం: నిర్మల

స్థూల ఆర్థిక మూలాలు గతం కంటే బలంగా ఉన్నాయని ఆర్థిక సర్వే నిరూపించిందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ ఒడుదొడుకులను తట్టుకుని గట్టిగా నిలిచామని, 7 శాతం వృద్ధి రేటుకు దగ్గరగా ఉన్నామని తెలిపారు.

మార్చి నాటికి విజయవాడ బైపాస్ నిర్మాణం పూర్తి

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి



ఈనాడు, దిల్లీ: గొల్లపూడి నుంచి చినకాని వరకు 17.6 కిలోమీటర్ల మేర తలపెట్టిన విజయవాడ బైపాస్ నిర్మాణాన్ని ఈ ఏడాది మార్చి 31 నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర రహదారి, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. గురువారం లోక్‌సభలో జనసేన ఎంపీ వల్లభనేని బాలశౌరి అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు సమాధానం ఇచ్చారు. "కృష్ణా నది మీదుగా ప్రధాన వంతెనలతో కూడిన ఈ ఆరు వరుసల బైపాస్‌రోడ్డు నిర్మాణానికి రూ.1,194.59 కోట్ల అంచనా వ్యయంతో 2019లో అనుమతులిచ్చాం. గత ఏడాది సెప్టెంబరు 30 నాటికి 13.410 కిలోమీటర్ల నిర్మాణం పూర్తయినట్లు తాత్కాలిక ధ్రువపత్రం మంజూరు చేశాం. మిగిలిన 4.226 కి.మీ. పనులను ఈ ఏడాది మార్చి 31నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం" అని నితిన్ గడ్కరీ వివరించారు.

అమరావతి నిర్మాణం.. అరుదైన అవకాశం

(మొదటి పేజీ తరువాయి)

చెందుతాయని స్పష్టం చేసింది. కొత్త నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుకోవచ్చని, ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి చెందుతున్న అమరావతిని అందుకు ఉదాహరణగా ఆర్థికసర్వే పేర్కొంది.

దేశంలోని పది నివాస యోగ్య నగరాల్లో.. తిరుపతి, విజయవాడ

జీవన సౌలభ్య సూచీల్లో దేశంలో అగ్రస్థానంలో ఉన్న పది నగరాల్లో ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి, విజయవాడ నగరాలకు స్థానం దక్కింది. బెంగళూరు, దిల్లీ, ముంబయి నగరాల్లాగా తిరుపతి, విజయవాడ తీవ్రమైన జనాభా ఒత్తిడిని ఎదుర్కోవడం లేదని ఆర్థిక సర్వే వెల్లడించింది. ఇక్కడ నగరీకరణ జరుగుతోందని.. మౌలిక సౌకర్యాలు, ఉద్యోగావకాశాలు సులభంగా లభిస్తాయని వెల్లడించింది.

అగ్రస్థానంలో ఉన్నవి: పుణె, నవీ ముంబయి, గ్రేటర్ ముంబయి, తిరుపతి, చండీగఢ్, ఠాణె, రాయ్‌పుర్, ఇండోర్, విజయవాడ, భోపాల్

నిజమైన నివాస యోగ్య నగరాలంటే

ప్రపంచంలో జీవన సౌలభ్యం కలిగిన నగరాలన్నీ కొత్తవి, ధనికమైనవి కావని.. రోజువారీ జీవనంలో ఇబ్బందుల్ని తగ్గించి ప్రజల వ్యక్తీకరణకు అవకాశం కల్పించేవని ఆర్థిక సర్వే వివరించింది. రోజూ ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే నగరాలే నిజమైన నివాసయోగ్య నగరాలుగా వర్ణించింది. మౌలిక సౌకర్యాల కల్పనకే పరిమితం కాకుండా.. ప్రజల సమయం, వారి ఎంపికలు, సృజనాత్మకతను గౌరవించేలా ఉంటేనే అసలైన జీవనయోగ్యత సాకారమవుతుందని తెలిపింది.

ఇవే ఉదాహరణ

- డెట్రాయిట్‌లో జాతీయ రహదారులు, పరిశ్రమలు, స్టేడియాల నిర్మాణానికి పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టారు. కానీ ఆర్థిక ఉత్పాదకత పరంగా. . ఆ పెట్టుబడులకు తగ్గ ఫలితం సాధించలేదు. ఫలితంగా అక్కడ జనాభా తగ్గిపోయింది.
- బోస్టన్‌లో మౌలిక సౌకర్యాలు పరిమితంగా ఉన్నా.. విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలు ఎక్కువ. అవే నగరాన్ని ఆర్థిక, విద్య, బయోటెక్ తదితర ఆధునిక రంగాల దిశగా నడిపించాయి.
- బెంగళూరులో..దిల్లీ, ముంబయితో పోలిస్తే మౌలిక సౌకర్యాలు తక్కువే. ఇంజినీరింగ్ ప్రతిభ, వ్యవస్థాపక పర్యావరణ వ్యవస్థ కారణంగానే భారతదేశ సిలికాన్ వ్యాలీగా ఎదిగింది.

జీవన సౌలభ్య సూచీకి ప్రధానాంశాలు

విద్య, ఆరోగ్యం, హౌసింగ్, నీరు, పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, రవాణా, భద్రత, వినోదం తదితర అంశాల్ని ప్రామాణికంగా తీసుకుంటారు. వాటి ఆధారంగా నగరాల్లో జీవన నాణ్యతను కొలుస్తారు.

రాజ్ కెసిరెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

జస్టిస్ వెంకట జ్యోతిర్మయి గురువారం ఈ మేరకు తీర్పు చెప్పారు.

ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి సహ నిందితులతో కుట్రపన్ని మద్యం కుంభకోణానికి పాల్పడినట్లు ప్రాథమిక ఆధారాలున్నాయని హైకోర్టు తీర్పులో స్పష్టం చేసింది. రాజ్ కెసిరెడ్డి అప్పటి ముఖ్యమంత్రికి ఐటీ సలహాదారుగా ఉన్నారనేది వాస్తవమని తెలిపింది. ఇతర నిందితులతో కెసిరెడ్డి తన కార్యాలయంలో పలుమార్లు సమావేశమయ్యారని పేర్కొంది. కెసిరెడ్డి, ఆయన సిండికేట్ సభ్యులకు లంచాలిచ్చిన డిస్టిలరీలకే మద్యం సరఫరా ఆర్డర్లు ఇప్పించినట్లు సాక్షులు, డిస్టిలరీల ఉద్యోగులు వాంగ్మూలంలో చెప్పారని గుర్తుచేసింది. నూతన మద్యం విధానం అమల్లోకి తీసుకొచ్చాక బినామీ సంస్థ అదాన్ డిస్టిలరీని గుప్పిట్లో పెట్టుకుని ముప్పిడి అవినాష్‌రెడ్డి (ఏ7) ద్వారా రాజ్ కెసిరెడ్డి వ్యవహారం నడిపించినట్లు సాక్ష్యాధారాలు స్పష్టం చేస్తున్నాయని పేర్కొంది. ఏపీ రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్‌బీసీఎల్) నుంచి రూ.750 కోట్లు కెసిరెడ్డి, అవినాష్‌రెడ్డి అందుకున్నారని, ఆ సొమ్మును డొల్ల కంపెనీలకు మళ్లించినట్లు ప్రాథమిక ఆధారాలున్నాయంది. షెల్ కంపెనీల నుంచి రూ.135 కోట్లను తిరిగి బదిలీ చేసుకున్నట్లు కోర్టు ముందున్న ఆధారాలు స్పష్టం చేస్తున్నాయని తెలిపింది. కాల్ డేటా రికార్డు, ఎఫ్ఎస్ఎల్ రిపోర్టులు, వాట్సప్ సమాచారాన్ని పరిశీలిస్తే వీటన్నింటిలో కెసిరెడ్డి చురుకైన పాత్ర పోషించినట్లు వెల్లడవుతోందని తెలిపింది. కెసిరెడ్డి గతంలో విదేశాలకు వెళ్లి దర్యాప్తును తప్పించుకునేందుకు యత్నించారని గుర్తుచేసింది.

కెసిరెడ్డికి బెయిలిస్తే అవినాష్‌రెడ్డిని తప్పించే ప్రమాదం

ఈ కేసులో ఏడో నిందితుడు, పరారీలో ఉన్న ముప్పిడి అవినాష్‌రెడ్డికి కెసిరెడ్డికి దగ్గర సంబంధాలున్నాయని హైకోర్టు పేర్కొంది. కెసిరెడ్డి తరఫున ముడుపులు వసూలు చేయడం, షెల్ కంపెనీలకు తరలించడం, తదితర కార్యకలాపాలన్నింటినీ అవినాష్‌రెడ్డి చక్కబెట్టారనడానికి సాక్ష్యాధారాలున్నాయని చెప్పింది. ఈ నేపథ్యంలో కెసిరెడ్డికి బెయిల్ మంజూరు చేస్తే అవినాష్‌రెడ్డిని చట్టం నుంచి తప్పించే అవకాశం లేకపోలేదని ఆందోళన వ్యక్తం చేసింది. ఆర్థిక నేరానికి పాల్పడటం, లోతైన కుట్రకోణం, భారీ స్థాయిలో ప్రజాధనాన్ని మళ్లించడం, మద్యం కుంభకోణంలో చురుకైన పాత్ర పోషించడం, కేసును ప్రభావితం చేసే హోదాలో ఉండటం వంటివన్నీ పరిగణనలోకి తీసుకొని రాజ్ కెసిరెడ్డి బెయిల్ పిటిషన్‌ను కొట్టేస్తున్నట్లు న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఆర్థిక నేరాల విషయంలో నిందితుల పట్ల కఠిన వైఖరి అనుసరించాలన్నారు. నేరారోపణల తీవ్రత, దర్యాప్తునకు సహకరించకుండా పరారీలో ఉండటం, తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని ముప్పిడి అవినాష్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను సైతం కొట్టేస్తున్నట్లు పేర్కొంది.

ఐఓకు సమాచారం ఇవ్వకుండా రాష్ట్రం దాటొద్దు

మద్యం కుంభకోణం కేసులో నిందితులు సజ్జల శ్రీధర్‌రెడ్డి, చెరుకూరి వెంకటేష్‌నాయుడు, వైకాపా మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డిలకు హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. వీటిని ఉల్లంఘిస్తే బెయిల్ రద్దు కోసం కోర్టును ఆశ్రయించవచ్చని సిట్‌కు సూచించింది. నిందితులు ఇప్పటికే సుదీర్ఘ కాలం జైల్లో ఉన్నారని, కేసు దర్యాప్తు చాలా వరకు పూర్తయినందున బెయిల్ మంజూరు చేస్తున్నట్లు పేర్కొంది.

- ఒక్కొక్కరు రూ.లక్ష చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలి
- దిగువ కోర్టులో పాస్‌పోర్టులు అప్పగించాలి. కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదు. దర్యాప్తు అధికారి (ఐవో)కి సమాచారం ఇవ్వకుండా రాష్ట్రం దాటి వెళ్లొద్దు.
- సాక్షులను కలవడం, వారిని ప్రభావితం చేయడం, సాక్ష్యాధారాలను తారుమారు చేయడం నిషేధం. విచారణ సమయంలో తప్ప సహ నిందితులను కలవడానికి వీల్లేదు.
- స్థిర, చరాస్తులు, బ్యాంక్, డీమ్యాట్ ఖాతాల వివరాలతో రెండు వారాల్లో అఫిడవిట్ వేయాలి.
- విచారణ ముగిసే వరకు ఈ కేసు వివరాలను పత్రికలు, ప్రసార మధ్యమాలు, సామాజిక మాధ్యమాలకు వెల్లడించడానికి వీల్లేదు.
- ఫోన్ నంబర్లను దర్యాప్తు అధికారికి అందజేయాలి. నంబరు మారిస్తే వెంటనే ఐవోకు చెప్పాలి. ఫోన్‌లో ఎప్పుడూ అందుబాటులో ఉండాలి.
- తదుపరి ఉత్తర్వులిచ్చే వరకు ప్రతి శనివారం దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలి.

ఈనాడు

క్షమార్హం కాని ఘోరాపచారమిది!

దేశవ్యాప్తంగా ఎన్నో కుటుంబాలకు ఇలవేల్పు అయిన ఏడుకొండల వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదానికి కల్తీనెయ్యిని వాడారంటే- అంతకుమించిన ఘోరాపచారం, భక్తజన ద్రోహం మరొకటి ఉండదు! కాసులకక్కుర్తితో ఆ మహాపరాధానికి తెగబడిన వారి పాపానికి నిష్కృతి లేదు. ఈ నేరం జరిగినట్లు కళ్ల ముందు సాక్ష్యాధారాలన్నీ కనిపిస్తున్నప్పటికీ అదసలు నేరమే కాదని అడ్డంగా బుకాయించే వారికి బుద్ధి ఉన్నట్లా లేనట్లా? ఉన్న అర కోడి మెదళ్లను మోకాళ్లలోకి తెచ్చుకుని చేసే ఇలాంటి చచ్చుపుచ్చు వాదనలకు వైకాపా పార్టీ, దాని మురికి మీడియా పెట్టింది పేరు! పాలూ వెన్న ఏమీ సేకరించకుండా పామాయిల్, పామ్ కెర్నెల్ ఆయిల్ లాంటివాటికి రసాయనాలు కలిపి చేసిన కల్తీ పదార్థాన్ని స్పెషల్‌గ్రేడ్ ఆవు నెయ్యి పేరిట కొందరు తితిదేకు సరఫరా చేశారని, ఇంటిదొంగలు కొంతమంది వాళ్లకు కొమ్ముకాశారని సుప్రీంకోర్టు నియమించిన 'సిట్' తేల్చింది. దాన్ని శ్రీవేంకటేశ్వరుడి లడ్డూ తయారీలో వాడారని స్పష్టంగా చెప్పింది. 59.71 లక్షల కిలోల కల్తీ నెయ్యి తిరుమలకు సరఫరా అయ్యిందనే వాస్తవాన్ని దాచేసి... అందులో జంతువుల కొవ్వు కలవలేదు కాబట్టి ఏ తప్పూ జరగనట్లేనని జగన్ పార్టీ మురికి మీడియా ఇప్పుడు వీధికెక్కి వీరంగాలాడుతోంది!

వైకాపా ఏలుబడిలో వెంకన్నస్వామి లడ్డూకోసం వినియోగించింది అసలు నిజమైన నెయ్యే కాదని పరీక్షల్లో స్పష్టంగా బయటపడింది. దాని గురించి పల్లెత్తు మాట మాట్లాడకుండా 'అబ్బే మావాళ్లంతా సుద్దపూసలు' అని సత్తుగిన్నెలో గులకరాళ్లు పోసి డబడబలాడించినట్లు జగన్ వందిమాగధులు కాకమ్మకబుర్లు చెబితే ఎవరు నమ్ముతారు? పరమ పవిత్రమైన శ్రీవారి దివ్య ప్రసాదాన్ని కల్తీనెయ్యితో తయారుచేసి కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసిన మహాపాతకాన్ని ఎలా కాదంటారు? "నిండిన పంచదారలను నేతులు దేనెలు..." అంటూ వేంకటాచలపతికి ప్రీతికరమైన ఆహారపదార్థాల జాబితాను అన్నమయ్య ఎప్పుడో చెప్పాడు. నైవేద్య ప్రియుడైన ఆ స్వామికి నివేదించే ప్రసాదాలకోసం వాడే నెయ్యి కొనుగోలుకు గతంలో కఠిన నిబంధనలుండేవి. జగన్ ముఖ్యమంత్రిత్వం వెలగబెడుతున్నప్పుడు తితిదే పాలకమండలి పాత కట్టుబాట్లు, అర్హతలు అన్నింటినీ ఇష్టారీతిగా సడలించేసింది. దాంతో ఊరూపేరూ లేని దొంగ సంస్థలకు టెండర్లు దక్కాయి. కనీసం కల్తీనెయ్యి నిర్మాతల కారణంగా రూ.234 కోట్లకు కాళ్లొచ్చేశాయి. జగన్ బాబాయ్ వైవీ సుబ్బారెడ్డికి లోగడ పీఏగా పనిచేసిన చిన్న అప్పన్న ఈ అక్రమాల పర్వంలో కీలక పాత్రధారి అని 'సిట్' దర్యాప్తులో వెల్లడైంది. మరి సూత్రధారులను కలుగులోంచి బయటికి లాగి, శ్రీనివాసుడి సన్నిధిలో చేసిన పాతకాలకు వారినెప్పుడు బాధ్యులను చేస్తారు?

స్వార్థ రాజకీయ అవసరాల కోసం తిరుమల పుణ్యక్షేత్రాన్ని అపవిత్రం చేయడానికి వెనకాడని పాపిష్టి చరిత్ర జగన్‌ది. అలాంటి మనిషి వేంకటనాథుడి లడ్డూ విషయంలో అపరాధమేమీ జరగలేదని అడ్డగోలుగా వాదిస్తున్నారు. జిత్తులమారితనంలో జగన్‌కు సరిజోడు అయిన భూమన కరుణాకరరెడ్డి లాంటివారు కల్తీనెయ్యిని వాడే ప్రసక్తే లేదని బొంకుతున్నారు. అవన్నీ ఒట్టి అబద్ధాలేనని 'సిట్' తేల్చేసింది. ప్రజారోగ్యంతో ముడిపడిన ఆహార ప్రమాణాలను ఏమాత్రం ఉల్లంఘించినా తీవ్రంగా పరిగణించాలని సుప్రీంకోర్టు గతంలో నిర్దేశించింది. పాలు, పాల పదార్థాల కల్తీకి పాల్పడేవారు జీవితఖైదుకు అర్హులని మరో సందర్భంలో న్యాయపాలిక ఛీత్కరించింది. తిరుమల లడ్డూల తయారీకి ఆవు నెయ్యి పేరుతో రసాయనాలు వాడి దైవాపచారానికి ఒడిగట్టడంతో పాటు భక్తుల ఆరోగ్యానికి ప్రమాదం తెచ్చిపెట్టిన వారెవరూ క్షమార్హులు కారు. ఆ పెద్దమనుషుల ముసుగులు తొలగించి కటకటాల్లోకి నెట్టాల్సిన బాధ్యత 'సిట్'దే!



నెట్ వర్త్ కాదు, లైఫ్ వర్త్ అంటే- జీవితం విలువ పెంచుకోవాలి. తోటివారిపట్ల కరుణతో ఉండాలి. మనం చేసిన పని ఎవరికీ గుర్తుండదు కానీ వారి పట్ల మనం ఎలా ప్రవర్తించామన్నదే ఎప్పటికీ గుర్తుండిపోతుంది.

– దీపక్ పరేఖ్, హెచ్‌డీఎఫ్‌సీ మాజీ ఛైర్మన్

కాలం విలువ

కాలం ప్రతీ క్షణం ఓ ఇంద్రజాలం. కళ్లముందే మాయమైపోతుంటుంది మరి. కదిలే కాలం అనుకోని విజయాలను, వైభవాలను ఇచ్చినట్లే అప్పుడప్పుడు ఓటమినీ చవిచూపిస్తుంది. విలువ తెలుసుకుని కాలాన్ని సద్వినియోగం చేసుకున్నవారే చక్కగా వృద్ధిలోకి వస్తారు. ఎప్పుడూ ఏదో ఒక నిరాశలో మగ్గుతూ, కాలాన్ని వృథా చేసేవారు జీవితంలో నిరర్థకంగా మిగిలిపోతారు.

ఏ భౌతిక సాధనాలూ, ఆధ్యాత్మిక సాధనలూ కదిలే కాలాన్ని బంధించలేవు. ప్రవహించే నదిలో ఈ క్షణం తాకిన నీటిని మరుక్షణం ఎలాగైతే మూట్టుకోలేమో అలాగే గతించిన కాలాన్ని ఎంత ప్రయత్నించినా పట్టుకోలేం. అందుకే కాలమహిమను గుర్తించండి... అంటాడు చాణక్యుడు. కాలం భగవత్ స్వరూపం. సృష్టి, స్థితి, లయలన్నీ కాల పరిధిలోనే జరుగుతాయన్నది సత్యం. పోగొట్టుకునేటంత కాలం మన దగ్గర లేదు. మనం కాలయాపన చేసేటంతటి ధనవంతులం కాదు- అంటారు రవీంద్రనాథ్ టాగోర్. మహత్తరమైన మాటలివి! కాలాన్ని వృథా చేస్తే, జీవితంలో అత్యంత విలువైన కొంత భాగాన్ని కోల్పోయినట్లే..! అందుకే, వెలకట్టగలిగిన ధనం కన్నా విలువైనది, వెలకట్ట లేనిది కాలం. కొంతమంది ఎప్పుడూ టైమ్ సరిపోవడం లేదని వాపోతూ ఉంటారు. మరి కొంత మంది అదే కాలాన్ని ఉపయోగించుకుని, అద్వితీయమైన విజయాలను చేజిక్కించుకుంటారు.



అంతర్యామి

రెండు రకాల వ్యక్తులకూ ఉన్నది ఒక్కటే సమయం. కొందరికి గెలుపు పిలుపు వినబడితే మరికొందరికి సదా అలుపుతో జీవనం తడబడుతుంది. వీరిలో తేడాను గమనిస్తే మందగమనులు, సమయపాలన లేనివారు, బద్ధకంగా ఉండేవారు మాత్రమే తగినంతగా కాలం దొరకడం లేదని బాధపడుతూ ఉంటారు. సమయానికున్న విలువను గుర్తించి, జాగరూకులై సాగేవారు విజేతలుగా నిలబడుతూ, జగతికి మహత్తరమైన సందేశాన్ని అందిస్తారు. అదేంటంటే.. నిర్మాణాత్మక ధోరణిలో కాలాన్ని వాడుకుని, ప్రణాళికతో సాగితే, విజయం మన ముంగిట్లోనే వేచి ఉంటుందని..! తత్వవేత్త ఆర్థర్ బ్రిస్బేన్ కాలం విలువ గురించి మాట్లాడుతూ 'కాలహరణం చేసే వ్యక్తి జీవితంలో అన్ని అవకాశాలను కోల్పోతాడు. విజయం కోసం, లక్ష్యసిద్ధికోసం నిరంతరం పరితపించే వ్యక్తి ప్రతి క్షణాన్నీ జాగ్రత్తగా సద్వినియోగపరుచుకుంటాడు' అంటాడు.

బృహత్తరమైన కార్యాన్ని సాధించాలన్నా, ప్రగతి పథంలో పురోగమించాలన్నా మనిషికి ఎన్నో వనరుల అవసరం ఉంటుంది. వాటిలో కాలం అత్యంత విలువైనది. దాన్ని వినియోగించే తీరు సరిగా ఉంటేనే, మిగిలిన వనరులవల్ల లాభముంటుంది. కాలం ఎక్కువగా వృథా అయ్యేది జయాపజయాలను అనుభవించే విధానంలోనే. గెలిచినప్పుడు అమితంగా పొంగిపోతూ, విలాసాల్లో మునిగితేలుతూ ఎంతో సమయాన్ని చేజార్చుకుంటాం. అదేవిధంగా అపజయం సంభవించినప్పుడు, కుంగిపోతూ కాలాన్ని నిష్ఫలంగా వదిలేస్తాం. ఇటువంటి సందర్భాల్లో తామరాకు మీద నీటిబొట్టులా వ్యవహరించగలిగితే, కాలహరణం లేకుండా వీలున్నంతగా ప్రయోజనాన్ని పొందుతాం.

కాలం అన్నిటినీ మనకు అందిస్తుంది, అనుక్షణం పరీక్షిస్తుంది. గడిచే కాలంలోని చిన్న చిన్న క్షణాల అందమైన కలయికే మనిషి జీవితం. కాలం విలువ తెలిసిన నేర్పరి తన జీవితానికి మనోహరమైన కూర్పరి అవుతాడు.

– వెంకట్ గరికపాటి

జల వివాదాలు కొలిక్కి వస్తాయా?

కృష్ణా జలాల్లో రెండు రాష్ట్రాల వాటాను తేల్చే అంశంపై బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ ఎదుట వాదనలు జరుగుతున్నాయి. బచావత్ ట్రైబ్యునల్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 811 టీఎంసీలు కేటాయించింది. ఇందులో తెలంగాణ, ఏపీలకు ఎవరి వాటా ఎంతన్నది మొదట తేల్చాలి. పునర్విభజన తరవాత ఏపీ 512 టీఎంసీలు, తెలంగాణ 299 టీఎంసీలు వాడుకునేలా 2015లో తాత్కాలిక అవగాహన కుదిరింది. అదిప్పటికీ కొనసాగుతోంది. 512 టీఎంసీలు తమకు నిర్ధారించాలని ఏపీ కోరుతోంది. తెలంగాణ మాత్రం కృష్ణాబేసిన్‌లోని ప్రాజెక్టులకు ప్రాధాన్యమిచ్చి 555 టీఎంసీలు కావాలని కోరింది. ఈ విషయంలో రెండు రాష్ట్రాల మధ్య చర్చల ద్వారా అవగాహనకు వచ్చే అవకాశాలు దాదాపు లేవనే చెప్పాలి. కృష్ణా డెల్టాకు బచావత్ చేసిన కేటాయింపుల మేరకు నీటి విడుదల అవసరం లేదని, శ్రీశైలం నుంచి పెన్నా బేసిన్‌కు నీటిని మళ్లించకుండా కృష్ణా బేసిన్‌లోని అవసరాలకే కేటాయించాలని తెలంగాణ వాదించింది. ఆ వాదనకు ట్రైబ్యునల్ అంగీకరిస్తే ఏపీ ప్రస్తుతం వాడుకుంటున్న 512 టీఎంసీలలో కొంత తగ్గించి తెలంగాణకు కేటాయించవచ్చు. లేదా ఇంకోరకమైన తీర్పు చెప్పొచ్చు. ఇది ట్రైబ్యునల్ దగ్గర తేలాలి తప్ప కేంద్ర జల్‌శక్తి కమిటీ దగ్గర కాదు. 811 టీఎంసీలలో ఎవరివాటా ఎంతన్నది తేల్చాల్సింది ట్రైబ్యునలే. ప్రస్తుత కమిటీ ఆ అంశం జోలికి వెళ్లే అవకాశం కూడా లేదు.

ఇచ్చిపుచ్చుకునే వాతావరణం ఉంటే...

పోలవరం నిర్మాణం ద్వారా గోదావరి నుంచి కృష్ణాబేసిన్‌లోకి మళ్లించే నీటిలో వాటా రెండో అంశం. పోలవరంతో 80 టీఎంసీల నీటిని కృష్ణా బేసిన్‌లోకి మళ్లిస్తే, ఆ మేరకు నాగార్జునసాగర్ నుంచి నీటి విడుదలను నియంత్రించి కర్ణాటక, మహారాష్ట్ర కలిపి 35 టీఎంసీలు, నాగార్జునసాగర్ ఎగువన ప్రాజెక్టులకు 45 టీఎంసీలు ఏపీ వాడుకునేలా గోదావరి జల వివాదాల ట్రైబ్యునల్ అవార్డు పేర్కొంది. ముఖ్యమంత్రుల మధ్య జరిగిన ఒప్పందమే అవార్డులో భాగమైంది. పునర్విభజన తరవాత 45 టీఎంసీలు తమకే చెందుతాయని తెలంగాణ పేర్కొంది. నాగార్జునసాగర్ ఎగువన వాడుకోవాలని గోదావరి అవార్డు పేర్కొందని, కృష్ణాబేసిన్‌లో సాగర్ ఎగువన ఉన్నది తెలంగాణ ప్రాజెక్టులే కాబట్టి తమకే చెందుతాయని వాదిస్తోంది. ఈ వాదనతో ఏపీ అంగీకరించలేదు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డులో, కేంద్ర జల్‌శక్తి దగ్గర పలు దఫాలు చర్చలు జరిగినా ఫలితం లేకపోయింది. సీడబ్ల్యూసీ మాజీ ఛైర్మన్ బజాజ్ నేతృత్వంలో ఈ అంశాన్ని తేల్చేందుకు కేంద్రం కమిటీని ఏర్పాటు చేసింది. అయితే, నీటి కేటాయింపులు, పంపిణీని తేల్చాల్సింది ట్రైబ్యునలేనని ఏపీ గట్టిగా వాదించడంతో బజాజ్ కమిటీ ఎలాంటి సిఫార్సు చేయలేదు. తరవాత ఈ అంశాన్ని కేంద్రం బ్రిజేష్ ట్రైబ్యునల్‌కే అప్పగించింది. ఈ 45 టీఎంసీలను పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతలకు కేటాయిస్తూ 2022లో తెలంగాణ ప్రభుత్వం జీవో జారీ చేసింది. కానీ దీనికి సీడబ్ల్యూసీ ఆమోదం, ఏపీ అంగీకారం లేకపోగా, ట్రైబ్యునల్ తేల్చాల్సి ఉంది. ఈ విషయంలో ప్రస్తుతం ఏర్పాటు చేసిన కమిటీలో కొంత చర్చ జరిగి సానుకూలత ఏర్పడిన తరవాత ఇద్దరు సీఎంల మధ్య ఓ అంగీకారానికి అవకాశం ఉంది. 1982లోనే శ్రీశైలం ఎడమగట్టు కాలువకు ఇందులో 30 టీఎంసీలను ప్రతిపాదించారు. పోలవరానికి ఇంకా అనుమతి రాలేదు కాబట్టి వచ్చిన తరవాత ఈ ప్రతిపాదన చేయాలని సీడబ్ల్యూసీ అప్పట్లో వెనక్కి పంపింది. మొదటి నుంచి తెలంగాణలోని ప్రాజెక్టులకే ఈ నీటిని కేటాయించాలనే ప్రతిపాదన ఉంది కాబట్టి పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతలకు వాడుకోవడానికి ఏపీ అంగీకరిస్తే రెండు రాష్ట్రాల మధ్య జలాల వినియోగానికి



తెలుగు రాష్ట్రాల మధ్య జల వివాదాల పరిష్కారానికి కేంద్రం నియమించిన కమిటీ శుక్రవారం దిల్లీలో సమావేశం కానుంది. కేంద్ర జలసంఘం ఛైర్మన్ నేతృత్వంలోని ఈ కమిటీలో రెండు రాష్ట్రాల నీటిపారుదలశాఖ అధికారులు సభ్యులుగా ఉన్నారు. ట్రైబ్యునల్, కృష్ణా, గోదావరి బోర్డులు, అపెక్స్ కౌన్సిల్ తేల్చాల్సిన అంశాలను ఈ కమిటీ పరిష్కరించగలదా అన్నది ప్రశ్న. అయితే జల వివాదాల పరిష్కారంలో ఇదొక ముందడుగుగానే చెప్పాలి. కీలక అంశాలను కమిటీ ఓ కొలిక్కి తేగలిగితే- కేంద్ర జల్‌శక్తి మంత్రి ఛైర్మన్‌గా, ఇద్దరు సీఎంలు సభ్యులుగా గల అపెక్స్ కౌన్సిల్ తుది నిర్ణయాలు తీసుకోగలదు.

సానుకూలత ఏర్పడుతుంది. ట్రైబ్యునల్ కేటాయిస్తే ఒక రాష్ట్రానికి కొంత ఎక్కువ, ఇంకొకరికి తక్కువ రావొచ్చు, సమానంగానైనా రావచ్చు. కానీ సీఎంలే ఓ అంగీకారానికి రాగలిగితే ప్రాజెక్టును పూర్తి చేసే అవకాశం ఏర్పడుతుంది. తెలుగు రాష్ట్రాల నడుమ ఇచ్చిపుచ్చుకునే వాతావరణానికి వీలు ఉంటుంది.

బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ 2013లో ఇచ్చిన తీర్పులోని కేటాయింపులు మూడో అంశం. బచావత్ ట్రైబ్యునల్ 75 శాతం నీటి లభ్యత ఆధారంగా ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీలు కేటాయిస్తే, 2013లో బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ ఇచ్చిన మరో 194 టీఎంసీలు కలిపితే 1005 టీఎంసీలైంది. తెలుగు రాష్ట్రాలకు ఇది సానుకూల తీర్పుకాదు. అందుకే ఉమ్మడి ఏపీ సుప్రీంకోర్టులో స్టే తెచ్చింది. దీనిపై ఏదో ఒక రోజు నిర్ణయం వచ్చే అవకాశం ఉంది. ఉమ్మడి ఏపీకి 194 టీఎంసీలు అదనంగా ఇచ్చిన బ్రిజేష్ ట్రైబ్యునల్, ఎగువన ఉన్న మహారాష్ట్ర, కర్ణాటకలకు కలిపి 264 టీఎంసీలు ఎక్కువగా కేటాయించింది. ఆలమట్టి ఎత్తు పెంచుకోవడానికీ అవకాశం ఇచ్చింది. అదనపు నీటి మాటేమోగానీ, కొన్నేళ్లలో బచావత్ కేటాయింపులు పొందడం కూడా సాధ్యం కాదు. దిగువన ఏపీకి 75 శాతం నీటి లభ్యతలో సమస్య రాకుండా చూసేందుకు 2130 టీఎంసీలకు మించి వచ్చినప్పుడు క్యారీ ఓవర్ స్టోరేజీ కింద శ్రీశైలం, సాగర్‌లలో నిల్వ చేసుకుని వాడుకోవడానికి అవకాశం ఇస్తే, బ్రిజేష్ ట్రైబ్యునల్ తీర్పు వల్ల 2400 టీఎంసీలకు మించి వస్తేతప్ప నిల్వ చేసుకోవడానికి వీలులేని పరిస్థితి ఏర్పడింది. ఇందులో కూడా బ్రిజేష్ ట్రైబ్యునల్ అన్యాయం చేసింది. అయితే దీంతో సంబంధం లేకుండా అదనంగా ఇచ్చిన నీటి వినియోగం తెలుగు రాష్ట్రాల మధ్య ఎలాగన్నదే ప్రశ్న. ఇందులో తెలుగుగంగకు 25 టీఎంసీలు, కర్నూలు జిల్లాలోని ఆర్డీఎస్ కుడికాలువకు నాలుగు టీఎంసీలు, జూరాలకు 9 టీఎంసీలు కేటాయించారు. ప్రస్తుతం రెండు రాష్ట్రాల మధ్య వాదనలు వింటున్న బ్రిజేష్ ట్రైబ్యునలే గతంలో ఈ తీర్పు ఇచ్చినందువల్ల తెలుగుగంగ, ఆర్డీఎస్ కుడికాలువ, జూరాలకు చేసిన కేటాయింపుల్లో మార్పులు చేసే అవకాశాలు తక్కువే. క్యారీ ఓవర్‌కు ఉన్న కేటాయింపుల్లో ఎవరెంత వాడుకోవాలన్నది తేల్చాలి. దీనిపై కూడా ప్రస్తుతం ఏర్పాటు చేసిన కమిటీ అధ్యయనం చేసి సంప్రదింపులతో ఒక అవగాహనకు వచ్చే అవకాశం ఉంది. ఇక్కడ అంగీకారానికి వచ్చి అపెక్స్ కౌన్సిల్ ఆమోదం పొందితే తెలుగు రాష్ట్రాలకు ఉపయుక్తం. బ్రిజేష్ ట్రైబ్యునల్ తీర్పు అమలులో లేదనుకున్నా బచావత్‌లోనూ క్యారీ ఓవర్ ఉండటంతో తెలుగు రాష్ట్రాలు చర్చలతో అంగీకారానికి రావడానికి ఇబ్బందేమీ లేదు.

అంగీకారానికి వస్తే మేలు

గోదావరిలో ఉమ్మడి ఏపీకి 1,430 టీఎంసీల లభ్యత ఉంది. పునర్విభజనకు ముందు అప్పటి ప్రభుత్వం గోదావరిలో 958 టీఎంసీలు తెలంగాణకు, మిగిలినవి ఏపీకి వాటా ఉన్నట్లు శాసనసభలో పేర్కొంది. పునర్విభజన తరవాత ఏపీ దీనికి అంగీకరించలేదు. తెలంగాణకు 700 టీఎంసీలలోపే ఉన్నట్లు పేర్కొంది. కొత్త ట్రైబ్యునల్ ఏర్పాటుకు మొగ్గు చూపింది. కృష్ణా జలాలపై బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ ఏర్పాటై రెండు దశాబ్దాలు దాటినా తీర్పు అమల్లోకి రాలేదు. పునర్విభజన తరవాత కాళేశ్వరం, కంతనపల్లి, సీతారామ ఎత్తిపోతల, సీతమ్మసాగర్‌లకు కేంద్రం అనుమతులిచ్చింది. ఇందులో కాళేశ్వరం మినహా మిగిలిన ప్రాజెక్టులు ఉమ్మడి ఏపీలో చేపట్టినవే. వీటన్నిటి కేటాయింపులను పరిగణనలోకి తీసుకుని గోదావరిలో తుది వాటాపై రెండు రాష్ట్రాలు ఓ అంగీకారానికి రావాల్సి ఉంది. అపెక్స్ కౌన్సిల్‌కు కేంద్రం కొత్తగా ఏర్పాటు చేసిన కమిటీ పునాదిని సిద్ధం చేయాలి. దీంతోపాటు మిగులు జలాలు ఎంత ఉన్నాయి, ఏయే నెలల్లో ఉన్నాయి, ఏ సబ్ బేసిన్ నుంచి ఉన్నాయన్న వివరాలతో ఓ అవగాహనకు వచ్చి వాడుకోవడానికి రెండు రాష్ట్రాలూ కార్యాచరణకు సిద్ధం కావాలి. ముందుగా నికర జలాలపై ఓ అంగీకారానికి వస్తే, మిగులు జలాలపై అవగాహన తేలికవుతుంది. ఈ దిశగా చర్చలు సాగితేనే ఫలితం ఉంటుంది.

– ఎం.ఎల్.నరసింహారెడ్డి

సమాన వేతనమేదీ?

మహిళల విద్యా స్థాయులు పెరుగుతున్నప్పటికీ సామాజిక వివక్ష, వృత్తిపరమైన విభజనలు, కుటుంబ బాధ్యతలు వంటివి ఉద్యోగాల్లో స్త్రీలకు ప్రతిబంధకంగా మారుతున్నాయి. వాటి మూలంగా పురుషులతో సమానంగా వారు వేతనాలు అందుకోలేకపోతున్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లోనూ ఈ సమస్య మహిళా ప్రగతికి ప్రతిబంధకమవుతోంది. పురుషులతో పోలిస్తే ఆయా దేశాల్లో మహిళలకు నగటున ఎంత తక్కువ వేతనాలు లభిస్తున్నాయంటే (శాతాల్లో)...




దక్షిణ కొరియా	29.3	యూకే	16.3
రష్యా	23.7	అమెరికా	15.3
ఇండియా	22	స్విట్జర్లాండ్	13.3
బంగ్లాదేశ్	17.6	ఫ్రాన్స్	11.6

(ఆధారం: అంతర్జాతీయ కార్మిక సంస్థ నివేదిక-2025)

భారత్‌కు తప్పని కర్బన పన్ను

భారత్-ఐరోపా సమాఖ్య(ఈయూ) మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ) వల్ల ఇరువైపులా సుంకాలు భారీగా తగ్గనున్నాయి. అయితే, ఈయూ కర్బన పన్ను(సీబీఏఎం) మాత్రం భారత్‌కు పంటి కింద రాయిలా మారవచ్చు. సీబీఏఎం విషయంలో ఇండియాకు ప్రత్యేక మినహాయింపు ఇచ్చే ఉద్దేశం లేదని ఈయూ ముఖ్య ప్రతినిధి పౌలా పీన్యో తాజాగా వ్యాఖ్యానించారు.

రెండు రోజుల కిందట కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంలో భాగంగా ఇకపై ఈయూకు భారత్ ఎగుమతి చేసే 99.5శాతం వస్తువులపై సుంకం ఉండదు. కార్మికులను ఎక్కువగా ఉపయోగించి వస్తువులను తయారుచేసే పరిశ్రమలకు దీనివల్ల లబ్ధి కలుగుతుంది. ఉదాహరణకు ఈయూ దేశాలకు ఎగుమతి అయ్యే భారతీయ దుస్తులు, పాదరక్షలు, సముద్ర ఉత్పత్తులు, వజ్రాలు, ఆభరణాలు, హస్తకళా ఉత్పత్తులు, రసాయనాలు, యంత్రాలపై సుంకాలు భారీగా తగ్గుతాయి. దాదాపు 97 శాతం ఈయూ ఎగుమతులపై తాను విధిస్తున్న సుంకాలను భారత్ వచ్చే 7-10 ఏళ్లలో దశల వారీగా తగ్గిస్తుంది. ప్రస్తుతం వైన్లపై విధిస్తున్న 150 శాతం సుంకాలను 20-30శాతానికి, విస్కీ, వోడ్కా, బ్రాందీ వంటి మద్యాలపై సుంకాలను నలభై శాతానికి, బీర్లపై సుంకాలను 110 నుంచి యాభై శాతానికి తగ్గిస్తుంది. ఈయూ దేశాల నుంచి దిగుమతి అయ్యే కార్లపై ప్రస్తుతం విధిస్తున్న 100-125శాతం సుంకాలను పది శాతానికి కుదిస్తుంది. ఇది ఏడాదికి 2.50 లక్షల కార్ల దిగుమతిపై మాత్రమే వర్తిస్తుంది. గొర్రె మాంసం, పండ్ల రసాలు, బేకరీ వస్తువులు, పాస్తా, చాక్లెట్లు వంటి వాటిపై సుంకాలను తొలగిస్తుంది. ఈయూ నుంచి దిగుమతయ్యే శుద్ధి చేసిన ఆహారం, రసాయనాలు, యంత్రాలు, ఎలక్ట్రానిక్స్, విమానాలపై సుంకాలను క్రమంగా ఎత్తివేస్తుంది.




అపరిష్కృతంగా మిగిలిన సీబీఏఎం

సుంకాల సంగతి అటుంచితే ప్రభుత్వపరంగా వస్తుసేకరణ, మేధా హక్కులు, కార్మిక, పర్యావరణ, సుస్థిరాభివృద్ధికి సంబంధించిన అంశాలపై భారత్, ఈయూలు భిన్న వైఖరులను అవలంబించాయి. దీని ప్రభావం ఎలా ఉంటుందో నిలకడ మీద తెలుస్తుంది. అన్నింటికన్నా ముఖ్యంగా ఈయూ కర్బన సరిహద్దు సర్దుబాటు విధానం (సీబీఏఎం) గురించి పరిశీలించాలి. ఒక వస్తువు తయారీలో బొగ్గు, చమురు వంటి శిలాజ ఇంధనాలను వాడితే కర్బన ఉద్గారాలు పెరుగుతాయి. అలాంటి వస్తువుల దిగుమతిపై ఈ ఏడాది జనవరి ఒకటి నుంచి ఈయూ అధిక సుంకాలు విధిస్తోంది. భారత్-ఈయూ ఒప్పందంలో సీబీఏఎం గురించి ప్రస్తావించలేదు. ప్రస్తుతానికి ఉక్కు, అల్యూమినియం వంటి ఆరు భారతీయ ఉత్పత్తులపై ఈయూ అధిక సుంకాలు విధిస్తోంది. క్రమంగా ఇతర పారిశ్రామిక ఉత్పత్తులపై కూడా సీబీఏఎం కింద అధిక సుంకాలు మోపవచ్చు. ఫలితంగా ఈయూతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కింద ఈ వస్తువులపై భారత్‌కు సుంకాల మినహాయింపు లభించదు. దీన్ని సరిదిద్దే ప్రయత్నమేదీ జరగడం లేదు. 2026లో భారత్-ఈయూ సహకార వేదిక ఏర్పాటు, హరిత ఇంధనాలకు ఇండియా మారడానికి 50కోట్ల యూరోల నిధిని అందించే ప్రతిపాదన వంటివి... సీబీఏఎం వల్ల భారతీయ ఎగుమతిదారులకు జరిగే నష్టం గురించి పట్టించుకోవడం లేదు.

హరిత ఇంధనాలే శరణ్యం

భారత్-ఈయూ ఎఫ్‌టీఏ 200 కోట్ల మందితో కూడిన సువిశాల మార్కెట్‌ను సృష్టిస్తుంది. ఉభయ పక్షాల మధ్య ఆయుధ ఉత్పత్తి, రక్షణ రంగంలో వ్యూహాత్మక బంధం రాబోయే రోజుల్లో పెరగనుంది. అయితే ఎఫ్‌టీఏ పరిధిలోకి సీబీఏఎం రాకపోవడం భారత్‌కు నష్టదాయకం కానుంది. ఈయూలోని 27 దేశాల నుంచి ఇండియాకి సుంకాలు లేకుండా పలు ఉత్పత్తులు దిగుమతి అవుతాయి. కానీ ఉక్కు, అల్యూమినియం వంటి భారతీయ ఎగుమతులపై మాత్రం ఐరోపాలో కర్బన పన్ను విధిస్తారు. దీన్ని తొలగించడానికి గట్టి చర్యలు తీసుకోవాలి. పరస్పర సహకార వేదికల నిర్మాణం, వాతావరణ మార్పుల నిభాయింపునకు నిధులు సమకూర్చడం వంటివి ఎగుమతిదారులకు తక్షణం ఉపశమనం కలిగించవు. ఏతావాతా ఎఫ్‌టీఏ సుంకాల తగ్గింపునకు తోడ్పడుతుంది కానీ కీలక భారతీయ ఎగుమతులకు అది గరిష్ఠస్థాయిలో లబ్ధి చేకూర్చకపోవచ్చు. సీబీఏఎం కింద కర్బన పన్నును తప్పించుకోవాలంటే భారత్ పెద్దయెత్తున హరిత ఇంధనాలతో ఉత్పత్తి చేపట్టాల్సి ఉంటుంది.



అజయ్ శ్రీవాస్తవ
వ్యవస్థాపకులు, గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ)

ఎలా లెక్కిస్తారంటే...

మన దేశ జనాభా 145 కోట్లకు పైమాటే కదా. ప్రజలు ఎంతమంది ఉన్నారని మనకు ఎలా తెలుస్తుంది? ఇంటింటికీ వెళ్లి లెక్కిస్తేనేగా! మరి అడవి జంతువులను ఎలా లెక్కిస్తారు? కచ్చితంగా ఇన్ని పులులు, సింహాలు ఉన్నాయని ఎలా చెబుతారో తెలుసా..




సాధారణంగా భారత వన్య ప్రాణి సంస్థ మాంసాహార, శాకాహార జంతువుల జనాభాను లెక్కిస్తుంది. అడవుల్లో కొన్నిరోజుల పాటు నడుస్తూ జంతువులను లెక్కిస్తుంటారు. ప్రత్యక్షంగా చూసి లెక్కించినవి కొన్ని అయితే.. వాటి పాద ముద్రలు, మలం, భూమి మీద చెట్లపై గోర్లతో పెట్టిన గాట్ల ఆధారంగానూ అడవి జంతువుల ఉనికిని రికార్డు చేస్తారు. వాటిని గుర్తించడానికి కొన్నిచోట్ల కెమెరాలు ఏర్పాటు చేస్తారు. అలాగే పక్షులనూ లెక్కిస్తారు. 'అంతేనా! జంతువులను లెక్కించడం చాలా ఈజీ అయితే!' అనుకుంటున్నారా. కానీ అది సులభమేం కాదు నేస్తాలూ! కౌంటింగ్ కార్యక్రమంలో పాల్గొనే వారికి వన్యప్రాణి శాస్త్ర జ్ఞానం, పరిశీలనాసక్తి, కచ్చితమైన సమాచారం సేకరించే నైపుణ్యం, ధైర్యం, అడవుల్లో తిరగడానికి కావాల్సిన శారీరక దృఢత్వం చాలా అవసరం. ఎటువైపు నుంచి ఏ జంతువులు వస్తాయో తెలియదు, ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి. అందుకే వారికి అటవీశాఖ ప్రత్యేక శిక్షణ ఇస్తుంది. ఒంటరిగా కాకుండా కొన్ని బృందాలుగా విడిపోయి జంతు గణన చేస్తారు. ఒక్కో జట్టులో ఇద్దరి నుంచి ముగ్గురు వ్యక్తులు ఉంటారు. వాళ్లు అడవిలో తిరిగేటప్పుడు ఆ చుట్టుపక్కల పరిసరాలతో కలిసిపోయే రంగు దుస్తులు మాత్రమే ధరిస్తారు. వాసన వెదజల్లే పౌడర్లు, పెర్‌ఫ్యూమ్‌లూ అస్సలు ఉపయోగించరు.

– ఎం.రామ్ మోహన్

హాయ్! బుజ్జీ!!

కొందరు మాట్లాడుతుంటే వింటూ ఉండిపోవాలనిపిస్తుంది. మరికొందరి ప్రసంగం ఎప్పుడైపోతుందా అనిపిస్తుంది. మాట్లాడటం ఒక కళ. వినసొంపుగా మాట్లాడటాన్ని ఎవరైనా నేర్చుకుని సాధన చేయవచ్చు. కానీ నలుగురిలో మాట్లాడాలంటే చాలా మందికి భయం. అలాగని మాట్లాడకుండా ఉండటం ఈ రోజుల్లో కుదరదు. ఉద్యోగంతో సంబంధం లేకపోయినా కుటుంబసభ్యులతో చిన్న చిన్న వేడుకల్లోనో, స్నేహితులతో పార్టీల్లోనో నాలుగు మాటలు మాట్లాడాల్సిన సందర్భాలు తప్పక వస్తాయి. అందుకు సిద్ధంగా ఉండటం అందరికీ అవసరం.

ప్రిపేర్ అవ్వండి!



'స్టేజ్ ఫియర్' అంటుంటారు చాలామంది. నిజానికి అది వేదిక మీద నిలబడి మాట్లాడటానికి సంబంధించిన భయం కానే కాదు. శ్రోతలు ఎలా రిసీవ్ చేసుకుంటారోనన్న భయం. జడ్జ్ చేస్తారేమో, మాట్లాడటం చేతకాదనుకుంటారేమో... అన్న భయం. దానికే శరీరం స్పందిస్తుంది. చేతులు వణుకుతాయి, కండరాలు బిగుసుకుంటాయి, నోరు తడారిపోతుంది. గుండె వేగంగా కొట్టుకుంటుంది. ఎవరికి వారు తమ ఒక్కరికే ఇలా జరుగుతోందనుకుంటారు. నిజానికి గొప్ప వక్తలుగా పేరున్న వాళ్లంతా కూడా ఇలాంటి అనుభవాలను ఎదుర్కొన్నవారే. ఆ లక్షణాలను మేనేజ్ చేయడం నేర్చుకున్నవాళ్లు కూల్‌గా కనిపిస్తారు. అలా చేయడం చేతకానివాళ్లు కంగారు పడతారు. నిజానికి తాను కంగారు పడుతున్నట్లు, భయపడుతున్నట్లు వక్తకు తెలుస్తుంది కానీ శ్రోతలకు తెలియదు. ఎందుకంటే వాళ్లు వింటున్న విషయంపైన దృష్టి పెడతారు కానీ వక్తకు చెమటలు పడుతున్నాయా, చేతులు వణుకుతున్నాయా అన్నది గమనించరు. అయితే, మాట్లాడాల్సిన వాళ్లు ఆ భయాన్ని అధిగమించాలి కాబట్టి అందుకు దోహదపడే సూచనలు తెలుసుకోవాలి.

నిదానంగా, గాఢంగా శ్వాస తీసుకోవడం వల్ల గుండెదడ తగ్గుతుంది. చిన్నగా స్ట్రెచింగ్ వ్యాయామాలు- చేతులూ కాళ్లూ కదిలించడం, మెడను అటూఇటూ తిప్పడం లాంటివి టెన్షన్‌ని తగ్గిస్తాయి. మనసులో బెరుగ్గా ఉన్నా పైకి కామ్‌గా ఉన్నట్లు కనిపించడానికి ప్రయత్నిస్తే... ఆటోమేటిగ్గా ఆందోళన తగ్గిపోతుంది. మొదట మనసులోని ఆందోళనకు శరీరం స్పందించింది కదా, ఇప్పుడు శరీరం మనసును దారిలోకి తెస్తుందన్న మాట. అలాగే సందర్భానికి తగిన, సౌకర్యవంతమైన దుస్తులు ధరించాలి. హావభావాలు, కదలికలు సహజంగా ఉండాలి. మాటలో స్పష్టత ముఖ్యం. పాజ్ ఇస్తూ గొంతులో కొద్దిపాటి హెచ్చుతగ్గులతో మాట్లాడితే వినబుద్ధేస్తుంది. పడికట్టు పదాలతో కాకుండా మంచి భాషలో ఎదుటి వాళ్లతో మాట్లాడుతున్నట్లుగా ప్రసంగం సాగాలి. షార్ట్ అండ్ స్వీట్... అంటారు కదా, చక్కగా ప్రిపేర్ అయ్యి తక్కువ మాటల్లో ఎక్కువ సారాంశాన్ని చెబితే విన్నవాళ్లకు గుర్తుండిపోతుంది.

ఎంత బాగా మాట్లాడినా ప్రసంగంలో చివరి మాటలు కాసేపు శ్రోతల చెవుల్లో మార్మోగుతూ ఉంటాయి. అందుకని మంచి ముగింపు వాక్యాలు ఎంచుకోవడం మరవద్దు. పేపర్ చూసి చదివినా, రాసుకున్నది కంఠతా పట్టి అప్పజెప్పినా, ఆశువుగా అప్పటికప్పుడు మాట్లాడినా... ఏదీ తప్పు కాదు. ప్రసంగించాల్సిన విషయం మీద ప్రిపేర్ అవడం మాత్రం తప్పనిసరి. స్పష్టమైన ఆలోచనలకు ప్రిపరేషన్ తోడైతే ఆత్మవిశ్వాసం అదే వస్తుంది. మీలోని వక్తను బయటికి తీస్తుంది.

– హనుమంతరావు తుర్లపాటి

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
శుక్రవారం జనవరి 30, 2026

అమ్మ వైభవం.. చూసినవారిదే భాగ్యం





ఉయ్యూరు వీరమ్మ తల్లి తిరునాళ్లు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజైన గురువారం గ్రామోత్సవం నిర్వహించగా మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించారు. వేలమంది భక్తులు తిరుగుడు గండ దీపాలతో పట్టణం మొత్తం తిరిగి మొక్కులు తీర్చుకున్నారు. - ఉయ్యూరు, న్యూస్‌టుడే

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో..

జిల్లాస్థాయి ప్రతిభాపాటవ పోటీలు నేడు

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు శుక్రవారం జరగనున్నాయి. విజయవాడ లబ్బీపేటలోని శ్రీదుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతాయి. నాలుగు నెలలుగా ఉమ్మడి కృష్ణా జిల్లాలోని మచిలీపట్నం, అవనిగడ్డ, గుడివాడ, గన్నవరం, విస్సన్నపేట, మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట, పెనమలూరు, విజయవాడలోని 25 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాసం, క్విజ్ పోటీలు జరిగాయి. ప్రతి కళాశాల నుంచి నాలుగు విభాగాల్లో ముగ్గురు చొప్పున 12 మంది విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారు. వారంతా ఉదయం 9 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని నిర్వాహకులు సూచించారు. - విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

వెలుగు దూరమై.. వేదన చేరువై!

★ జాతీయ రహదారుల్లో కానరాని కాంతులు ★ సూచిక బోర్డులు, సిగ్నల్స్ లేని దైన్యం

పరిశీలన

'పేరుకు జాతీయ రహదారులైనా తీరులో సౌకర్యాల లేమితో కునారిల్లుతున్నాయి. ప్రధాన కూడళ్లు, గ్రామాల్లో సైతం చిమ్మచీకట్లో ప్రయాణించాల్సిన దైన్యం కళ్లకు కడుతోంది. సిగ్నల్స్, డివైడర్లు, ప్రమాద సూచికలు లేక తరచూ ప్రయాణికులు ప్రాణాలొదులుతున్నారు. ఇంతలా రోడ్లు రక్తసిక్తమవుతున్నా అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి.'

చిమ్మచీకట్లో బిక్కుబిక్కుమంటూ..

✪ విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిలో గొల్లపూడి, గుంటుపల్లి, తుమ్మలపాలెం, ఇబ్రహీంపట్నం వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసినా కొన్నేళ్లుగా వెలగడం లేదు. జూపూడి, మూలపాడు, కేతనకొండ, దొనకొండ, పరిటాల విద్యుత్తు సౌకర్యం లేదు. పరిటాల నుంచి కంచికచర్ల వరకు ఉన్న బైపాస్‌లో 70 శాతం దీపాలు దాదాపు ఏడాదిగా వెలగడం లేదు. ఆ పరిధిలోని సర్వీస్ రోడ్లపై అంధకారంలో వెళ్లాల్సిందే. అంబారుపేట, ఐతవరం, నంది గామ, అనాసాగరం, తోటచర్ల, గౌరవరం, చిల్లకల్లు వరకు సగంచోట్ల దీపాలు వెలగని దుస్థితి ఉంది. ✪ ఇబ్రహీంపట్నం-ఛత్తీస్‌గఢ్ జాతీయ రహదారిలో ఇబ్రహీంపట్నం నుంచి కొండపల్లి, కట్టుబడిపాలెం, జి.కొండూరు పరిధిలో కొండపల్లిలో అక్కడక్కడా మాత్రమే దీపాలు వెలుగుతున్నాయి. మిగిలిన చోట్ల ప్రయాణికులకు అవస్థలే. ✪ విజయవాడ- మచిలీపట్నం రహదారిలో బెంజిసర్కిల్ నుంచి గంగూరు వరకు విద్యుత్తు సౌకర్యం ఉంది. అక్కడ నుంచి దాదాపు ఎక్కడా విద్యుత్తు కాంతులు లేవు. కత్తిపూడి-ఒంగోలు రహదారిపై కృత్తివెన్ను మండల పరిధిలో గరిశపూడి, సీతనపల్లి, లక్ష్మీపురం, రంగాసెంటర్, కృత్తివెన్ను ప్రధాన కూడలి అత్యంత ప్రమాదకర ప్రాంతాలైనా ఇక్కడ విద్యుత్తు సౌకర్యం లేదు.



హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై గొల్లపూడి మార్కెట్ యార్డు నుంచి తుమ్మలపాలెం వరకు అంధకారం

సదుపాయాలు శూన్యం..

★ గొల్లపూడిలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. కత్తిపూడి-ఒంగోలు రహదారిపై తొమ్మిది బ్లాక్ స్పాట్లు గుర్తించినా ఎక్కడా ప్రమాద సూచికలు కనిపించవు. గ్రామాల్లో నుంచి జాతీయ రహదారి ఎక్కే రోడ్ల చివర వేగ నియంత్రికలు కూడా అరకొరగానే ఏర్పాటు చేశారు. దీంతో గ్రామాల నుంచి హైవే ఎక్కేవారు వేగంగా రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ★ గత ఏడాది కాలంలో జాతీయ రహదారుల్లో 668 ప్రమాదాలు జరిగితే 237 మంది చనిపోయారు. 610 మంది గాయాలపాలయ్యారు. ఇందులో 30 నుంచి 40శాతం వరకు రాత్రుళ్లు, మౌలిక సదుపాయాల లేమితోనే జరిగాయి.

అధికారులను ఆదేశించాం..

దీనిపై ఎన్టీఆర్, కృష్ణా కలెక్టర్లు లక్ష్మీశ, బాలాజీ మాట్లాడుతూ..'జాతీయ రహదారుల్లో మౌలిక సదుపాయాల సమస్య మా దృష్టిలో ఉంది. రహదారుల భద్రత సమావేశాల్లో ఈ సమస్యలను పరిష్కరించాలని ఇప్పటికే అధికారులను ఆదేశించాం. ఈ పనుల ప్రగతి పరిశీలనకు నెలకోసారి జరగాల్సిన సమావేశాన్ని 15 రోజులకోసారి నిర్వహిస్తాం' అని తెలిపారు.

- ఈనాడు, అమరావతి

★ హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిలో(ఎన్‌హెచ్-65) గొల్లపూడి మార్కెట్ యార్డ్ సమీపంలో ఓ మహిళ ద్విచక్రవాహనంపై రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన వ్యాన్ ఢీకొని మృతి చెందారు. విద్యుత్తు దీపాలు లేక వేగంగా వస్తున్న వ్యాన్ డ్రైవర్‌కు దగ్గరకు వచ్చే వరకు మహిళ కనిపించక ప్రమాదం జరిగింది. ★ ఇబ్రహీంపట్నం కేరళ హోటల్ కూడలి దగ్గర యాచకులు రాత్రి సమయాల్లో రహదారి దాటుతూ ఉంటారు. ఆ ప్రాంతంలో విద్యుత్తు దీపాలు లేకపోవడంతో దగ్గరకు వచ్చే వరకు రోడ్డు దాటుతున్న వారు కనిపించక ఈ కూడలిలోనే గత రెండేళ్లలో 8 మంది చనిపోయారు. గుంటుపల్లి, కేతనకొండ, ఇబ్రహీంపట్నం, నల్లకుంట కూడళ్లలో ఇదే తరహా ప్రమాదాల్లో రెండేళ్లలో 11 మంది మృతి చెందారు. కత్తిపూడి-ఒంగోలు రహదారిపై కృత్తివెన్ను మండల పరిధిలోనే ఏడాదిలో 11 మంది మృతి చెందారు.

తార్‌మార్.. రైల్‌మార్

రోజూ విశాఖ-సికింద్రాబాద్, సికింద్రాబాద్-విశాఖ వందేభారత్ రైళ్లు ఐదు నిముషాల తేడాతో విజయవాడ రైల్వేస్టేషన్‌లో ఆగుతాయి. దీంతో ప్రయాణికులు తికమక పడి ఒక రైలుకు బదులు మరో రైలు ఎక్కి ఇబ్బంది పడుతున్నారు. ఈ చిత్రంలో కనిపిస్తున్న ప్రయాణికుడు సికింద్రాబాద్‌కు వెళ్లాలి. కంగారులో 6వ నంబరు ప్లాట్‌ఫాంలో ఉన్న రైలుకు బదులు 7వ నంబరు ప్లాట్‌ఫాంపై ఉన్న రైలు ఎక్కడానికి వచ్చారు. అప్పటికే డోర్లు మూసుకుపోవడంతో మానవతా దృక్పథంతో లోకో పైలట్ తన క్యాబిన్ నుంచి ఎక్కించారు. తీరా తాను ఎక్కాల్సిన రైలు ఇది కాదని తెలిసి నెమ్మదిగా కదులుతున్న రైలు నుంచి దిగిపోయి బతుకుజీవుడా అనుకున్నారు. ఒకే సమయంలో రెండు దిశలలో వెళ్లే వందేభారత్ రైళ్లను పక్కపక్క ప్లాట్‌ఫాంలలో కాకుండా దూరదూరంగా ఇవ్వాలని ప్రయాణికులు కోరుతున్నారు.

- ఈనాడు, అమరావతి



విశాఖ వెళ్లే వందేభారత్ తలుపులు మూసుకోగా..లోకోపైలట్ క్యాబిన్‌లో నుంచి లోపలకు ప్రయాణికులను మానవతా దృక్పథంతో ఎక్కిస్తున్న రైల్వే సిబ్బంది.



ఈ రైలు కాదని దిగిపోతూ..



ఆరో ప్లాట్‌ఫాంలో ఎక్కాల్సిన రెలు

కొందరే సిబ్బంది.. సేవలకు ఇబ్బంది!

విజయవాడ పాత ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది కొరత వేధిస్తోంది. వైద్యులతో పాటు రక్తపరీక్షలు నిర్వహించే సిబ్బంది సరిపడా లేక ఉన్నవారిపై పనిభారం పెరుగుతుంది. పాత ఆసుపత్రికి జిల్లా నుంచే కాకుండా ఇతర ప్రాంతాల మహిళలు వారి ఆరోగ్య సమస్యలు, గర్భాశయానికి సంబంధించిన పరీక్షలు, తదితర వైద్యసేవల కోసం వస్తుంటారు. దీంతో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది.

మౌలిక వసతుల కొరత

పాతాసుపత్రిలో రోజువారి ఓపీకి వచ్చే రోగులకు సరిపడా సిబ్బంది, వైద్యులు లేక ఉన్న వారిపై ఒత్తిడి పెరిగిపోతుంది. ప్రసూతి విభాగం, గర్భకోశ వ్యాధులు విభాగం, శిశు వైద్యం తదితర విభాగాల్లో సరిపడా వైద్యులు లేరు. ఎక్స్‌రే, రక్త పరీక్షల విభాగంలో ముడిసరుకు, సిబ్బంది కొరత ఉండడంతో కొత్త ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాల్సిన దుస్థితి. ★ గైనకాలజీ, చిన్న పిల్లలకు సంబంధించిన విభాగాలన్నీ ఒకే చోట ఉన్నాయి. దీంతో పని సులభతరం అవుతున్నా మెరుగైన వైద్య సేవలందించేందుకు ఆసుపత్రి ఆవరణలోనే సిటీ స్కాన్, ఎంఆర్ఐలను ఏర్పాటు చేయాలని రోగులు కోరుతున్నారు.

పరికరాలు తక్కువ

ప్రసూతి విభాగం, గర్భకోశ వ్యాధులు, శిశు, మత్తు మందు విభాగం, డయాగ్నోస్టిక్స్ సేవల్లో భాగంగా రక్త పరీక్షలు, బయో కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, పాథాలజీ విభాగాలు అందుబాటులో ఉన్నాయి. రేడియాలజీ వైద్య సేవల్లో భాగంగా ఎక్స్‌రే, అల్ట్రా సోనోగ్రఫీ విభాగం, ఈసీజీ, రక్త నిధి కేంద్రాలు ఉన్నాయి. నిత్యం 190 నుంచి 210 మంది మధ్య ఓపీ ఉంటోంది. ఆసుపత్రిలో నెలకొల్పాల్సిన స్కాన్‌లు, ఎక్స్‌రే పరికరాల సంఖ్య పెంచాలని మహిళలు కోరుతున్నారు.

– విజయవాడ పాతాసుపత్రి, న్యూస్‌టుడే

కొలువుల శిక్షణ కోలాహలం..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రణాళికాబద్ధంగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తోంది. దీంతో తమ నైపుణ్యాలు మెరుగుపర్చుకుని ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో విజయవాడ నగరానికి రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మంది యువతీ యువకులు వచ్చి కోచింగ్ సెంటర్లలో చేరుతున్నారు. నక్కలరోడ్ చుట్టుపక్కల కోచింగ్ సెంటర్లు ఉండడంతో బ్యాంకు, రైల్వే, ఎస్ఎస్‌సీ, ఏపీపీఎస్సీ, డీఎస్సీ ఇలా ఎన్నో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. గురువారం



మధ్యాహ్నం తరగతులు ముగిసిన అనంతరం ఇలా ఒకేసారి బయటకు రాగా నక్కల్ రోడ్ అంతా ట్రాఫిక్‌తో స్తంభించింది.

-ఈనాడు, అమరావతి

ఏపీపీఎస్సీ పరీక్షా కేంద్రాల పరిశీలన

ఎన్టీఆర్ కలెక్టరేట్, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : నగరంతోపాటు నగర పరిసరాల్లోని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షా కేంద్రాలను కలెక్టర్ లక్ష్మీశ గురువారం పరిశీలించారు. ఇబ్రహీంపట్నంలోని జాకీర్ హుస్సేన్ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 27న ప్రారంభమైన పరీక్షలు 31వ తేదీ వరకు జరుగుతాయన్నారు. గురువారం 1,108 మంది అభ్యర్థులకు గాను, 370 మంది హాజరయ్యారని.. 738 మంది గైర్హాజరైనట్టు తెలిపారు. నగరంలోని బిషప్ అజరయ్య జూనియర్ కళాశాల, చిట్టూరి విద్యాలయం, రామవరప్పాడు జడ్పీ హైస్కూలులోని కేంద్రాల్లోనూ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

ఎరక్కపోయారో.. ఇరుక్కుపోయారే!

■ డబ్బు ఆశ చూపి భారీగా ఖాతాలు తెరిపించిన మధ్యవర్తులు
■ క్రికెట్ బెట్టింగ్, సైబర్ నేరాలకు వినియోగించేందుకు పథకం

ఈనాడు, అమరావతి

★ పేద, దిగువ మధ్య తరగతి వారిని లక్ష్యంగా చేసుకుని మధ్యవర్తులు బ్యాంకు ఖాతాలను తెరిపిస్తున్నారు. కమీషన్ల కోసం వాటిని చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించేవారికి అందజేస్తున్నారు. ఇటీవలి కాలంలో అద్దె ఖాతాల వ్యవహారాలు వరుసగా బయటపడుతున్నాయి. తాజాగా నగరంలోని భవానీపురంలో వెలుగుచూసింది. దాదాపు 25 బ్యాంకు ఖాతాలు తెరిచి వాటిని రాజస్థాన్‌లోని క్రికెట్ బెట్టింగ్ లావాదేవీలు నిర్వహించేవారికి పంపించేందుకు సిద్ధంగా ఉంచారు.

★ విజయవాడ నగరం చిట్టినగర్‌కు చెందిన అహ్మదున్నీసాది నిరుపేద కుటుంబం. ఆమెకు రూ.5వేలు ఆశ చూపి భవానీపురంలోని కరూర్ వైశ్యాబ్యాంకులో ఖాతా తెరిపించారు. పోలీసులకు సమాచారం రావడంతో బ్యాంకుకు వెళ్లి పట్టుకున్నారు.

విజయవాడకు చెందిన షారుఖ్ అహ్మద్ కుటుంబం రాజస్థాన్ నుంచి వచ్చి నగరంలో స్థిరపడింది. మార్బుల్ పరిచే పనులు చేస్తుంటాడు. రెండు నెలల కిందట రాజస్థాన్ వెళ్లినప్పుడు అక్కడ ఓ ముఠా పరిచయమైంది. క్రికెట్ బెట్టింగ్ లావాదేవీల కోసం బ్యాంకు ఖాతాలు కావాలని.. ఎన్ని ఉన్నా తీసుకుని కమీషన్ ఇస్తామని ముఠాకు చెందిన అజ్జూ, యూనస్, ప్రశాంత్‌లు చెప్పడంతో షారుఖ్ అంగీకరించాడు. విజయవాడ వచ్చిన తర్వాత లోకేష్, కోటేశ్వరరావులను ఏజెంట్లుగా నియమించుకున్నాడు. ఖాతాలు తెచ్చి ఇస్తే ఒక్కో దానికి రూ.2వేలు ఇస్తామని ఒప్పందం చేసుకున్నాడు. వీరు తిరిగి లంబాడిపేటకు చెందిన నాగలక్ష్మిని ఏజెంటుగా నియమించుకుని ఖాతాకు రూ.వెయ్యి ఇచ్చేలా ఒప్పందం కుదిరింది. ఆ ప్రాంతంలో స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసి, వారికి నాగలక్ష్మి రుణాలు ఇప్పిస్తుంటుంది. వీరంతా నిరుపేదలకు వల వేసి ఖాతాలు తెరిపించేందుకు ముఠాగా ఏర్పడ్డారు.

ప్రైవేటు బ్యాంకుల్లోనే..

ప్రధాన నిందితుడు షారుఖ్ అహ్మద్ ఇప్పటికే దాదాపు 25 బ్యాంకు ఖాతాలను సేకరించినట్లు దర్యాప్తులో గుర్తించారు. లోకేష్, కోటేశ్వరరావులు సొంతంగా ఖాతాలు తెరవడంతో పాటు, బంధువులు, కుటుంబ సభ్యుల పేర్లతో తీసుకుని అందజేశారు. పొదుపు, కరెంట్ ఖాతాలు తెరిచేందుకు మధ్యవర్తులు ప్రైవేటు బ్యాంకులను ఎంచుకుంటున్నారు. షారుఖ్ ముఠా ప్రధానంగా గాయత్రి బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, కరూర్ వైశ్యాబ్యాంకుల్లో తెరిపించినట్లు తేలింది. వ్యాపార సంస్థలు మాత్రమే కరెంట్ ఖాతాలు తెరుస్తాయి. కానీ సాధారణ వ్యక్తులతోనూ ఈ ఖాతాలు తెరిపిస్తున్నారు. కనీసం అర్హతలు చూడకుండానే ఖాతాలు మంజూరు చేస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. మొత్తం 50 ఖాతాలు అయిన తర్వాత వాటిని రాజస్థాన్ తీసుకెళ్లి అందజేయాలని షారుఖ్ నిర్ణయించుకున్నాడు. ఇప్పటి వరకు మొత్తం 25 ఖాతాలు తెరిపించి, వాటికి సంబంధించిన కిట్‌లు తీసుకున్నాడు. ఇంతలో పోలీసులకు దొరికిపోయాడు.

ఇంతికి ఫలం.. ఇంటికి బలం

★ రైజ్ ద్వారా వ్యాపార వృద్ధికి సహాయ సహకారాలు

ఈనాడు, అమరావతి

'ప్రతి కుటుంబం నుంచి మహిళా వ్యాపారవేత్త రావాలి' అన్న సీఎం చంద్రబాబు ఆశయాన్ని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ స్ఫూర్తిగా తీసుకున్నారు. మహిళలు వ్యాపార రంగంలో రాణించేందుకు రైజ్(రూరల్ ఇంక్యుబేషన్ స్కిల్లింగ్, ఆంత్రప్రెన్యూర్‌షిప్ సెంటర్) పేరుతో వినూత్న కార్యక్రమాన్ని రూపొందించారు. వనితలను వ్యాపారవేత్తలుగా మార్చడమే కార్యక్రమం లక్ష్యం.



వనితకు కూటమి దన్ను..

★ వెలుగు సంఘాల్లో ఉన్న మహిళలు ఇప్పటికే చిన్న చిన్న వ్యాపారాలు చేస్తున్నా మరింత ముందుకు వెళ్లడంలో దిశా నిర్దేశం లేక అక్కడే ఆగిపోతున్నారు. మరికొందరు అసలు వ్యాపార ఆలోచన, మార్గ నిర్దేశం, పెట్టుబడి, నైపుణ్యాలు లేక అడుగు ముందుకేయడం లేదు. అన్ని సమస్యలకు ఒక్క కేంద్రంతో పరిష్కారం చూపించేలా రైజ్ రూపుదిద్దుకుంది. ★ బ్యూటీపార్లర్, బొటిక్, ఫుడ్‌ప్రాసెసింగ్, సేంద్రియ ఉత్పత్తుల సాగు అమ్మకాలు, పచ్చళ్లు, వస్త్రవ్యాపారం, ఫ్యాన్సీ, కిరాణా, స్వీట్ దుకాణాలు ఇలా మహిళలు తమ అభిరుచికి తగిన ఏ వ్యాపారాన్నికైనా చేయూత ఉంటుంది. ★ ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలో రైజ్ సెంటర్ ఏర్పాటు చేసుకునేందుకు ఇప్పటికే నీతి ఆయోగ్ నుంచి అనుమతులొచ్చాయి. నిర్మాణ వ్యయం కోసం రూ.కోటి నిధులు మంజూరు చేసింది. ★ ఈ సెంటర్‌లో ఏ వ్యాపారం చేయాలి అన్న ఆలోచన లేని వారికి వ్యాపారాల్లో రాణిస్తున్న మహిళలతో అవగాహన, నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. ఆలోచన ఉన్నా పెట్టుబడి లేని వారికి రుణాలు ఇప్పిస్తారు. ఇప్పటికే వ్యాపారాలు చేస్తున్న వారికి విస్తరణకు మార్కెటింగ్ దారి చూపుతారు. ఆన్‌లైన్ మార్కెటింగ్‌పై ఏఐ ష్యూర్ అనే ప్రత్యేక విభాగంతో శిక్షణ ఇప్పిస్తారు.

★ ఈ ఏడాది వెయ్యి మంది మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చాలన్న దిశగా కసరత్తు చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం విజయవాడకు సమీపంలో ఉండడం, మార్కెటింగ్‌కు సులభంగా ఉంటుందన్న ఉద్దేశంతో ఆ మండలాన్ని ఎంపిక చేసుకున్నారు. అక్కడ 903 వెలుగు సంఘాలు, 18వేల మంది సభ్యులున్నారు. వీరితో ఇప్పటికే సమావేశాలు నిర్వహించి ఆసక్తి ఉన్న వారిని ఎంపిక చేస్తున్నారు. ★ వీరికి పెట్టుబడి సాయం కోసం స్త్రీనిధి, బ్యాంకు అనుసంధాన రుణాలను ఏడాదికి రూ.25 కోట్ల వరకు కేటాయిస్తున్నారు. పెద్ద పరిశ్రమలు ఏర్పాటు చేసే వారికి కేంద్ర ప్రభుత్వం నుంచి రుణాలు, రాయితీలు ఇస్తారు. ★ 'మహిళల్లో ఆర్థిక సాధికారతను పెంపొందించేందుకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహానికి రూపంగా రైజ్ రూపొందించాం. ఏటా వెయ్యి మందిని వ్యాపారవేత్తలుగా మార్చలన్నదే లక్ష్యంతో రాష్ట్రంలో ఎక్కడా లేని కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం. శనివారం వర్క్‌షాపు ద్వారా మహిళలకు అవగాహన కల్పిస్తాం' అని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.



చిన్నారుల సంక్షేమమే మిషన్ వాత్సల్య లక్ష్యం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నిస్సహాయ స్థితిలో ఉన్న చిన్నారుల సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న మిషన్ వాత్సల్య పని చేస్తున్నట్టు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. దీనికింద జిల్లాలో ఇప్పటి వరకు 550 మందికి ఆర్థిక సాయం చేసి, చిన్నారుల భవిష్యత్తుకు బాటవేసినట్టు పేర్కొన్నారు. మిషన్ వాత్సల్య జిల్లా స్పాన్సర్షిప్ అండ్ ఫోస్టర్ కేర్ అప్రూవల్ కమిటీ సమావేశాన్ని నగరంలోని కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. హెచ్ఐవీ పిల్లలు, కొవిడ్ వల్ల తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారుల చదువులకు సాయం అందిస్తున్నట్టు చెప్పారు. బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నిర్మూలన, విద్యా సాధికారిత, శిశు మద్దతు కార్యకలపాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఐసీడీఎస్ పీడీ రుక్సానా సుల్తానా బేగం, ప్రొటెక్షన్ అధికారి జాన్సన్, డీసీపీయూ క్రాఫ్ ప్రోగ్రామ్ డైరెక్టర్ ఫ్రాన్సిస్ తంబి, మేనేజర్ దీపిక తదితరులు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

నిషేధిత జాబితా నుంచి 798 ఎకరాలకు విముక్తి

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం: కృష్ణా జిల్లా పరిధిలోని 798.77 ఎకరాల భూములను 22ఎ (1)(ఈ) నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. 2016 జీవో 196 ప్రకారం జిల్లాలో 23,906 ఎకరాల భూములను రిజిస్ట్రేషన్ చేయరాదని నిషేధిత జాబితాలో చేర్చారు. దీంతో చాలా మంది రైతుల భూముల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. రైతుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో వీటిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని జిల్లాలో పనిచేసిన పలువురు కలెక్టర్ సీసీఎల్ఏకు ప్రతిపాదనలు పంపించారు. 2022లో 18,431.73 ఎకరాల షరతుగల భూములను పై జాబితా నుంచి తొలగించారు. ప్రభుత్వ భూములతో పాటు వందల ఎకరాల పట్టా, అసైన్డ్ భూములు నిషేధిత జాబితాలో ఉండిపోవడంతో సుమారు పదేళ్లుగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమస్యను గుర్తించిన ప్రభుత్వం 2016.. జీవో 196లో కొన్ని మార్పులు చేర్పులు చేసింది. ఇందులో భాగంగా 798.77 ఎకరాల భూములకు నిషేధిత జాబితా నుంచి విముక్తి లభించింది. మిగిలిన సుమారు 5474 ఎకరాల భూములను 22ఎలోని వివిధ క్యాటగిరీల్లోని భూముల్లో సర్దుబాటు చేశారు.

సర్వర్ లేకుంది.. సర్వే కాకుంది!

విజయవాడ సిటీ, ఉయ్యూరు గ్రామీణం న్యూస్‌టుడే

కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం ఆకునూరులో దేవరపల్లి శ్యామలదేవి, ఆమె కుమారుడు భాగ్యరాజు వేర్వేరు వీధుల్లో నివసిస్తున్నారు. వారు ఒకే ఇంట్లో ఉన్నట్లు గత వైకాపా ప్రభుత్వంలో హౌస్‌హోల్డ్ సర్వేలో మ్యాపింగ్ చేశారు. ఫలితంగా వారు ఎస్సీలకు ఉచితంగా ఇచ్చే విద్యుత్తు ఛార్జీల రాయితీ కోల్పోయారు. ఇలాంటి తప్పిదాలు ఎన్టీఆర్ జిల్లాలోనూ జరిగాయి. అర్హులు పథకాలకు దూరమయ్యారు. ఆయా సమస్యలు పరిష్కరించి అర్హులు లబ్ధి పొందేలా కూటమి ప్రభుత్వం యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే-2025 (యూఎస్ఎఫ్-2025)కు శ్రీకారం చుట్టింది. గత ఏడాది డిసెంబరు 12న ప్రారంభించిన సర్వే సాంకేతిక సమస్యలతో మందకొడిగా సాగుతోంది. ఇచ్చిన గడువు ఫిబ్రవరి 10 నాటికి సర్వే పూర్తయ్యేలా లేదు.

మధ్యలో ఆగిపోతున్న ప్రక్రియ

ఇంటింటికీ సిబ్బంది వెళ్లి సర్వే చేస్తున్నారు. కుటుంబ సభ్యుల వివరాలు తీసుకుంటున్నారు. సంబంధిత పత్రాలు స్కాన్ చేస్తున్నారు. సర్వర్ పనిచేయక ఆ ప్రక్రియ మధ్యలోనే ఆగిపోతోంది. నలుగురు సభ్యులున్న ఇంటి వద్ద సుమారు గంటన్నర సమయం పడుతోందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాంకేతిక సమస్యలు లేకుంటే 20 నిమిషాల్లోనే పూర్తవుతోంది. రోజూకు రెండు నుంచి మూడు ఇళ్ల సర్వే మాత్రమే చేయగలుగుతున్నారు. పది గంటల్లోపు సాంకేతిక సమస్యలు తలెత్తడం లేదు. దాంతో కొంతమంది ఆ సమయంలో చేస్తున్నారు. ఆ తరువాత సర్వర్ మొరాయిస్తోందని సిబ్బంది చెబుతున్నారు.

✦ కృష్ణా జిల్లాలో 6,02,950 ఇళ్లను సర్వే చేయాలి. ఈ నెల 28వ తేదీ ఉదయానికి 64,791 ఇళ్లను మాత్రమే చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో 7,24,990 ఇళ్లకు గాను 1,09,829 ఇళ్ల సర్వే మాత్రమే పూర్తయింది.

వేగవంతం చేసేందుకు చర్యలు

ఎక్కువ మంది సిబ్బంది సర్వేకు హాజరు కాలేదు. ఇప్పటికే కలెక్టర్... ఎంపీడీవోలతో సమావేశం నిర్వహించి సర్వే వేగవంతం చేయాలని ఆదేశాలు ఇచ్చారు. క్షేత్ర స్థాయిలో సాంకేతిక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి కూడా వెళ్లింది. సమస్య పరిష్కారం అవుతుంది. సర్వే గడువులోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. - ఆనంద్, డిప్యూటీ సీఈవో, కృష్ణా

'తిరుమల వేదికగా వైకాపా అరాచకాలు'

పటమట, న్యూస్‌టుడే: గత వైకాపా పాలనలో హిందువులను చులకనగా చూశారని, తిరుమలను కూడా అక్రమార్జన కింద మార్చుకుని హిందువుల మనోభావాలను దెబ్బతీశారని ఎన్టీఆర్ జిల్లా తెదేపా అధ్యక్షురాలు గద్దె అనురాధ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. గురువారం 9వ డివిజన్ పటమటలంక రామాలయం శుద్ధి కార్యక్రమం, అనంతరం పూజలు చేశారు. ఈ సందర్భంగా పటమటలంక నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ భక్తులంతా కలియుగ దైవంగా భావించే వెంకటేశ్వరస్వామి ప్రసాదాన్ని వైకాపా పాలనలో కల్తీ చేసి భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బ తీశారన్నారు. సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సిట్ లడ్డూలో కల్తీ నెయ్యి కలిసిందని నిర్ధారించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో దేవాలయాల శుద్ధి, పూజలు, ర్యాలీలు చేపట్టినట్లు తెలిపారు. యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహారావు, తెదేపా రాష్ట్ర కార్యదర్శి చెన్నుపాటి గాంధీ, కార్పొరేటర్లు చెన్నుపాటి క్రాంతిశ్రీ, దేవినేని అపర్ణ, ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి ఉషారాణి, జనసేన మహిళ నాయకురాలు రావి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



రామాలయాన్ని శుద్ధి చేస్తున్న గద్దె అనురాధ, ఎమ్మెల్యే రామ్మోహన్ తదితరులు

ప్రతిభ చాటారు.. విజేతలుగా నిలిచారు



విజేతలతో సీఐ చిన కొండలరావు, కేబీఎన్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ రమేష్ తదితరులు

చిట్టినగర్, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు పోటీలు ఎంతగానో దోహదపడుతున్నాయని కొత్తపేట పోలీస్‌స్టేషన్ సీఐ చిన కొండలరావు అన్నారు. కొత్తపేట, కేబీఎన్ కళాశాలలో గురువారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంతీయ స్థాయి ప్రతిభా పోటీలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విద్యతో పాటుగా ఇతర అంశాల్లో ప్రావీణ్యం అవసరమని అన్నారు. పర్యావరణం, సమాజ పోకడలపై అవగాహనతో మెలగాలని సూచించారు. చరవాణులు పాఠ్యాంశాల విషయాలను తెలుసుకునే వరకే వినియోగం చేయాలని, మిగతా విషయాలకు దానికి ఎంతవరకు దూరంగా ఉంటే అంత మంచిదన్నారు. విజేతలకు సీఐ చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో కేబీఎన్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ పి.ఎల్.రమేష్ విజేతలను అభినందించారు. న్యాయ నిర్ణేతలుగా ఉపాధ్యాయులు వై.నాగరామారావు, బ్రహ్మాజీ, అధ్యాపకులు పవన్‌కుమార్‌రెడ్డి, జయవర్ధన్ వ్యవహరించారు.

వ్యాసరచన విభాగంలో..: వ్యాసరచన విభాగంలో ప్రథమ బహుమతి ఆర్.సిద్ధి సాయి శ్రీనివాసన్ (రాకేష్ పబ్లిక్ స్కూల్), ద్వితీయ బహుమతి బి.నాగ చరిత (సాయి అరుణా హైస్కూల్), తృతీయ బహుమతి ఎల్.తురణ్యప్రియ (రాకేష్ పబ్లిక్ స్కూల్) గెలుచుకున్నారు. **చిత్రలేఖనంలో..:** ప్రథమ వై.హేమశ్రీ (రాకేష్ పబ్లిక్ స్కూల్), ద్వితీయ ఫణిసాయి ప్రణీత్ (సాయి అరుణా హైస్కూల్), తృతీయ ఎల్.కల్యాణ్ (తెలప్రోలు రాజా హైస్కూల్) గెలుచుకున్నారు. **ఉపన్యాసం విభాగంలో..:** ప్రథమ ఎస్.కె.చాందిని (గీతాంజలి హైస్కూల్), ద్వితీయ జె.చరణ్‌తేజ (సాయి అరుణా హైస్కూల్), తృతీయ వి.శ్రీవల్లి(శ్రీగౌతమ్ హైస్కూల్) గెలుచుకున్నారు. **క్విజ్‌లో..:** ప్రథమ బహుమతి బి.మోహన్‌కృష్ణ (సాయి అరుణా హైస్కూల్), ద్వితీయ ఎల్.మేఘన లక్ష్మీప్రియ (రాకేష్ పబ్లిక్ స్కూల్), తృతీయ కె.సాయి ప్రవల్లిక (రాకేష్ పబ్లిక్ స్కూల్) గెలుచుకున్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

ఉత్సాహంగా 'ఈనాడు' ప్రతిభాపాటవ పోటీలు



బహుమతులు అందుకున్న విద్యార్థులతో వెంకటేశ్వర్లు, దామోదర్

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి విద్య ఒక్కటే మార్గమని అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్ సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. మాతృ భాష తెలుగుపై పట్టు సాధిస్తే.. ఇతర భాషలను సులువుగా నేర్చుకోవచ్చని చెప్పారు. గురువారం నందమూరినగర్, వశిష్ఠ కాలనీలోని శ్రీవిద్య ఆర్ట్స్ అండ్ సైన్స్ జూనియర్ కళాశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో స్థానిక పాఠశాలల విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గెలుపోటములు సహజమని.. ఓటమిని రెట్టింపు ఉత్సాహంతో అధిగమిస్తే విజయాలు మీ సొంతం అవుతాయని పేర్కొన్నారు. తెలుగు భాషాభివృద్ధికి 'ఈనాడు' చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. స్థానిక విద్యార్థులకు ప్రాంతీయ వ్యాస రచన, చిత్ర లేఖనం, ఉపన్యాసం, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఆయా పోటీలకు ఎస్.సుమలత, పి.కవిత, ఆర్.దామోదర్, అనూష న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు సీఐ వెంకటేశ్వర్లు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. సీఐకు కళాశాల ప్రిన్సిపల్ దామోదర్ మొక్క అందజేసి సన్మానించారు.

వ్యాస రచన విజేతలు : ఫిర్‌దోస్ (ఎం.కె.బేగ్ మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాల) ప్రథమ, ఎ.పూజిత (వివేకానంద సెంటినరీ తెలుగు మీడియం పాఠశాల) ద్వితీయ, ఎం.పల్లవి (శ్రీకృష్ణవేణి పాఠశాల) తృతీయ స్థానాల్లో గెలుపొందారు. **చిత్ర లేఖనంలో..** జి.జెస్సికా (శ్రీకృష్ణవేణి పాఠశాల), ఎం.ధరణి (జంధ్యాల దక్షిణామూర్తి మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాల), జి.దివ్య సత్య (వివేకానంద సెంటినరీ తెలుగు మీడియం పాఠశాల) తొలి మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచారు. **ఉపన్యాసంలో..** కె.జ్యోత్స్న (వివేకానంద సెంటినరీ తెలుగు మీడియం పాఠశాల) ప్రథమ, వి.మహిత (శ్రీకృష్ణవేణి పాఠశాల) ద్వితీయ, ఎన్.బ్లెస్సీ (ఎం.కె.బేగ్ మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాల) తృతీయ స్థానాలు గెలుచుకున్నారు. **కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్‌లో..:** టి.స్వరూప (శ్రీచైతన్య పబ్లిక్ స్కూల్), టి.మాన్య (శ్రీరామ్ స్కూల్), పి.నీరజ్ వెంకట్ (జంధ్యాల దక్షిణామూర్తి మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాల)లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందారు.

బ్రాయిలర్ ధరలు
(కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -143 రిటైల్ ధర 170 చికెన్ విత్ స్కిన్ - 247 చికెన్ స్కిన్‌లెస్ - 281.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 162, 171, 182 చికెన్ విత్ స్కిన్ - 314 చికెన్ స్కిన్‌లెస్ - 324.

దుర్గగుడి ఏఈవో బదిలీ

ఇంద్రకీలాద్రి: దుర్గగుడి ఏఈవో వాసు ద్వారకా తిరుమలకు గురువారం బదిలీ అయ్యారు. ద్వారక తిరుమల నుంచి డిప్యుటేషన్‌పై ఆరు నెలల కిందట దుర్గగుడికి వచ్చారు. దసరా, భవానీ దీక్షల విరమణ సమయాల్లో ప్రసాదాల పోటు, శానిటేషన్ విభాగాలను పర్యవేక్షించారు. ద్వారకా తిరుమలలో పాలన పరమైన అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఉన్నతాధికారులు డిప్యుటేషన్ కాల పరిధి కుదించి బదిలీ చేసినట్లు తెలిసింది.

నిప్పులు చెరిగిన బౌలర్లు

సందడిగా ఈఎస్ఎల్ క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలు

EENADU SPORTS LEAGUE 2025

జిల్లాపరిషత్తు(గుంటూరు), తాడికొండ, న్యూస్‌టుడే: బ్యాటర్లు, బౌలర్లు సమష్టిగా రాణిస్తే.. విజయం ఎలా కైవసం చేసుకోవచ్చో హైదరాబాద్ హీరోస్ జట్లు నిరూపించాయి. సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో విజయాలు నమోదు చేసుకుని ముందుకు దూసుకెళ్లాయి. గుంటూరుకు సమీపంలోని మోతడకలో చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల మైదానాల్లో జరుగుతున్న 'ఈనాడు' స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలు మూడో రోజైన గురువారం ఉత్సాహంగా సాగాయి. బౌలర్లు వికెట్లు తీసినా.. బ్యాటర్లు బౌండరీలు, సిక్స్‌లు కొట్టినా.. విద్యార్థులు కేరింతలు కొడుతూ సందడి చేశారు. ● జూనియర్స్ విభాగంలో రాయలసీమ రాకర్స్, హైదరాబాద్ హీరోస్ మ్యాచ్‌కు చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల కార్యదర్శి వై.సుజిత్ టాస్ వేసి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ఛైర్మన్ వై.వి.ఆంజనేయులు మ్యాచ్‌ను వీక్షించారు. 'ఈనాడు' గుంటూరు యూనిట్ మేనేజర్ ఎం.వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్



వరుణ్ ఆదిత్య వైభవ్

నార్త్ ఆంధ్రా నింజాస్ గైర్హాజరుతో..

● సీనియర్స్ విభాగంలో మొదటి మ్యాచ్ సెంట్రల్ ఆంధ్రా ఛాలెంజర్స్- నార్త్ ఆంధ్రా నింజాస్ మధ్య జరగాల్సి ఉండగా నార్త్ ఆంధ్రా నింజాస్ జట్టు హాజరుకాలేదు. దీంతో అంపైర్లు సెంట్రల్ ఆంధ్రా ఛాలెంజర్స్ జట్టును విజేతగా ప్రకటించారు.

5.2 ఓవర్లలోనే లక్ష్య ఛేదన



సీనియర్స్: గెలుపొందిన హైదరాబాద్ హీరోస్ జట్టు

సీనియర్స్ విభాగంలో హైదరాబాద్ హీరోస్ (టీకేఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ), రాయలసీమ రాకర్స్ (సికామ్ కాలేజీ) జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన హైదరాబాద్ హీరోస్ బౌలింగ్ ఎంచుకుంది. రాయలసీమ రాకర్స్ ఆటగాళ్లు నలుగురు అందుబాటులో లేకపోవడంతో ఏడుగురితోనే బరిలోకి దిగారు. 13.5 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 69 పరుగులు మాత్రమే చేయగలిగారు. హైదరాబాద్ హీరోస్ బౌలర్లు వరుణ్, మధువీర్‌ల ధాటికి రాయలసీమ రాకర్స్ స్వల్ప స్కోరుకే పరిమితమైంది. అనంతరం హైదరాబాద్ హీరోస్ 5.2 ఓవర్లలో ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి లక్ష్యం చేరుకుంది. కెప్టెన్ గౌరవ్ రెడ్డి 18 బంతుల్లో ఎనిమిది బౌండరీలు, ఒక సిక్సర్‌తో 40 పరుగులు చేశాడు. బౌలింగ్‌లో 11 పరుగులిచ్చి 4 వికెట్లు తీసుకున్న వరుణ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.



జూనియర్స్: సెంట్రల్ ఆంధ్రా ఛాలెంజర్స్ జట్టు గెలుపు సంతోషం

బెంబేలెత్తించిన సెంట్రల్ ఆంధ్రా బౌలర్లు

జూనియర్స్ విభాగంలో మొదటి మ్యాచ్ సెంట్రల్ ఆంధ్రా ఛాలెంజర్స్- నార్త్ ఆంధ్రా నింజాస్ జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన సెంట్రల్ ఆంధ్రా ఛాలెంజర్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 16 ఓవర్లకు 108 పరుగులకే ఆలౌటైంది. తర్వాత బరిలోకి దిగిన నార్త్ ఆంధ్రా నింజాస్ జట్టు.. సెంట్రల్ ఆంధ్రా బౌలర్ల దాటికి 57 పరుగులకే ఆలౌటైంది. సెంట్రల్ ఆంధ్రా ఛాలెంజర్స్ బౌలర్ వైభవ్ 3 ప్రధాన వికెట్లు తీయడంతో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. అదే టీం బ్యాటర్ రామ్‌చరణ్ 24 బంతుల్లో 6 ఫోర్లు కొట్టి 39 పరుగులు చేశాడు. నార్త్ ఆంధ్రా నింజాస్ బౌలర్ సాయి గణేష్ 4 వికెట్లు తీశాడు.



జూనియర్స్: విజయానందంలో హైదరాబాద్ హీరోస్

హైదరాబాద్ హీరోస్ ఘన విజయం

జూనియర్స్ విభాగంలో రెండో మ్యాచ్ హైదరాబాద్ హీరోస్, రాయలసీమ రాకర్స్ జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన హైదరాబాద్ హీరోస్ బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 187 పరుగులు చేశారు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన రాయలసీమ రాకర్స్ జట్టు.. . హైదరాబాద్ హీరోస్ బౌలర్ల దెబ్బకు 110 పరుగులకే ఆలౌటైంది. దీంతో హైదరాబాద్ హీరోస్ జట్టు ఘన విజయం సాధించింది. ఆల్‌రౌండర్ ఆదిత్య 30 బంతుల్లో 6 ఫోర్లు కొట్టి 39 పరుగులతో పాటు మూడు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.

30న (నేడు) జరిగే మ్యాచ్‌ల షెడ్యూల్ ఇలా..

గ్రౌండ్-1 (జూనియర్స్)	గ్రౌండ్-2 (సీనియర్స్)
మ్యాచ్-1: సెంట్రల్ ఆంధ్రా ఛాలెంజర్స్ x హైదరాబాద్ హీరోస్	మ్యాచ్-1: సెంట్రల్ ఆంధ్రా ఛాలెంజర్స్ x హైదరాబాద్ హీరోస్
మ్యాచ్-2: రాయలసీమ రాకర్స్ x తెలంగాణ టైగర్స్	మ్యాచ్-2: రాయలసీమ రాకర్స్ x తెలంగాణ టైగర్స్

ఏపీ ఎన్జీవో నాయకులకు సత్కారం



ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా, నగర కార్యదర్శులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన పి.రమేష్, షేక్ నజీరుద్దీన్‌లను నగరంలోని జలసౌధ భవనంలో గురువారం సత్కరించి, అభినందించారు. కేసీ డివిజన్ ఈఈ రావెళ్ల రవి కిరణ్, డివిజనల్ గణాంక అధికారి కె.రమేష్‌బాబు, సాంకేతిక అధికారి కె.పాండురంగారావు, డివిజన్, సబ్ డివిజనల్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

\- న్యూస్‌టుడే, ఎన్టీఆర్ కలెక్టరేట్

గిరిజన గురుకుల విద్యార్థులకు వీడియో పాఠాలు



వెబ్‌సైట్ ఆవిష్కరించిన రఘు, జాన్సన్‌దేవరాజ్, కిశోర్‌బాబు, చిత్రంలో ఉపాధ్యాయినులు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో గిరిజన గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు జీత్ వెబ్‌సైట్ ద్వారా వీడియో పాఠాలు బోధించడానికి ముంబయి కేంద్రంగా ఉన్న రామకృష్ణ శారద సమితి (ఆర్‌కేఎస్ఎస్) రాష్ట్ర ప్రభుత్వంతో ఎంవోయూ కుదుర్చుకుందని ఆ సంస్థ జాతీయ డైరెక్టర్ రఘు పిలక తెలిపారు. నందిగామ ఎస్టీ గురుకుల బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో రాష్ట్రంలో తొలిసారిగా గురువారం ఈ వీడియో పాఠాలకు శ్రీకారం చుట్టారు. తెరపై వీడియో పాఠాలను బోధించే విధానం గురించి ఉపాధ్యాయులకు వివరించారు. ఈసందర్భంగా రఘు మాట్లాడుతూ ఆర్‌కేఎస్ఎస్, ఎస్‌బీఐ ఫౌండేషన్‌తో కలిసి పలు రాష్ట్రాల్లో విద్యార్థులకు సబ్జెక్టు నిపుణులతో వీడియో పాఠాలు తయారు చేసిందన్నారు. రాష్ట్ర సిలబస్ ప్రకారం ప్రధానంగా సబ్జెక్టు నిపుణులతో గణితం, సైన్స్ సబ్జెక్టులను రూపొందించామన్నారు. సైన్స్‌లో 170 పాఠాలు, గణితంలో 138 పాఠాలు రూపొందించామన్నారు. పేద విద్యార్థుల కోసం తాము ఉచితంగా ఈ వీడియో పాఠాలను అందుబాటులోకి తెచ్చామన్నారు. కార్యక్రమంలో గిరిజన గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలల రాష్ట్ర అకడమిక్ మానటరింగ్ అధికారి జి.జాన్సన్‌దేవరాజ్, ఉపకార్యదర్శి ఎన్‌జీ కిశోర్‌బాబు, స్థానిక పాఠశాల ప్రిన్సిపల్ సుజాత, వైస్ ప్రిన్సిపల్ కె.సునీత, వార్డెన్ పి.చైతన్య తదితరులు పాల్గొన్నారు.

తిరుపతమ్మకు అశేష భక్తజన నీరాజనం

వైభవంగా రంగుల ఉత్సవం ఊరేగింపు



భీమవరంలో పల్లకీల వద్ద భక్తులు



లింగగూడెంలో కళాకారిణుల ప్రదర్శన

పెనుగంచిప్రోలు, వత్సవాయి (న్యూస్‌టుడే): శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారి రంగుల మహోత్సవం వైభవంగా జరుగుతోంది. అడుగడుగునా భక్తుల మొక్కుబడులతో అనుకున్న సమయానికి అమ్మవారు గ్రామాలకు చేరుకోలేదు. జగ్గయ్యపేటలో విగ్రహాలకు రంగుల ముగింపు తర్వాత బుధవారం ఉదయం 8 పల్లకీల్లో 11 విగ్రహాలు ఊరేగింపుగా పెనుగంచిప్రోలుకు బయలుదేరాయి. జగ్గయ్యపేట, చిల్లకల్లు, భీమవరం, లింగగూడెం గ్రామాల మీదుగా పెనుగంచిప్రోలులోని ఆలయం వద్దకు శుక్రవారం ఉదయం కల్లా చేరుకోవాలని ఆలయ అధికారులు, పూజారులు నిర్ణయించారు. ఈ షెడ్యూల్ ప్రకారం చిల్లకల్లుకు బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు చేరాల్సి ఉండగా రాత్రి పది గంటల తర్వాత వచ్చింది. అక్కడి నుంచి భీమవరం గ్రామానికి రాత్రి 11 గంటలకు చేరుకోవాల్సి ఉండగా గురువారం ఉదయం పది గంటలకు చేరుకున్నాయి. ఆయా గ్రామాల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు సమీప గ్రామాల ప్రజలు, బంధువులు పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో గ్రామాలు భక్త జనసందోహంతో సందడిగా మారాయి. గురువారం సాయంత్రం 6 గంటలకు లింగగూడెం గ్రామానికి చేరుకున్నాయి. దీంతో ఆలయానికి నిర్ణీత సమయంలో చేరుకోవడం సాధ్యంకాలేదు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతాయ్య, కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురాం, జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, మున్సిపల్ ఛైర్మన్ రాఘవేంద్ర, ఎమ్మెల్యే సోదరుడు శ్రీరాం చిన్నబాబు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

అమ్మవారి పల్లకీల ఊరేగింపులో పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కోలాటాలు, డప్పు వాయిద్యాలు, కేరళ నృత్యాలు, డీజే పాటలు మరింత ఉత్సాహాన్ని ఇచ్చాయి. అక్షయ పాత్ర ఫౌండేషన్ నుంచి భక్తులకు అల్పాహారం, భోజనాలను ఉచితంగా పంపిణీ చేశారు.

ఆచార్య చందు సుబ్బారావు మృతికి సంతాపం

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : మార్క్సిస్టు రచయిత, అభ్యుదయ రచయితల సంఘంలో ప్రముఖులు ఆచార్య చందు సుబ్బారావు (80) గురువారం విశాఖపట్నంలో కన్నుమూశారు. ఆయన మరణంపై విజయవాడ పుస్తక మహోత్సవ కమిటీ అధ్యక్షుడు టి.మనోహర్‌నాయుడు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా, భూభౌతిక శాస్త్రవేత్తగా స్త్రీవాద, రాజకీయ, శాస్త్రీయ అంశాలపై చందు సుబ్బారావు అనేక వ్యాసాలు, పుస్తకాలు రాశారు. ఆయన రచనలు అభ్యుదయవాదులందరికీ సుపరిచితమే. ఆయన మరణం అభ్యుదయ, తెలుగు సాహిత్య సమాజానికి తీరని లోటని మనోహర్ నాయుడు పేర్కొన్నారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

విద్యుత్తు లోడు క్రమబద్ధీకరణకు రాయితీ గడువు పెంచాలి



మంత్రి రవికుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాస్, లక్ష్మణరావు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: గృహ విద్యుత్తు కనెక్షన్ల లోడు క్రమబద్ధీకరణకు రాయితీ గడువును పొడిగించాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను ఉమ్మడి కృష్ణా జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు వెల్ది శ్రీనివాస్ కోరారు. వెలగపూడిలోని సచివాలయంలో గురువారం మంత్రిని తెదేపా నాయకుడు ధూళిపాళ్ల లక్ష్మణరావుతో పాటు కలిసి వినతిపత్రం అందజేశారు. సోలార్ విద్యుత్తు వినియోగంపై ప్రజలకు అవగాహన వచ్చిందని చెప్పారు. ఈ క్రమంలో అదనపు లోడు క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఇస్తున్న రాయితీని పొడిగించడం వల్ల ఎక్కువ మంది సోలార్ విద్యుత్తు కనెక్షన్లు తీసుకుంటారని తెలిపారు. అదేవిధంగా కొందరు డిస్ట్రిబ్యూటర్లు నాణ్యత ఉన్న సోలార్ విద్యుత్తు ప్యానల్స్, ఇతర పరికరాలు వినియోగించడం లేదని చెప్పారు. వీటిపై అధికారులతో తనిఖీలు చేయించాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలి



ఆర్పీఎఫ్ బ్యాండ్ ప్రదర్శన

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని ఉద్యోగులంతా పని చేయాలని ఏడీఆర్ఎంలు పి.ఇ.ఎడ్విన్, కొండా శ్రీనివాసరావు తెలిపారు. గురువారం రైల్వేస్టేషన్ ఆవరణలో బీటింగ్ ది రిట్రీట్ వేడుకల్లో భాగంగా వందేమాతరం 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తు చేసుకునేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని చెప్పారు. దక్షిణ మధ్య రైల్వే ఆర్పీఎఫ్ బ్యాండ్ వరుసగా మూడేళ్లు ఇంటర్ రైల్వే బ్యాండ్ పోటీల్లో మొదటి బహుమతి అందుకోవడం గర్వకారణమని చెప్పారు. ఆర్పీఎఫ్ బ్యాండ్ ప్రదర్శన ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో సీనియర్ డీఎస్సీ వి.ఎస్.షణ్ముగ, సీనియర్ డీఎఫ్ఎం వి.రామిరెడ్డి, స్టేషన్ డైరెక్టర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు
• తిరువూరు • మైలవరం

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నేడు

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు మున్సిపల్ ఛైర్మన్ కె.నిర్మల అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శుక్రవారం ఉదయం 11 గంటలకు కార్యాలయంలో నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మనోజ్ తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమం, మౌలిక సౌకర్యాలపై చర్చిస్తామని ఆమె చెప్పారు.

ఉచిత వైద్య శిబిరం

కొండపల్లి, న్యూస్‌టుడే : ఎన్టీటీపీఎస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఇలప్రోలులో గురువారం నిర్వహించారు. తెదేపా సీనియర్ నాయకుడు జంపాల సీతారామయ్య, మైలవరం జనసేన నాయకుడు రామ్మోహనరావు, గ్రామ సర్పంచి రంగయ్య, నాయకులు వెంకటరావు, ఎన్టీటీపీఎస్ ముఖ్య ఇంజినీరు శివరామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీల వితరణ

జి.కొండూరు, న్యూస్‌టుడే : చెవుటూరు ప్రాథమిక పాఠశాలలో పని చేసి సాధారణ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు పి.మేరీ స్వర్ణలత, స్వప్న ప్రియ రూ.5000 విలువైన కుర్చీలను హెచ్ఎం ఎ.రమాదేవికి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు పాఠశాల ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రాంగణ నియామకాల్లో ప్రతిభ

గొల్లపూడి: తమ కళాశాలలో జరిగిన ప్రాంగణ నియామకాల్లో డిగ్రీ బీకాం చదువుతున్న ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు గొల్లపూడిలోని నలంద డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ బాశింపా తెలిపారు. విద్యార్థుల ప్రతిభను కనబరచడం వల్లనే ఎంపికయ్యారని వెల్లడించారు. విద్యార్థులను అభినందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705



స్పందన: వెలగలేరు శివారు కొత్తేటిగూడెంలో పంచాయతీ బోరు మరమ్మతులకు గురై నీటి కోసం అవస్థలు పడుతున్నామని స్థానికులు సమస్యను 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా కార్యదర్శి మురళి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి సిబ్బందితో బోరుకు మరమ్మతులు చేయించారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**

★ కొండపల్లి విద్యుత్తు వినియోగదారుల సేవా కేంద్రం నుంచి ఇలప్రోలు రోడ్డుకు వెళ్లే మార్గం, ఆర పంపుల కూడలి వద్ద ఉన్న అప్రోచ్ వద్ద వాహనాలు దాటడానికి ఇబ్బందిగా ఉందని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా అధికారులకు విన్నవించారు. స్పందించిన మున్సిపల్ పాలకవర్గం అప్రోచ్ వద్ద శాశ్వత పరిష్కారం చేపట్టింది. ఐరన్ మెస్‌తో కాంక్రీట్‌ను ఏర్పాటు చేసింది. **- న్యూస్‌టుడే, కొండపల్లి**

? తుమ్మలపాలెంలో రహదారి వెంట ఉన్న మురుగు కాలువ పూడిక కప్పలతో దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. తక్షణమే వాటిని తొలగించాలి. **- వెంకటేశ్వరరావు, స్థానికుడు**
✔ పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి సమస్యను పరిష్కరిస్తాం. **- వనిత, గ్రామ కార్యదర్శి, తుమ్మలపాలెం - ఇబ్రహీంపట్నం గ్రామీణం**

పరిష్కార దిశగా ప్రయత్నించడంలోనే విజయం

కొండపల్లి, న్యూస్‌టుడే : మానసిక ఒత్తిళ్లున్న వారు వాటిని గుర్తించి పరిష్కార దిశగా ప్రయత్నించడంలోనే మొదటి విజయం ఉంటుందని వాసవ్య మహిళా మండలి ఫౌండేషన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ కేశవ అన్నారు. కమ్యూనిటీ మానసిక ఆరోగ్య ప్రాజెక్టు కార్యక్రమాన్ని వాసవ్య మహిళా మండలి కొండపల్లి నాగార్జున జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించింది. ఆయన మాట్లాడుతూ మానసిక ఒత్తిళ్లు ఒక దశ దాటిన తర్వాత శరీర ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయని చెప్పారు. మహిళా మండలి సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

తిరువూరు: స్థానిక రాజుపేటలోని 11 కేవీ విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఏఈ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

భవనాలు లేక సతమతం.. పునాదులకే పరిమితం

ఏళ్ల తరబడి అసంపూర్తిగా నిర్మాణాలు

మైలవరం, న్యూస్‌టుడే

మైలవరం మండలం ఎదురుబీడెంలో ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలోని అంగన్‌వాడీ కేంద్రానికి శాశ్వత భవన నిర్మాణ పనులను మూడేళ్ల కిందట ప్రారంభించారు. పునాదులపై పిల్లర్లు వేశారు. నిధుల మంజూరులో జాప్యంతో పనులు ఆపేశారు. అనాటి నుంచి నేటి వరకు కనీసం అక్కడ ఒక్క ఇటుక రాయి కూడా పడలేదు. ఈ ఏడాది ప్రాథమికోన్నత పాఠశాల వర్గీకరణ జరగడంతో, ఖాళీగా ఉన్న ఒక తరగతి గదిలో కేంద్రాన్ని నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. మైలవరం నియోజకవర్గ వ్యాప్తంగా పలు సంఖ్యలో నిర్మాణాలు ఏళ్ల తరబడి కొనసాగుతూ ఉన్నాయి. గొంగళి అక్కడే అన్నం దంగా మారడంతో కేంద్రాల్లోని చిన్నారులకు అసౌకర్యాలు తప్పడం లేదు.

పునర్నిర్మాణ పనులు పడుతోంది. ఐసీడీఎస్ మైలవరం ప్రాజెక్టు పరిధిలో మూడు మండలాలున్నాయి. వైకాపా హయాంలో నాడు-నేడు పేరిట, ఉపాధి హామీ పథకం కింద సొంత భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. దాదాపు 100 కేంద్రాలకు పైగా సొంత భవనాలు లేక సతమతమవుతుంటే, అందులో సగం మంజూరైనా పూర్తి కావడం లేదు. స్థల సమస్యతో కొన్ని గ్రామాల్లో కదలిక లేదు. స్థలాలు కేటాయించిన గ్రామాల్లో పనులు ప్రారంభించినా సగానికి పైగా స్లాబ్ దశలో, కొన్ని పునాదుల్లో, మరికొన్ని చివరి దశలో ఉన్నాయి.


మైలవరం మండలం ఎదురుబీడెంలో మూడేళ్లుగా ఇదే పరిస్థితి

రణల్లో, మరికొన్ని చోట్ల అద్దె భవనాల్లోనే చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. కనీస సౌకర్యాలు ఉండని ఆయా కేంద్రాల్లో పిల్లలకు ఆటల సంగతి దేవుడెరుగు, ఆహారాలు వండేందుకు ఇబ్బంది తప్పడం లేదు. దాంతో ఆరు బయట ఉంచాల్సిన ఆట వస్తువులు మూలన దాక్కుంటున్నాయి.

లక్ష్యం పూర్తికాక..

అంగన్‌వాడీ కేంద్రాలకు శాశ్వతంగా సొంత భవనాల ఏర్పాటు లక్ష్యం పునాదుల్లో

ప్రాజెక్టు పరిధిలో ఇలా..

మొత్తం కేంద్రాలు	243
సొంత భవనాలున్నవి	132
మంజూరైనవి	42
పూర్తి అయినవి	5
అసంపూర్తిగా ఉన్నవి	37

తాత్కాలిక గదుల్లో..

ఏళ్ల తరబడి భవనాలు పూర్తికాక పోవడంతో కొన్ని చోట్ల ప్రాథమిక పాఠశాల ఆవ

అధికారులు పర్యవేక్షిస్తున్నారు

కొత్త భవనాల నిర్మాణ పనులను అధికారులు పర్యవేక్షిస్తున్నారు. కొన్ని చోట్ల పనులు ఆగాయి. సొంత భవనాలు లేని కేంద్రాలు పాఠశాలల గదులు, ప్రైవేటు ఇళ్లల్లో కొనసాగుతున్నాయి.
- డి.జోజికటాక్షం, ఇన్‌ఛార్జి సీడీపీవో

ప్రతి పౌరుడిలో చైతన్యం రావాలి


రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్సై లక్ష్మణ్

ఇబ్రహీంపట్నం గ్రామీణం : రోడ్డు భద్రత మాసోత్సవాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఇబ్రహీంపట్నం గ్రామీణ మండల పరిధిలోని జాతీయ రహదారి వెంట గ్రామాల్లో పోలీసులు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. నిత్యం తనిఖీలు చేపడుతున్నారు. ఈ క్రమంలో ప్రతి పౌరుడిలో చైతన్యం తీసుకువచ్చేందుకు గురువారం నుంచి అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

పన్ను వసూళ్లు వేగవంతం

విస్సన్నపేట : విస్సన్నపేట మండలం నరసాపురంలో ఈ ఆర్థిక సంవత్సరం ఇంటి, కుళాయి పన్ను, లైసెన్స్ ఫీజులను స్వర్ణ పంచాయతీ ద్వారా ఆన్‌లైన్ పేమెంట్ కార్యక్రమం షురూ అయ్యింది. పంచాయతీ కార్యదర్శి జి.స్వాతి ఆధ్వర్యంలో సిబ్బంది ప్రజలను చైతన్యపరచి పన్నులు కట్టిస్తున్నారు. లక్ష్యంలో 30 శాతం ఇప్పటికే పన్నులు చెల్లింపు జరిగినట్లు ఆమె తెలిపారు. మార్చి చివరి వరకు పన్నులు చెల్లించవచ్చన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన తప్పనిసరి

కృష్ణారావుపాలెం (ఎ.కొండూరు), న్యూస్‌టుడే : విద్యార్థులు చదువుతో పాటు ప్రాథమిక దశ నుంచే సాంకేతిక పరిజ్ఞానం కూడా వృద్ధి చేసుకోవాలని తిరువూరు ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని కృష్ణారావుపాలెంలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ బాలుర గురుకులంలో రూ.18.50 లక్షలతో నిర్మించనున్న కంప్యూటర్ ల్యాబ్ భవనానికి ఆయన గురువారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. ఆర్వో ప్లాంట్, మధ్యాహ్న భోజన తనిఖీ చేసి బాలురతో కలిసి భోజనం చేశారు. రాష్ట్ర మాదిగ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ వి.మురళి, ఎస్ఎంసీ అధ్యక్షురాలు నాగమణి, ప్రిన్సిపల్ కె.సిద్ధయ్య, తెదేపా మండల నాయకులు పాల్గొన్నారు.


టెంకాయ కొడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, పక్కన నాయకులు

లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి

తిరువూరు, న్యూస్‌టుడే : మండలంలోని ఆంజనేయపురం సీపీఏపీ(కాన్సిస్టేన్సీ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్) కార్యాలయంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన స్వర్ణాంధ్ర- 2047 విజన్‌కు సంబంధించి కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్ (కేపీఐ)పై గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తిరువూరు నియోజకవర్గంలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, లక్ష్యాల సాధన, శాఖల వారీగా ప్రగతి స్థితిగతులపై అధికారులతో చర్చించారు. ప్రతి విభాగం లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీపీఏపీ జాయింట్ డైరెక్టర్.హనుమంతరావు, ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

ఆపన్నులకు అండగా ఎమ్మెల్యే వసంత


కార్తీక్‌కు ట్రైసైకిల్ అందిస్తున్న తెదేపా నేతలు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆపన్నులకు అండగా నిలుస్తున్నారు. ట్రైసైకిల్ కావాలని అడిగిన రెండు రోజుల్లోనే దివ్యాంగునికి దాన్ని అందజేశారు. ఈ నెల 27న ఎమ్మెల్యే రెడ్డిగూడెంలో అభివృద్ధి పనుల శంకుస్థాపనలో పాల్గొని అక్కడికొచ్చిన మల్లాది కార్తీక్ అనే దివ్యాంగుడిని పలకరించగా తన అవసరం గురించి ఎమ్మెల్యేకు చెప్పాడు. తక్షణమే అతనికి ట్రైసైకిల్ ఇవ్వాలని ఆదేశించగా కూటమి నాయకులు, అధికార యంత్రాంగం రూ.70 వేలు విలువ గల మూడు చక్రాల సైకిల్‌ను గురువారం రెడ్డిగూడెంలో అందజేశారు.

ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందిద్దాం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : సురక్షితమైన తాగునీటిని ప్రజలకు అందించాల్సిన బాధ్యత అధికారులదేనని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. రక్షిత తాగునీటి సరఫరాపై బుధవారం కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారులతో సమావేశమైన ఆయన నేరుగా పుర వీధుల్లో పరిశీలనకు దిగారు. కొండపల్లి పురపాలికలోని ఇబ్రహీంపట్నం 16వ డివిజన్ పరిధిలో తాగునీటి సరఫరాను ఆయన గురువారం పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఓవర్ హెడ్ ట్యాంకులు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని సూచించారు. అన్ని ట్యాంకుల వద్ద క్లోరినేషన్, క్లీనింగ్ చేయాలన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్ వెంకటరత్నం, వివిధ శాఖల అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


పారిశుద్ధ్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

మట్టి ప్రతిమల తయారీకి చేయూత

కొండపల్లి : మట్టి వినాయక ప్రతిమలకు కావాల్సిన అన్ని ముడి వస్తువులు అందజేసేందుకు ప్రభుత్వ పరంగా పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కొండపల్లి శాలివాహన సంఘ సభ్యులు కలెక్టర్‌ను గురువారం కలిశారు. ప్రతిమల తయారీకి కావాల్సిన వస్తువుల గురించి ఆయనకు విన్నవించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో శ్రీను ఉన్నారు.

అధ్వానం.. ఉద్యానం

గొల్లపూడి సాయిపురం కాలనీలోని ఉద్యానవనం అధ్వానంగా మారింది. చిన్నారులు ఆడుకోవాల్సిన ప్రాంతం పిచ్చి మొక్కలతో నిండింది. గతంలో ఈ పార్కును కాలనీ అసోసియేషన్ సభ్యులు, దాతల సహకారంతో అభివృద్ధి చేశారు. చిన్నారులు ఆడుకునేందుకు వీలుగా ఆట పరికరాలను బిగించగా తర్వాత అవి తుప్పు పట్టి పాడైపోయాయి. కొన్నాళ్ల కిందట గొల్లపూడి పంచాయతీ అధికారులు దీన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. కానీ ఉద్యానవనం అభివృద్ధిని పట్టించుకోని పరిస్థితి ఉంది. వందలాది మంది ప్రజలు ఈ కాలనీలో నివాసం ఉంటున్నారు. పార్కును అభివృద్ధి చేస్తే చిన్నారులు, పెద్దలు సాయంత్రం వేళ వచ్చి సేద తీరేందుకు అవకాశం ఉంటోంది. ఉద్యానవనంలో ఏర్పాటు చేసిన విగ్రహాల చుట్టూ కూడా పిచ్చి మొక్కలు పెరిగాయి. ఇప్పటికైనా సంబంధిత గ్రామ పంచాయతీ అధికారులు ఉద్యానవనం అభివృద్ధికి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. **- న్యూస్‌టుడే, గొల్లపూడి**


పిచ్చి మొక్కలతో సాయిపురం కాలనీ పార్కు

పథకాల అమలులో వేగం పెంచండి

మైలవరం, న్యూస్‌టుడే : ప్రభుత్వం వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న పథకాల నిర్వహణలో మండల స్థాయి అధికారులు వేగం పెంచాలని విజయవాడ ఆర్డీవో కె.చైతన్య సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వివిధ శాఖల అధికారులతో ఆర్డీవో సమీక్షించారు. బాలికోన్నత పాఠశాలలోని తరగతులు పరిశీలించారు. పల్లె పండగ పేరిట రెండు విడతల్లో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పురోగతిని అడిగి తెలుసుకుని సకాలంలో పూర్తి చేయాలన్నారు. గృహ నిర్మాణ పథకంలో నిర్మాణంలో ఉన్న అన్నింటిని వచ్చే ఉగాది నాటికి పూర్తి చేయాలని నిర్దేశించారు. పది విద్యార్థుల కోసం రూపొందించిన వంద రోజుల ప్రణాళికపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో అనురాధ, తహసీల్దార్ అబ్దుల్‌దరియా తదితరులు పాల్గొన్నారు.


మండల అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీవో చైతన్య

సచివాలయ వ్యవస్థ పనితీరుపై అధ్యయనం


వివరాలు తెలియజేస్తున్న సచివాలయ సిబ్బంది

గొల్లపూడి, న్యూస్‌టుడే : సచివాలయ వ్యవస్థ, పరిపాలన పనితీరుపై అధ్యయనం చేసేందుకు తమిళనాడుకు చెందిన ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందం గొల్లపూడి సచివాలయాన్ని గురువారం సందర్శించింది. పంచాయతీ ఆదాయ వనరులు, సొంత ఆదాయాన్ని పెంచుకోవడం, పన్నుల వసూలు విధానం, ఇతర ఆదాయ మార్గాల ద్వారా గ్రామాభివృద్ధికి నిధులు సమకూర్చుకునే విధానాన్ని సభ్యుల బృందం అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలు సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకు చేరే విధానాన్ని పరిశీలించారు.

ప్రయత్నం.. సాధించారు ఉద్యోగం

గంపలగూడెం, ఎ.కొండూరు, న్యూస్‌టుడే : ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్- 2 ఫలితాల ద్వారా పలువురు యువకులు ఉద్యోగాలు సాధించాలనే కలలను సాకారం చేసుకున్నారు. అందులో గంపలగూడెం మండలం లింగాలకు చెందిన మిరియాల రంగారావు కూడా ఉన్నారు. 2023లో డిగ్రీ పూర్తి చేసిన అతను ఉద్యోగాన్వేషణ ప్రారంభించి, ఆ ఏడాది డిసెంబరులో గ్రూప్-2 పోటీ పరీక్షకు నోటిఫికేషన్ వెలవడటంతో కసరత్తు ప్రారంభించాడు. 2024 ఫిబ్రవరిలో ప్రిలిమ్స్, 2025 ఫిబ్రవరిలో మెయిన్స్ అర్హత సాధించాడు. 2025 ఏప్రిల్‌లో ప్రకటించిన ఫలితాల్లో ఎంపికైనా కోర్టు వివాదాల నేపథ్యంలో నెలల తరబడి నిరీక్షించాడు. తాజాగా వెలువడిన ఫలితాల్లో అసిస్టెంట్ సెక్షన్ అధికారి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా వ్యవసాయ కూలీలైన అతని తల్లిదండ్రులు సావిత్రి, సీతారాములు రంగారావుకు మిఠాయిలు తినిపించారు.


రంగారావుకు మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు సావిత్రి, సీతారాములు

ఎ.కొండూరు మండలం మారేపల్లిలో గ్రేడ్- 5 పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న షేక్ నాయబ్ రసూల్ కూడా ఖజానా శాఖలో సీనియర్ అకౌంటెంట్‌గా ఎంపికయ్యాడు. తిరువూరులోని రాజుపేటకు చెందిన అతను 2016లో ఎంబీఏ పూర్తి చేసి 2019లో గ్రామ సచివాలయం కార్యదర్శిగా ఎంపికయ్యాడు. తన లక్ష్యం మేరకు గ్రూప్స్ పోటీ పరీక్షకు సొంతగానే సిద్ధమయ్యాడు. ప్రిలిమ్స్, మెయిన్స్‌లో అర్హత సాధించి 2025లో ధ్రువపత్రాలు వెరిఫికేషన్ కూడా పూర్తయినా ప్రభుత్వ ప్రకటన కోసం 8 నెలల పాటు నిరీక్షించాడు. తాజాగా విడుదల చేసిన ఫలితాల్లో ఖజానా శాఖలో ఉద్యోగం సాధించాడు. అతని తల్లిదండ్రులు పాట్చాబి, పుల్లయ్య సంతోషం వ్యక్తం చేశారు.


తల్లిదండ్రులు పాట్చాబి, పుల్లయ్యతో నాయబ్ రసూల్

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

రెడ్డిగూడెం : రంగాపురంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, రేషన్ దుకాణాలు, ఆరోగ్య ఉప కేంద్రాన్ని తహసీల్దార్ జె.సుశీలాదేవి గురువారం తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డులు, విద్యార్థుల హాజరు పట్టి, వారికి ఇస్తున్న పౌష్టికాహార పదార్థాలను పరిశీలించారు. ఆరోగ్య ఉప కేంద్రంలో మందుల లభ్యతపై ఆరా తీశారు. రెడ్డిగూడెం పీహెచ్‌సీని సందర్శించి సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. రెవెన్యూ సిబ్బంది ఆమె వెంట ఉన్నారు.


రికార్డు పరిశీలిస్తున్న తహసీల్దార్ సుశీలాదేవి

దిగుబడులు పెంచుకునేందుకు శాస్త్రీయ విధానం అమలు

తిరువూరు, న్యూస్‌టుడే : స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో గురువారం రైతులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాజశేఖర్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంట సాగుపై అన్నదాతలు దృష్టి పెట్టాలని, దిగుబడులు పెంచుకునేందుకు శాస్త్రీయ విధానం పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.


రైతులకు సూచనలిస్తున్న రాజశేఖర్

వైష్ణవాలయాల్లో భీష్మ ఏకాదశి వేడుకలు

గంపలగూడెం, ఎ.కొండూరు, న్యూస్‌టుడే : భీష్మ ఏకాదశి పర్వదిన వేడుకలను గురువారం గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లోని వైష్ణవాలయాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు దేవతామూర్తులను అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు విష్ణుసహస్రనామ పారాయణం ఆలపించారు. నెమలి వేణుగోపాల స్వామి ఆలయంలో అర్చకుడు గోపాలాచార్యులు ఆధ్వర్యంలో రుత్వికులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారిణి సంధ్య పర్యవేక్షించారు.


గంపలగూడెం శ్రీరామ భజన మందిరంలో..


నెమలి వేణుగోపాల స్వామి ఆలయంలో..

దక్షిణామూర్తికి విశేష పూజలు

గోసవీడు(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని గోసవీడులో గురువారం దక్షిణామూర్తి మూలవిరాట్‌కు భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అర్చకుడు కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో స్వామి వారి విగ్రహానికి పంచామృతాభిషేకాలు నిర్వహించి నూతన వస్త్రాలతో అలంకరించి అర్చన చేయగా భక్తులు దర్శించుకున్నారు.

బొర్రగూడెంలో కల్యాణోత్సవం

మైలవరం, న్యూస్‌టుడే : మండల పరిధి బొర్రగూడెంలోని తిరుపతమ్మ, గోపయ్య స్వామి ఆలయంలో అమ్మవారి కల్యాణోత్సవాన్ని ఫిబ్రవరి 1న రాత్రి 8.36 గంటలకు ఆలయ ధర్మకర్త సీహెచ్. సత్యవరప్రసాద్ నేతృత్వంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో తెలిపారు. 2న ఆలయ ప్రాంగణంలో జలబిందెల కార్యక్రమం, గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.


తిరుపతమ్మ, గోపయ్య స్వామి

బాధ్యతల స్వీకరణ

తిరువూరు: తిరువూరు డివిజనల్ విద్యాశాఖాధికారిగా శ్యామ్‌సుందర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావును మర్యాద పూర్వకంగా కలిశారు. డివిజన్‌లోని ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొని శ్యామ్‌సుందర్‌కు శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సత్కరించారు.


శ్యామ్‌సుందర్‌ను సత్కరిస్తున్న ఎంఈవోలు, హెచ్ఎంలు

సత్యనారాయణకు ఘన నివాళి

విస్సన్నపేట, న్యూస్‌టుడే : ఇటీవల మృతి చెందిన విస్సన్నపేట తెదేపా సీనియర్ నాయకుడు నాదెళ్ల సత్యనారాయణ కుటుంబాన్ని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ కేఎస్ జవహర్ గురువారం పరామర్శించారు. నాదెళ్ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు యువత జిల్లా నాయకుడు తుమ్మలపల్లి అనిల్, తెలుగు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దమ్మాలపాటి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.


నాదెళ్ల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జవహర్ తదితరులు

విస్సన్నపేట: ఇటీవల అనారోగ్యానికి గురైన విస్సన్నపేట మండల సీనియర్ నాయకుడు నెక్కలపు శ్రీనివాసరావు (డాబా శ్రీను)ని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ కేఎస్ జవహర్ స్థానికంగా ఆయన నివాసంలో గురువారం పరామర్శించారు. తెదేపా నాయకులు నెక్కలపు వెంకటేశ్వరరావు, గొట్టేటి సుబ్రహ్మణ్యం, తెదేపా మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు, ఆకుల రాధా తదితరులు పాల్గొన్నారు.

బలవంత భూసేకరణ సరికాదు


రైతులతో కలిసి నినాదాలు చేస్తున్న విజ్జు కృష్ణన్, ఆంజనేయులు తదితరులు

మైలవరం, న్యూస్‌టుడే : అమరావతి ఔటర్ రింగురోడ్డు పేరిట అవసరానికి మించి చేయాలనుకుంటున్న బలవంతపు భూసేకరణ మంచిది కాదని, ఐక్య ఉద్యమం ద్వారా అడ్డుకుంటామని అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్ పేర్కొన్నారు. ఓఆర్ఆర్ భూసేకరణలో భూములు కోల్పోనున్న మైలవరం ప్రాంత రైతులతో గురువారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఆయన సమావేశమయ్యారు. వారి నుంచి వివరాలు సేకరించి కృష్ణన్ మాట్లాడారు. ఇతర రాష్ట్రాల్లో జాతీయ ప్రాజెక్టులకు 60 మీటర్ల లోపే భూసేకరణ చేస్తున్నారని, ఓఆర్ఆర్ కోసం 140 నుంచి 250 మీటర్ల వరకు సేకరణకు నోటీసులు ఇవ్వడంతో రైతులు భయాందోళనలు చెందుతున్నారన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం, ప్రజావసరాల కోసం సేకరణకు ప్రజలతో నేరుగా చర్చించి, అందులో సగం ఆమోదం పొందాలన్నారు. అప్పుడే ఎటువంటి ఇబ్బంది రాదన్నారు. సేకరణలో గ్రామీణ ప్రాంతాల్లో భూ విలువకు 4 రెట్లు, అర్బన్ ప్రాంతాల్లో 2 రెట్లు అధికంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కానీ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌లో ఎటువంటి వివరాలు లేవన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి పీవీ ఆంజనేయులు, వ్య.కా.స. జిల్లా ప్రధాన కార్యదర్శి కోట కల్యాణ్, వివిధ సంఘాల నాయకులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

వివాదాస్పదంగా గోడ నిర్మాణం


జి.కొండూరు: వెలగలేరు గ్రామ శివారులో కల్కి భగవాన్ ఆలయ సమీపంలో చేపట్టిన గోడ నిర్మాణం వివాదాస్పదంగా మారింది. చాలాకాలంగా రైతులు తమ పొలాలకెళ్లేందుకు నడిచే డొంకను ఆక్రమించి గ్రామానికి చెందిన ఓ మహిళ తన స్థలంలో కలిపేసుకుని అడ్డుగా గోడ నిర్మించడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పొలాలకు వెళ్లాలంటే మరో దారి లేకుండా పోయిందని వాపోతున్నారు. డొంకను ఆక్రమించి అడ్డుగా గోడ నిర్మాణం చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'ఒక్కొక్కటిగా బయట పడుతున్న వైకాపా దుర్మార్గాలు'

కొండపల్లి: తిరుపతి లడ్డూ ప్రసాదంపై సిట్ ఛార్జిషీట్ వైకాపా దుర్మార్గాలను బయటపెట్టిందని తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు అన్నారు. గురువారం కొండపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైకాపా దుర్మార్గాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయని చెప్పారు. అనంతరం పార్టీ నాయకులు మాజీ ముఖ్యమంత్రి జగన్‌పై పలు విమర్శలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్ శ్రీను, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వానరాల దాడులు.. ఇంకా ఎన్నాళ్లు?

ఇబ్రహీంపట్నం గ్రామీణ మండల పరిధిలోని అటవీ సమీప గ్రామాలపైన, కొండపల్లి పురపాలిక ప్రాంతంలో వానరాలు గుంపులుగా దండెత్తుతున్నాయి. ఇళ్లలోకి వచ్చి దొరికిన వస్తువులను ఎత్తుకెళ్తున్నాయి. అడ్డుకోవడానికి ప్రయత్నిస్తే కరవడానికి మీదకు వస్తుండటంతో ప్రజలు భయపడుతున్నారు. ఇవి పంట పొలాలనూ వదలడం లేదని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. పెద్దలంక, చిన్నలంక, కేతనకొండ గ్రామాల్లో కాపునకు వచ్చిన కూరగాయలను ఇష్టానుసారంగా పీకేస్తుండటంతో సాగుదారులు నష్టపోతున్నారు. దీంతో కాపలా ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు. గ్రామాలకు చెందిన బస్టాండు ప్రాంతాల్లో కోతుల దాడి ఎక్కువగా ఉంటోంది. ఇబ్రహీంపట్నం ఎన్టీటీపీఎస్ ఏ- కాలనీతో పాటు బీమరాజు గుట్ట ప్రాంతంలో బుధవారం కోతుల గుంపు ఇళ్లల్లోకి చొరబడి భయానక వాతావరణం సృష్టించడంతో కాలనీ వాసులు భయభ్రాంతులకు గురయ్యారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి వీటి నుంచి తమను కాపాడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం**


ఎన్టీటీపీఎస్ ఏ- కాలనీలో కోతుల గుంపు



సౌకర్యాలు మనల్ని రుణాల ఊబిలోకి నెట్టొద్దు

సౌకర్యాలనేవి మన జీవనశైలి నాణ్యతను పెంచేలా ఉండాలి తప్ప, మనల్ని రుణాల ఊబిలోకి తోసి మన జీవితాన్ని నియంత్రించేలా మారకూడదు. మనం సంపన్నులయ్యేది ఇతరుల జీవనశైలిని అనుకరిస్తూ విలాసంగా జీవించినప్పుడు కాదు, ఖర్చులకు పరిమితి విధించుకొని, పొదుపును పెంచుకున్నప్పుడే. ఈ విషయం గుర్తించి ఆర్థిక క్రమశిక్షణ అలవర్చుకోండి.

– బసవరాజ్, ఫైనాన్షియల్ ప్లానర్

కల్తీ నెయ్యి.. 'హవాలా'లో లంచమియ్యి

- ఊరికో ఏజెంట్‌ను పెట్టుకున్న భోలేబాబా డెయిరీ
- విజయవాడలో భరత్‌భాయ్ ఠాకుర్, చెన్నైలో మదరం దేవాసి
- హైదరాబాద్‌లో అర్జున్ గోస్వామి, దిల్లీలో ఆశిష్ అగర్వాల్
- వైష్ణవి డెయిరీ సీఈవో, తితిదే అధికారులు, ఉద్యోగులకు వీరిద్వారానే లంచాలు
- సిట్ దర్యాప్తులో గుట్టు రట్టు

ఈనాడు, అమరావతి: విజయవాడలో భరత్‌భాయ్ ఠాకుర్.. చెన్నైలో మదరం దేవాసి.. హైదరాబాద్‌లో అర్జున్ గోస్వామి.. గుజరాత్‌లో లాల్‌భాయ్ పటేల్.. దిల్లీలో ఆశిష్ అగర్వాల్, రాధేశ్యామ్ ఓఝా, రిషబ్ జైన్.. గ్వాలియర్‌లో గోపాల్ వాద్వా.. వీరంతా ఎవరనుకుంటున్నారా? వైకాపా హయాంలో ఐదేళ్లలో తిరుమలకు లక్షల కిలోల కల్తీ నెయ్యి సరఫరాకు సహకరించినవారికి హవాలా మార్గాల్లో లంచాలు అందజేసిన ఘనులు. భోలేబాబా డెయిరీ తమ అక్రమ కార్యకలాపాల కోసం ఇలా ఊరికో ఏజెంట్‌ను అడ్డుపెట్టుకుని భారీ ఎత్తున హవాలా లావాదేవీలు నడిపించింది. భోలేబాబా డైరెక్టర్లు పొమిల్ జైన్ (ఏ3), విపిన్ జైన్ (ఏ4) ఈ హవాలా దందాలో కీలకంగా వ్యవహరించారు. తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసులో సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సిట్ ఈ లావాదేవీల గుట్టు రట్టు చేసింది. భోలేబాబా డెయిరీ 2019 నుంచి 2024 మధ్య 68 లక్షల కిలోలకు పైగా కల్తీ నెయ్యి తయారుచేసింది. అందులో 59.71 లక్షల కిలోల కల్తీ నెయ్యిని తమ సంస్థలతో పాటు వైష్ణవి డెయిరీ, మాల్‌గంగా, ఏఆర్ డెయిరీ సహా మరికొన్ని డెయిరీల ద్వారా తితిదేకు సరఫరా చేసి మహాపచారానికి పాల్పడింది. ఈ దందాలో రూ.235 కోట్ల అనుచిత లబ్ధి పొందింది. ఈ సంస్థ కల్తీ నెయ్యి సరఫరాకు సహకరించిన వైష్ణవి డెయిరీ సీఈవో అపూర్వ చావ్డా (ఏ5), తితిదేలోని కొందరు అధికారులు, ఉద్యోగులకు లంచాలిచ్చేందుకు హవాలా మార్గాలు ఎంచుకున్నట్లు సిట్ నిగ్గు తేల్చింది.

నెయ్యి కొనకుండానే కొన్నట్లు రికార్డులు సృష్టించి..

దశ-1: దిల్లీలోని చాందినీ చౌక్‌లో హవాలా దుకాణం నిర్వహించే ఆశిష్ అగర్వాల్ (ఏ15) సంస్థల నుంచి నెయ్యి కొనకుండానే కొన్నట్లు పొమిల్ జైన్, విపిన్ జైన్ రికార్డులు సృష్టించారు. భోలేబాబా డెయిరీ బ్యాంకు ఖాతా నుంచి ఆశిష్ అగర్వాల్ సంస్థల బ్యాంకు ఖాతాల్లోకి డబ్బులు జమ చేశారు. ఆ సొత్తును ఆశిష్ చాందినీ చౌక్‌లో హవాలా దుకాణం నడిపే రాధేశ్యామ్ ఓఝా అనే మరో ఏజెంట్‌కు పంపించారు.

దశ-2: కల్తీ నెయ్యి తయారీ కోసం పొమిల్ జైన్, విపిన్ జైన్‌లు కొన్న పామ్ కర్నెల్ ఆయిల్, పామాయిల్‌ను గ్వాలియర్‌కు చెందిన దీపక్ జైన్ సంస్థలకు విక్రయించినట్లు నకిలీ రికార్డులు తయారు చేశారు. ఈ నకిలీ విక్రయాన్ని నిజమైనదిగా చూపించేందుకు ఆశిష్ అగర్వాల్ నుంచి మరో హవాలా ఏజెంట్ రిషబ్ జైన్ దుకాణానికి నగదు పంపించారు. రిషబ్ ఆ సొత్తును గ్వాలియర్‌కు చెందిన గోపాల్ వాద్వా అనే హవాలా ఏజెంట్ ద్వారా దీపక్‌జైన్‌కు అందజేశాడు. ఆయన తన సంస్థల బ్యాంకు ఖాతాల నుంచి పొమిల్‌జైన్, విపిన్ జైన్ సంస్థల ఖాతాలకు చెల్లించాడు.

వైష్ణవి డెయిరీ సీఈవో అపూర్వ చావ్డాకు చెల్లింపులిలా!

దశ-3: పొమిల్ జైన్, విపిన్ జైన్‌లు వైష్ణవి డెయిరీ సీఈవో అపూర్వ చావ్డా, డెయిరీ నిపుణుడు మద్ది విజయభాస్కరరెడ్డి (ఏ-34), తమ కమీషన్ ఏజెంట్ పీపీ శ్రీనివాసన్‌లకు హవాలా మార్గాల ద్వారా నగదు చేర్చేవారు. దిల్లీ ఏజెంట్ ఆశిష్ అగర్వాల్ ద్వారా గుజరాత్‌కు చెందిన మరో హవాలా ఏజెంట్ లాలాభాయ్ పటేల్‌కు పంపించేవారు. లాలా భాయ్ దుకాణంపై దాడులు నిర్వహించిన సిట్ అధికారులు.. హవాలా లావాదేవీలకు సంబంధించి గుజరాతీలో పెన్సిల్‌తో రాసుకున్న పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

దశ-4: లాలాభాయ్ హవాలా ఏజెంట్లయిన విజయవాడలోని భరత్‌భాయ్ ఠాకుర్, చెన్నైలోని మదరం దేవాసి, హైదరాబాద్‌లోని అర్జున్ గోస్వామికి సొమ్ము చేర్చేవారు.

దశ-5: భరత్‌భాయ్ 2024లో పలు సందర్భాల్లో అపూర్వ చావ్డా ఇంటికెళ్లి రూ.8.55 కోట్లు అందజేశారు. భరత్ నుంచి మరో రూ.4 కోట్లు, చెన్నైలో మదరం దేవాసి ద్వారా రూ.7.31 కోట్లు అపూర్వ చావ్డాకు అందాయి. వైష్ణవి డెయిరీ ద్వారా తితిదేకు కల్తీ నెయ్యి సరఫరాకు సహకరిస్తున్నందుకు ఆయనకు ఇలా రూ.19.86 కోట్లు ముట్టాయి.

తితిదే ఉద్యోగులకు లంచాల కోసం..

దశ-6: మదరం దేవాసి ద్వారా పొమిల్ జైన్, విపిన్ జైన్‌లు తమ కమీషన్ ఏజెంట్ పీపీ శ్రీనివాసన్‌కు రూ.31.40 లక్షలు హవాలా రూపంలో అందజేశారు. శ్రీనివాసన్ అందులో కొంత కమీషన్‌గా మినహాయించుకుని. . మిగతా సొమ్మును కల్తీ నెయ్యి సరఫరాకు సహకరించిన పలువురు తితిదే ఉద్యోగులకు లంచాలిచ్చారు.

దశ-7: పొమిల్ జైన్ డెయిరీ నిపుణుడు విజయభాస్కరరెడ్డికి ఒక్కో విడతలో రూ.25 లక్షల చొప్పున రూ.75 లక్షలను హైదరాబాద్‌లోని హవాలా ఏజెంట్ అర్జున్ గోస్వామి ద్వారా చెల్లించారు. అందులో రూ.34 లక్షలను సిట్ తాజాగా సీజ్ చేసింది.

కేసీఆర్‌కు సిట్ పిలుపు

- నేడు 3 గంటలకు విచారణకు రావాలని సూచన
- ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో కీలక పరిణామం

ఈనాడు, హైదరాబాద్: సంచలనం సృష్టించిన ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు హాజరు కావాలని తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్‌కు సిట్ నోటీస్ జారీ చేసింది. దీనిపై కేసీఆర్ వెంటనే స్పందించారు. మున్సిపల్ ఎన్నికల్లో తలమునకలై ఉన్నందున మరో తేదీ ఇవ్వాలని కోరారు. ఇందుకు సిట్ సుముఖత వ్యక్తం చేసింది. శుక్రవారం రెండో విడత నోటీస్ ఇచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది. తనను ఎర్రవల్లిలోనే విచారించాలన్న కేసీఆర్ విజ్ఞప్తిపై న్యాయసలహా పొందిన అనంతరం సిట్ నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

క్యాన్సర్ నియంత్రణే లక్ష్యంగా కార్యాచరణ

- 'ఏపీ క్యాన్సర్ స్క్రీనింగ్ అట్లాస్' విడుదలలో సీఎం చంద్రబాబు
- వైద్య నిపుణుడు నోరి దత్తాత్రేయుడితో కలిసి ఆవిష్కరణ



డా.నోరి దత్తాత్రేయుడితో కలిసి క్యాన్సర్ స్క్రీనింగ్ అట్లాస్‌ను విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో వివిధ రకాల క్యాన్సర్ల నియంత్రణే లక్ష్యంగా కార్యాచరణ చేపడుతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంచేశారు. దేశంలో క్యాన్సర్ వ్యాధిని నోటిఫై చేసిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అవతరించిందని తెలిపారు. ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణుడు, ఏపీ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ నోరి దత్తాత్రేయుడితో కలిసి గురువారం క్యాంపు కార్యాలయంలో క్యాన్సర్ స్క్రీనింగ్ అట్లాస్‌ను ముఖ్యమంత్రి విడుదల చేశారు. మహిళల్లో సర్వైకల్ క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందించేందుకు వివిధ సంస్థలు, ఎన్నారైల నుంచి సహకారం తీసుకోవాలని సీఎం సూచించారు. డాక్టర్ నోరి దత్తాత్రేయుడు మాట్లాడుతూ దేశంలో తొలిసారిగా ఏపీలో క్యాన్సర్ అట్లాస్ రూపొందించినట్లు తెలిపారు. దీంతో రోగులకు బోధనాసుపత్రులు, జిల్లా ఆసుపత్రుల ద్వారా వివిధ రకాల చికిత్సలు అందించే వీలుంటుందన్నారు. ప్రస్తుతం ఏపీలో 32,657 మంది క్యాన్సర్ బాధితులు ఉన్నారని.. ఐసీఎంఆర్, ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం 2030 నాటికి 20% కేసుల పెరుగుదల ఉంటుందని వెల్లడించారు.

ఇదీ అట్లాస్ ఉపయోగం: రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో 2.9 కోట్ల మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేసి, ఆ వివరాలతో అట్లాస్ రూపొందించారు. చికిత్సలు, సర్జికల్, రేడియేషన్, వైద్యసేవల వివరాలూ అందులో పేర్కొన్నారు. 2030 నాటికి అడ్వాన్స్ చికిత్సలతో పీడితులను తగ్గించేలా కార్యాచరణ చేపట్టనున్నారు. ఆరోగ్యంపై అవగాహన, వ్యాధిపై అవగాహన, నివారణ, ముందస్తు పరీక్షలు.. లాంటివి క్యాన్సర్ కేర్ స్ట్రాటజీలో భాగంగా ఉంటాయి.

లడ్డూ కల్తీతో రూ.కోట్లకు పడగలెత్తిన వైకాపా నేతలు

- మంత్రి పార్థసారథి
- వైకాపా నేతల రాద్ధాంతం: తిరుపతిలో స్వామీజీలు
- పలుచోట్ల 'మహా పాపం నిజం' ఫ్లెక్సీలు

న్యూస్‌టుడే బృందం: వేంకటేశ్వరస్వామి ఆలయంలో 20 కోట్ల లడ్డూల తయారీలో వైకాపా నేతలు రూ.251 కోట్లను తమ జేబుల్లో వేసుకుని కోట్లకు పడగలెత్తారని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. గురువారం నూజివీడులో స్త్రీ శక్తి భవనం నుంచి వేంకటేశ్వరస్వామి కోవెల వరకు కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి పాదయాత్ర చేశారు. ఆలయాన్ని పసుపు, కుంకుమ నీళ్లతో శుభ్రం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లడ్డూల్లో నెయ్యికి బదులు పామాయిల్, కెమికల్ వాడినట్లు సిట్ నివేదిక ద్వారా వెల్లడైన విషయం తెలిసిందేనన్నారు. ఇది కోట్లమంది భక్తుల మనోభావాలపై చేసిన దాడిగా భావించాలన్నారు.

స్వామీజీలు, హిందూ సంఘాల సదస్సు

అతి పవిత్రమైన తిరుమల, తితిదే, శ్రీవారి విశిష్టతపై వైకాపా నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని, ఈ దుష్ప్రచారాన్ని మానుకోవాలని మఠాధిపతులు, పీఠాధిపతులు, స్వామీజీలు హెచ్చరించారు. గురువారం తిరుపతి మహతి కళాక్షేత్రంలో స్వామీజీల సదస్సు జరిగింది. శ్రీవారి ప్రసాదాల విషయంలో వైకాపా ప్రభుత్వంలో అనేక అవినీతి, అక్రమాలు జరిగాయని పలువురు అన్నారు. సదస్సులో శివకామేశ్వరి పీఠం పీఠాధిపతి శివానంద స్వామి, సాధుసంతువుల సమన్వయకర్త అట్లూరి నారాయణరావు, త్రిపుర భైరవనంత స్వామి తిరుక్షేత్రాల అధ్యక్షుడు తుమ్మ ఓంకార్, మౌనస్వామి, త్యాగరాజస్వామి, దేవిదాస్ స్వామి, కాలభైరవ స్వామి, రమానందస్వామి, పద్మానంద యోగేశ్వర్ తదితరులు ప్రసంగించారు.



నూజివీడు వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న మంత్రి పార్థసారథి

కల్తీ నెయ్యిపై ఫ్లెక్సీలు

వైకాపా హయాంలో తిరుమల లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి వినియోగించినట్లు నిర్ధారణ అయిన నేపథ్యంలో పల్నాడు జిల్లా పిడుగురాళ్ల, వినుకొండ పట్టణాల్లో 'మహా పాపం నిజం' పేరుతో భారీ ఫ్లెక్సీలు గురువారం వెలిశాయి. ఫ్లెక్సీపై మాజీ సీఎం జగన్, తితిదే మాజీ ఛైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి చిత్రాలను ప్రచురించారు.

దర్శిలో ఫ్లెక్సీ దహనం

వైకాపా నాయకులు తెదేపా ఫ్లెక్సీని దహనం చేసి వీరంగం సృష్టించారు. ప్రకాశం జిల్లా దర్శిలో గురువారం 'మహా పాపం నిజం' పేరిట ఓ ఫ్లెక్సీని తెదేపా నాయకులు ఏర్పాటుచేశారు. సాయంత్రం నాలుగున్నర ప్రాంతంలో వైకాపా మండల నాయకులు వెంకటరెడ్డి, అంజిరెడ్డి, మధుసూదన్ రెడ్డి, భాస్కర్ తదితరులు కార్యకర్తలతో వెళ్లి ఫ్లెక్సీని తొలగించి నిప్పు పెట్టారు. దీంతో అక్కడ గంటపాటు ట్రాఫిక్ నిలిచింది. పోలీసులు వారిని స్టేషన్‌కు తరలించారు. తొలగించిన ఫ్లెక్సీ స్థానంలో తెదేపా నాయకులు మూడింటిని ఏర్పాటుచేశారు.



పిడుగురాళ్లలోని ఎన్టీఆర్ కూడలిలో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ



దర్శిలో ఫ్లెక్సీని తొలగిస్తున్న వైకాపా నాయకులు

సీఎంతో ఆరెస్సెస్ చీఫ్ భాగవత్ భేటీ

ఈనాడు, అమరావతి: రెండు రోజుల పర్యటనలో భాగంగా విజయవాడ వచ్చిన ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ ఉండవల్లిలోని నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో గురువారం భేటీ అయ్యారు. సీఎం ఆయనను సాదరంగా ఆహ్వానించి, పలు అంశాలపై చర్చించారు.

మూడేళ్లలో రూ.33.57 కోట్ల ఆస్తులు

- మద్యం కుంభకోణం సొత్తుతో భార్య పేరిట కొన్న రాజ్ కెసిరెడ్డి
- సిట్ దర్యాప్తులో గుర్తింపు

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి ఈ లంచాల సొమ్ములో కొంత మొత్తంతో ఆయన భార్య పైరెడ్డి దివ్యారెడ్డి పేరిట హైదరాబాద్‌లోని అత్యంత ఖరీదైన ప్రాంతాల్లో రూ.33.57 కోట్ల విలువైన స్థిరాస్తులు కొన్నట్లు సిట్ తేల్చింది. 2020-23 మధ్య ఆయన వీటిని కొన్నట్లు గుర్తించింది. ఆ ఆస్తుల జప్తు కోసం విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో ఒకటి, రెండు రోజుల్లో పిటిషన్ దాఖలు చేయనుంది. ఈ మేరకు సిట్‌కు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. సిట్ దర్యాప్తులో గుర్తించిన ప్రధానాంశాలివీ.

✦ హైదరాబాద్‌లోని గండిపేట మండలం పుప్పాలగూడ గ్రామంలోని సర్వే నంబర్ 338లో 15వ నంబర్ విల్లాను 2020 జనవరి 23న రాజ్ కెసిరెడ్డి ఆయన భార్య పేరిట కొన్నారు. ఈ విల్లాను రూ.2.90 కోట్లకు కొన్నట్లు చూపించారు. వాస్తవంగా దాని విలువ రూ.8 కోట్లు. ఈ ఆస్తి కొనుగోలు కోసం కొంత మొత్తం బ్యాంకు రుణం తీసుకున్నట్లు చూపించారు. మిగతా సొమ్ము అధికారిక ఆదాయం నుంచి చెల్లించినట్లు లేదు.

✦ జూబ్లీహిల్స్‌లోని షేక్‌పేట అశ్వినీ లేఔట్స్‌లో 6,464 గజాల ఓపెన్ ప్లాట్ రూ.4.20 కోట్లకు కొన్నట్లు రికార్డుల్లో చూపించారు. దాని మార్కెట్ విలువ రూ.18 కోట్లు. ఆ స్థలంలో పైరెడ్డి దివ్యారెడ్డి పేరిట అనుమతి పొంది రూ.4.32 కోట్లతో భవనం నిర్మించారు. మొత్తంగా దాని విలువ రూ.22.32 కోట్లు.

✦ షేక్‌పేట సర్వే నంబర్ 403/1లో 108.43 గజాల ఓపెన్ ప్లాట్‌ను రాజ్ కెసిరెడ్డి 2023 మే 22న తన పేరిట కొన్నారు. రూ.76 లక్షలకు కొన్నట్లు చూపించారు. దాని మార్కెట్ విలువ రూ.3.25 కోట్లు.

✦ రాజ్ సతీమణి దివ్యారెడ్డి పేరిట కొన్న ఆయా ఆస్తుల రిజిస్టర్డ్ డాక్యుమెంట్ విలువ రూ.12.18 కోట్లుగా చూపించినప్పటికీ.. వాటి విక్రేతలకు అదనంగా రూ.21.39 కోట్లు నగదు రూపంలో చెల్లించినట్లు సిట్ గుర్తించింది. ఇదంతా లెక్కల్లో చూపని మొత్తమేనని, మద్యం కుంభకోణంలో వచ్చిన లంచాల సొమ్ముతోనే వీటిని కొన్నారని తేల్చింది.

మార్చి 3న శ్రీవారి ఆలయం మూసివేత

తిరుమల, న్యూస్‌టుడే: చంద్ర గ్రహణం కారణంగా మార్చి 3న ఉదయం 9 నుంచి సాయంత్రం 7.30 గంటల వరకు తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని మూసివేయనున్నారు. ఆ తర్వాత ఆలయ తలుపులు తెరిచి శుద్ధి, పుణ్యాహవచన క్రతువులు పూర్తి చేస్తారు. రాత్రి 8.30 నుంచి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించనున్నారు. ఆ రోజు వీఐపీ బ్రేక్, శ్రీవాణి సహా అన్నిరకాల ప్రివిలేజ్ దర్శనాలను, అష్టదళ పాదపద్మారాధన, కల్యాణోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను తితిదే రద్దు చేసింది.

నైతిక విలువల కేంద్రాలుగా జైళ్లు

హోం మంత్రి అనిత



కేంద్ర కారాగారాల్లోని ఖైదీలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలిస్తున్న హోం మంత్రి అనిత

విశాఖపట్నం (మధురవాడ), న్యూస్‌టుడే: జైళ్లను కేవలం శిక్ష అమలు చేసే కేంద్రాలుగా కాకుండా సమాజానికి నైతిక విలువలు గల వ్యక్తులను తీర్చిదిద్దే సంస్కరణ కేంద్రాలుగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని హోం మంత్రి వంగలపూడి అనిత చెప్పారు. విశాఖలో రెండు రోజులపాటు నిర్వహించిన జైళ్ల శాఖ 9వ జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమానికి గురువారం మంత్రి హాజరై మాట్లాడారు. ఏపీ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కార్యక్రమం విశాఖలో జరగడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ఏపీలో పోలీసు, జైళ్ల విభాగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామన్నారు. జిల్లాల్లోని అన్ని జైళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. అమరావతిలో హైసెక్యూరిటీ సెంట్రల్ జైలు ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరామని, త్వరలో ఆమోదం లభించే అవకాశాలున్నాయని చెప్పారు. ఏపీ డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా, ఇతర ఉన్నతాధికారులతో కలిసి జైళ్ల శాఖ నూతన వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని కేంద్ర కారాగారాల్లో ఖైదీలు తయారు చేసిన పలు ఉత్పత్తుల స్టాళ్లను మంత్రి సందర్శించారు. దేశవ్యాప్తంగా జైళ్ల నిర్వహణలో విధానపరంగా ఎదురవుతున్న కార్యాచరణ సవాళ్లపై రెండో రోజు సదస్సులో సీనియర్ జైలు అధికారులు, నిపుణులు చర్చించి, సూచనలను వెల్లడించారు. కార్యక్రమంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ (ఏపీ) అంజనీకుమార్, అడిషనల్ డైరెక్టర్ జనరల్ (బీపీఆర్ అండ్ డీ) రవి జోసెఫ్ లొక్కు, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ (ఏపీ) ఐ.శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ జనరల్ (బీపీఆర్ అండ్ డీ) జితేంద్రసింగ్‌మీనా, పలు రాష్ట్రాల జైళ్ల శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సామాన్యులకు అందుబాటులోనే ధరలు

- ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబరు వరకు ద్రవ్యోల్బణం 1.39శాతమే
- జాతీయ సగటు కన్నా తక్కువ
- కేంద్ర ఆర్థిక సర్వే వెల్లడి

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ద్రవ్యోల్బణం ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి డిసెంబరు మధ్య జాతీయ సగటు కన్నా తక్కువ నమోదైంది. జాతీయ స్థాయిలో సగటు ద్రవ్యోల్బణం 1.72% ఉంది. అదే సమయంలో ఏపీలో 1.39%గా లెక్కించారు. కేంద్రం గురువారం వెలువరించిన ఆర్థిక సర్వే ఫలితాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. రాష్ట్రంలో క్రమేణా ద్రవ్యోల్బణం తగ్గుతూ వస్తోంది. వస్తువుల, సేవల ధరలు పెరిగితే ద్రవ్యోల్బణం పెరిగిందని, ఆ ధరలు తగ్గితే ద్రవ్యోల్బణం తగ్గిందని నిర్ణయిస్తారు. మన దేశంలో వినియోగదారుల ధరల సూచిక (సీపీఐ), టోకు ధరల సూచిక (డబ్ల్యూపీఐ) ఆధారంగా ద్రవ్యోల్బణం లెక్కిస్తారు. ప్రస్తుతం రిజర్వ్‌బ్యాంకు ఆఫ్ ఇండియా వినియోగదారుల ధరల సూచిక ఆధారంగానే లెక్కిస్తోంది. సామాన్య కుటుంబం ఏం కొంటుంది అనే అంశాల ఆధారంగా ఇది లెక్కిస్తారు. బియ్యం, కూరగాయలు, పాలు, ఇంధనం, బట్టలు, విద్యుత్తు ఛార్జీలు, వైద్యుని ఫీజు, ఇంటి అద్దె తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని లెక్కలు వేస్తారు. ప్రతి నెలా ఈ ద్రవ్యోల్బణం లెక్కిస్తారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల డేటాను ఆర్థిక సర్వే వెల్లడించింది. జాతీయ స్థాయిలో 1.72% ఉన్నట్లు పేర్కొంది. అర్బన్ ప్రాంతాల్లో కన్నా గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉందని ఈ సర్వే విశ్లేషించింది.

2022–23లో ఏకంగా 7.57%

ఆంధ్రప్రదేశ్‌లో క్రమేణా ధరలు దిగి వస్తున్నాయని ఈ సర్వే ఫలితాలు స్పష్టంచేస్తున్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 7.57% ద్రవ్యోల్బణం రాష్ట్రంలో నమోదైంది. ఆ ఏడాది జాతీయ సగటు 6.66%. 2023-24లో ఏపీలో 5.54%గా నమోదైంది. అప్పట్లో కూడా జాతీయ సగటు కన్నా రాష్ట్రంలో ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉంది. అప్పుడు జాతీయ సగటు 5.36%గా ఉంది. 2024-25లో ద్రవ్యోల్బణం 4.41%గా నమోదైంది. ఆ ఏడాది నుంచి జాతీయ సగటు కన్నా ద్రవ్యోల్బణం రాష్ట్రంలో తగ్గడం విశేషం. 2024-25 ఆర్థిక సంవత్సరానికి జాతీయ స్థాయిలో 4.63% ద్రవ్యోల్బణం నమోదైంది. తాజాగా డిసెంబరు నెల వరకు 1.39% మాత్రమే నమోదు కావడం శుభ పరిణామం. రిటైల్ ద్రవ్యోల్బణం 2% నుంచి 6% మధ్య ఉండాలని రిజర్వుబ్యాంకు పేర్కొంటోంది. దేశంలో కేరళ, లక్షద్వీప్‌లు ఎగువ పరిమితిని దాటి ఉన్నాయని ఆర్థిక సర్వే విశ్లేషించింది. కేరళలో ఈ ఆర్థిక ఏడాది డిసెంబరు వరకు 8.05%, లక్షద్వీప్‌లో 6.69% నమోదైంది.

ఏపీ విధానాలు భేష్

- నాలా రద్దుతో విధాన ప్రక్రియలో జాప్యం తొలగింపు
- ఆర్థిక సర్వేలో ప్రస్తావించిన కేంద్రం

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న భూ వినియోగ మార్పిడి విధానాన్ని కేంద్రం ప్రశంసించింది. కొన్ని నిర్దిష్ట వర్గాలకు భూవినియోగ మార్పిడి అవసరాన్ని తొలగించారని.. విధాన ప్రక్రియలో జరిగే జాప్యాన్ని గణనీయంగా తగ్గించేందుకు ఇది దోహదపడిందని గురువారం విడుదల చేసిన 2025-26 సామాజిక ఆర్థిక సర్వేలో వివరించింది. ప్రాధాన్య ప్రాంతాల్లో అనుసరిస్తున్న ఉత్తమ పద్ధతులు, సంస్కరణల కింద.. ఆంధ్రప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో అమలు చేస్తున్న భూవినియోగ మార్పిడి విధానాన్ని ప్రస్తావించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏపీలో నాలా రద్దు చేసింది. పురపాలక సంఘాలు ప్లాన్ ఆమోదించే సమయంలో డెవలప్‌మెంట్ ఛార్జీలు వసూలు చేస్తున్నాయి. రెవెన్యూశాఖలో చోటు చేసుకుంటున్న జాప్యానికి, అక్రమ వసూళ్లకు చెక్ పెట్టింది.

పర్యావరణ అనుమతులూ సులభతరం

విధానపరమైన అడ్డంకులను అధిగమించే ప్రక్రియలో భాగంగా పలు రాష్ట్రాలు థర్డ్‌పార్టీ తనిఖీలు, స్వయం ధ్రువీకరణలను అమలు చేస్తున్నాయని ఆర్థిక సర్వేలో కేంద్రం పేర్కొంది. పర్యావరణ అనుమతులకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌తోపాటు అండమాన్ నికోబార్ దీవులు, గోవా, తమిళనాడు, ఉత్తరాఖండ్‌లో ఇలాంటి విధానాలు ఉన్నాయని వివరించింది.

కేంద్ర విధానాలతో వ్యవసాయ రంగానికి విఘాతం

- పదేళ్లలో 10 లక్షల మంది రైతులు, కూలీల ఆత్మహత్య
- అఖిలభారత కిసాన్‌సభ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్



ఈనాడు, అమరావతి: కేంద్రప్రభుత్వ విధానాలు, తీసుకొస్తున్న చట్టాలు వ్యవసాయ రంగానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్నాయని, వాటిపై పోరాడాలని అఖిలభారత కిసాన్‌సభ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ పిలుపునిచ్చారు. గుంటూరులో అఖిలభారత కిసాన్‌సభ జాతీయ కౌన్సిల్ సమావేశాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విజూకృష్ణన్ మాట్లాడుతూ గుంటూరులో ఓఆర్ఆర్ కోసం 140-250 మీటర్ల వెడల్పుతో భూసేకరణ ప్రకటన ఇచ్చారని.. అదే కేరళలో జాతీయరహదారులకు 45 మీటర్లు, కర్ణాటక, మహారాష్ట్రలో 60 మీటర్లే తీసుకుంటున్నారన్నారు. ఏపీలో చంద్రబాబు, ఆయన కుమారుడు అమరావతి కోసం 2-3 పంటలు పండే వేల ఎకరాల భూసమీకరణ చేసి ఇప్పటికీ అభివృద్ధి చేసి రైతులకు ఇవ్వలేదని ఆరోపించారు. 'ఇక్కడ ఓఆర్ఆర్‌కు భూసేకరణ చేస్తున్న ఎన్‌హెచ్ఏఐ ఎంత పరిహారం ఇస్తుందో చెప్పలేదు. కేరళలో భూసేకరణలో 25% ఖర్చు రాష్ట్రప్రభుత్వం భరించి రూ.5,600 కోట్లు ఇచ్చింది. అక్కడ సెంటుకు రూ.15-40 లక్షల పరిహారం ఇచ్చారు. ఇదీ కేరళకు, ఏపీకి ఉన్న వ్యత్యాసం' అని చెప్పారు.

వికసిత భారత్ అంటే ఇదేనా

'రెండు బల్బులు ఉన్న గిరిజనుడి ఇంటికి రూ.50 వేలు, ప్రీపెయిడ్ స్మార్ట్‌మీటరు వల్ల రూ.లక్ష విద్యుత్తు బిల్లు రావడమే మోదీ చెబుతున్న వికసిత్ భారత్. విజయనగరం జిల్లాలో 3హెచ్‌పీ మోటారుకు నెలకు రూ.10-15 వేల బిల్లు వస్తోంది. 2014 నుంచి 2025 వరకు 1.50 లక్షల మంది రైతులు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని కేంద్రం చెబుతోంది. మహిళలు, కౌలురైతులు, ఆదివాసీలను లెక్కలోకి తీసుకోలేదు. మోదీ హయాంలో 11 ఏళ్లలో 3.50 లక్షల మంది వలస కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారు. ఇవి 12 రాష్ట్రాల్లో వచ్చిన అంకెలే. పదేళ్లలో 10 లక్షల మంది కౌలురైతులు, మహిళలు, రైతులు, కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ పరిస్థితి మారాలంటే అఖిలభారత కిసాన్‌సభ అన్ని గ్రామాలకు విస్తరించడంతో పాటు ప్రతి రైతూ సభ్యుడు కావాలి' అని విజూకృష్ణన్ అన్నారు.

ఫిబ్రవరి 12న సమ్మె

'కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న పెద్ద ఎత్తున సమ్మె చేయనున్నాం. కేరళలో పోరాడితే ప్రభుత్వం క్వింటాలు వరి రూ.3వేలకు కొంటోంది. మోదీ ప్రభుత్వం రూ.2,389కు కొంటోంది. ఇక్కడ రైతుబంధు, రైతుభరోసా అని ప్రచారం చేస్తున్నారు. కానీ కేరళలో గ్రామపంచాయతీలు వరి సాగుకు రాయితీ కింద రూ.30వేలు ఇస్తున్నాయి. ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై జరుగుతున్న దాడిని అడ్డుకునేందుకు ఐక్య ఉద్యమానికి సిద్ధం కావాలి' అని తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ఏపీ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి శారదా జయలక్ష్మి, విశ్రాంత శాస్త్రవేత్తలు, కార్మిక నేతలు, కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా వేటూరి సాహితీ మహోత్సవం



వేటూరిపై రచించిన ఆరు పుస్తకాలను పల్లకిలో పెట్టి ఊరేగిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్, తానా వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రసాద్ తోటకూర, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తదితరులు

మోపిదేవి, న్యూస్‌టుడే: 'కవికులాలంకరణ వేటూరి సుందర రామమూర్తి సాహితీ మహోత్సవం' ఆయన స్వగ్రామమైన కృష్ణా జిల్లా మోపిదేవి మండలం పెదకళ్లేపల్లిలో గురువారం రాత్రి వైభవంగా జరిగింది. వేటూరి సుందర రామమూర్తి 90వ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. సాహిత్యానికి సంబంధించి ఆయనపై రచించిన ఆరు పుస్తకాలను పల్లకిలో ఊరేగించి శ్రీదుర్గా పార్వతీ సహిత నాగేశ్వరస్వామి సన్నిధిలో పూజలు చేశారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ దంపతులు, తానా వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రసాద్ తోటకూర, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, వేటూరి కుమారులు రవిప్రకాష్, చంద్రశేఖర్‌లు.., బుర్రా సాయిమాధవ్, తిపిర్నేని కల్యాణ్ చక్రవర్తి, మునగాల మోహన్ శ్యామ్ ప్రసాద్, జీడిగుంట విజయసారథి, ఎర్రాప్రగడ రామకృష్ణ, గొల్ల నారాయణరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామవరప్రసాదరావు, ప్రజాప్రతినిధులు, ఆహ్వానితులు, వేటూరి అభిమానులు పాల్గొన్నారు.



ఆలయ నమూనా



మధుసూదన్‌గౌడ్

సుద్ద ముక్కలతో వెంకన్న ఆలయ నమూనా

నంద్యాల జిల్లా డోన్‌కు చెందిన యువ చిత్రకారుడు మధుసూదన్‌గౌడ్ దాదాపు 2 వేల సుద్దముక్కలతో అద్భుతాన్ని ఆవిష్కరించారు. 25 రోజుల పాటు శ్రమించి స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ నమూనాను తీర్చిదిద్దారు. గురువారం ఈ నమూనాను ఆలయ ధర్మకర్తలు, అర్చకులకు అందజేశారు. - న్యూస్‌టుడే, డోన్

వసుంధర
vasundhara@eenadu.in

సైజుతో... సమస్యేనా?

నేను మూడు నెలల గర్భవతిని. నా వక్షోజాలు చిన్నగా ఉంటాయి. దీంతో పుట్టే బిడ్డకు పాలు సరిపోవని మా అత్తగారు కంగారుపడుతున్నారు. నిజమేనా?

– ఓ సోదరి

ప్రెగ్నెన్సీ సమయంలో తల్లి శరీరంలో చాలా మార్పులు చోటు చేసుకుంటాయి. అందులో ప్రధాన మార్పు జరిగేది వక్షోజాల్లోనే. ఆ ప్రాంతం కణజాలం, క్షీరగ్రంథులతో నిండి ఉంటుంది. ప్రెగ్నెన్సీలో ఈ రెండూ పాల ఉత్పత్తికి తగ్గట్టుగా పెరుగుతాయి. ఒకరకంగా దీన్ని ప్రకృతి ధర్మంగా చెప్పొచ్చు. సాధారణంగా గర్భం దాల్చాకే పాలిండ్లలో మార్పులు మొదలవుతాయి. ఇందుకు వక్షోజాలు చిన్నవా పెద్దవా అన్నది ముఖ్యం కాదు. అంతేకాదు, బిడ్డ పెరిగేకొద్దీ రొమ్ము పరిమాణమూ పాపాయికి పాలు సరిపోయేలా పెరుగుతుంది. కొంతమందికి ప్రసవానంతరం పెద్దగా మార్పు కనిపించకపోవచ్చు. కానీ... పాలు సమృద్ధిగా ఉంటే క్షీరగ్రంథులు పెరుగుతాయి. కాబట్టి, వక్షోజాల పరిమాణాన్ని గురించి ఎక్కువ ఆలోచించకండి. మీ జన్యువులు, వంశపారంపర్యం ఆధారంగా అవి ఎలా ఉన్నా... బిడ్డ అవసరాలకు తగ్గట్టుగా అవి సిద్ధమవుతాయి. అనవసరంగా కంగారుపడకుండా బిడ్డ, మీ ఆరోగ్యం మీద దృష్టి పెట్టండి.

డియర్ వసుంధర



డా. [illegible], గైనకాలజిస్ట్



బంగారం - వెండి
29న ముగింపు

	బంగారం (24కి)	ఆర్నమెంట్ (22కి)	వెండి (కేజీ)
హైదరాబాద్	1,79,290	1,64,350	4,25,000
విజయవాడ	1,80,420	1,67,040	3,99,000
ప్రొద్దుటూరు	1,85,000	1,70,200	4,00,000
రాజమహేంద్రవరం	1,78,850	1,63,950	4,25,000
విశాఖపట్నం	1,78,870	1,63,950	4,01,000
తమిళనాడు	-----	1,68,100	4,25,000

పెన్ను సరిగా పట్టుకుని నాలుగు అక్షరాలు రాయలేదు. కానీ, ప్రేమ... కలలు... లక్ష్యాలు... ఇలా ఆమె కవితల్లో జాలువారే అంశాలెన్నో! నాలుగు అడుగులు వేయాలన్నా కష్టమే. అయితేనేం తన కలలకు రెక్కలు కట్టి, కావాల్సిన తీరాలకు తీసుకెళ్లగలదు. మాట సరిగా రాదు... కానీ ఎంతో మందిలో స్థైర్యం నింపగలదు. వినయనా ఖురానా... స్ఫూర్తికి చిరునామా ఆమె!



వినయన

మాట సరిగ్గా రాదు... మెంటారింగ్ చేస్తోంది!

'ప్రతి ఒక్కరికీ జీవితంలో సవాళ్లు ఉంటాయి కదా! నా విషయంలో మాత్రం జీవితమే సవాలు' అంటుంది వినయన. అవును మరి! నడవలేదు, చేతులతో ఏదీ సరిగ్గా పట్టుకోలేదు. అంతెందుకు, మాట కూడా స్పష్టంగా చెప్పలేదు. దీనికితోడు జాలి చూపులు, 'ఈ అమ్మాయి ఎలా బతుకుతుంది? ఎవరు పెళ్లి చేసుకుంటార'ంటూ మాటలు. వినయనకి సెరిబ్రల్ పాల్సీ. అయితేనేం, అది నన్ను ఆపలేదు అంటుందీమె.

వినయనది దిల్లీ. సెరిబ్రల్ పాల్సీ కారణంగానే కాళ్లూ, చేతులూ, మాట సమస్యలు. 'చిన్నప్పుడు నడవడం అసాధ్యం అన్నారు డాక్టర్లు. అలాగని ప్రయత్నించకుండా ఉండలేకపోయాన్నేను. రోజూ గోడ, కుర్చీ పట్టుకుని సాధన చేసేదాన్ని. ఇప్పటికీ అడుగులు వేయగలను కానీ, ఎక్కువ దూరాలు నడవలేను. 11ఏళ్ల కష్టమది. అంటే... ప్రయత్నిస్తే ఏదైనా మార్చొచ్చు అనేగా! కన్ను, చేయి సమన్వయం కష్టమే అయినా తినడం, తాగడం, రాయడం వంటివి ప్రయత్నిస్తుంటా. రాయడం కష్టమవుతోందని కంప్యూటర్ వాడినా... చాలా త్వరగా అలసిపోతుంటా. ఎందుకంటే వేళ్లతో సాధ్యం కాదని ముక్కునీ ఉపయోగిస్తా. నొప్పికితోడు కీబోర్డు మీద ఒక్కో అక్షరం చూసుకుని నొక్కడానికి చాలా సమయం తీసుకుంటుంది. దాంతో విపరీతంగా కోపమొచ్చేది. అయినా పట్టుదలగా కొనసాగిస్తుంటా. అప్పుడే నా ఆలోచనలు, భావోద్వేగాలు వంటివి ప్రపంచానికి తెలియజేయగలిగేది' అనే వినయన... కవితలు, చిన్న కథలు బాగా రాస్తూ పేరు తెచ్చుకుంది. పుస్తకాలూ రాసింది. తన రచనల్ని లోక్‌సభలోనూ చదివి వినిపించారు. టీవీ ద్వారా అవి అందరికీ చేరువైనప్పుడు సాధించా అనుకుందట వినయన.

ఆ క్షణం నిస్సహాయత ఆవరించింది

తనకంటూ గుర్తింపు తెచ్చుకుంటున్నా అనుకున్నప్పుడు మరో దెబ్బ. ఈసారి అనారోగ్యంతో మంచానికే పరిమితమైందామె. వినయనకి ఆ క్షణం నిస్సహాయత ఆవరించేసిందట. అప్పుడు తల్లి తనకు అండగా నిలిచింది. తన ఆలోచనలకు అక్షర రూపమిచ్చింది. ఈ స్థితిలోనూ చదువుని ఆపలేదు వినయన. దిల్లీ యూనివర్సిటీ నుంచి బీఏ, ఎంఏ, ఇంగ్లిష్‌లో ఎంఫిల్ పూర్తిచేసింది. తన కాళ్లమీద తను నిలబడాలనుకుంది. 'ఉద్యోగానికి ఇంటర్వ్యూకి వెళ్లినప్పుడు 'మీరొక్కరే వచ్చారా? ఈ లోపం నుంచి బయటపడగలరా? సాయం లేకుండా పనులు చేయగలరా? జీతం తక్కువైనా పర్లేదు కదా?' వంటి ప్రశ్నలు అడుగుతుంటారు. ప్రతిఒక్కరూ నా అంగవైకల్యాన్నే చూసేవారు తప్ప నా సామర్థ్యాలను కాదు. అయితే ఇది నా ఒక్కదాని సమస్యే కాదు, నాలాంటి చాలామందిది అని అర్థమైంది' అనే వినయన తరవాత లైఫ్‌కోచ్‌గా మారింది. అందరిలోనూ ఆత్మవిశ్వాసం నింపడమే కాదు, తనలాంటి వాళ్లకి ధైర్యమిస్తోంది. యూనిసెఫ్ నుంచి ఆహ్వానం అందుకుని, అక్కడా ప్రసంగించింది. రాష్ట్రపతి ప్రత్యేకంగా తనని పిలిపించుకుని మరీ మాట్లాడారు. దిల్లీ యూనివర్సిటీలో గెస్ట్ లెక్చరర్‌గా పనిచేస్తోంది. ఎంతోమందికి మెంటారింగ్ చేస్తోంది. సోషల్‌మీడియా ద్వారానూ స్ఫూర్తిని నింపుతుంటుంది. ఈ క్రమంలో ఎన్నో అవార్డులూ అందుకుంది.

'అవును పెన్ను పట్టుకోలేను. ఏకధాటిగా మాట్లాడలేను. అయితేనేం, నాకంటూ ఆలోచనలున్నాయి. సృజనాత్మకత ఉంది. అంతకు మించి నాపై నాకు నమ్మకం, సాధించాలన్న తపన ఉన్నాయి. నిజానికి ఎవరికైనా ఇవి చాలు... కోరుకున్నదేదైనా సాధించొచ్చు. నేను చెప్పేదీ ఇదే' నంటోన్న వినయన అందరికీ స్ఫూర్తిదాయకమే అంటే కాదనగలమా?

వీళ్ల కష్టం వృథా కాలేదు..!

పట్టుదలతో ప్రయత్నిస్తే విజయం తప్పక వరిస్తుంది. సీహెచ్.హేమలత, డి.నీరజల ప్రయాణమే ఇందుకు ఉదాహరణ. తమకు ఎదురైన అడ్డంకులన్నీ దాటుకుని గ్రూప్-2లో విజయకేతనం ఎగురవేశారీ యువతులు.

ప్రయత్నాలు ఆపలేదు... – సీహెచ్.హేమలత



మాది కడపలోని శివానందపురం. నాన్న బాలయ్య చిరు వ్యాపారి. అమ్మ వెంకటలక్షుమ్మ. మేం అయిదుగురు సంతానం. ఒక అక్క, ఇద్దరు చెల్లెళ్లు, తమ్ముడు. అమ్మానాన్నలు మమ్మల్ని ఉన్నత స్థానాల్లో చూడాలని కలలు కన్నారు. అందుకోసం అమ్మ ఇంటి దగ్గరే దోసెలమ్మేది కూడా. వాళ్ల ప్రోత్సాహంతోనే కష్టపడి చదివేదాన్ని. ఈ క్రమంలోనే అక్క భారతి, గ్రామ సచివాలయ పోలీస్ ఉద్యోగం సాధించింది. పెద్దమ్మ కొడుకు నన్నూ పోటీ పరీక్షలకు సిద్ధం అవ్వమని సలహా ఇచ్చారు. స్థానికంగానే డిగ్రీ పూర్తిచేశా. కానీ అంతలోనే కొవిడ్. ఏడాదిపాటు ఇంటికే పరిమితమయ్యా. కొవిడ్‌లో స్థానికులకు సేవలు చేస్తున్న ప్రభుత్వాధికారుల్ని చూసే... నేనూ వాళ్లలా అవ్వాలి అనుకున్నా. లాక్‌డౌన్ తర్వాత హైదరాబాద్‌లోని ఓ శిక్షణాసంస్థలో చేరా. ఏడాది పాటు శిక్షణ తీసుకుని తర్వాత సొంతంగా సన్నద్ధమవ్వడం మొదలుపెట్టా. నా శిక్షణ అమ్మానాన్నలకు ఆర్థిక భారం కాకూడదని... సిటీలోనే పని వెతుక్కున్నా. ఉదయం నుంచి సాయంత్రం వరకూ డ్యూటీ. తర్వాత యూట్యూబ్ వీడియోలు, ఈనాడు- ప్రతిభ పేజీలోని ప్రశ్నావళిని ప్రాక్టీసు చేసేదాన్ని. మొదట గ్రూప్-1కి ప్రయత్నించి మెయిన్స్‌లో వెనుదిరిగా. అయినా నిరాశ పడకుండా... గ్రూప్-2కి సన్నద్ధమయ్యా. ప్రస్తుతం ట్రెజరీ విభాగంలో జూనియర్ అకౌంటెంట్‌గా ఎంపికయ్యా.

– శ్రీనివాసులు బోగెం, కడప

సివిల్స్... నా లక్ష్యం! – డి.నీరజ



గ్రామీణ నేపథ్యం... పేదరికం ఇవేవీ లక్ష్యసాధనలో నన్ను ఆపలేదు. మాది జమ్మలమడుగు మండలంలోని మోరగుడి గ్రామం. నాన్న చిన్న హుసేనయ్య, భవన నిర్మాణ కార్మికుడు. అమ్మ చెన్నమ్మ, నేను తొమ్మిదో తరగతి చదువుతున్నప్పుడే దీర్ఘకాలిక వ్యాధితో మంచాన పడింది. చికిత్సకు శక్తికి మించి ఖర్చుచేసినా లాభం లేకపోయింది. మూడేళ్లు మృత్యువుతో పోరాడి చనిపోయింది. ఆర్థిక కష్టాలు వెంటాడినా నాన్న ఎప్పుడూ నా చదువు ఆపలేదు. నేనూ కష్టపడి చదువుకునేదాన్ని. ఇంటర్, డిగ్రీ చదువుతున్నప్పుడు ఉపాధ్యాయులు అందించిన సహాయం మరచిపోలేను. డిగ్రీ పూర్తయ్యాక యూపీఎస్సీ శిక్షణ కోసం హైదరాబాద్ వెళ్లా. ప్రభుత్వ కొలువు సాధించడమే లక్ష్యంగా రేయింబవళ్లు శ్రమించా. కానీ, అనివార్య పరిస్థితులవల్ల ఊరికి తిరిగొచ్చి, ఇంటి నుంచే ప్రిపరేషన్ మొదలుపెట్టా. రోజూ రానూపోనూ ఆరు కిలోమీటర్లు సైకిల్ తొక్కుతూ రీడింగ్ రూమ్‌కి వెళ్లి చదువుకునేదాన్ని. నోటిఫికేషన్ రాగానే కానిస్టేబుల్, గ్రూప్-2 ఉద్యోగాలకి దరఖాస్తు చేసుకున్నా. ప్రిలిమ్స్ అయ్యాక మెయిన్స్‌కి చాలా సమయం వేచిచూడాల్సి వచ్చింది. దాంతో ఆర్థిక కష్టాలు సరేసరి... చుట్టుపక్కల వాళ్ల మాటలతో చాలా నిరాశపరిచేవాళ్లు. బాధపడినా, బయటికి కనిపించనిచ్చేదాన్ని కాదు. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యా. ఒంగోలు పీటీసీలో శిక్షణలో ఉండగానే గ్రూప్-2లోనూ విజయం సాధించా. ఎగ్జిక్యూటివ్ కేడర్‌లో ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖలో ఎస్ఐగా విధులు నిర్వర్తించనున్నా. సివిల్ సర్వెంట్ అవ్వాలన్నదే నా లక్ష్యం.

– పెద్దిరెడ్డిగారి పవన్‌కుమార్‌రెడ్డి, కడప


మనవరాళ్లను పెంచండి... ఆనందంగా ఉండండి!

శోభిత



'అమ్మమ్మా నాకో కథ చెప్పవా, నానీ... నాకు నువ్వే స్నానం చేయించాలి' అని మనవరాలో మనవడో అడిగితే పెద్దవాళ్లలో ఉత్సాహం ఉంటుంది... ముఖ్యంగా మనదేశంలో మనవల ఆలనాపాలన, వాళ్ల ముద్దుముచ్చట్లతో గ్రానీలకు నిముషం తీరిక ఉండదనడం ఏమాత్రం అతిశయోక్తి కాదు. నిజం చెప్పాలంటే పుట్టిన క్షణం నుంచి స్కూల్లోకెళ్లే వరకూ పసివాళ్ల సంరక్షణ బాధ్యత దాదాపు బామ్మలూ తాతలదే. దాన్ని వాళ్లు ఇష్టంగానే తీసుకుంటారు. అయితే దీనివల్ల పసివాళ్లే కాదు, ఆ బామ్మతాతలు కూడా ఆరోగ్యంగా ఆనందంగా ఉంటున్నారని నెదర్లాండ్స్‌లోని టిల్‌బర్గ్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు చేసిన తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. మనవళ్లని పెంచుతోన్న బామ్మతాతల్లో వృద్ధాప్యంలో కనిపించే జ్ఞాపకశక్తి, భాషా నైపుణ్యాలకు సంబంధించిన సమస్యలు తక్కువగా ఉన్నాయట. పసివాళ్లను రాత్రివేళ కనిపెట్టుకుని ఉండటం, ఆరోగ్యం బాగోలేనప్పుడు దగ్గరుండి చూసుకోవడం, వండిపెట్టడం, స్కూలుకి సిద్ధం చేయడం, హోమ్‌వర్క్‌లో సాయం చేయడం, ఆటలు ఆడించడం, కథలు చెప్పడం... ఇలా ఎన్నో పనులు చేస్తుంటారు కదా. దాంతో శారీరకంగానూ మానసికంగానూ ఆరోగ్యంగా ఉంటున్నారు. పాశ్చాత్యదేశాలతో పోలిస్తే మనదగ్గర వృద్ధాప్యంలో ఆల్జీమర్స్, డిమెన్షియా... వంటి సమస్యలు తక్కువగా ఉండటానికి ఇదే కారణం కావచ్చు. సో, మనవల పెంపకం వల్ల అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలకే బోలెడు లాభాలున్నాయి. తాతయ్యలతో పోలిస్తే ఈ పనుల్ని అమ్మమ్మ, నానమ్మలే చేస్తుంటారు కాబట్టి వీళ్లలో ఈ సమస్యలు మరింత తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఏదిఏమైనా మన కుటుంబవ్యవస్థ ఎంత గొప్పదో దీన్నిబట్టి అర్థంకావడం లేదూ!

రికార్డులు భద్రం... ఆరోగ్యం క్షేమం!



సరోజ్

ఆధార్ కార్డు దగ్గర నుంచి బ్యాంక్ అకౌంట్ వరకూ అన్నీ మన ఫోన్‌లో డిజిటలైజేషన్ చేసుకుని పెట్టుకుంటాం. కానీ ఆరోగ్య సమాచారాన్ని మాత్రం రిపోర్టుల రూపంలో కాగితాలకే పరిమితం చేసేస్తాం. ఈ పద్ధతినే మార్చాలనుకున్నారు డాక్టర్ సరోజ్ గుప్తా. మెడికల్ రికార్డుల నిర్వహణకి ఎండీఆర్(మై డిజీ రికార్డు) అనే పేరుతో యాప్‌ను రూపొందించి, రిపోర్టులను ఆన్‌లైన్ చేస్తున్నారు.

మన దేశంలో వైద్యులు లేకో, ఆసుపత్రులు లేకో ప్రజలు ప్రాణాలు కోల్పోవడం లేదు. సరైన మెడికల్ రిపోర్టులు నిర్వహించకే ప్రమాదాలు జరుగుతున్నాయి అంటారు సరోజ్ గుప్తా. విదేశాల్లో మనదేశంలో అనేక స్టార్టప్‌ల్నీ నడిపిస్తున్నారు. విదేశాల్లో రెండు దశాబ్దాలకు పైగా వైద్యరంగంలో అనుభవం ఉన్న సరోజ్ మన దేశంలో ప్రతి ఒక్కరూ డిజిటల్ హెల్త్ రికార్డులను నిర్వహిస్తే మంచిది అంటున్నారు. 'ఈ పద్ధతి ఇక్కడ కొత్తగా ఉండొచ్చు కానీ, విదేశాల్లో ఎప్పటి నుంచో అమలు చేస్తున్నారు. అనారోగ్య వివరాలు, మందుల లిస్ట్ అన్నీ డిజిటల్ చేస్తే వైద్య సేవలు సులభం అవుతాయి.



అందుకే మన దేశంలో ఈ ఎండీఆర్(మై డిజీ రికార్డు) యాప్‌ను రూపొందించా. దీంట్లో కుటుంబ సభ్యుల వివరాలు, ఎవరికి ఏ సమస్య ఉందో అన్నీ డిజిటల్ రికార్డుల రూపంలో భద్రంగా ఉంటాయి' అంటున్నారు సరోజ్.

ఏంటీ డిజిటల్ రికార్డు...

'భారతదేశంలో వైద్య సేవలు మిగిలిన దేశాలతో పోలిస్తే కాస్త భిన్నంగా ఉంటాయి. మన దేశంలో జనాభా ఎక్కువ. అభివృద్ధి చెందుతున్న దేశం కావడంతో పెరుగుతున్న జనాభాకు మెరుగైన వైద్య సేవలు అందించడం చాలా కష్టం. ఎందుకంటే పట్టణ ప్రాంతాల్లో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు ఉంటే, గ్రామీణ ప్రాంతాల్లో కనీసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కూడా ఉండటం లేదు. పల్లెల్లో ఆర్థికంగా వెనకబడి కొందరు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే... ఇంకొందరు సరైన అవగాహన లేక ఆలస్యం చేస్తుంటారు. దీంతో మధుమేహం, బీపీ వంటి దీర్ఘకాలిక వ్యాధులు ఎప్పటికో గానీ బయటపడటం లేదు. కొంతమందికి ఇవి వారసత్వంగానూ రావొచ్చు. అలాంటప్పుడు ఈ మెడికల్ డేటా ఉపయోగపడుతుంది. ఆసుపత్రిలో ఏ మందులు వాడుతున్నారు? అని అడిగితే ఎర్ర బిళ్ల, నీలం రంగులో ఉన్న ట్యాబ్లెట్ వేసుకుంటున్నా అని చెప్పగలరు తప్ప టాబ్లెట్ పేరు, ఎంత ఎంజీ వంటివాటిపై అవగాహన అందరికీ ఉండదు. అంతేకాదు, కొందరికి కొన్ని మందులు అలర్జీలు కలిగిస్తాయి. అలాంటి వివరాలన్నీ ఈ మై డిజీ రికార్డులో నమోదు చేసుకోవచ్చు. దీనికి ఐడీ నంబర్‌తోపాటు పాస్‌వర్డ్ ఉంటుంది. ఒకసారి మొబైల్లో యాప్‌లో లాగిన్ అయ్యి రోగి బయోడేటా, అనారోగ్య వివరాలు, వాడే మందుల పేర్లు, వాటి ఫొటోలతో సహా పొందుపరుచుకోవచ్చు. చదువుకోలేని వారికోసం ఫేస్ లాకర్ కూడా ఉంటుంది. అంతేకాదు, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆభా (ఏబీహెచ్ఏ)కార్డుతో దీన్ని అనుసంధానం చేసేందుకూ అనుమతి వచ్చింది. ఇప్పటి వరకూ నలభై వేల మంది ఈ యాప్‌ను ఉపయోగిస్తున్నారు. వీళ్లంతా ఈ యాప్‌లో మెడిసిన్ రిమైండర్లు, ఫ్యామిలీ హెల్త్ డేటా అంతా భద్రపరుచుకుని ప్రాణాలు కాపాడుకుంటున్నారు. దీన్ని ప్రజలకు ఇంకా చేరువ చేయాలి' అంటున్నారు సరోజ్ గుప్తా.

కాఫ్తాన్‌లో... స్టైల్‌గా!

నేటి ఫ్యాషన్







చలి ఒక్కసారిగా తగ్గిపోయి... ఎండ ప్రభావం మొదలైంది కదూ! ఎండంటే చెమటలు, ఉక్కపోత. ఇలాంటప్పుడు మన మనసు సౌకర్యం వైపే మళ్లుతుందంటే కాదంటామా? అలా ఇప్పుడు ఎక్కువమందిని ఆకర్షిస్తున్నవేంటో తెలుసా... కాఫ్తాన్‌లు. ఫ్యాషన్ ప్రపంచాన్ని కుదిపేసిన స్టైల్ ఇది. కానీ వీటి ఉనికి మాత్రం వందల ఏళ్ల క్రితం నుంచే ఉంది. మధ్యప్రాచ్యం, ఆసియాల్లో ఎక్కువగా కనిపించే ఫ్యాషన్ ఇది. పైనుంచి కిందివరకూ ఉండేది. రానురానూ దానిలో మార్పులొచ్చాయి. తారల వల్లా కాఫ్తాన్ చాలామందికి పరిచయమైంది. మెటర్నిటీ సమయంలో, బీచ్ వెకేషన్లలో వాటిల్లో మెరిసి పాపులారిటీ తెచ్చేశారు. దీంతో అమ్మాయిలూ మనసుపడ్డారు. ఇలా ప్రత్యేక సందర్భాల్లో సరే! కానీ రోజువారీకే కష్టమంటారు చాలామంది. కాఫ్తాన్... వేసుకోవడానికి సౌకర్యవంతం. చూడటానికీ స్టైల్‌గా ఉంటుంది. ఎలాంటి శరీరాకృతికైనా నప్పుతుంది. సమస్యల్లా పొడవుగా ఉండటమే. కాస్త డిజైన్లు మారినా.. తుది రూపం మాత్రం అదే! పైగా ఇప్పుడు షార్ట్ ఫ్యాషన్‌దే ట్రెండ్. అందుకే ప్యాంట్ స్టైల్ కో ఆర్డ్ సెట్ల హవా నడుస్తోంది. అలాంటప్పుడు ఈ పొడుగు ఫ్యాషన్‌ని మెచ్చేదెవరు? అలాగని సౌకర్యం దృష్ట్యా పక్కన పెట్టాలి అనిపించదు. ఈ మీమాంసని గుర్తించారేమో డిజైనర్లు. కోఆర్డ్ సెట్లకి కాఫ్తాన్‌ని జోడించారిలా! ట్రెండీ డిజైన్లలోనూ తీసుకొచ్చారు. బాగున్నాయి కదూ! రోజువారీకే కాదు... వేడుకలకీ తగ్గట్టుగా తీర్చిదిద్దేశారు. అంటే స్టైల్‌కి సౌకర్యం జోడి అన్నమాట. ఇవి వేసుకుంటే పెద్దగా యాక్సెసరీల అవసరమూ ఉండదు. అయినా మెరిసిపోవొచ్చు. ఇంకేం తెచ్చేసుకోండి. వేసవికి చక్కగా సిద్ధమైపోండి.

మీకు తెలుసా!

ఆట... పిల్లలకి పని లాంటిది అంటున్నారు శాస్త్రవేత్తలు. దీనిద్వారానే చిన్నారులు ఆలోచించడం, సమస్యలను పరిష్కరించడం నేర్చుకుంటారట. ఇందుకు వాళ్లు 'ట్రయల్ అండ్ ఎర్రర్' పద్ధతిని ఉపయోగిస్తారట. ఇంట్లో ఉండే వస్తువుల్ని పైకి ఎత్తడం, గిన్నెల్నీ కప్పుల్నీ చెంచాలతో కొట్టడం, పడేయడం, పేర్చడం వంటివి చేస్తారట.



కెమెరాకు తెరవేద్దాం..!



ప్రస్తుత రోజుల్లో ఫోన్ లేకుండా ఒక్క రోజు కూడా గడపలేకపోతున్నాం. వృత్తి రీత్యా ఎప్పుడు ఏ నోటిఫికేషన్లు, ఫోన్ కాల్స్ వస్తాయో అంటూ ఎక్కడికి వెళితే అక్కడికి నిత్యం వెంటబెట్టుకుని వెళుతుంటాం. అలాంటి సందర్భాల్లో ఒక్కోసారి మనకు తెలియకుండానే కెమెరా ఆన్ అయ్యి ఫొటోలు క్యాప్చర్ అయ్యే ప్రమాదం ఉంది. కొన్ని సందర్భాల్లో ఇది ఇతరులకి ఇబ్బందీ కలిగించొచ్చు. ఇక నుంచి ఆ భయం లేకుండా 'వెబ్ క్యామ్ స్లైడర్ కవర్'ని తీసుకొచ్చారు తయారీదారులు. దీని వాడకం కూడా సులువే. సెల్ స్క్రీన్ శుభ్రంగా తుడిచి స్లైడర్ వెనకున్న స్టిక్కర్‌ను తీసి సెల్ కెమెరాకి అతికించాలి. ఫొటోలు, వీడియోలు తీస్తున్నప్పుడు దీనికి ఉండే చిన్న స్లైడ్‌ని పక్కకు జరిపితే సరిపోతుంది. అవసరం లేనప్పుడు దీన్ని క్లోజ్ చేసుకోవచ్చు. ఫోన్, ట్యాబ్, ల్యాప్‌టాప్ వంటి వాటికీ ఇది పనిచేస్తుంది. మీకూ నచ్చిందా? అయితే ఆన్‌లైన్‌లో వెతికేయండి మరి.

రంగు పోగొట్టండిలా!

ముప్పై దాటకుండానే తెల్లజుట్టు వచ్చేస్తోంది. దాన్ని దాచేద్దామని రంగేస్తాం. కానీ ఈ క్రమంలో చర్మానికి అంటిందనుకోండి... రంగు వేశామన్న సంగతిని గుర్తుచేస్తూ ఉంటుంది. ఓ పట్టాన వదలదు కూడా. ఈ చిట్కాలు పాటించేయండి... త్వరగా వదులుతుంది.




- వైట్ వెనెగర్‌లో దూదిని ముంచి రంగు అంటినచోట రుద్దండి. కాసేపలా రుద్దుతూ వెళితే నెమ్మదిగా మాయం అవుతుంది. అయితే తరవాత వెంటనే చల్లని లేదా గోరువెచ్చని నీటితో ఆ ప్రాంతాన్ని శుభ్రం చేసుకోవాలి.
- అప్పుడే అంటితే మాత్రం ఈ చిట్కా బాగా పనిచేస్తుంది. ముందు గోరువెచ్చని నీటితో ఆ ప్రాంతాన్ని కడగాలి. తరవాత లిక్విడ్ సోప్‌తో మరక అంటినచోట రుద్దండి. తిరిగి గోరువెచ్చని నీటితో కడిగేస్తే సరి.
- గోరువెచ్చని నీటిలో బేకింగ్‌సోడా కలిపి పేస్టులా చేయండి. ఆ మిశ్రమాన్ని మరక మీద ఉంచి రెండు నిమిషాలు మృదువుగా రుద్దాలి. ఆపై గోరువెచ్చని నీటితో కడిగేస్తే చాలు. మొండి మరకలకు ఇది బాగా పనిచేస్తుంది.
- రబ్బింగ్ ఆల్కహాల్ లేదా శానిటైజర్‌ని దూదికి అంటించి, రంగు అంటినచోట మృదువుగా రుద్దండి. త్వరగా వదులుతుంది. అయితే కళ్ల దగ్గర మాత్రం దీన్ని వాడకపోవడమే మేలు.
- టూత్‌పేస్టుల్లో కొద్దిమొత్తంలో ఎక్స్‌ఫోలియెంట్లు ఉంటాయి. ఇవీ రంగును పోగొట్టడంలో సాయపడతాయి. కాసేపు దాన్ని రుద్ది, 3-5 నిమిషాలు వదిలేయండి. ఆపై గోరువెచ్చని నీటితో కడిగేయడమే. అయితే జెల్‌పేస్ట్ రకాలు ఇందుకు సాయపడవు. నాన్ జెల్ రకాలను ఎంచుకోవడం మేలు.

డబ్ల్యూపీఎల్‌లో ఈనాడు

గుజరాత్ × ముంబయి

వేదిక: వడోదర, రా॥ 7.30


స్మృతి 54 నాటౌట్

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మరోసారి అదరగొట్టింది. స్మృతి మంధాన నేతృత్వంలోని ఆ జట్టు డబ్ల్యూపీఎల్-4లో ఫైనల్ చేరిన తొలి జట్టయింది. గ్రేస్ హారిస్ ఆల్‌రౌండ్ సత్తా చాటిన వేళ.. యూపీ వారియర్స్‌ను ఆర్సీబీ చిత్తుగా ఓడించింది. లీగ్ దశలో తన ఎనిమిది మ్యాచ్‌లనూ ఆడేసిన ఆర్సీబీ, ఆరు విజయాలతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని ఖాయం చేసుకుంది. అయిదో ఓటమి చవిచూసిన యూపీ ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించినట్లే!

ఆర్సీబీదే తొలి అడుగు


యూపీపై విజయంతో ఫైనల్‌కు

● గ్రేస్ ఆల్‌రౌండ్ జోరు


వడోదర

మాజీ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు డబ్ల్యూపీఎల్ ఫైనల్లోకి ప్రవేశించింది. గురువారం అత్యంత ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో బెంగళూరు 8 వికెట్ల తేడాతో యూపీ వారియర్స్‌పై ఘనవిజయం సాధించింది. నదైన్ డిక్లెర్క్ (4/22), గ్రేస్ హారిస్ (2/22) ధాటికి మొదట యూపీ వారియర్స్ 8 వికెట్లకు 143 పరుగులే చేయగలిగింది. లారెన్ బెల్ (1/21), శ్రేయాంక పాటిల్ (1/27) కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. దీప్తి శర్మ (55; 43 బంతుల్లో 6×4, 1×6) టాప్ స్కోరర్‌గా నిలిచింది. మెగ్ లానింగ్ (41; 30 బంతుల్లో 6×4, 1×6) రాణించింది. ఓపెనర్లు గ్రేస్ హారిస్ (75; 37 బంతుల్లో 13×4, 2×6), స్మృతి మంధాన (54 నాటౌట్; 27 బంతుల్లో 8×4, 2×6) విధ్వంసం సృష్టించడంతో లక్ష్యాన్ని ఆర్సీబీ 13.1 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి అలవోకగా ఛేదించింది. ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన గ్రేస్ హారిస్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. అగ్రస్థానం ఖాయం కావడంతో బెంగళూరు (12 పాయింట్లు) ఫైనల్లో అడుగు పెట్టింది. డబ్ల్యూపీఎల్‌లో లీగ్ దశ ముగిసే సరికి పాయింట్ల పట్టికలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన జట్లు ప్లేఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి. అగ్రస్థానం సాధించిన జట్టు నేరుగా ఫైనల్‌కు వెళ్తుంది. రెండు, మూడు స్థానాల్లో నిలిచిన జట్లు ఎలిమినేటర్‌లో తలపడతాయి. అందులో గెలిచిన జట్టు ఫైనల్ చేరుతుంది. గుజరాత్ (8 పాయింట్లు), ముంబయి ఇండియన్స్ (6), దిల్లీ క్యాపిటల్స్ (6), యూపీ (4) ఒక్కో మ్యాచ్ ఆడాల్సి ఉంది.

ఆర్సీబీ అలవోకగా..: గ్రేస్ హారిస్ ఆకాశమే హద్దుగా చెలరేగడంతో ఆర్సీబీ లక్ష్యం మరింత చిన్నదైపోయింది. ఎడాపెడా బౌండరీలు బాదేసిన ఆమె.. స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. క్రాంతి గౌడ్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్లో రెండు బంతులను బౌండరీ దాటించిన గ్రేస్.. ఆ తర్వాత ఏ దశలోనూ తగ్గలేదు. విధ్వంసాన్ని పెంచుకుంటూ పోయింది. క్రాంతి తర్వాతి ఓవర్లో ఏకంగా నాలుగు బౌండరీలు బాదింది. ఆశా బౌలింగ్‌లో సిక్స్‌తో అర్ధశతకం (28 బంతుల్లో) పూర్తి చేసింది. 7 ఓవర్లకు ఆర్సీబీ స్కోరు 79 కాగా.. అందులో గ్రేస్ చేసినవే 64 పరుగులు. ఎదుర్కొన్న తొలి 11 బంతుల్లో 13 పరుగులు చేసిన మరో ఓపెనర్ స్మృతి కూడా క్రమంగా జోరు పెంచింది. చకచకా ఫోర్లు కొట్టింది. 10వ ఓవర్లో జట్టు స్కోరు 108 వద్ద గ్రేస్ నిష్క్రమించినా.. వారియర్స్‌కు సంతోషించడానికేమీ లేకపోయింది. అప్పటికే బెంగళూరు విజయం ఖాయమైంది. ధాటైన బ్యాటింగ్‌ను కొనసాగించిన స్మృతి.. అలవోకగా పని పూర్తి చేసింది. 26 బంతుల్లోనే ఆమె అర్ధశతకం అందుకుంది. వోల్ (16)తో రెండో వికెట్‌కు స్మృతి 35 పరుగులు జోడించింది.


నదైన్ 4/22

వారియర్స్ కట్టడి: నదైన్ డిక్లెర్క్‌తో పాటు ఇతర బౌలర్లు సూపర్‌గా బౌలింగ్ చేయడంతో మొదట యూపీ వారియర్స్‌కు బెంగళూరు కళ్లెం వేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన యూపీ.. అదిరే ఆరంభాన్ని వృథా చేసుకుంది. ఈ మ్యాచ్‌లో దీప్తి ఓపెనర్‌గా వచ్చింది. లానింగ్‌తో కలిసి యూపీ ఇన్నింగ్స్‌ను ఆరంభించిన ఆమె.. బెల్ ఓవర్లో ఓ ఫోర్, సిక్స్ బాదింది. లానింగ్ మరింత దూకుడుగా బ్యాటింగ్ చేసింది. సయాలి బౌలింగ్‌లో సిక్స్, ఫోర్ కొట్టిన ఆమె.. అరుంధతి ఓవర్లో మూడు ఫోర్లు అందుకుంది. ఓపెనర్ల దూకుడుతో 8 ఓవర్లు ముగిసే సరికి 74/0తో యూపీ భారీ స్కోరుపై కన్నేసింది. కానీ ఆ జట్టు అనూహ్యంగా తడబడింది. లానింగ్‌ను ఔట్ చేయడం ద్వారా తొలి వికెట్ భాగస్వామ్యాన్ని నదైన్ విడదీయడంతో యూపీ ఇన్నింగ్స్ స్వరూపమే మారిపోయింది. ఆ తర్వాత బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. గ్రేస్ కూడా విజృంభించడంతో యూపీ చకచకా వికెట్లు కోల్పోయింది. ఓ వైపు దీప్తి నిలిచినా.. ఆమెకు సహకరించే వారే కరవయ్యారు. అమీ జోన్స్ (1), హర్లీన్ డియోల్ (14), క్లో ట్రయాన్ (6), శ్వేత్ సెహ్రావత్ (7) విఫలమయ్యారు. దీప్తి 19వ ఓవర్లో నిష్క్రమించింది. ఆఖరి ఓవర్లో సోఫీ ఎకిల్‌స్టోన్ (0), సిమ్రన్ షేక్ (10)ను నదైన్ వెనక్కి పంపింది. యూపీ తన చివరి 8 వికెట్లను 48 పరుగుల వ్యవధిలో కోల్పోయింది.


గ్రేస్ హారిస్ 75

యూపీ వారియర్స్ ఇన్నింగ్స్: లానింగ్ (సి) రాధ యాదవ్ (బి) నదైన్ 41; దీప్తి శర్మ (సి) నదైన్ (బి) శ్రేయాంక 55; అమీ జోన్స్ ఎల్బీ (బి) నదైన్ 1; హర్లీన్ డియోల్ (బి) హారిస్ 14; క్లో ట్రయాన్ (స్టంప్డ్) రిచా (బి) గ్రేస్ 6; శ్వేత సెహ్రావత్ (సి) స్మృతి (బి) బెల్ 7; సిమ్రన్ షేక్ (సి) అరుంధతి రెడ్డి (బి) నదైన్ 10; సోఫీ ఎకిల్‌స్టోన్ ఎల్బీ (బి) నదైన్ 0; ఆశా శోభన నాటౌట్ 0; శిఖ పాండే నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 9
మొత్తం: (20 ఓవర్లలో 8 వికెట్లకు) **143; వికెట్ల పతనం:** 1-74, 2-78, 3-95, 4-103, 5-122, 6-137, 7-138, 8-143; **బౌలింగ్:** లారెన్ బెల్ 4-0-21-1; సయాలి 2-0-21-0; శ్రేయాంక పాటిల్ 4-0-27-1; అరుంధతి రెడ్డి 1-0-14-0; నదైన్ డిక్లెర్క్ 4-0-22-4; గ్రేస్ హారిస్ 3-0-22-2; రాధ యాదవ్ 2-0-11-0

బెంగళూరు ఇన్నింగ్స్: గ్రేస్ హారిస్ (బి) శిఖ పాండే 75; స్మృతి మంధాన నాటౌట్ 54; జార్జియా వోల్ (సి) సిమ్రన్ షేక్ (బి) శోభన 16; రిచా ఘోష్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 2
మొత్తం: (13.1 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి) **147; వికెట్ల పతనం:** 1-108, 2-143; **బౌలింగ్:** క్రాంతి గౌడ్ 2-0-29-0; శిఖ పాండే 4-0-36-1; దీప్తి శర్మ 2.1-0-28-0; సోఫీ ఎకిల్‌స్టోన్ 2-0-14-0; ఆశా శోభన 2-0-24-1; క్లో ట్రయాన్ 1-0-15-0

నా ఆలోచనా ధోరణి మెరుగవుతోంది



శివమ్ దూబె

విశాఖపట్నం: పేస్ బౌలర్లను ఎదుర్కోవడంలో మెరుగయ్యానని భారత ఆల్‌రౌండర్ శివమ్ దూబె చెప్పాడు. అతడు న్యూజిలాండ్‌తో నాలుగో టీ20లో (15 బంతుల్లో 65 పరుగులు) విధ్వంసక ఇన్నింగ్స్‌తో రాబోయే టీ20 ప్రపంచకప్‌లో ప్రత్యర్థి జట్లకు హెచ్చరికలు పంపాడు. ఈ నేపథ్యంలో దూబె మాట్లాడుతూ.. ''బ్యాటుతో ఉత్తమ ప్రదర్శన చేసేందుకు నెట్స్‌లో శ్రమిస్తున్నా. నా ఆలోచనా ధోరణి మెరుగవుతోంది. బౌలర్లను అంచనా వేయగలుగుతున్నా. బ్యాటింగ్, బౌలింగ్‌లో అవకాశం ఇచ్చిన ప్రధాన కోచ్ గంభీర్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌లకు ధన్యవాదాలు. బౌలింగ్ వేయడం వల్ల తెలివిగా బ్యాటింగ్ ఎలా చేయాలో నేర్చుకోవచ్చు. నా నైపుణ్యాలు పెంపొందించుకునే దిశగా కష్టపడుతున్నా. నా బలమేంటో తెలుసుకుని.. ఎప్పుడు బౌలర్లపై దాడి చేయాలో నేర్చుకున్నా. షాట్ల ఎంపికలో తెలివిగా వ్యవహరిస్తున్నా'' అన్నాడు.

తోకముడిచిన పాకిస్థాన్!

టీ20 ప్రపంచకప్ కోసం 2న శ్రీలంకకు

లాహోర్: పాకిస్థాన్ వెనక్కి తగ్గినట్లే. టీ20 ప్రపంచకప్ కోసం ఆ జట్టు శ్రీలంకకు వెళ్లబోతోంది. ఈ మేరకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు షెడ్యూల్ కూడా సిద్ధం చేసినట్లు సమాచారం. ఫిబ్రవరి 2న పాక్ కొలంబోకు చేరనున్నట్లు తెలిసింది. ఈ మేరకు శుక్రవారం అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది. భారత్, శ్రీలంక ఉమ్మడిగా ఆతిథ్యమిస్తున్న టీ20 ప్రపంచకప్ నుంచి బంగ్లాదేశ్‌ను తప్పించినందుకు ఈ టోర్నీని బహిష్కరించాలని పాక్ భావిస్తున్నట్లుగా వార్తలొచ్చిన సంగతి తెలిసిందే. ప్రపంచకప్‌లో ఆడినా భారత్‌తో తలపడకూడదని పాక్ యోచిస్తున్నట్లు కూడా ప్రచారం జరిగింది. అయితే పాక్ బెదిరింపులకు ఇటు బీసీసీఐ, అటు ఐసీసీ ఏమాత్రం తలొగ్గలేదు. ఆ జట్టుతో సంప్రదింపులు కూడా జరపలేదు. టోర్నీకి దూరమైతే భారీ నష్టం చవిచూడాల్సి వస్తుందని అర్థం చేసుకున్న పీసీబీ.. జట్టును పంపడానికి సిద్ధమైంది. అన్ని అంశాల్ని పరిగణనలోకి తీసుకుని, పాకిస్థాన్ క్రికెట్ భవిష్యత్ దృష్ట్యా మిగతా దేశాలతో మంచి సంబంధాలు కలిగి ఉండాలని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ మోసిన్ నఖ్వీకి పాక్ ప్రధాని షాబాజ్ షరీఫ్ సూచించినట్లు సమాచారం. 2027 వరకు భారత్‌లో జరిగే ఐసీసీ టోర్నీల్లో తమ మ్యాచ్‌లన్నీ పాక్ ప్రత్యామ్నాయ వేదికల్లో ఆడనుంది.



అయూబ్

తొలి టీ20లో ఆసీస్‌పై పాక్ విజయం

లాహోర్: ఆస్ట్రేలియాతో మూడు టీ20 సిరీస్‌లో ఆతిథ్య పాకిస్థాన్ శుభారంభం చేసింది. గురువారం తొలి టీ20లో పాక్ 22 పరుగుల తేడాతో విజయం సాధించింది. సైమ్ అయూబ్ (40), సల్మాన్ ఆఘా (39) మెరవడంతో మొదట పాకిస్థాన్ 8 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. ఆడమ్ జంపా (4/24), బార్ట్‌లెట్ (2/26), మహ్లి బీర్డ్‌మ్యాన్ (2/33) బంతితో రాణించారు. ఛేదనలో ఆస్ట్రేలియా తడబడింది. 8 వికెట్లకు 146 పరుగులే చేయగలిగింది. గ్రీన్ (36), బార్ట్‌లెట్ (34 నాటౌట్) మాత్రమే రాణించారు. సైమ్ అయూబ్ (2/29), అబ్రార్ (2/10) ఆస్ట్రేలియాను దెబ్బతీశారు. అయూబ్ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా ఎంపికయ్యాడు.

ఛాంపియన్

ప్రపంచ నంబర్‌వన్ అరినా సబలెంకా జోరు కొనసాగుతోంది. తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ ఆమె ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. టైటిల్ కోసం ఆమె అయిదో సీడ్ రిబకినాను ఢీకొంటుంది.



సబలెంకా


రిబకినా

సబలెంకా × రిబకినా

● ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో అమీతుమీ

మెల్‌బోర్న్

టాప్ సీడ్ అరినా సబలెంకా ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఇక్కడ మూడో టైటిల్‌పై కన్నేసిన ఈ బెలారస్ అమ్మాయి సెమీఫైనల్లో 6-2, 6-3తో ఉక్రెయిన్‌కు చెందిన స్వితోలినాను చిత్తుగా ఓడించింది. సబలెంకాకు ఇది వరుసగా నాలుగో ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్ కావడం విశేషం. 2023, 2024లో టైటిల్ గెలిచిన ఆమె.. నిరుడు తుది పోరులో పరాజయం పాలైంది. సబలెంకా సెమీస్‌లో స్వితోలినాపై పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. సెమీస్ చేరే క్రమంలో ఇద్దరు టాప్-10 ప్లేయర్లను ఓడించిన 12వ సీడ్ స్వితోలినా.. సబలెంకా పవర్ హిట్టింగ్ ముందు నిలవలేకపోయింది. ఆమె చేతిలో స్వితోలినాకు ఇది వరుసగా ఆరో ఓటమి. సబలెంకా ఈ ఏడాది ఇప్పటి వరకు ఒక్క సెట్ కూడా కోల్పోలేదు. ఆమె వరుసగా 11 మ్యాచ్‌ల్లో గెలిచింది. సబలెంకా గురువారం సెమీఫైనల్లో 29 విన్నర్లు కొట్టింది. నాలుగుసార్లు ప్రత్యర్థి సర్వీసును బ్రేక్ చేసింది. సర్వీసులో 11 పాయింట్లు మాత్రమే జారవిడిచింది. మూడు డబుల్ ఫాల్ట్‌లు చేసిన స్వితోలినా.. 17 అనవసర తప్పిదాలు చేసింది. 12 విన్నర్లు మాత్రమే కొట్టింది. ఏకపక్షంగా సాగిన సెమీఫైనల్లో ఆరంభం నుంచీ సబలెంకాదే ఆధిపత్యం. ఆమె బలమైన ఫోర్ హ్యాండ్ షాట్లతో విరుచుకుపడింది. నాలుగో గేమ్‌లో బ్రేక్‌తో 3-1తో ఆధిక్యంలోకి దూసుకెళ్లిన సబలెంకా.. ఆ తర్వాత సర్వీసులు నిలబెట్టుకుని 5-2తో నిలిచింది. ఏడో గేమ్‌లో తిరిగి బ్రేక్ సాధించి సెట్‌ను చేజిక్కించుకుంది. అయితే రెండో సెట్లో తొలి గేమ్‌లోనే సబలెంకా సర్వీసును బ్రేక్ చేసిన స్వితోలినా.. పుంజుకున్నట్లు కనిపించింది. కానీ ఆమె ఆనందం ఎంతో సేపు నిలవలేదు. బలంగా పుంజుకున్న సబలెంకా.. నాలుగు, ఆరో గేముల్లో బ్రేక్‌లు సాధించి ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆ తర్వాత ప్రత్యర్థికి ఎలాంటి అవకాశమివ్వలేదు. ఏడో గేమ్‌లో సర్వీసు నిలబెట్టుకుని 5-2తో నిలిచిన సబలెంకా.. తొమ్మిదో గేమ్‌లో మ్యాచ్‌ను ముగించింది. మార్టినా హింగిస్ (2002) తర్వాత ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో వరుసగా నాలుగుసార్లు ఫైనల్ చేరిన తొలి ప్లేయర్‌గా సబలెంకా ఘనత సాధించింది. ''దీన్ని నేను నమ్మలేకపోతున్నా. ఇదో గొప్ప ఘనత. కానీ నా పని ఇంకా పూర్తి కాలేదు'' అని సెమీఫైనల్ అనంతరం ఆమె వ్యాఖ్యానించింది. శనివారం జరిగే ఫైనల్లో సబలెంకా.. కజకిస్థాన్ అమ్మాయి రిబకినాను ఢీకొంటుంది. సెమీఫైనల్లో రిబకినా 6-3, 7-6 (9-7)తో ఆరో సీడ్ జెస్సికా పెగులా (అమెరికా)పై విజయం సాధించింది. తొలి సెట్‌ను తేలికగా గెలుచుకున్న రిబకినా.. రెండో సెట్లో తీవ్ర ప్రతిఘటన ఎదుర్కొంది. హోరాహోరీ పోరులో టైబ్రేక్‌లో సెట్‌ను గెలుచుకుని రిబకినా ఫైనల్లో అడుగుపెట్టింది. పెగులా రెండు సెట్ పాయింట్లు సాధించినా సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఈ మ్యాచ్‌లో రిబకినా 6 ఏస్‌లు, 31 విన్నర్లు కొట్టింది. నాలుగుసార్లు ప్రత్యర్థి సర్వీసును బ్రేక్ చేసింది. మహిళల సింగిల్స్ ఫైనల్ రసవత్తరంగా సాగడం ఖాయం. 2023 ఫైనల్లో సబలెంకా చేతిలో ఓటమికి ప్రతీకారం తీర్చుకోవడానికి రిబకినాకు ఇది చక్కని అవకాశం. సబలెంకాతో ముఖాముఖి పోరులో ఆమె 6-5తో ఆధిక్యంలో ఉండడం విశేషం.


సినర్


జకోవిచ్

సినర్‌తో జకోవిచ్ ఢీ

ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్‌లో ఆసక్తికర సమరానికి వేళైంది. శుక్రవారం జరిగే సెమీఫైనల్లో పదిసార్లు ఛాంపియన్ నొవాక్ జకోవిచ్ (సెర్బియా).. డిఫెండింగ్ ఛాంపియన్ యానిక్ సినర్ (ఇటలీ)ను ఢీకొంటాడు. రికార్డు స్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై కన్నేసిన 37 ఏళ్ల జకోవిచ్‌కు 24 ఏళ్ల సినర్‌తో పోరు ఎంతో కఠినమైందే. ఈ టోర్నీలో నాలుగో రౌండ్లో వాకోవర్ పొందిన జకోవిచ్‌కు క్వార్టర్స్‌లోనూ అదృష్టం కలిసొచ్చింది. రెండు సెట్లు గెలిచి ఆధిక్యంలో ఉన్న దశలో ప్రత్యర్థి ముసెటి గాయం కారణంగా వైదొలిగాడు. మరోవైపు ప్రపంచ నంబర్ 2 సినర్ సూపర్ ఫామ్‌తో సెమీస్ చేరుకున్నాడు. జకోవిచ్‌తో ముఖాముఖి పోరులో సినర్ 6-4తో ఆధిక్యంలో ఉన్నాడు. మరో సెమీఫైనల్లో మూడో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ)తో ప్రపంచ నంబర్‌వన్ అల్కరాస్ (స్పెయిన్) తలపడతాడు.

రెండో సీడ్‌కు ఇషారాణి షాక్

థాయ్‌లాండ్ మాస్టర్స్ బ్యాడ్మింటన్


ఇషారాణి

బ్యాంకాక్: భారత యువ షట్లర్ ఇషారాణి బారువా.. థాయ్‌లాండ్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో రెండో సీడ్ సంగ్ షువో యున్ (దక్షిణ కొరియా)కు షాకిచ్చి క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో ఆమె 21-13, 14-21, 21-14తో సంగ్‌ను ఓడించింది. మరో మ్యాచ్‌లో దేవిక షగ్ 21-14, 21-14తో చైనీస్ తైపీ అమ్మాయి టుంగ్ టాంగ్‌పై విజయం సాధించి క్వార్టర్స్‌లో అడుగు పెట్టింది. హోరాహోరీగా సాగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో తరుణ్ మన్నెపల్లి 21-17, 14-21, 24-22తో టింగ్ యెన్ (చైనీస్ తైపీ)ని ఓడించాడు. కిరణ్ జార్జ్ 16-21, 11-21తో బగాస్ షుజివో (ఇండొనేసియా) చేతిలో, మిథున్ మంజునాథ్ 21-11, 16-21, 12-21తో లీ జియా (మలేసియా) చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించారు.

చేతన్ అజేయ శతకం

నాగాలాండ్ 322/6 ● ఆంధ్రతో రంజీ


దీమాపుర్: నాగాలాండ్‌తో రంజీ మ్యాచ్‌లో ఆంధ్ర బౌలర్లు నిరాశ పరిచారు. ఎలీట్ గ్రూప్-ఎలో గురువారం మొదలైన మ్యాచ్‌లో నాగాలాండ్ భారీ స్కోరు దిశగా సాగుతోంది. తొలి రోజు ఆట ముగిసేసరికి 6 వికెట్లకు 322 పరుగులు సాధించింది. చేతన్ బిష్ట్ (160 బ్యాటింగ్; 217 బంతుల్లో 23×4, 1×6) అజేయ శతకం సాధించాడు. డేగా నిశ్చల్ (74) కూడా రాణించాడు. సాయితేజ (2/28), సత్యనారాయణరాజు (2/58)ల ధాటికి 59 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన నాగాలాండ్‌ను బిష్ట్, నిశ్చల్ ఆదుకున్నారు. వీరిద్దరు అయిదో వికెట్‌కు 163 పరుగులు జోడించారు. ఆట చివరికి బిష్ట్‌కు తోడుగా నగాహో చిషి (37) క్రీజులో ఉన్నాడు.


సిరాజ్

విజృంభించిన సిరాజ్

● ఛత్తీస్‌గఢ్ 283 ఆలౌట్
● హైదరాబాద్ 56/0

హైదరాబాద్, ఈనాడు: టీమ్ఇండియా పేసర్ మహ్మద్ సిరాజ్ (4/56) రంజీ ట్రోఫీలో సత్తా చాటాడు. గురువారం ఉప్పల్ స్టేడియంలో మొదలైన ఎలీట్ గ్రూప్-డిలో మ్యాచ్‌లో హైదరాబాద్ కెప్టెన్ సిరాజ్‌తో పాటు రక్షణ్ రెడ్డి (2/28) రాణించడంతో ఛత్తీస్‌గఢ్ తొలి ఇన్నింగ్స్‌లో 72.3 ఓవర్లలో 283 పరుగులకు ఆలౌటైంది. ప్రతీక్ యాదవ్ (106) సెంచరీ సాధించగా.. వికల్ప్ తివారి (94) త్రుటిలో శతకం కోల్పోయాడు. 58 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన ఛత్తీస్‌గఢ్‌ను.. ప్రతీక్, వికల్ప్ ద్వయం ఆరో వికెట్‌కు 183 పరుగులు జోడించి ఆదుకుంది. అనంతరం బ్యాటింగ్ ఆరంభించిన హైదరాబాద్.. ఆట చివరికి వికెట్ నష్టపోకుండా 56 పరుగులు చేసింది. అమన్ రావు (32 నాటౌట్), అభిరథ్ రెడ్డి (23 నాటౌట్) క్రీజులో ఉన్నారు.



చైనా-బ్రిటన్ సంబంధాల్లో కొత్త అధ్యాయం

జిన్‌పింగ్‌తో స్టార్మర్ భేటీ

బీజింగ్: సుస్థిర, సుదీర్ఘ, సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొనసాగించాలని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ నిర్ణయించుకున్నారు. ప్రపంచ శాంతి, సుస్థిరతలకు తమ రెండు దేశాల మైత్రి కీలకమని అభిప్రాయపడ్డారు. మూడు రోజుల చైనా పర్యటనలో భాగంగా బుధవారం బీజింగ్‌లో అడుగు పెట్టిన స్టార్మర్ గురువారం.. ఇక్కడ గ్రేట్ హాల్ ఆఫ్ ది పీపుల్‌లో జిన్‌పింగ్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీ దాదాపు 80 నిమిషాలు కొనసాగింది. గ్రీన్‌లాండ్ అంశంలో ఐరోపా దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రకరకాలుగా ఒత్తిడి తెస్తున్న తరుణంలో స్టార్మర్.. బీజింగ్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఎనిమిదేళ్ల తర్వాత బ్రిటన్ ప్రధాని చైనాలో పర్యటించడం ఇదే తొలిసారి. బ్రిటన్, చైనా సంబంధాల్లో కొత్త అధ్యాయం మొదలైందని జిన్‌పింగ్ పేర్కొన్నారు. ప్రధాన దేశాలు అంతర్జాతీయ చట్టాలను గౌరవించాలని..లేకపోతే ప్రపంచం ఆటవిక రాజ్యంగా మారే ప్రమాదం ఉందని పరోక్షంగా అమెరికాను ఉద్దేశించి జిన్‌పింగ్ వ్యాఖ్యలు చేశారు. తాము ఇతర దేశాలకు హాని కలిగించబోమని ఈ సందర్భంగా చైనా అధ్యక్షుడు పేర్కొనడం గమనార్హం. దాదాపు 10 ఒప్పందాలపై ఇరు దేశాలు సంతకాలు చేశాయి. వీసా లేకుండా బ్రిటన్ పౌరులు చైనాలోకి ప్రవేశించేందుకు బీజింగ్ అంగీకరించిందని స్టార్మర్ తెలిపారు.

పారిశ్రామికాభివృద్ధికి కార్మిక సంఘాలే అవరోధం

- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్య

దిల్లీ: అసంఘటిత రంగంలోని ఇంటి పని వాళ్లకు చట్టపరమైన రక్షణలు కల్పించాలని, కనీస వేతనాల నిబంధనను అమలుచేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను తిరస్కరిస్తూ సుప్రీంకోర్టు గురువారం కీలక వ్యాఖ్యలు చేసింది. శాసనాలు చేయాల్సిందిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను తాము ఆదేశించలేమని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం పేర్కొంది. దేశంలో పారిశ్రామికాభివృద్ధి నిలిచిపోవడానికి కార్మిక సంఘాలే చాలా వరకు కారణమని ఆక్షేపించింది. కనీస వేతనాలు చెల్లించకపోవడాన్ని ప్రాథమిక హక్కుల ఉల్లంఘనగా పరిగణించాలన్న పిటిషనర్ల అభ్యర్థననూ ధర్మాసనం తోసిపుచ్చింది. అలా చేస్తే ప్రతి గృహ యజమానినీ కార్మిక సంఘాలు వివాదంలోకి లాగుతాయంది. సర్వీస్ ప్రొవైడర్ ఏజెన్సీలు ఇంటి పనివాళ్ల శ్రమను దోచుకుంటున్నాయని జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు.

గర్భిణిని డంబెల్‌తో కొట్టిచంపిన భర్త

దిల్లీ: దేశ రాజధాని నగర పోలీసు విభాగంలో స్వాట్ కమాండోగా పనిచేస్తున్న కాజల్ చౌదరీ (27) భర్త ఘాతుకానికి బలైంది. గర్భిణి అనే కనికరం కూడా లేకుండా అంకుర్ ఆమెను డంబెల్‌తో కొట్టి చంపాడు. ఏడాదిన్నర వయసు గల కుమారుడున్న వీరిద్దరూ కలిసి చదువుకొని ప్రేమవివాహం చేసుకోవడం గమనార్హం. రక్షణశాఖలో క్లర్కుగా పనిచేస్తున్న అంకుర్‌కు ఆర్థికపరమైన అంశాల్లో భార్యతో తరచూ గొడవలు జరిగేవి. ఈ నెల 22న అవి తీవ్రరూపం దాల్చడంతో విచక్షణ కోల్పోయిన అంకుర్ ఆమెపై దాడిచేసి, డంబెల్‌తో తలపై కొట్టాడు. తీవ్రంగా గాయపడిన కాజల్ గాజియాబాద్ ఆసుపత్రిలో అయిదు రోజులు మృత్యువుతో పోరాడి మంగళవారం మృతిచెందగా.. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. "కట్నకానుకలు ఇచ్చి పెళ్లి చేసినా వారు నా కుమార్తెను వేధించడం మానలేదు" అని మృతురాలి తండ్రి రాకేశ్ బావురుమన్నారు. తన సోదరిని భర్త, అతడి కుటుంబం అదనపు కట్నం కోసం వేధించేవారని కాజల్ సోదరుడు నిఖిల్ తెలిపారు. అంకుర్‌ను అరెస్టు చేసిన పోలీసులు హత్యకేసు నమోదు చేశారు.


హతురాలు కాజల్, నిందితుడు అంకుర్

ప్రపంచ ఆశాకిరణం భారత్

- ఈయూతో ఒప్పందం మహత్తరం
- మన తయారీదారులకు మరిన్ని అవకాశాలు : మోదీ

దిల్లీ: ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతున్న భారతదేశం ఇప్పుడు ప్రపంచానికి ఒక ఆశాకిరణంగా, ఆకర్షణ కేంద్రంగా మారుతోందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. మన ప్రజాస్వామ్యం, జనసంఖ్య పరంగా మనకున్న బలం ప్రపంచానికి గొప్ప ఆశాభావాన్ని కలిగిస్తోందని చెప్పారు. ఐరోపా సమాఖ్య (ఈయూ)తో ఇటీవల కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) బృహత్తరమైనదని, దేశంలోని తయారీదారులకు దీనిద్వారా మరిన్ని అవకాశాలు లభించనున్నాయని చెప్పారు. వీటిని వారు అందిపుచ్చుకుని సామర్థ్యాన్ని పెంచుకోవాలని అభిప్రాయపడ్డారు. బడ్జెట్ సమావేశాలను పురస్కరించుకుని ఆనవాయితీ ప్రకారం గురువారం పార్లమెంటు ప్రాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. "పారిశ్రామిక దిగ్గజాలు, తయారీదారులు ఎలాంటి ఉదాసీనతకు తావులేకుండా ఉత్పత్తుల నాణ్యతపై దృష్టి సారించాలి. ఈయూలోని 27 దేశాల్లో మనం అత్యుత్తమ నాణ్యతతో ఉత్పత్తుల్ని విక్రయించి లాభాలతోపాటు అక్కడివారి మనసుల్లో చోటు దక్కించుకునేందుకు అవకాశం ఉంది. అది దశాబ్దాలపాటు మన బంధాలపై సానుకూల ప్రభావం చూపిస్తుంది. దేశం పేరుతో పాటు ఉత్పత్తి పేరు గర్వకారణంగా నిలుస్తుంది. సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌పై మనదేశం వేగంగా దూసుకుపోతోంది. సంస్కరణల ఆవిష్కరణలో ఎంపీలు సానుకూలంగా తమ వంతు కృషి చేస్తున్నారు. వారికి నా కృతజ్ఞతలు.



రిఫార్మ్.. పెర్ఫార్మ్.. ట్రాన్స్‌ఫార్మ్

ప్రజల జీవితాల్లోకి వెళ్లాలన్నదే ప్రభుత్వ ఆలోచన. సంస్కరించడం (రిఫార్మ్), పనిచేయడం (పెర్ఫార్మ్), మార్పు తీసుకురావడం (ట్రాన్స్‌ఫార్మ్)లో ప్రభుత్వ అసలు గుర్తింపు ఉంది. దీర్ఘకాల సమస్యల్ని వదిలించుకుంటూ శాశ్వత పరిష్కారాల కోసం పనిచేస్తున్నాం" అని మోదీ పేర్కొన్నారు.

గొప్పలు ఆయనకు అలవాటే: కాంగ్రెస్

ప్రతిసారీ పార్లమెంటు సమావేశాల సమయంలో గొప్పలు చెప్పుకోవడం మోదీకి అలవాటేనని, తాజా మాటలూ దానిలో భాగమేనని కాంగ్రెస్ విమర్శించింది. జాతీయ అంశాల్లో విపక్ష అభిప్రాయాన్ని తెలుసుకునేందుకు ఆయన ఎన్నడూ అఖిలపక్ష సమావేశానికి అధ్యక్షత వహించరని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాంరమేశ్ వ్యాఖ్యానించారు.



ఖర్గే, రాహుల్‌తో శశిథరూర్ భేటీ

దిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌గాంధీలతో పార్టీ సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ గురువారం భేటీ అయ్యారు. థరూర్ తీరు, పార్టీ నాయకత్వంపై ఆయన చేస్తున్న వ్యాఖ్యలు కొంత వివాదాన్ని రేకెత్తిస్తుండటం, త్వరలో కేరళ శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. పార్లమెంటు భవనంలోని ఖర్గే ఛాంబర్లో గంటసేపు ఇది కొనసాగింది. "మా ఇద్దరు నేతలతో ఎంతో సానుకూలంగా, సంతృప్తికరంగా చర్చ జరిగింది. అంతా బాగుంది. మేమంతా ఒక్కటే. మా అభిప్రాయాలు ఒక్కటే. ఇంతకంటే ఏం చెప్పగలను?" అని థరూర్ విలేకరులతో అన్నారు. కేరళ సీఎం అభ్యర్థిగా ఎవరు ఉంటారనేది చర్చించారా అని ప్రశ్నించగా అది తనకెన్నడూ ఒక అంశమే కాదన్నారు.

చిరుతతో పోరాడి చంపిన రైతు

వేరావల్: గుజరాత్‌లోని గిర్ సోమనాథ్ జిల్లా గంగ్డా గ్రామంలో 60 ఏళ్ల రైతు కొడవలి, ఈటెలతో చిరుతను చంపాడు. ఈ పోరులో గాయపడిన రైతు బాబు వజా, అతడి కుమారుడు శార్దూల్‌లను ఉనా పట్టణ ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు గురువారం వెల్లడించారు. రైతుపై అటవీశాఖ అధికారులు కేసు నమోదు చేశారు. గ్రామ శివారులో ఉన్న తమ ఇంటి ఆవరణలో బుధవారం రాత్రి బాబు వజా విశ్రాంతి తీసుకొంటూ ఉండగా చిరుత దాడికి పాల్పడింది. తండ్రి కేకలు విని కుమారుడు శార్దూల్ పరుగున వచ్చాడు. తమ ఇద్దరిపై చిరుత పలుమార్లు దాడికి దిగడంతో వరండాలో ఉన్న కొడవలి, ఈటెతో కొట్టి చంపినట్లు బాబు వజా మీడియాకు వివరించారు.

కొలంబియాలో విమాన ప్రమాదం

- పార్లమెంటు సభ్యుడు సహా 15 మంది మృతి

బొగొటా: కొలంబియాలో జరిగిన విమాన ప్రమాదంలో ఒక పార్లమెంటు సభ్యుడు సహా 15 మంది మరణించారు. కుకుటా నుంచి ఒకానాకు వెళ్తున్న విమానం ఈశాన్య కొలంబియాలోని నోర్టే డి శాంటాండర్ ప్రావిన్స్‌లోని పర్వత ప్రాంతంలో కుప్పకూలింది. ప్రమాదానికి గురైన విమానం... ప్రభుత్వ విమానయాన సంస్థ శాటెనా ఎయిర్‌లైన్స్‌కు చెందిన బీచ్‌క్రాఫ్ట్ 1900 డీగా తెలుస్తోంది. హెచ్‌కే4709 నంబరుగల ఈ విమానం.. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 11:42 గంటలకు కుకుటా నుంచి 13 మంది ప్రయాణికులు, ఇద్దరు సిబ్బందితో బయల్దేరింది. చివరకు కొలంబియా, వెనెజువెలా సరిహద్దు సమీపంలోని పర్వత ప్రాంతంలో కూలిపోయినట్లు తేలింది. మృతి చెందిన వారిలో పార్లమెంటు సభ్యుడు డయోజెనెస్ క్వింటెరో (36) ఉన్నారు.


నోర్టే డి శాంటాండర్ ప్రావిన్స్‌లో కూలిన విమానం

అశ్రునయనాలతో అజిత్ పవార్ అంత్యక్రియలు

- హాజరైనవారిలో ఫడణవీస్, శరద్ పవార్, నారా లోకేశ్

బారామతి: విమాన ప్రమాదంలో దుర్మరణం చెందిన మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య గురువారం జరిగాయి. బారామతిలోని విద్యా ప్రతిష్ఠాన్ మైదానంలో ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కుటుంబసభ్యులు, కేంద్రమంత్రులు- అమిత్ షా, నితిన్ గడ్కరీ, మురళీధర్ మోహోల్, భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్, ఆ పార్టీ ఎంపీ సుప్రియా సూలే, ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే, ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్, తదితర రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. గురువారం ఉదయం అజిత్ పవార్ పార్థివదేహాన్ని బారామతిలోని అహల్యాదేవి ఆసుపత్రి నుంచి ఆయన స్వగ్రామం కాటేవాడికి, అక్కడి నుంచి జేడీ మాడ్గుల్కర్ ఆడిటోరియానికి తరలించారు. అక్కడి నుంచి విద్యా ప్రతిష్ఠాన్ మైదానం వరకు అంతిమయాత్ర సాగింది. అభిమాన నేత దాదాకు తుది వీడ్కోలు పలికేందుకు వేలమంది తరలిరావడంతో పరిసరాలు కిక్కిరిసిపోయాయి. ఈ ప్రమాదంలో మృతిచెందిన పైలట్ కెప్టెన్ సుమిత్ కపూర్‌కు, కోపైలట్ శాంభవి పాఠక్‌కు దిల్లీలో వేర్వేరుచోట్ల అంత్యక్రియలు పూర్తిచేశారు.


అజిత్ పవార్ అంత్యక్రియల్లో ఆయన కుమారులు పార్థ్ పవార్, జయ్ పవార్

ఫ్లైట్ అటెండెంట్ పింకీ మాలీకి ముంబయిలో, అజిత్ పవార్ వ్యక్తిగత భద్రతా అధికారి విదిప్ జాధవ్‌కు మహారాష్ట్రలోని సతారా జిల్లాలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

బ్లాక్‌బాక్స్ దొరికింది.. వేగంగా దర్యాప్తు చేస్తాం: కేంద్రం

దిల్లీ: బారామతిలో కూలిపోయిన విమానంలోని బ్లాక్‌బాక్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పౌర విమానయాన శాఖ వెల్లడించింది. దుర్ఘటనపై దర్యాప్తును వేగంగా ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా పౌర విమానయాన శాఖ గురువారం ఒక ట్వీట్ చేసింది. ఘోర విమాన ప్రమాదాన్ని చివరి క్షణంలో పైలట్లు గుర్తించారు. ప్రమాదాన్ని గమనించి విస్మయం చెందినట్లు పైలట్ మాటలు రికార్డ్ య్యాయని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) అధికారి వెల్లడించారు.



ఆరోగ్యంగా ఉండాలంటే ఇవి చేయకండి

- టీ/కాఫీలో పంచదార కలుపుకోవడం. ✦ సోడా, ఎనర్జీ డ్రింకులు, బీర్లు తాగడం.
- అతిగా శుద్ధిచేసిన పదార్థాలను తీసుకోవడం. ✦ రాత్రి 8 గంటల తర్వాత భోంచేయడం.
- రోజులో ఎక్కువ సేపు కూర్చొనే ఉండటం.

– కసెనెన్, వైద్య నిపుణులు

ఉగ్ర జాబితాలోకి ఇరాన్ రివల్యూషనరీ గార్డ్

- ఈయూ కీలక నిర్ణయం

బ్రసెల్స్: ఇరాన్‌పై దాడి చేస్తామని అమెరికా సంకేతాలు పంపుతున్న తరుణంలో ఐరోపా సమాఖ్య(ఈయూ) కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇరాన్ సైన్యంలో కీలక విభాగమైన ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ)ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. మరో 15 మంది ఉన్నతస్థాయి అధికారులపైనా ఆంక్షలు విధించింది. ఇరాన్ ప్రదర్శనకారులపై దమనకాండకు పాల్పడినందుకే వీరిపై చర్యలు తీసుకున్నట్లు ఈయూ విదేశాంగ విధాన అధిపతి కాజా కల్లాస్ తెలిపారు. ఆన్‌లైన్ ప్రసారాలను నియంత్రించే సంస్థతో పాటు ఆరు ఇరాన్ సంస్థలకూ ఈ ఆంక్షలు వర్తిస్తాయని చెప్పారు.

బలప్రయోగం వద్దు

మాస్కో: ఇరాన్, అమెరికాల మధ్య సంప్రదింపులకు ఇప్పటికీ అవకాశం ఉందని రష్యా గురువారం పేర్కొంది. ఇరాన్‌పై ఎలాంటి సైనిక చర్య తీసుకున్నా అది ఆ ప్రాంతంలో భద్రతను అస్థిరపరుస్తుందని స్పష్టం చేసింది. "ఈ వివాదంతో సంబంధం ఉన్నవారందరూ సమస్య పరిష్కారానికి బలప్రయోగం చేయకుండా సంయమనం పాటించాలని మేం కోరుతున్నాం" అని రష్యా అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ మాస్కోలో అన్నారు.

హుందాగా మెలగండి

- సభ్యులకు రాజ్యసభ ఛైర్మన్, లోక్‌సభ స్పీకర్ హితవు

దిల్లీ: పార్లమెంటులో సభ్యులు హుందాగా మెలగాలని, ఫలప్రదమైన చర్చల్లో పాలుపంచుకోవాలని సభాపతులు హితవు పలికారు. గురువారం ఉభయసభల్లోనూ వేర్వేరు సందర్భాల్లో వారు ఈ మేరకు స్పందించారు. 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్టుపై చర్చించేటప్పుడు, ఇతర కీలకమైన శాసనసంబంధ ప్రతిపాదనలపై అత్యున్నత పార్లమెంటరీ సంప్రదాయాలను, మర్యాదలను పాటించాలని రాజ్యసభ ఛైర్మన్ సి.పి.రాధాకృష్ణన్ పేర్కొన్నారు. "ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక రంగంగా భారత్ నిలుస్తోంది. త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కాబోతోంది. ప్రపంచ ఆర్థిక యవనికపై మన స్థాయి, మనం చూపబోయే ప్రభావం దృష్ట్యా, దేశానికి దిశానిర్దేశం చేయడంలో పార్లమెంటేరియన్లుగా మన పాత్ర మరింత కీలకం. 30 పనిదినాల్లో మనం బడ్జెట్ ప్రతిపాదనల్ని పరిశీలించాలి. రెండు విడతల మధ్య విరామంలో స్థాయీ సంఘాలు పద్దుల్ని క్షుణ్నంగా పరిశీలిస్తాయి. సభలో, కమిటీల్లో కూడా సభ్యులంతా ప్రభావవంతమైన కృషి సాగించాలి. ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజల ఆకాంక్షల్ని సాకారం చేయడానికి ప్రతి నిమిషాన్నీ సద్వినియోగం చేసుకోవాలి. మన ముందున్న శాసన సంబంధిత పని మన విహిత కర్తవ్యాన్ని నొక్కి చెబుతోంది. భిన్నాభిప్రాయాలు, స్ఫూర్తిదాయక చర్చల్లోనే మన ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. అభిప్రాయాలను గౌరవప్రదంగా వ్యక్తం చేయడం, నిర్మాణాత్మకంగా చర్చలు సాగించడం అవసరం. ప్రజాస్వామ్య విలువల్ని పెంచి, ప్రవర్తనలో క్రమశిక్షణ కనపరచాలి" అని రాధాకృష్ణన్ హితవు పలికారు. లోక్‌సభలో కొందరు సభ్యులు పరస్పరం మాట్లాడుకుంటుండటంపై స్పీకర్ ఓంబిర్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కువసేపు మాట్లాడుకోవాల్సి ఉంటే సభ నుంచి బయటకు వెళ్లాలని ఆదేశించారు. సభ్యులు ఎక్కువసేపు మాట్లాడుకుంటుండటం ఇతరులకు అంతరాయంగా ఉందని, అది సభ హుందాతనానికి తగదని స్పష్టం చేశారు. ఇక అంతరాయం కలిగిస్తున్నవారి పేర్లను తాను ప్రస్తావించాల్సి వస్తుందని హెచ్చరించారు.


లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా

ట్రాఫిక్ పోలీసును లాక్కెళ్లిన కారు

నొయిడా: ఉత్తర్‌ప్రదేశ్‌లోని గ్రేటర్ నొయిడాలో దూసుకుపోయిన ఓ కారు ట్రాఫిక్ పోలీసును బానెట్‌పై అర కిలోమీటరు దూరం అలాగే లాక్కొని పోయింది. డ్రైవరు ఉద్దేశపూర్వకంగా ఈ చర్యకు పాల్పడినట్లు అధికారులు గురువారం వెల్లడించారు. ఈ ఘటన బుధవారం మధ్యాహ్నం 2.30కు జరిగినట్లుగా సీసీటీవీలో రికార్డు అయింది. ట్రాఫిక్ విధుల్లో ఉన్న గుర్మీత్ చౌదరి ఓ ఎర్రటి కారును ఆపమని సంజ్ఞ చేశారు. డ్రైవరు ఆయనను ఢీకొని



మరీ కారును ముందుకు పోనిచ్చాడు. కొంత దూరం వెళ్లాక డ్రైవరు కారును వదిలి పారిపోయాడు. ఈ ఘటనలో గుర్మీత్ స్వల్పంగా గాయపడ్డారు. వాహనాన్ని సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు డీసీపీ సుధీర్ కుమార్ తెలిపారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

చాట్‌జీపీటీలో అమెరికా ప్రభుత్వ ఫైల్స్

- భారత సంతతి అధికారిపై ఆరోపణలు

ఇంటర్నెట్‌డెస్క్: అమెరికా ప్రభుత్వానికి చెందిన కీలకమైన ఫైల్స్ చాట్‌జీపీటీలోని పబ్లిక్ వెర్షన్‌లో అప్‌లోడ్ అవడం సంచలనం సృష్టిస్తోంది. దీనికి సంబంధించి భారత సంతతికి చెందిన యూఎస్ సైబర్ సెక్యూరిటీ తాత్కాలిక చీఫ్ మధు గొట్టుముక్కలపై ఆరోపణలు వస్తున్నాయి. పలువురు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంలాండ్ సెక్యూరిటీ (డీహెచ్‌ఎస్) అధికారుల వ్యాఖ్యలను ఉటంకిస్తూ 'ది పొలిటికో' వార్తా పత్రిక ఈ మేరకు కథనం ప్రచురించింది. దాని ప్రకారం.. సైబర్ సెక్యూరిటీ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెక్యూరిటీ ఏజెన్సీ (సీఐఎస్‌ఏ) తాత్కాలిక చీఫ్‌గా మధు గొట్టుముక్కల గతేడాది మే నెలలో బాధ్యతలు చేపట్టారు. ఆ వెంటనే ఏఐ చాట్‌బాట్ యాక్సెస్ కోసం ఆయన ఒత్తిడి చేశారని అధికారులు తెలిపారు. అయితే, హోంలాండ్ సెక్యూరిటీ వంటి విభాగాలకు చెందిన ఉద్యోగులకు దీని వాడకంపై నిషేధం ఉంది. అయినప్పటికీ ఆయన ఏఐ యాక్సెస్ తీసుకొని.. .సీఐఎస్‌ఏకు సంబంధించిన కాంట్రాక్టు ఫైళ్లను అందులో అప్‌లోడ్ చేశారని అధికారులు ఆరోపించారు. దీనిపై డీహెచ్‌ఎస్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఇది పూర్తయిందా...లేదా అన్న దానిపై స్పష్టత లేదు. చాట్‌జీపీటీలోని పబ్లిక్ వర్షన్‌లో అప్‌లోడ్ చేసిన సమాచారం మొత్తం.. ఓపెన్ ఏఐకు షేర్ అయి ఉంటుంది. ఈ వ్యవహారంపై యూజర్లు ఏదైనా ప్రశ్న అడిగితే.. చాట్‌జీపీటీ దానికి సంబంధించిన సమాచారాన్ని వారికి అందించే ప్రమాదముంది.


మధు గొట్టుముక్కల



బ్యాంకు ఖాతా వివరాలతో పేపరు ప్లేటు!

ఇంటర్నెట్‌డెస్క్: రోడ్డుపక్కన తినుబండారాలు అమ్మే పేపర్ ప్లేట్‌లో బ్యాంక్ ఖాతా వివరాలు కనిపించాయి. ఈ విషయాన్ని ఓ వ్యక్తి సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా పంచుకోవడంతో తీవ్ర చర్చకు దారి తీసింది. తమ వ్యక్తిగత డేటా గోప్యతపై నెటిజన్లు తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. 'భారతదేశంలో మీ డేటా గోప్యత మీ చేతుల్లో కూడా లేదు' అంటూ మోరోన్‌హ్యూమర్ అనే ఖాతా ఉన్న వ్యక్తి ఓ పోస్టు పెట్టాడు. బ్యాంక్ ఖాతా వివరాలు ఉన్న పత్రంతో తయారుచేసిన పేపర్ ప్లేట్ ఫొటోను పంచుకున్నారు. ఇందులో పేరు, ప్రాంతం, చెల్లింపు వంటి వివరాలు రాసి ఉన్నాయి.

థాయ్‌లాండ్‌లో విమానం కూలి ఇద్దరు పైలట్ల మృతి

బ్యాంకాక్: థాయ్‌లాండ్‌లో విమానం కూలడంతో వాయు సేనకు చెందిన ఇద్దరు పైలట్లు మరణించారు. ఏటీ6టీహెచ్ వోల్వరైన్ లైట్ అటాక్, నిఘా విమానం చియాంగ్ మయీ విమానాశ్రయానికి 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న చోంతోంగ్ జిల్లాలోని సైనిక శిక్షణ కేంద్రం వద్ద కూలిపోయిందని అధికారులు వెల్లడించారు.

ఆకాశం నుంచి కింద పడిన 'మలేసియా' టెలీమెట్రీ పరికరం

రాయ్‌సేన్: మధ్యప్రదేశ్‌లోని రాయ్‌సేన్ జిల్లా మార్థండీ గ్రామంలో ఓ టెలీమెట్రీ పరికరం బుధవారం సాయంత్రం ఆకాశం నుంచి కిందపడగా.. అది పేలుడు పదార్థం కావచ్చని తీవ్ర భయాందోళనలకు గురైన గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వాతావరణ తీవ్రతను కొలిచే ఆ పరికరంపై 'మలేసియా వాతావరణ శాఖ' అని ఉన్నట్లు పోలీసులు గురువారం వెల్లడించారు. అది టెలీమెట్రీ పరికరమని నిర్ధారించుకొని, సీజ్ చేసినట్లు డీఎస్పీ సోనాల్ గుప్తా తెలిపారు. బ్యాటరీతో పనిచేసే ఈ పరికరాన్ని సాధారణంగా బెలూన్ ద్వారా ఆకాశంలోకి వదులుతారు.

చండీగఢ్ మేయర్ స్థానం భాజపాదే

చండీగఢ్: చండీగఢ్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పదవి భాజపా కార్పొరేటర్ సౌరభ్ జోషిని వరించింది. గురువారం జరిగిన ఎన్నికల్లో భాజపా ఆయనకు 18 ఓట్లు, ఆప్‌నకు 11 ఓట్లు, కాంగ్రెస్‌కు 7 ఓట్లు పడ్డాయి. గతంలో ఇక్కడ రహస్య బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ జరగ్గా తాజా ఎన్నికల్లో కార్పొరేటర్లు చేతులెత్తి ఓటు వేశారు. ఆ తర్వాత ఎన్నికల అధికారి ముందు ఫలానా వారికి ఓటు వేశామని చెప్పారు. మేయర్ ఎన్నిక అనంతరం సీనియర్ డిప్యూటీ మేయర్, డిప్యూటీ మేయర్ పదవులకు ఎన్నికలు నిర్వహించగా వాటినీ భాజపానే గెలుచుకుంది.

ఉద్రిక్తతలు తీవ్రమవుతాయ్

తమ పార్టీని ఎన్నికల నుంచి బహిష్కరించడంపై హసీనా

ఢాకా: లక్షల మంది కార్యకర్తలను కలిగిన తమ పార్టీ అవామీ లీగ్‌ను ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక ఎన్నికల నుంచి బహిష్కరించడాన్ని బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, భారత్‌లో ఆశ్రయం పొందుతున్న షేక్ హసీనా తప్పుబట్టారు. మహమ్మద్ యూనస్ సారథ్యంలోని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే తమ పార్టీని ఎన్నికల్లో పాల్గొనకుండా చేసిందని ఆరోపించారు. అన్ని పార్టీలకూ పోటీ చేసే అవకాశం ఇవ్వకుండా నిరంకుశంగా నిర్వహించే ఎన్నికల వల్ల బంగ్లాదేశ్ దీర్ఘకాలం పాటు అస్థిరతను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇలాంటి చర్యల వల్ల బంగ్లాదేశ్‌లో ప్రజాగ్రహం పెరుగుతుందని పేర్కొన్నారు. తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తుతాయని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంస్థలు, వ్యవస్థలే చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తే దేశంలో అస్థిర పరిస్థితులు ఏర్పడతాయని తెలిపారు. అసంపూర్ణ ప్రజా మద్దతుతో, అక్రమంగా బంగ్లాదేశ్‌లో ఏర్పడబోయే ప్రభుత్వం దేశంలోని అన్ని వర్గాల ప్రజలను ఏకం చేయలేదని హసీనా అభిప్రాయపడ్డారు. ఓ అంతర్జాతీయ వార్తాసంస్థ అడిగిన ప్రశ్నలకు ఆమె ఈమెయిల్ ద్వారా బదులిచ్చారు.



ఇమ్రాన్ ఖాన్‌కు గత వారమే చికిత్స చేయించాం: పాక్

ఇస్లామాబాద్: పాకిస్థాన్ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ (పీటీఐ) వ్యవస్థాపకుడు, మాజీ ప్రధాన మంత్రి ఇమ్రాన్ ఖాన్‌కు గత వారమే ఆసుపత్రిలో చికిత్స చేయించినట్లు ఆ దేశ సమాచారశాఖ మంత్రి అతావుల్లా తరార్ వెల్లడించారు. 'ఇమ్రాన్ ఖాన్ కంటి సమస్యతో బాధపడుతున్నట్లు తెలియగానే జైలుకు వైద్యుడిని పిలిపించి చూపించాం. ఆయన సూచన మేరకు అత్యంత భద్రత నడుమ పాకిస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు (పిమ్స్) తరలించాం. అక్కడ ఆయన కంటికి వైద్యులు చికిత్స చేశారు. అది పూర్తి కాగానే మళ్లీ జైలుకు తీసుకెళ్లాం. చిన్న కంటి సమస్య మినహా ఆయన పూర్తి ఆరోగ్యంతోనే ఉన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేవు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ప్రచారంలో వాస్తవం లేదు' అని గురువారం మంత్రి పేర్కొన్నారు. జైలులో ఉన్న తమ నేత ఇమ్రాన్ ఖాన్ తీవ్రమైన కంటి సమస్యతో బాధపడుతున్నారని, వెంటనే ఆయనకు చికిత్స అందించకపోతే శాశ్వతంగా కంటి చూపును కోల్పోయే ప్రమాదం ఉందని పీటీఐ నేతలు మంగళవారం ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రి నుంచి వివరణ వచ్చింది. అవినీతి కేసులో దోషిగా తేలడంతోపాటు ఇతర కేసుల్లో నిందితుడిగా ఉన్న 73 ఏళ్ల ఇమ్రాన్ ఖాన్ 2023 ఆగస్టు నుంచి రావల్పిండిలోని అడియాలా జైలులో ఉంటున్నారు.

చైనాలో 11 మంది

నేరగాళ్లకు మరణశిక్ష అమలు

బ్యాంకాక్: ఆన్‌లైన్ మోసాలతోపాటు పలు కేసుల్లో నిందితులుగా ఉన్న ఓ కుటుంబం సహా పలువురిపై చైనా తీవ్ర చర్యలు తీసుకుంది. మయన్మార్‌కు చెందిన 11 మంది సభ్యుల నేరముఠాకు మరణశిక్ష అమలు చేసింది. రూ.వేల కోట్ల కుంభకోణాలు, జూద కార్యకలాపాలకు పాల్పడుతున్న ఈ మాఫియా.. వారివద్ద పని చేస్తూ తప్పించుకునేందుకు ప్రయత్నించిన 14 మంది చైనీయుల ప్రాణాలు తీసిందనే ఆరోపణలు ఉన్నాయి. ఉత్తర మయన్మార్‌లో ఇంటర్నెట్ స్కాములు, వ్యభిచారం, మాదకద్రవ్యాల రవాణాలో కొన్ని కుటుంబాలు ఆరితేరాయి. ఇందులో 'మింగ్ ఫ్యామిలీ' సహా నాలుగు కుటుంబాలపై తీవ్ర ఆరోపణలున్నాయి. స్థానిక ప్రభుత్వంలోనూ ఈ కుటుంబాలు క్రియాశీల పాత్ర పోషిస్తున్నాయి. కొన్నేళ్లుగా వీరి ఆగడాలపై అనేక ఫిర్యాదులు రావడంతో రంగంలోకి దిగిన చైనా అధికారులు.. మయన్మార్‌పై ఒత్తిడి తీసుకువచ్చారు. మోసపూరిత, జూద కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలపై 2023 నవంబరులో పలు కుటుంబాలను అదుపులోకి తీసుకున్నారు. ఇందులో మింగ్ కుటుంబ పెద్ద.. మింగ్ జుచాంగ్ కస్టడీలోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆ తర్వాత ఈ వ్యవహారంపై విచారించిన వెంఝౌ సిటీ న్యాయస్థానం.. గతేడాది సెప్టెంబరులో 11 మందిని దోషులుగా తేల్చి, వారందరికీ మరణశిక్ష విధించింది. కుటుంబ సభ్యుల అప్పీలును న్యాయస్థానం ఇటీవల తిరస్కరించడంతో గురువారం ఉదయం మరణశిక్ష అమలు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.


హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి జిల్లాలో గల పరాశర్ కొలను, దాని చుట్టుపక్కల ప్రాంతం గురువారం మంచుతో పేరుకుని శ్వేతవర్ణంలో మనోహరంగా కనిపించింది

ఉక్రెయిన్‌పై దాడులను వారం రోజులు ఆపండి

పుతిన్‌కు ట్రంప్ పిలుపు

కీవ్: అతి శీతల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఉక్రెయిన్ రాజధాని కీవ్, ఇతర నగరాలపైన ఒక వారం రోజుల పాటు దాడులకు పాల్పడవద్దని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్‌ను కోరారు. రష్యా ఉక్రెయిన్ నగరాల్లోని కీలక మౌలిక సదుపాయాలపై దాడిచేస్తూ విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగించి ప్రజాజీవనాన్ని దుర్భరం చేస్తున్న దరిమిలా ట్రంప్ ఈ మేరకు పిలుపునిచ్చారు. తన ప్రతిపాదనకు పుతిన్ అంగీకరించారని శ్వేతసౌధంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ట్రంప్ ప్రకటించారు. అయితే రష్యా ఈ విషయాన్ని ధ్రువీకరించలేదు. మరోవైపు ఉక్రెయిన్‌లోని జపోరిజియా ప్రాంతంపై రష్యా జరిపిన దాడిలో ముగ్గురు సాధారణ పౌరులు మరణించారని అధికారులు తెలిపారు. ఈ దాడిలో ఒక భవనం పూర్తిగా అగ్నికి ఆహుతైందని ఎమర్జెన్సీ సర్వీసుల అధికారులు వెల్లడించారు.

చుక్‌చుక్ బండికి దక్కేదెంత?



- భారీగా విస్తరణ ప్రణాళికలు
- మూలధన కేటాయింపులు పెరగడం లాంఛనమే!
- సెమీ హైస్పీడ్ నెట్‌వర్క్ పెంపునకు ప్రాధాన్యం లభించే అవకాశం

దేశ ఆర్థిక వ్యవస్థకు జీవరేఖ- రైల్వే! ప్రజా రవాణా, పరిశ్రమల అనుసంధానం, ఉపాధి కల్పన, ఆహార భద్రతల్లో దానిది విశిష్ట పాత్ర. కొన్నేళ్లుగా రైల్వే ఆధునికీకరణకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగానే నిరుటి బడ్జెట్‌లో ప్రయాణికుల భద్రత, విద్యుదీకరణతో పాటు వందే భారత్, అమృత్ భారత్, నమోభారత్ వంటి కొత్త సర్వీసులకు ప్రాధాన్యమిచ్చింది. మరి ఈసారి పద్దులో రైల్వేకు రాబోయే నిధులెన్ని.. ఏయే ప్రాజెక్టులకు అగ్రతాంబూలం దక్కబోతోంది.. అనే అంశాలపై ప్రస్తుతం సర్వత్రా ఆసక్తి నెలకొంది.

వరుసగా రెండేళ్లూ..

2024-25 బడ్జెట్‌లో రైల్వేకు కేంద్రం రూ.2.65 లక్షల కోట్లు కేటాయించింది. 2025-26లోనూ అంతే మొత్తంతో సరిపెట్టింది. 2024-25తో పోలిస్తే మరుసటి ఏడాది ప్రయాణికుల సదుపాయాలపై వ్యయానికి కేటాయింపులను కుదించింది. ప్రభుత్వరంగ యూనిట్లలో, జాయింట్ వెంచర్లలో పెట్టుబడులను తగ్గించింది. నిరుటి బడ్జెట్‌లో కేటాయించిన మూలధన వ్యయంలో 80.54% నిధులను 2025 చివరి నాటికి రైల్వే వినియోగించుకుంది.

2.3 కోట్లు – 2.5 కోట్లు సగటున రోజూ భారతీయ రైళ్లలో ప్రయాణించేవారి సంఖ్య

2027కల్లా 50 వందేభారత్ స్లీపర్ రైళ్లు

సరకు, ప్రయాణికుల రవాణాలో పెరుగుతున్న అవసరాలను దృష్టిలో పెట్టుకొని రైల్వే భారీగా విస్తరణ ప్రణాళికలు రూపొందించుకుంటోంది. ట్రాక్‌ల డబ్లింగ్‌ను ముమ్మరం చేస్తోంది. రాబోయే కొన్నేళ్లలో 1,000 రోడ్ ఓవర్ బ్రిడ్జిలు (ఆర్‌వోబీ), రోడ్ అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ)లను నిర్మించేందుకు సన్నాహాలు చేస్తోంది.

4 ప్రపంచంలో నాలుగో అతిపెద్ద రైల్వే నెట్‌వర్క్‌ను కలిగి ఉన్న దేశం మనది. అమెరికా, చైనా, రష్యా మన కంటే ముందు స్థానాల్లో ఉన్నాయి.

- 2027 కల్లా మొత్తం 50 వందేభారత్ స్లీపర్ రైళ్లను ప్రవేశపెట్టాలనుకుంటోంది.
- తక్కువ దూరం ఉన్న ఇంటర్‌సిటీ మార్గాల్లో 50 నమోభారత్ రైళ్లను, 100 నాన్ ఏసీ అమృత్ భారత్ రైళ్లను ప్రారంభించాలని భావిస్తోంది.
- సెమీ హైస్పీడ్ నెట్‌వర్క్ విస్తరణలో భాగంగా మరో 200 వందేభారత్ రైళ్లను ప్రవేశపెట్టే ప్రణాళికలను ఇప్పటికే ప్రకటించింది.
- రద్దీ సమస్య పరిష్కారం కోసం.. 17,500 నాన్ ఏసీ జనరల్ బోగీలను రైల్వే తయారుచేయనుంది.

వేటికి ప్రాధాన్యం దక్కొచ్చంటే..

2025-26తో పోలిస్తే ఈసారి బడ్జెట్‌లో రైల్వేకు కేటాయింపులు 5% మేర పెరగొచ్చని అంచనా. విద్యుదీకరణ పనులు పూర్తికావస్తుండటంతో.. రద్దీ ఎక్కువున్న మార్గాల్లో కొత్త లైన్ల నిర్మాణం, గేజ్ మార్పిడి, ట్రాక్‌ల డబ్లింగ్, ఓడరేవులు-మినరల్ క్లస్టర్లతో అనుసంధానమై ఉన్న రవాణా-ఆర్థిక నడవాల విస్తరణ వంటి పనులకు మూలధన కేటాయింపులను పెంచే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

- ట్రాక్‌ల విస్తరణ, సిగ్నలింగ్ వ్యవస్థల ఉన్నతీకరణ, స్టేషన్ల అభివృద్ధి, రవాణా సామర్థ్యాల పెంపు, కొత్త సాంకేతికతలను అందిపుచ్చుకోవడం వంటి అంశాలకు ప్రాధాన్యం పెరగొచ్చు.
- కొత్త ప్రాజెక్టుల ప్రకటన కంటే.. ఇప్పటికే ప్రకటించిన ప్రాజెక్టుల పనులను పూర్తిచేయడం, ఆయా సేవలను అందుబాటులోకి తీసుకురావడంపైనే ఎక్కువగా మొగ్గుచూపొచ్చు.
- గంటకు 160 కిలోమీటర్లు, అంతకంటే ఎక్కువ వేగంతో రైళ్లు దూసుకెళ్లేందుకు వీలుగా సెమీ హైస్పీడ్ నడవాల విస్తరణపై దృష్టిపెట్టొచ్చు.
- అత్యాధునిక రైలు భద్రతా వ్యవస్థలు, మెకనైజ్డ్ మెయింటెనెన్స్, ఏఐ ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థలకు నిధులు ఎక్కువగా కేటాయించొచ్చు. కవచ్ ఆటోమేటిక్ ట్రెయిన్ ప్రొటెక్షన్ సిస్టమ్ అత్యాధునిక వెర్షన్లపై వ్యయం పెంచొచ్చు.
- వ్యాపార ప్రకటనలు, భూమి లీజు వంటి మార్గాల్లో ఆదాయం పెంపుపై దృష్టిపెట్టే అవకాశాలున్నాయి.
- రవాణా నడవాలు, ప్యాసింజర్-రవాణా టెర్మినళ్లు, లాజిస్టిక్స్ మౌలిక వసతుల వంటి అంశాల్లో రూ.25 వేల కోట్ల వరకూ ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నాలను ముమ్మరం చేయొచ్చు.

– ఈనాడు ప్రత్యేక విభాగం

కాకర ఏనుగు.. పువ్వుల నెమలి!







'విశాఖ ఉత్సవ్'లో భాగంగా నగరంలోని సిటీసెంట్రల్ పార్కులో గురువారం ప్రారంభించిన ఫల, పుష్ప ప్రదర్శన సందర్శకులను అలరిస్తోంది. వివిధ రకాల పుష్పాలు, పండ్లు, కూరగాయలతో రూపొందించిన ఆకృతులు మైమరిపించేలా ఉన్నాయి. ద్రాక్షలతో తయారుచేసిన సింహాద్రి అప్పన్న రూపం మరో ప్రధాన ఆకర్షణ. స్వాగత ద్వారం నుంచి పార్కు లోపల పలు ప్రాంతాలను ప్రత్యేకంగా ముస్తాబు చేయడంతో పూల ప్రపంచాన్ని తలపిస్తోంది. – ఈనాడు, విశాఖపట్నం

అట్టహాసంగా 'అరకు ఉత్సవ్' ప్రారంభం

హాజరైన మంత్రులు దుర్గేష్, సంధ్యారాణి



ఉడుం, డోలు కొట్టి ఉత్సవాలను ప్రారంభిస్తున్న మంత్రులు

ఈనాడు డిజిటల్, పాడేరు- అరకులోయ, న్యూస్‌టుడే: 'ఊర్పూరి రాన్ని పర్యాటక గమ్యంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యం. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో నిర్వహిస్తున్న పర్యాటక ఉత్సవాలు రానున్నరోజుల్లో ఆసియాలోనే అతిపెద్ద పండుగగా తీర్చిదిద్దుతాం' అని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో గురువారం 'అరకు ఉత్సవ్-2026'ను గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణితో కలిసి ఆయన ప్రారంభించారు. విశాఖ ఉత్సవ్‌లో భాగంగా అరకు, అనకాపల్లి ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. లంబసింగిలో రూ.6.5 కోట్లతో రాష్ట్రంలోనే తొలిసారి టెంట్ సిటీ, రూ.1.23 కోట్లతో కారవాన్ పార్కులు, హోంస్టేలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. 'గతంలో పర్యాటకులకు అవసరమైన హోటళ్లు, రెస్టారెంట్లు పరిమితంగా ఉండేవి. కూటమి ప్రభుత్వం పర్యాటకానికి పారిశ్రామిక హోదా కల్పించింది. అందుకే అతిథ్య రంగం పర్యాటకులకు సరికొత్త గమ్యంగా మారుతోంది' అని పేర్కొన్నారు.



ఉత్సవాల్లో అమ్మవారి వేషధారణ

ఉత్సవాల పేరిట ప్రభుత్వం రూ.కోట్లు వృథాచేస్తోందని వైకాపా నేతలు ఆరోపిస్తున్నారు. వైకాపా హయాంలో గంజాయిని పెంచితే, కూటమి ప్రభుత్వం ముమ్మరంగా అరకు కాఫీని పండిస్తోంది' అని మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. కార్యక్రమంలో పర్యాటకశాఖ ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, ఏపీటీడీసీ ఛైర్మన్ బాలాజీ, ట్రైకార్ ఛైర్మన్ శ్రావణ్‌కుమార్, కొట్ని బాలాజీ, దొన్నుదొర పాల్గొన్నారు.

నెయ్యి కల్తీ జరిగింది.. కానీ జంతు కొవ్వు కలవలేదు

సిట్ ఛార్జిషీట్ అదే చెప్పింది: వైవీ సుబ్బారెడ్డి

ఈనాడు, దిల్లీ: తిరుమల లడ్డూ ప్రసాదం కోసం సరఫరా చేసిన నెయ్యిలో కల్తీ జరిగింది... అయితే అందులో జంతు కొవ్వు లేదని సిట్ ఛార్జిషీట్ చెప్పిందని తితిదే మాజీ ఛైర్మన్, వైకాపా ఎంపీ వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం దిల్లీలో విలేకర్లతో మాట్లాడుతూ దీనిపై స్పందించారు. 'వైకాపా హయాంలో స్వామివారికి సమర్పించిన ప్రసాదంలో నెయ్యికి బదులు జంతుకొవ్వు వాడారని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించడంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తుల మనోభావాలు దెబ్బతినే పరిస్థితి వచ్చింది. అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వ దర్యాప్తుపై నమ్మకం లేక.. స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని సుప్రీంకోర్టును ఆశ్రయించాను. సుప్రీంకోర్టు రెండు అంశాలపై సిట్ ఏర్పాటు చేసింది. 2024 జులైలో సరఫరా చేసిన నెయ్యిలో జంతుకొవ్వు ఉందా? లేదంటే కల్తీ అయ్యిందా? జంతుకొవ్వు కలిసి ఉంటే ఆ నెయ్యిని స్వామివారి ప్రసాదం తయారీలో వాడారా లేదా అనే విషయాలను నిర్ధారించాలని ఆదేశించింది. అయితే సిట్ ఛార్జిషీట్‌లో నెయ్యి కల్తీ జరిగింది.. కానీ దాంట్లో జంతుకొవ్వు లేదని చాలా స్పష్టంగా చెప్పింది. జంతుకొవ్వు కలిసిన నెయ్యిని వైకాపా హయాంలో సరఫరా చేశారని 2024 జులైలో వచ్చిన నెయ్యి నమూనాల్లో తేలిందన్న ముఖ్యమంత్రి, ప్రభుత్వం దీనికేం సమాధానం చెబుతారు? నేను, జగన్‌మోహన్‌రెడ్డి అవినీతికి పాల్పడి ఇన్ని కోట్ల లడ్డూల తయారీకి ఇన్ని లక్షల కేజీల కల్తీ నెయ్యి కొన్నామని దుష్ప్రచారం చేస్తున్నారు. దీనిపైనా మరోసారి కోర్టును ఆశ్రయించే ప్రయత్నం చేస్తా' అని సుబ్బారెడ్డి పేర్కొన్నారు. దీనిపై క్షమాపణలు కోరతారా అని విలేకర్లు ప్రశ్నించగా.. అది వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని చెప్పారు.

ప్రముఖ రచయిత చందు సుబ్బారావు కన్నుమూత



విశాఖపట్నం (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: ప్రముఖ రచయిత, విశ్లేషకుడు, ఆచార్య చందు సుబ్బారావు (80) అనారోగ్యంతో గురువారం విశాఖలో మృతి చెందారు. ఆయనను నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో కన్నుమూసినట్లు కుటుంబీకులు వెల్లడించారు. ఆయనకు భార్య నిర్మలాదేవి, కుమారుడు దిలీప్, కుమార్తె కవిత ఉన్నారు. శనివారం ఉదయం పది గంటలకు ఎంవీపీకాలనీలోని శ్మశానవాటికలో సుబ్బారావు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు పేర్కొన్నారు. చందు సుబ్బారావు ఉమ్మడి గుంటూరు జిల్లా తెనాలిలో 1946 మే 18న జన్మించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి సైన్స్ అండ్ టెక్నాలజీలో మాస్టర్స్ డిగ్రీ చేశారు. 1974లో ఇదే వర్సిటీలో భూ భౌతికశాస్త్ర అధ్యాపకుడిగా చేరారు. అనంతరం రీడర్‌గా, ఆచార్యునిగా బాధ్యతలు నిర్వర్తించారు. మార్క్సిస్టు రచయితగా, అభ్యుదయ రచయితల సంఘం (అరసం) అధ్యక్షుడిగా వ్యవహరించిన సుబ్బారావు స్త్రీవాద, రాజకీయ, శాస్త్రీయ అంశాలపై అనేక వ్యాసాలు, పుస్తకాలు రచించారు. ఇటీవల నాలుగు విమర్శక గ్రంథాలను ఒకే పుస్తకంగా వెలువరించారు. 1966లో తాపీ ధర్మారావు అవార్డు, 1999లో కొండేపూడి సాహితీ సత్కారం అందుకున్నారు. అధికార భాషా సంఘం సభ్యునిగా పనిచేశారు. చందు సుబ్బారావు మృతిపట్ల అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, వల్లూరు శివప్రసాద్, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షులు టి.మనోహర్‌నాయుడు సంతాపం ప్రకటించారు.

ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టుల మృతి

చర్ల, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దులో.. బీజాపుర్ జిల్లా పామేడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కవురుగట్ట-గుండ్రాజుగూడెం అడవుల్లో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. ఘటనాస్థలిలో ఏకే-47, 9ఎంఎం పిస్టల్‌లను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.



పుస్తకం చదవడానికీ ఓ పద్ధతుంది

పుస్తకం చదివేటప్పుడు దాన్ని త్వరగా పూర్తిచేయడం ఒక్కటే మీ లక్ష్యం కారాదు. అందులో ముఖ్యమైన అంశాల ప్రస్తావన వచ్చినప్పుడు వాటిని హైలైట్ చేసుకోవాలి. బాగా గుర్తుంచుకోవాల్సిన వివరాలకు సంబంధించి ప్రత్యేకంగా నోట్స్ సిద్ధం చేసుకోవాలి. ఆ పుస్తకం నుంచి నేర్చుకున్న పాఠాలను జీవితంలో ఆచరించడానికి కృషి చేయాలి. దాని సారాంశాన్ని ఇతరులకు బోధించాలి. నేర్చుకోవడంలో అత్యుత్తమ దశ అదే.

– జున్వాన్ చిన్, కంటెంట్ క్రియేటర్

తిరుమలలో వైకాపా నేతల అరాచకాలు ప్రజలకు చెబుదాం

- ఎమ్మెల్యే శ్రీధర్‌పై విచారణ కమిటీ వేయడం పార్టీ నిబద్ధతకు నిదర్శనం
- జనసేన శాసనసభాపక్ష భేటీలో చర్చ

ఈనాడు, అమరావతి: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయంలో వైకాపా ప్రభుత్వ హయాంలో సాగించిన అరాచకాలు, కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారాలపై ప్రజలకు పూర్తి సమాచారం తెలియజేయాలని జనసేన శాసనసభా పక్షం నిర్ణయించింది. అసలు నెయ్యే లేకుండా రసాయనాలతో తయారు చేసింది నెయ్యిగా సరఫరా చేయడం దుర్మార్గమని, ఇది భక్తుల మనోభావాలను దెబ్బతీయడంతో పాటు వారి ఆరోగ్యాలతో చెలగాటమాడటమేనని అభిప్రాయపడింది. విశాఖలో ఉన్న పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గురువారం మధ్యాహ్నం అక్కడి నుంచే వర్చువల్ విధానంలో పార్టీ శాసనసభాపక్ష సమావేశం నిర్వహించారు. వచ్చే నెలలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో.. అనుసరించాల్సిన విధివిధానాలపై చర్చించారు. రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా చర్చల్లో పాల్గొనాలని మంత్రి నాదెండ్ల మనోహర్ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు సూచించారు. తిరుపతి లడ్డూ ప్రసాదం కల్తీ అంశంపై సభలో చర్చించాలని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు. లడ్డూ కల్తీపై సామాజిక మాధ్యమాల్లో, ప్రధాన మీడియాలోనూ ప్రజలకు అర్థమయ్యేలా లోతుగా వివరిద్దామని ఎమ్మెల్సీ నాగబాబు సూచించారు. తప్పు చేసిన వాళ్లే ఎదురుదాడి చేయడాన్ని నివారిద్దామని పేర్కొన్నారు. ప్రశ్నోత్తరాలు, జీరో అవర్, ఇతర చర్చల్లో పార్టీ సభ్యులంతా పాల్గొనేలా ప్రణాళిక రూపొందించాలని రాజోలు ఎమ్మెల్యే వరప్రసాద్ సూచించారు.

కమిటీ నివేదికపై అధినేత నిర్ణయమే ఫైనల్

రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై వచ్చిన ఆరోపణలకు సంబంధించి పార్టీ తరఫున త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసి, నిజానిజాలు విచారించాలని ఆదేశాలివ్వడం ద్వారా పార్టీ ఎంత నిబద్ధతతో ఉందో అధినేత పవన్ కల్యాణ్ తెలియజేశారని శాసనసభా పక్షం అభిప్రాయపడింది. శ్రీధర్ సత్వరమే కమిటీ ముందుకు వచ్చి ఆరోపణలకు వివరణ ఇవ్వాలని శాసనసభ్యులు సూచించారు. కమిటీ నివేదిక ఆధారంగా అధినేత తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటామని చెప్పారు. పవన్ కల్యాణ్ రాష్ట్రం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తుంటే వైకాపా వాళ్లు ఓర్వలేక జనసేనను లక్ష్యంగా చేసుకుని ఆరోపణలు చేస్తున్నారని, వాటిని వ్యూహాత్మకంగా తిప్పికొట్టాలని నిర్ణయించారు. శాసనసభ సమావేశాలకు ముందు మరోసారి భేటీ కావాలని నిర్ణయించినట్లు రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్, శాసనమండలి, శాసనసభలో విప్‌లు పిడుగు హరిప్రసాద్, బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణకు ముందుకు రావాలి

- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపు
- విశాఖ జూ సందర్శన



నగరవనం ప్రారంభోత్సవంలో పవన్ కల్యాణ్, అధికారులు

ఈనాడు, విశాఖపట్నం: వన్యప్రాణుల సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. పర్యావరణ సమతౌల్యతను కాపాడడంలో వన్యప్రాణులు చాలా కీలకమని, వాటిని దత్తత తీసుకునేందుకు కార్పొరేట్ సంస్థలు ముందుకు రావాలని, జంతు ప్రదర్శన శాలల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. గురువారం విశాఖ జంతు ప్రదర్శన శాలను సందర్శించిన పవన్ కల్యాణ్. తన తల్లి అంజనాదేవి జన్మదినం సందర్భంగా రెండు జిరాఫీలను ఏడాది కాలానికి దత్తత తీసుకున్నారు. జూలో ఏర్పాట్ల గురించి తెలుసుకొని, అభివృద్ధికి ఉన్న అవకాశాలపై అధికారులతో చర్చించారు. అనంతరం మాట్లాడుతూ.. 'మా కుటుంబంలో అంతా జంతు ప్రేమికులే' అని పవన్ కల్యాణ్ తెలిపారు.

నగరవనం ప్రారంభం

- జూలోని సీతాకోకచిలుకల పార్కును పవన్ కల్యాణ్ సందర్శించారు. కొన్ని సీతాకోకచిలుకలను కొత్త పార్కులోకి వదిలారు. నీటి ఏనుగుల సంరక్షణ గురించి తెలుసుకున్నారు.
- ఎలుగుబంటి ఎన్‌క్లోజర్‌ను ప్రారంభించారు. జింకల పార్క్, సింహాలు, పులులు, మకావ్ చిలుకలను తిలకించారు. ఏనుగులకు, జిరాఫీలకు ఆహారం పెట్టారు.
- అనంతరం కంబాలకొండను సందర్శించి, కొత్తగా 50 ఎకరాల్లో అభివృద్ధి చేసిన నగరవనాన్ని ప్రారంభించారు. ఆయనతో పాటు పీసీసీఎఫ్ పీవీ చలపతిరావు, ఏపీ సీసీఎఫ్ శాంతిప్రియా పాండే, అటవీ అభివృద్ధి సంస్థ ప్రాంతీయ మేనేజర్ జ్యోతి, జిల్లా అటవీశాఖాధికారి రవీంద్ర పాల్గొన్నారు.

పరకామణి కేసులో ఎలా రాజీచేశారు?

- కౌంటర్ వేయాలని తితిదే ఈవోకు హైకోర్టు ధర్మాసనం ఆదేశం
- విచారణ ఫిబ్రవరి 5కి వాయిదా

ఈనాడు, అమరావతి: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయ పరకామణిలో కానుకల చోరీ కేసును రాజీ చేసుకోవడానికి అనుసరించిన విధానం ఏమిటి? రాజీ చేసుకోవడానికి అథార్టీ ఎవరు? తితిదే నిబంధనలు ఏం చెబుతున్నాయి? తదితర వివరాలతో కౌంటర్ వేయాలని తితిదే ఈవోను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. ఇదే కేసులో సింగిల్ జడ్జి వద్ద విచారణ పెండింగ్‌లో ఉన్న వ్యాజ్యాన్ని తమ ముందు ఉంచాలని రిజిస్ట్రీకి సూచించింది. విచారణను ఫిబ్రవరి 5కు వాయిదా వేసింది. హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ ఆర్.రఘునందన్‌రావుతో కూడిన ధర్మాసనం గురువారం ఈ ఉత్తర్వులిచ్చింది. వైకాపా ప్రభుత్వ హయాంలో పరకామణిలో జరిగిన చోరీ కేసును ఫిర్యాదుదారు సతీష్‌కుమార్, నిందితుడు సీవీ రవికుమార్ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవడంపై సీఐడీతో దర్యాప్తు చేయించాలంటూ దాఖలైన వ్యాజ్యంపై ఇప్పటికే హైకోర్టు సింగిల్ జడ్జి విచారణ చేపట్టారు. కేసు రాజీలో తితిదే పాలకమండలి, బోర్డు అధికారులు, దర్యాప్తు అధికారి, ఫిర్యాదుదారుల పాత్రలపై దర్యాప్తు చేయాలని సీఐడీ డీజీని ఆదేశించారు. నిందితుడు రవికుమార్, అతని కుటుంబ సభ్యుల స్థిర, చరాస్తులతో పాటు బ్యాంక్ ఖాతాలపై దర్యాప్తు చేయాలని ఏసీబీ డీజీకి ఆదేశాలిచ్చారు. లోక్ అదాలత్ ఉత్తర్వుల చట్టబద్ధతను తేల్చే వ్యవహారాన్ని ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనానికి నివేదించారు. అయితే, సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాలు చేస్తూ నిందితుడు రవికుమార్ వేసిన అప్పీల్‌తో పాటు లోక్ అదాలత్ ఉత్తర్వుల చట్టబద్ధతను తేల్చేందుకు నమోదు చేసిన వ్యాజ్యంపై గురువారం సీజే నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. రవికుమార్ తరఫున సీనియర్ న్యాయవాది నాగేశ్వరరావు వాదించారు.

దొంగ డెయిరీల మోసాన్ని మాపై నెట్టాలనుకున్నారు

తితిదే మాజీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి (జీవకోన), న్యూస్‌టుడే: 'మాజీ సీఎం జగన్‌ను దెబ్బతీయడానికి సీఎం చంద్రబాబు శ్రీమహావిష్ణువును వాడుకున్నారు. లడ్డూలో అసలు నెయ్యే వాడలేదు.. జంతువుల కొవ్వు వాడారని చంద్రబాబు ఆరోపించారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ తమ మాటలతో హిందువుల మనోభావాలను దెబ్బతీశారు' అని తితిదే మాజీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆరోపించారు. తిరుపతి వైకాపా కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. సరైన తనిఖీ, నాణ్యత నిర్ణయ వ్యవస్థలు లేకపోవడంతో కొందరు అధికారులు, దొంగ డెయిరీ సంస్థలతో కలిసి తితిదేను మోసం చేశారన్నారు. ఆ మోసాన్ని కూటమి నేతలు తమపై నెట్టే ప్రయత్నం చేశారని భూమన అన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నన్ను టార్గెట్ చేశారు: చెవిరెడ్డి

మద్యం కేసులో జైలు నుంచి విడుదలైన చెవిరెడ్డి, వెంకటేష్ నాయుడు, సజ్జల శ్రీధర్‌రెడ్డి



జైలు నుంచి బయటకు వస్తున్న చెవిరెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, వెంకటేష్ నాయుడు

ఈనాడు, అమరావతి: 'ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గం నుంచి రాజకీయాల్లో ఎదిగి, ఎమ్మెల్యేగా గెలిచా. అందుకే ఆయన నన్ను టార్గెట్ చేశారు. తప్పుడు కేసులు పెట్టి నన్ను జైలుకు పంపుతున్నారు. 2014-19 మధ్య నాపై 72 కేసులు పెట్టారు. ఎమ్మెల్యే అన్న గౌరవం లేకుండా జైలులో కూడా కొట్టారు' అని మద్యం కేసులో నిందితుడు, వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు. ఈ కేసులో హైకోర్టు బెయిల్ ఇవ్వడంతో గురువారం రాత్రి విజయవాడ జిల్లా జైలు నుంచి ఆయన విడుదలయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే అని కూడా చూడకుండా గతంలో తనను బస్సులో కింద కూర్చోబెట్టి తిరువళ్లూరు, సత్యవేడు, తదితర చోట్లకు తిప్పారని తెలిపారు. 2024లో చంద్రబాబు మళ్లీ సీఎం అయిన తర్వాత కేసులు బనాయించడం ప్రారంభించారని విమర్శించారు.

- మద్యం కేసులో చెవిరెడ్డితో పాటు వెంకటేష్ నాయుడు, సజ్జల శ్రీధర్‌రెడ్డిలకు హైకోర్టు బెయిల్ ఇవ్వడంతో గురువారం రాత్రి విజయవాడ జైలు నుంచి విడుదలయ్యారు. అరెస్టు అయిన 226 రోజుల తర్వాత చెవిరెడ్డి, వెంకటేష్ నాయుడు, 280 రోజుల అనంతరం సజ్జల శ్రీధర్‌రెడ్డి జైలు నుంచి విడుదలయ్యారు. వీరికి కారాగారం బయట వైకాపా నేతలు స్వాగతం పలికారు. ముగ్గురికీ మాజీ మంత్రి జోగి రమేష్ దండలు వేశారు. జైలు వద్ద నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున బాణసంచా కాల్చారు. జై జగన్ అంటూ నినాదాలు చేశారు.
- ఏసీబీ కోర్టు తీర్పు మేరకు.. మంతెన సత్యనారాయణరాజు ఆశ్రమంలో వెన్నునొప్పి చికిత్స కోసం గురువారం ఉదయం కారాగారం నుంచి చెవిరెడ్డి వెళ్లారు. హైకోర్టులో బెయిల్ రావడంతో మధ్యాహ్నానికి తిరిగి జైలుకు వచ్చారు.

చిన్న కొలువు.. భారీగా అక్రమ ఆదాయం!

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సబార్డినేట్ తిరుమలేష్ ఆస్తులపై అనిశా సోదాలు
- ఆస్తుల విలువ రూ.50 కోట్లుగా అంచనా



తిరుమలేష్

తిరుపతి(నేరవిభాగం), మర్రిపాడు, న్యూస్‌టుడే: తిరుపతి జిల్లా రేణిగుంటలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేస్తూ సస్పెన్షన్‌కు గురైన ఆఫీస్ సబార్డినేట్ తిరుమలేష్ ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించినట్లు అవినీతి నిరోధక శాఖ (అనిశా) గుర్తించింది. ఈ మేరకు అనిశా అదనపు ఎస్పీ విమలకుమారి పర్యవేక్షణలో మూడు బృందాలు తిరుపతి, నెల్లూరులోని ఆరు ప్రదేశాల్లో సోదాలు నిర్వహించాయి. తిరుపతి రామచంద్రనగర్‌లోని శ్రీలక్ష్మీ నివాస్ అపార్ట్‌మెంట్‌లో గురువారం ఉదయం ఓ బృందం సోదాలు చేసింది. తిరుమలేష్ సమక్షంలో తనిఖీలు చేశారు. తిరుపతిలోని చైతన్యపురంలో జీ ప్లస్ త్రీ భవనం, తిరుచానూరు పరిధిలో రెండు స్థలాలతోపాటు మరో రెండు ఆస్తుల పత్రాలను గుర్తించారు. నివాసం ఉంటున్న అపార్ట్‌మెంట్‌తోపాటు భూములు, భవనాలకు (మరో పది ఆస్తులు) సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అక్కడ రూ.15.26 లక్షల నగదు, 1.4 కిలోల బంగారు, 8.7 కిలోల వెండి సామగ్రి గుర్తించారు. కారు, మూడు ద్విచక్ర వాహనాలు, విలువైన గృహోపకరణాలు సోదాల్లో బయటపడ్డాయి. రెండు బ్యాంకు లాకర్లలోని నగదు, ఆభరణాలను మదింపు చేయనున్నారు.



స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి వస్తువులు

- తిరుపతి తిమ్మినాయుడుపాళెంలోని అతని సన్నిహితుల అపార్ట్‌మెంట్‌లోనూ సోదాలు జరిపారు. అక్కడ కిలో బంగారు ఆభరణాలు, నాలుగు కిలోల వెండి సామగ్రి గుర్తించారు. నగరంలోని గిరిపురంలోని సొంతింటితోపాటు మరో ఇంటిలోనూ.. నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలంలోని డీసీపల్లిలోని రెండు ప్రాంతాల్లోనూ తనిఖీలు నిర్వహించారు. అక్కడ నిర్మాణంలో ఉన్న జీ ప్లస్ త్రీ భవనానికి సంబంధించిన పత్రాలను గుర్తించారు. గుర్తించిన ఆస్తుల విలువ సుమారు రూ.50 కోట్లు ఉంటుందని ఏసీబీ అధికారులు అంచనా వేశారు. సంబంధిత పత్రాలు, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. గురువారం రాత్రి కూడా సోదాలు కొనసాగాయి. శుక్రవారం ఉదయం తిరుమలేష్‌ను అరెస్టు చేసి నెల్లూరు ఏసీబీ కోర్టుకు తరలించే అవకాశం ఉంది.

పనిచేసింది ఏసీబీలో.. కూడబెట్టింది రూ.కోట్లలో!

- ఇదీ హోంగార్డు అక్రమార్జన



పట్టుబడిన అక్రమ సంపాదన. చిత్రంలో శ్రీనివాసరావు

ఈనాడు, విజయనగరం: అవినీతి నిరోధక శాఖలోనే పనిచేస్తూ.. కోట్ల రూపాయల అక్రమాస్తులు కూడబెట్టారో హోంగార్డు. చేస్తుంది చిరుద్యోగమైనా అడ్డదారిలో భారీగా సంపాదించారు. వీటిపై అందిన ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించగా.. బంగారం, వెండి, నగదుతో పాటు అక్రమంగా సంపాదించిన ఇళ్ల స్థలాల డాక్యుమెంట్లు దొరికాయి. విజయనగరం జిల్లా గుర్ల మండలం నడిపూరు గ్రామానికి చెందిన నెట్టి శ్రీనివాసరావు(43).. 2010లో జిల్లాలోని పోలీసు శాఖలో హోంగార్డుగా చేరి, కొన్నేళ్లు ఏసీబీ విభాగంలో పనిచేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలు పాటిస్తూ.. నమ్మకంగా పనిచేస్తున్నట్లు నటించేవారు. సబ్ రిజిస్ట్రార్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులపై ఏసీబీ అధికారుల దాడులు, సోదాల సమాచారం ముందుగానే వారికి లీక్ చేసి, వారి నుంచి పెద్ద మొత్తంలో నగదు అందుకునేవారు. గతేడాది నవంబరులో రాష్ట్ర వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీల సమయంలో ఏసీబీ అధికారుల కదలికలకు సంబంధించిన సమాచారాన్నీ అవినీతి అధికారులకు ఈయనే చేరవేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఏళ్ల నుంచి ఏసీబీలో హోంగార్డుగా పనిచేస్తున్న శ్రీనివాసరావుపై పలు ఫిర్యాదులు రావడంతో ఉన్నతాధికారులు ఇటీవల ఆయన్ను మాతృ విభాగానికి పంపించారు. అయినా ఏసీబీలో పనిచేస్తున్నానని చెప్పుకొంటూ అక్రమార్జనకు పాల్పడ్డారు. ఆయన కూడబెట్టిన ఆస్తులపై అధికారులకు సమాచారం అందడంతో విజయనగరం ఏసీబీ డీఎస్పీ రమ్య, సీఐ మహేష్ పర్యవేక్షణలో అయిదు బృందాలు గురువారం ఆకస్మికంగా విజయనగరం, నడిపూరు, విశాఖ నగర పరిధిలోని పెందుర్తి, గోపాలపట్నం, ఆదర్శనగర్‌లో శ్రీనివాసరావు, ఆయన బంధువుల ఇళ్లలో ఏకకాలంలో సోదాలు చేశాయి. విలువైన రెండు ఫ్లాట్లు, ఒక ఆర్‌సీసీ భవనం, నాలుగు ఇళ్ల స్థలాలు, 23 సెంట్ల వ్యవసాయ భూమితో పాటు 166 గ్రాముల బంగారం, వెండి ఆభరణాలు, రూ.60 వేల నగదు, రూ.7.07 లక్షల బ్యాంకు బ్యాలెన్స్, హ్యుందాయ్ ఐ-10 కారు, ద్విచక్ర వాహనం కలిగి ఉన్నట్లు తేలింది. వీటి విలువ సుమారు రూ.10 కోట్లు ఉండొచ్చని అంచనా. నిందితుడిపై కేసు నమోదు చేసి, విశాఖలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు.

EENADU Vol: 52, Issue: 170 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

కొన్నేళ్లపాటు ఉద్యోగం చేసి, పదవీ విరమణ చేసినప్పటికీ.. ఖర్చుల నుంచి తప్పించుకోలేం కదా! నిత్యావసరాలు, ఔషధాలు, ఇతర ఖర్చులు ఆకాశాన్ని తాకుతుంటాయి. ఇలాంటి సమయంలో చేతిలో ఎంత పెద్ద మొత్తం ఉన్నా అది కరిగిపోతుందేమో అన్న భయం ప్రతి ఒక్కరినీ వెంటాడుతుంది. 'నా తదనంతరం నా జీవిత భాగస్వామి పరిస్థితి ఏమిటి?'.. 'వడ్డీ రేట్లు తగ్గితే ఎలా?' ఈ ప్రశ్నలన్నింటికీ ఒకే సురక్షితమైన సమాధానం 'యాన్యుటీ ప్లాన్స్'. అవేమిటి? వాటిలో ఉన్న రకాలు, లాభనష్టాల గురించి వివరంగా తెలుసుకుందాం.



విశ్రాంతంలో ఆర్థిక స్వేచ్ఛ

యాన్యుటీ పథకాలు లేదా పింఛను పథకాల గురించి ఒక్క మాటలో చెప్పాలంటే.. బ్యాంకు నుంచి రుణం తీసుకున్నప్పుడు.. మనం వడ్డీతో సహా నెలనెలా వాయిదాలు చెల్లిస్తాం. ఇదే తరహాలో మనకు బీమా సంస్థ దగ్గర డబ్బు పెట్టినప్పుడు వడ్డీతో కలిపి, జీవితాంతం పింఛను తరహాలో ఇస్తుంది.

ఈ పింఛను పాలసీల్లో రకాలు ఉంటాయి. ఇక్కడే చాలామందికి సమస్య వస్తుంది.

● **వెంటనే పింఛను:** వీటిని ఇమ్మీడియట్ యాన్యుటీ పథకాలని చెప్పొచ్చు. మీరు ఈ నెలలో డబ్బు కడితే.. వచ్చే నెల నుంచి పింఛను రావడం ప్రారంభం అవుతుంది. పదవీ విరమణ చేసిన వెంటనే పింఛను రావాలనుకున్నప్పుడు దీన్ని ఎంచుకోవాలి.

● **తర్వాత కాలంలో:** ఇది డిఫర్డ్ యాన్యుటీ పాలసీ. మీరు ఇప్పుడు డబ్బు చెల్లిస్తారు.. పింఛను మాత్రం 5 లేదా 10 ఏళ్ల తర్వాత నుంచి కావాలని కోరుకుంటారు. అప్పటిదాకా, మీ డబ్బు బీమా సంస్థ దగ్గరే ఉంటుంది. దీనికి వడ్డీ జమ అవుతూ.. పెద్ద మొత్తంగా మారిన తర్వాత పింఛను ప్రారంభం అవుతుంది. పదవీ విరమణకు కనీసం 10 ఏళ్లకు మించి సమయం ఉన్నప్పుడు ఈ తరహా పాలసీలో మదుపు చేయడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.

పెట్టుబడి వెనక్కి వస్తుందా?

ఈ పాలసీల్లో పెట్టుబడి పెట్టేప్పుడు రెండు రకాల ఆప్షన్లను ఎంచుకునేందుకు అవకాశం ఉంటుంది. పాలసీ తీసుకున్న వ్యక్తి జీవించి ఉన్నంత కాలమే పింఛను ఇచ్చేది ఒక రకం. ఇందులో పింఛను కాస్త అధికంగా అందుతుంది. రెండో రకంలో పాలసీదారుడి మరణానంతరం జీవిత భాగస్వామికి పింఛను ఇస్తుంది. ఆమె/అతను చనిపోయిన తర్వాత డబ్బును నామినీకి చెల్లిస్తుంది. సాధారణంగా ఈ రకంలో పింఛను కాస్త తక్కువగా ఉంటుంది.

ఉదాహరణకు కుమార్ 60 ఏళ్లకు పదవీ విరమణ చేశారు. అతని దగ్గర రూ.50 లక్షలు ఉన్నాయనుకుందాం. ఆయన యాన్యుటీ ప్లాన్ తీసుకుంటే వడ్డీ రేటు 6-6.5 శాతం అంచనాతో ఎలా ఉంటుందో చూద్దాం..

- పెట్టుబడి రూ.50,00,000.
- **ప్లాన్:** భార్యాభర్తలిద్దరికీ పింఛను, ఆ తర్వాత డబ్బు వెనక్కి
- **వార్షిక పెన్షన్:** సుమారు రూ.3లక్షలు-రూ.3.25లక్షలు
- **నెలవారీ ఆదాయం:** రూ.25000-రూ.27,000

కుమార్ 90 ఏళ్లు బతికినా, 100 ఏళ్లు జీవించినా.. ఈ రూ.27,000 రావడం ఆగదు. బ్యాంకుల్లో వడ్డీ రేటు 3 శాతానికి పడిపోయినా.. బీమా కంపెనీ కుమార్‌కు ఇచ్చే మొత్తాన్ని తగ్గించలేదు.

ఎవరికి సరిపోతాయి?

- పెట్టుబడి సురక్షితంగా ఉండాలని కోరుకునే వారికి
- పింఛను సౌకర్యం లేని ప్రైవేటు ఉద్యోగులు, వ్యాపారులు, స్వయం ఉపాధి పొందుతున్న వారు
- చేతిలో డబ్బు ఉంటే ఖర్చు చేసేస్తా అనుకునే వారికి ఇవి ఒక ఆర్థిక రక్షణగా పనిచేస్తాయి.

యాన్యుటీ పాలసీలు మంచివే.. కానీ, కొన్ని విషయాలనూ గుర్తుంచుకోవాలి..

- వచ్చే పింఛను మొత్తాన్ని మొత్తం ఆదాయంలో కలిపి చూపించాలి. కాబట్టి, వర్తించే శ్లాబులను బట్టి, పన్ను చెల్లించాల్సి వస్తుంది.
- అత్యవసర పరిస్థితుల్లో డబ్బు వెనక్కి తీసుకోవడం అన్ని వేళలా సాధ్యం కాదు. కొన్ని పాలసీల్లో క్యాన్సర్, మూత్రపిండాల వైఫల్యం.. లాంటి తీవ్ర వ్యాధులున్నప్పుడే డబ్బు వెనక్కి ఇస్తారు.
- ద్రవ్యోల్బణం పెరుగుతున్న పరిస్థితుల్లో యాన్యుటీతో వచ్చే ఆదాయం సరిపోకపోవచ్చు.

ఏం చేయొచ్చు?

మీ దగ్గరున్న పదవీ విరమణ నిధిని మూడు భాగాలుగా చేయండి.

- 30 శాతం సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీంలో పెట్టుబడి పెట్టండి. ఇందులో 5 ఏళ్ల పాటు పెట్టుబడిని కొనసాగించొచ్చు. ఆ తర్వాత అవసరాన్ని బట్టి, వ్యవధిని పెంచుకోవచ్చు.
- 40 శాతాన్ని యాన్యుటీ పాలసీల్లో జమ చేయండి. దీని నుంచి వచ్చే పింఛను మీ ప్రాథమిక అవసరాలకు ఉపయోగపడుతుంది.
- 30 శాతాన్ని హైబ్రిడ్ లేదా బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్లలో జమ చేయండి. ద్రవ్యోల్బణాన్ని తట్టుకునేందుకు, మీ డబ్బు పెరిగేందుకు ఇది సాయం చేస్తుంది.

టర్మ్ పాలసీ రద్దయ్యిందా?

జీవితం అనూహ్య మలుపులు తిరుగుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో కొన్నిసార్లు అనుకోని సంఘటనలూ చోటు చేసుకుంటాయి. అప్పుడు కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవడంలో టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలే కీలకంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో ఈ పాలసీలు రద్దయితే పరిస్థితి ఏమిటి? పునరుద్ధరించుకునే అవకాశం ఉందా? ఏం చేయాలి? చూద్దాం..

సిరి

siri@eenadu.net

పాలసీదారుడు నిర్ణీత గడువులోగా ప్రీమియం చెల్లించడంలో విఫలమైనప్పుడు టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ రద్దవుతుంది. దీని కారణంగా పాలసీ రక్షణ ఆగిపోతుంది. ఫలితంగా పాలసీదారుడు, వారి నామినీలు ఆశించిన ఆర్థిక భరోసాను కోల్పోయే అవకాశం ఉంది.

- అనుకోని ఆర్థిక సవాళ్లు ఎదురైనప్పుడు పాలసీదారుడు ప్రీమియంలను సకాలంలో చెల్లించలేకపోవచ్చు.
- సరైన బడ్జెట్ నిర్వహణ లేకపోవడం వల్ల ప్రీమియం సకాలంలో చెల్లించకపోతే టర్మ్ పాలసీ రద్దయ్యే అవకాశం ఉంది.
- ఉద్యోగం పోవడం లేదా జీతం తగ్గడం వంటి ఆదాయ మార్పులు ప్రీమియం చెల్లింపు సామర్థ్యంపై ప్రభావం చూపుతాయి.
- ఆరోగ్యం క్షీణించినప్పుడు, ఇతర వైద్య పరిస్థితులు పాలసీదారుడి ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీసి, ప్రీమియం చెల్లించలేని స్థితికి తీసుకురావచ్చు.
- ప్రీమియం చెల్లించాల్సిన తేదీలు, అదనపు గడువు వంటి వివరాలపై అవగాహన లేకపోవడం వల్ల అనుకోకుండా పాలసీలు ల్యాప్స్ అవుతుంటాయి.



పాలసీ రద్దుకు కారణాలను అర్థం చేసుకొని, ముందుగానే తగిన జాగ్రత్తలు పాటిస్తే, కవరేజీని నిరంతరాయంగా కొనసాగించవచ్చు.

టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీని తిరిగి ప్రారంభించడానికి పాలసీదారులకు అనేక మార్గాలు అందుబాటులో ఉన్నాయి.

- పాలసీని పునరుద్ధరించేందుకు బాకీ ఉన్న ప్రీమియాలను చెల్లిస్తే సరిపోతుంది. పాలసీదారులు తమ ఆర్థిక స్థితిని సమీక్షించుకుని, పాలసీని చెల్లించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- ప్రీమియం గడువు తేదీ దాటిన తర్వాతా బీమా సంస్థలు కొంత వ్యవధిని ఇస్తాయి. ఈ సమయంలో కవరేజీని కోల్పోకుండా ప్రీమియాన్ని చెల్లించొచ్చు. ఈ అవకాశాన్ని వెంటనే వినియోగించుకోవడం ముఖ్యం.
- పాలసీని తిరిగి ప్రారంభించడానికి బీమా సంస్థకు అధికారికంగా దరఖాస్తు చేసుకోవాలి. ఇందులో తాజా వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని అందించాల్సి ఉంటుంది.
- పాలసీ ల్యాప్స్ అయి ఎంత కాలం అయిందనే దానిపై ఆధారపడి, బీమా సంస్థలు ఆరోగ్య ధ్రువీకరణను కోరవచ్చు. పాలసీదారుడి ప్రస్తుత ఆరోగ్య స్థితి, పాలసీ తీసుకున్నప్పటి నిబంధనలకు అనుగుణంగా ఉందని నిర్ధారించడానికి ఇది అవసరం. అవసరమైతే వైద్య పరీక్షలు చేయించుకోవాలనీ కంపెనీ కోరొచ్చు.
- కొన్ని సందర్భాల్లో, పాలసీదారులు తమ ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు, అవసరాలకు అనుగుణంగా బీమా మొత్తాన్ని సమీక్షించుకోవాల్సి వస్తుంది.

వీలైనంత వరకూ పాత పాలసీని కొనసాగించడమే మేలు అని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ఎందుకంటే, వయసు తక్కువగా ఉన్నప్పుడు తీసుకుంటారు కాబట్టి, ప్రీమియం స్వల్పంగా ఉంటుంది. వయసుతో పాటే, ప్రీమియమూ పెరుగుతుంది. పైగా ఏదైనా వ్యాధులుంటే.. కొత్త పాలసీ లభించకపోవచ్చు. వచ్చినా.. ప్రీమియంపై లోడింగ్ ఉండే అవకాశం ఉంది.

పనితీరు బాగున్న రంగాల్లో

కొత్త పథకం

సాధారణంగా ఫండ్లు మంచి షేర్లను ఎంచుకొని పెట్టుబడి పెడుతుంటాయి. కానీ, పరిస్థితులకు అనుగుణంగా మంచి పనితీరు చూపిస్తున్న రంగాలను ఎంచుకొని, మదుపు చేసే వ్యూహంతో జియో బ్లాక్‌రాక్ మ్యూచువల్ ఫండ్.. జియో బ్లాక్‌రాక్ సెక్టార్ రొటేషన్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ పథకం ఎన్ఎఫ్ఓ వచ్చే నెల 9 వరకూ అందుబాటులో ఉంటుంది. కనీస పెట్టుబడి రూ.500. థీమ్యాటిక్, సెక్టార్ ఫండ్ విభాగం కిందకు వస్తుంది. నిఫ్టీ 500 టీఆర్ఐ సూచీ ప్రామాణికంగా పనిచేస్తుంది. పెట్టుబడిని ఎప్పుడు వెనక్కి తీసుకున్నా ఎలాంటి రుసుములూ ఉండవు. ఈ పథకం కేవలం ఫండ్ మేనేజర్ల అంచనాలపైనే కాకుండా, బ్లాక్‌రాక్ అత్యాధునిక సాంకేతికత సిస్టమేటిక్ యాక్టివ్ ఈక్విటీస్ పద్ధతిని ఉపయోగిస్తుంది. సంప్రదాయ సమాచారంతో పాటు, ప్రత్యామ్నాయ సమాచారం, కృత్రిమ మేధని ఉపయోగించి, ఏ రంగానికి గిరాకీ పెరుగుతుందో గుర్తిస్తుంది. ఉదాహరణకు బ్యాంకింగ్, ఐటీ, ఫార్మా, ఆటోమొబైల్.. రాబోయే రోజుల్లో ఏది బాగా రాణిస్తుందో ముందుగానే అంచనా వేసి, ఆ విభాగానికి చెందిన షేర్లలో ఎక్కువగా పెట్టుబడి పెడుతుంది. ఒకే రంగంలో పెట్టుబడిని కొనసాగించకుండా, ఎప్పటికప్పుడు లాభదాయకమైన సెక్టార్ల వైపు మళ్లడం వల్ల నష్టభయం పరిమితం చేసే ప్రయత్నం చేస్తుంది. ఇది సెక్టార్ ఆధారిత ఫండ్ కాబట్టి, హెచ్చుతగ్గులు ఉండొచ్చు. కనీసం 5 ఏళ్లకు మించి మదుపు చేయాలనుకునే వారికి అనుకూలమని చెప్పొచ్చు.

హెచ్చుతగ్గులు తట్టుకునేలా

మార్కెట్ పెరిగినప్పుడు లాభాలు రావాలి.. తగ్గినప్పుడు నష్టపోకూడదు అని కోరుకునే వారి కోసం ద వెల్త్ కంపెనీ.. కొత్తగా బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్‌ను తీసుకొచ్చింది. ఇది డైనమిక్ అసెట్ అలకేషన్ పద్ధతిలో పనిచేస్తుంది. అంటే, మార్కెట్ పరిస్థితులను బట్టి, ఈక్విటీ, డెట్‌ల మధ్య పెట్టుబడిని మారుస్తూ ఉంటుంది. ఈ ఫండ్ లార్జ్ క్యాప్, మిడ్, స్మాల్ స్టాక్స్‌లో పెట్టుబడి పెడుతుంది. సాధారణంగా 30-80 శాతం వరకూ ఈక్విటీ పెట్టుబడులు ఉండేలా చూసుకుంటుంది. వచ్చే నెల 10 వరకూ ఎన్ఎఫ్ఓ కొనసాగుతుంది. హైబ్రిడ్ రకానికి చెందిన ఫండ్ ఇది. కనీస పెట్టుబడి రూ.1,000. కొత్తగా మార్కెట్‌లో మదుపు చేయడం ప్రారంభించిన వారు, పదవీ విరమణకు దగ్గరగా ఉన్నవారు ఈ తరహా ఫండ్లను ఎంచుకోవచ్చు. దీర్ఘకాలం పెట్టుబడులు పెట్టినప్పుడే మంచి రాబడి అందుకోగలం.

నాణ్యమైన షేర్లలో

మార్కెట్ పెరిగినా, తగ్గినా స్థిరంగా ఉండే కంపెనీల్లో పెట్టుబడి పెట్టే వ్యూహంతో ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్.. ఎస్‌బీఐ క్వాలిటీ ఫండ్‌ను తీసుకొచ్చింది. కేవలం లాభాలే కాకుండా, ఆ కంపెనీ ఎంత బలంగా ఉంది అనేదీ పరిశీలిస్తుంది. లాభదాయకత, అప్పుల భారం, స్థిరత్వం ఈ మూడింటి ఆధారంగా ఫండ్ మేనేజర్ కంపెనీలను ఎంచుకుంటారు. వచ్చే నెల 11 వరకూ ఎన్ఎఫ్ఓ అందుబాటులో ఉంటుంది. కనీస పెట్టుబడి రూ.5000. సిప్‌ను రూ.500లతో చేయొచ్చు. నాణ్యమైన కంపెనీలు స్వల్పకాలంలో పెద్దగా లాభాలు ఇవ్వవు. కానీ, దీర్ఘకాలంలో మంచి సంపదను సృష్టిస్తాయి. ఇలా ఓపికగా ఎదురుచూసే వారికి ఈ పథకం బాగుంటుంది.

బ్యాంకు లేదా ఆర్థిక సంస్థ నుంచి రుణం తీసుకున్నప్పుడు క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లించాలి. కానీ, అనుకోని పరిస్థితుల్లో రుణ వాయిదా (ఈఎంఐ) చెల్లింపులో విఫలమైతే.. ఏంటి పరిస్థితి.. ఈ ఒక్క పొరపాటు భవిష్యత్తులో ఇబ్బంది పెడుతుందా? అనేది చాలామందికి ఆందోళన కలిగిస్తుంది. ఈ నేపథ్యంలో ఈఎంఐని చెల్లించకపోతే ఏం జరుగుతుంది? క్రెడిట్ స్కోరుపై ఎలాంటి ప్రభావం పడుతుంది? తెలుసుకుందాం..

ఈఎంఐ ఆలస్యమైతే



మన దేశంలో చాలామందికి నగదు ప్రవాహం మారుతూ ఉంటుంది. జీతం పడటం ఆలస్యం కావడం, అనుకోని వైద్య ఖర్చులు లేదా ఇతర అత్యవసరాలు వల్ల నెలవారీ చెల్లింపుల చక్రం దెబ్బతినే అవకాశం ఉంది. ఈఎంఐను నిర్ణీత తేదీనాడు చెల్లించనప్పుడు.. ఆ తర్వాత రుణదాత ఎంత వేగంగా, బాధ్యతగా స్పందించారన్నదే దీర్ఘకాలిక ప్రభావాన్ని నిర్ణయిస్తుంది.

ఒక్కసారి వాయిదాను తప్పినంత మాత్రాన బ్యాంకులు రుణగ్రహీత సామర్థ్యాన్ని తక్కువగా అంచనా వేయవు. క్రెడిట్ బ్యూరోలు ఒక వ్యక్తి దీర్ఘకాలిక చెల్లింపు ప్రవర్తనను గమనిస్తాయి. కానీ, అప్పుడప్పుడు జరిగే పొరపాట్లను ప్రామాణికంగా తీసుకోవు.

✦ ఒక ఈఎంఐ ఆలస్యమైనప్పటికీ, 30 రోజుల్లోపు దాన్ని చెల్లించిన వారి క్రెడిట్ స్కోరుపై పెద్దగా ప్రభావం ఉండదు. లేదా తాత్కాలికం మాత్రమే. అదే పనిగా ఆలస్యం చేయడం లేదా స్పందించకుండా మౌనంగా ఉండిపోవడం వల్ల జరిమానా పడుతుంది. రికవరీ చర్యలు, క్రెడిట్ స్కోరు శాశ్వతంగా పతనం కావడం వంటివి జరుగుతాయి.

ఏం చేయాలి?

ఈఎంఐ తప్పిన సందర్భంలో చేయాల్సిన ముఖ్యమైన పని.. బ్యాంకును సంప్రదించడం..

✦ రుణగ్రహీతలు వెంటనే తమ రుణదాతను సంప్రదించి, తమ పరిస్థితిని వివరించాలి. అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయాలను అన్వేషించాలి.

✦ మంచి చెల్లింపుల చరిత్ర ఉన్న రుణగ్రహీతలకు.. చెల్లింపు తేదీని మార్చడం, పాక్షిక చెల్లింపులు లేదా తాత్కాలిక ఉపశమన పద్ధతుల ద్వారా బ్యాంకులు వెసులుబాటు కల్పిస్తాయి.

✦ చాలామంది భయంతోనో, సరైన సమాచారం లేక.. బ్యాంకులను సంప్రదించరు. ఒక్క ఈఎంఐ చెల్లించకపోతే క్రెడిట్ చరిత్ర దెబ్బ తింటుందని భావిస్తారు. కానీ, ఇది అపోహే.

మరో ముఖ్యమైన విషయం.. వాయిదాలను చెల్లించకపోతే, అపరాధ రుసుములు, వడ్డీలతో భారం పెరిగిపోతుంది. దీనివల్ల వచ్చే నెల మరింత ఒత్తిడి ఎదురవుతుంది. ఆదాయంలో అనిశ్చితి ఉండే గిగ్ వర్కర్లు, తొలిసారి రుణం తీసుకున్న వారికి ఇది పెద్ద సవాలుగా మారుతుంది. కాబట్టి, వాయిదాలను చెల్లించకపోవడం ఆర్థిక ఇబ్బందిగా కాకుండా, ఒక హెచ్చరికగా భావించాలి. సరైన సమయంలో స్పందించడం, పారదర్శకంగా ఉండటం ఎప్పుడూ అవసరం.

ఉమ్మడి పాలసీ తీసుకోవచ్చా?

నా వయసు 30. ఇటీవలే వివాహం అయ్యింది. మేమిద్దరమూ ఉద్యోగులమే. మా ఇద్దరి పేరుమీద ఉమ్మడిగా ఆరోగ్య, టర్మ్ పాలసీలు తీసుకోవచ్చా? కొన్నాళ్లు ఆగిన తర్వాత పాలసీలు తీసుకోవాలా? - నారాయణ

బీమా పాలసీలను తీసుకోవడం ఎప్పుడూ ఆలస్యం చేయొద్దు. కాబట్టి, వెంటనే తగిన మొత్తానికి పాలసీలను తీసుకోండి. ఎలాంటి ఉప పరిమితులు లేకుండా ఉండేలా రూ.10లక్షల వరకూ మీ ఇద్దరికీ వర్తించేలా ఫ్యామిలీ ఫ్లోటర్ ఆరోగ్య బీమా తీసుకోండి. మీ ఇద్దరూ ఉమ్మడి టర్మ్ పాలసీ కాకుండా, ఎవరికి వారే ప్రత్యేకంగా తీసుకోండి. మీ వార్షికాదాయానికి కనీసం 12 రెట్ల వరకూ విలువైన టర్మ్ పాలసీ తీసుకోండి. కనీసం 6 నెలలకు సరిపోయేలా అత్యవసర నిధిని సిద్ధం చేసుకోండి.

మా అబ్బాయి వయసు 4. అతని పేరుమీద ప్రతి నెలా రూ.10వేల చొప్పున మదుపు చేయాలనే ఆలోచనతో ఉన్నాం. అతని ఉన్నత చదువులు, ఇరత ఖర్చులకు ఉపయోగపడేలా ఎలాంటి పెట్టుబడి పథకాలను ఎంచుకోవాలి? - దీపక్

ముందుగా మీ అబ్బాయి భవిష్యత్తు ఖర్చులకు తగిన రక్షణ కల్పించేలా. . మీ పేరుపైన తగినంత జీవిత బీమా పాలసీని తీసుకోండి. మీ పెట్టుబడులు ఎప్పుడూ విద్యా ద్రవ్యోల్బణానికి మించి వచ్చేలా చూసుకోవాలి. మీరు డైవర్సిఫైడ్ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ల ద్వారా మదుపు చేస్తే, మంచి లాభాలు వచ్చే అవకాశం ఉంది. మీ అబ్బాయి ఉన్నత చదువులకు దాదాపు 13 ఏళ్ల సమయం ఉంది. మీరు నెలకు రూ.10వేలు 13 ఏళ్లపాటు 11 శాతం రాబడి అంచనాతో పెట్టుబడి పెడితే.. రూ.31,45,396 అయ్యేందుకు అవకాశం ఉంది. ఈ మొత్తం భవిష్యత్తులో సరిపోకపోవచ్చు. మీ ఆదాయం పెరిగినప్పుడు, మీ పెట్టుబడినీ పెంచండి.

ఆదాయపు పన్ను మినహాయింపు గురించి రూ.50వేలు ఎన్‌పీఎస్‌లో మదుపు చేద్దామని అనుకుంటున్నాను. ఇది మంచి ఆలోచనేనా? దీనికి మించి రాబడినిచ్చే పథకాలు ఏమైనా ఉన్నాయా? - శ్రీధర్

మార్గదర్శి

జాతీయ పింఛను పథకం (ఎన్‌పీఎస్) మంచి పథకమే. దీన్ని మించి రాబడినిచ్చే పథకాలూ ఉన్నాయి. ఎన్‌పీఎస్‌లో ఖర్చుల నిష్పత్తి తక్కువగా ఉంటుంది. కానీ, మ్యూచువల్ ఫండ్లలో వైవిధ్యం అధికంగా ఉంటుంది. ఫండ్లలో ఒకేసారి కాకుండా, క్రమానుగత పెట్టుబడి విధానంలో మదుపు చేసేందుకు ప్రయత్నించండి.

నేను షేర్లలో మదుపు చేయాలనే ఆలోచనతో డీమ్యాట్ ఖాతా తీసుకున్నాను. యాప్‌లో కొన్ని షేర్లలో మదుపు చేయాల్సిందిగా సూచనలు వస్తుంటాయి. ఇలాంటి వాటిని నమ్మొచ్చా? - ఆదిత్య

సాధారణంగా డీమ్యాట్ ఖాతా ఉన్న కంపెనీలు షేర్లకు సంబంధించి సూచనలు ఇస్తుంటాయి. వీటిలో అన్నీ బాగుంటాయని చెప్పలేం. నేరుగా షేర్లలో మదుపు చేసేందుకు సమయం, పర్యవేక్షణ అవసరం. ఆ షేరు గురించి పూర్తిగా అవగాహన ఉండాలి. ఇది సాధారణంగా అందరికీ సాధ్యం కాని విషయం. మీరు నేరుగా షేర్లలో మదుపు చేయడంకన్నా.. డైవర్సిఫైడ్ ఫండ్లలో మదుపు చేసేందుకు ప్రయత్నించండి. మంచి ఫండ్లను ఎంచుకొని, మదుపు చేస్తే.. దీర్ఘకాలంలో మంచి లాభాలు వచ్చే అవకాశం ఉంది.

- తుమ్మ బాల్‌రాజ్, సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

సంపద సృష్టికి 8 మార్గాలు

ఈక్విటీ మార్కెట్లలో హెచ్చుతగ్గులు పెట్టుబడి ప్రయాణంలో అనివార్యం. ముఖ్యంగా మార్కెట్‌లో షేర్ల ధరలు మారుతున్నప్పుడు చాలామంది మదుపరులు ఆందోళన చెందుతారు. తమ క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్)ను ఆపేస్తుంటారు. పూర్తిగా రద్దు చేస్తుంటారు. సరైన వ్యూహంతో ముందుకు వెళ్తే, ఈ అస్థిరతనే గొప్ప అవకాశంగా మార్చుకోవచ్చు.

సగటును నమ్మండి..

క్రమానుగత పెట్టుబడి విధానంలో ఉన్న ప్రాథమిక సూత్రం.. రూపాయి సగటు. మార్కెట్ పరిస్థితులతో సంబంధం లేకుండా, నిర్ణీత కాల వ్యవధిలో, నిర్దేశిత మొత్తాన్ని మదుపు చేయడమే ఇందులో కీలకం. ధరలు తక్కువగా ఉన్నప్పుడు ఎక్కువ యూనిట్లు, ధరలు పెరిగినప్పుడు తక్కువ యూనిట్లు మీ ఖాతాలో జమ అవుతాయి. కాలక్రమేణా, ఇది యూనిట్ సగటు ధరను తగ్గించి, స్వల్పకాలిక అస్థిరత ప్రభావాన్ని తగ్గిస్తుంది. ఇది భావోద్వేగాల ఆధారంగా మార్కెట్‌ను చూసే అలవాటును నివారిస్తుంది.

స్టెప్-అప్ చేయండి

ఆదాయం పెరిగినప్పుడు లేదా ఆర్థిక లక్ష్యాల ఆధారంగా ఏటా లేదా ఆరు నెలలకోసారి సిప్ మొత్తాన్ని పెంచుకునే వెసులుబాటు ఉంది. దీన్నే స్టెప్-అప్ సిప్ అంటారు. అస్థిర మార్కెట్లలో, ముఖ్యంగా మార్కెట్ పడినప్పుడు సిప్ మొత్తాన్ని పెంచడం వల్ల తక్కువ ఎన్ఏవీ వద్ద ఎక్కువ యూనిట్లను పోగు చేసుకోవచ్చు. ఎక్కువ మొత్తంలో పెట్టుబడి, రూపాయి సగటు ప్రయోజనం కలిసి, దీర్ఘకాలంలో మీ నిధి వేగంగా వృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుంది. జీతం పెరిగినప్పుడు ఖర్చులను కాకుండా.. సిప్‌ను పెంచే ఆలోచన చేయండి.

లక్ష్యం ఆధారంగా..

సాధారణ సిప్ వ్యూహానికి భిన్నంగా.. పోర్ట్‌ఫోలియో విలువ ఆధారంగా సిప్ మొత్తాన్ని నిర్ణయించుకుంటూ మదుపు చేయొచ్చు. మీ పోర్ట్‌ఫోలియో మీ లక్ష్యం కంటే తక్కువ పనితీరు చూపిస్తే.. ఎక్కువ మొత్తాన్ని, తక్కువ రాబడిని అందిస్తే.. ఎక్కువ మొత్తాన్ని మదుపు చేస్తూ ఉండాలి. ఈ విధానం వల్ల అస్థిరత ఉన్నప్పుడు కొనుగోలు ధర తగ్గుతుంది. కానీ, నిరంతరం పెట్టుబడులను పర్యవేక్షిస్తూ ఉన్నవారికే ఈ పద్ధతి నప్పుతుంది.

తక్కువగా ఉన్నప్పుడు..

మార్కెట్లు తగ్గినప్పుడు ఎక్కువ మొత్తాన్ని మదుపు చేసే వ్యూహాన్నీ అనుసరించవచ్చు. దీనివల్ల షేర్ల ధరలు పడిపోయినప్పుడు, ఎక్కువ యూనిట్లు లభిస్తాయి. తక్కువ ఎన్ఏవీ ఉన్నప్పుడు మీ నెలవారీ సిప్ మొత్తానికి అదనంగా ఒకేసారి యూనిట్లను కొనుగోలు చేయొచ్చు. మార్కెట్‌ను నిరంతరం గమనిస్తూ ఉండేవారు ఈ పద్ధతిని పాటించేందుకు వీలుంది.



బదిలీతో..

సిస్టమేటిక్ ట్రాన్స్‌ఫర్ ప్లాన్ (ఎస్‌టీపీ) ద్వారా మదుపరులు ఒక ఫండ్ నుంచి మరో ఫండ్‌లోకి క్రమంగా డబ్బును బదిలీ చేయొచ్చు. ఉదాహరణకు మొదట అస్థిరత తక్కువగా ఉండే డెట్ ఫండ్లలో ఏకమొత్తాన్ని జమ చేసి, ఆ తర్వాత అక్కడి నుంచి ఎస్‌టీపీ ద్వారా ఈక్విటీ ఫండ్లలోకి మార్చుకోవచ్చు. అస్థిర మార్కెట్లలో ఈక్విటీ రిస్కును తగ్గించేందుకు ఈ పద్ధతి బాగా పనిచేస్తుంది. మీ పొదుపు ఖాతాలో డబ్బు తక్కువ వడ్డీకే ఉండటంకన్నా మంచి రాబడిని ఇస్తూనే ఈక్విటీలో రూపాయి సగటు ప్రయోజనాన్ని అందిస్తుంది.

ఆపాలా? కొనసాగించాలా?

మార్కెట్ ఆటుపోట్ల సమయంలో సిప్‌ను కొన్నాళ్లపాటు ఆపేయాలనే ఆలోచన రావడం సహజం. కానీ, స్వల్పకాలిక కదలికలకు భయపడి పెట్టుబడిని ఆపితే.. దీర్ఘకాలిక లక్ష్యాలు దెబ్బతింటాయి. చరిత్రను చూస్తే.. పతనాల సందర్భంలోనూ సిప్‌ను కొనసాగించిన వారే మార్కెట్ కోలుకున్నపుడు ఎక్కువగా లాభపడ్డారు. స్థిరంగా పెట్టుబడి పెట్టడం వల్ల మీ ఆస్తుల కేటాయింపు సరిగ్గా ఉంటుంది. సిప్‌ను కొనసాగించాలా వద్దా అనే నిర్ణయం మీ ఆర్థిక లక్ష్యాలు, నష్టభయం భరించే సామర్థ్యంపై ఆధారపడి ఉండాలి తప్ప, తాత్కాలిక మార్కెట్ పరిస్థితులపై కాదు.

సమీక్షతో..

మార్కెట్ కదలికల వల్ల మీ పోర్ట్‌ఫోలియోలో ఉన్న ఈక్విటీ, డెట్ నిష్పత్తులు మారిపోవచ్చు. ఉదాహరణకు ఈక్విటీ మార్కెట్ భారీగా పెరిగినప్పుడు, మీ పోర్ట్‌ఫోలియోలో ఈక్విటీ వాటా మీరు అనుకున్న పరిమితిని మించిపోవచ్చు. అందుకే, నిర్ణీత కాలానికి మీ పెట్టుబడుల జాబితాను సమీక్షించుకుని, ఆస్తుల కేటాయింపును తిరిగి సరి చేసుకోవాలి. మార్కెట్ పెరిగినప్పుడు ఈక్విటీలలో లాభాలను డెట్ పథకాల వైపు మళ్లించడం, లేదా మార్కెట్ పడినప్పుడు ఈక్విటీ వాటాను పెంచడం ఇందులో భాగం. ఇది ఆర్థిక క్రమశిక్షణను పెంచడమే కాకుండా, నష్టభయాన్ని తగ్గిస్తుంది.

వైవిధ్యం ఉన్నప్పుడే..

లార్జ్, మిడ్, ఫ్లెక్సీ క్యాప్, హైబ్రిడ్ వంటి వివిధ రకాల ఫండ్లలో సిప్‌ను విస్తరించాలి. దీనివల్ల మార్కెట్ హెచ్చుతగ్గుల తీవ్రతను తగ్గించుకోవచ్చు. ఒక్కో విభాగం ఒక్కో సందర్భంలో వేర్వేరుగా స్పందిస్తుంది. ఉదాహరణకు మిడ్ క్యాప్‌లో అస్థిరత ఎక్కువ. లార్జ్ క్యాప్ పథకాలు నిలకడగా ఉంటాయి. ఇలా వైవిధ్యం పాటించడం వల్ల ఏ ఒక్క సెక్టార్ లేదా మార్కెట్ విభాగంపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు.

ఈనాడు సినిమా

దసరాకి... ఫౌజీ


ప్రభాస్

ప్రభాస్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'ఫౌజీ' చిత్రాన్ని దసరా సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు ఓ ప్రకటనలో తెలిపింది నిర్మాణ సంస్థ. విరామం లేకుండా చిత్రీకరణని పూర్తి చేసి సినిమాని తెలుగుతోపాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీ భాషల్లో విడుదల చేస్తున్నట్టు అందులో పేర్కొంది. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ప్రభాస్ సరసన ఇమాన్వి నటిస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. టి - సిరీస్‌కు చెందిన గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్ సమర్పిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో భారీ హంగులతో రూపొందుతున్న ఈ సినిమాలో ప్రభాస్ ఓ కొత్త అవతారంలో కనిపిస్తారని సినీ వర్గాలు చెప్పాయి. మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్, జయప్రద, భానుచందర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: సుదీప్ ఛటర్జీ, సంగీతం: విశాల్ చంద్రశేఖర్, ప్రొడక్షన్ డిజైన్: అనిల్ విలాస్ జాదవ్, కూర్పు: కోటగిరి వెంకటేశ్వరరావు.

లాల్.. లవ్‌లాజన్


మోహన్ లాల్

మనిషి రూపంలో ఉన్న స్వచ్ఛమైన ప్రేమను పరిచయం చేస్తున్నానంటూ.. మలయాళ అగ్ర కథానాయకుడు మోహన్ లాల్ తన రాబోయే చిత్రంలోని ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. గతేడాది బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించిన 'తుడరుమ్' చిత్రం తర్వాత.. దర్శకుడు తరుణ్ మూర్తితో మోహన్ లాల్ హీరోగా ఎల్366(వర్కింగ్ టైటిల్) పేరుతో ఓ సినిమా తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా నుంచి ఆయన పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్‌ని పంచుకుంది చిత్రబృందం. ఈ సినిమాలో 'టి.ఎస్.లవ్‌లాజన్' అనే పోలీసు అధికారిగా ప్రేక్షకుల్ని అలరించనున్నారు మోహన్ లాల్. మీరా జాస్మిన్ ఈ చిత్రంలో ఓ కీలక పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాని యాక్షన్ కామెడీగా రూపొందిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం పలు చిత్రాలతో బిజీగా ఉన్నా మోహన్‌లాల్ 'దృశ్యం 3', 'పేట్రియాట్' చిత్రాలతో ఏప్రిల్‌లో థియేటర్లో సందడి చేయనున్నారు.

ఏప్రిల్ 7న విడుదల?


మహేశ్‌బాబు

ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు ఆత్రుతగా ఎదురు చూస్తున్న సినిమాల్లో 'వారణాసి' ఒకటి. మహేశ్‌బాబు - ఎస్.ఎస్.రాజమౌళి కలయికలో రూపొందుతున్న ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 7న విడుదల అంటూ ప్రచారం ఊపందుకుంది. వారణాసిలో వెలసిన హోర్డింగులే ఈ ప్రచారానికి కారణం. వివరాలేవీ లేకుండా కేవలం విడుదల తేదీతో దర్శనమిస్తున్న ఆ హోర్డింగులు 'వారణాసి' సినిమాకి సంబంధించినవే అని సమాచారం. తెలుగునాట ఉగాది, ఉత్తర భారతంలో గుడి పడ్వా పండుగల్ని పురస్కరించుకుని ఆ రోజు చిత్రాన్ని విడుదల చేయాలని చిత్రబృందం నిర్ణయించినట్టు తెలుస్తోంది. త్వరలోనే ఈ సినిమా విడుదలపై స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. పురాణాలు, కాల ప్రయాణం ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రంలో మహేశ్‌బాబు సరసన ప్రియాంక చోప్రా నటిస్తున్నారు. కె.ఎల్.నారాయణ, ఎస్.ఎస్.కార్తికేయ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ఎం.ఎం. కీరవాణి స్వరాలు సమకూరుస్తున్నారు.

ఎన్టీఆర్ హక్కులకు రక్షణ


ఎన్టీఆర్

వాణిజ్యపరమైన ప్రయోజనాల కోసం అనుమతి లేకుండా కథానాయకుడు ఎన్టీఆర్ పేరు, ఆయన ఇమేజ్‌ని, గుర్తింపుని వాడటం చట్ట విరుద్ధమని దిల్లీ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. వివిధ మాధ్యమాల్లో తన పేరు, ఫొటోలు, గుర్తింపుని వాణిజ్య ప్రయోజనాల కోసం వాడుతున్నట్టుగా తెలిసి ఎన్టీఆర్ ఇటీవల న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దిల్లీ హైకోర్టు ఆ పిటిషన్‌ని పరిశీలించి, ఎన్టీఆర్ వ్యక్తిత్వ, ప్రచార హక్కులకు రక్షణ కల్పిస్తూ ఆదేశాల్ని జారీ చేసింది. నందమూరి తారక రామారావు, ఎన్టీఆర్, జూనియర్ ఎన్టీఆర్, తారక్, యంగ్‌టైగర్, మ్యాన్ ఆఫ్ మాసెస్ తదితర పేర్లని కానీ, ఆయన ఫొటోల్ని కానీ వాడటం చట్ట విరుద్ధమని, ఆయన పేరుపైన, ఇమేజ్‌పైన ఆయనకు మాత్రమే హక్కులు ఉంటాయని ఆ ఆదేశాల్లో న్యాయస్థానం పేర్కొంది. ఒక వ్యక్తి పేరు, ఇమేజ్‌లాంటి వ్యక్తిత్వ హక్కులనేవి జీవించే హక్కు, స్వేచ్ఛతోనే కలిసి ఉంటాయని చెప్పిన న్యాయస్థానం, సామాజిక మాధ్యమాల్లోనూ హక్కుని ఉల్లంఘించిన కంటెంట్‌నీ తొలగించాలంటూ ఫేస్‌బుక్, యూట్యూబ్ తదితర సంస్థలకు తెలియజేసింది. డిజిటల్ కంటెంట్, మార్ఫ్ చేసిన ఫొటోలు, ఏఐ కంటెంట్, ఇతర ఏదైనా సాంకేతికతని ఉపయోగించి ఎన్టీఆర్ పేరు, ప్రతిష్ఠకీ నష్టం కలిగించేలా ప్రవర్తిస్తే చట్ట పరమైన చర్యలకు బాధ్యులు కావల్సి ఉంటుందని న్యాయస్థానం జారీ చేసిన ఆదేశాల్లో పేర్కొంది.

'ది బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్' నిర్మాతలకు ఊరట

సమీర్ వాంఖడే దావాను కొట్టేసిన దిల్లీ హైకోర్టు


'ది బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్'

'ది బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్' సిరీస్‌పై నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో మాజీ అధికారి సమీర్ వాంఖడే వేసిన దావాను నేడు దిల్లీ హైకోర్టు కొట్టివేసింది. హిందీ అగ్రహీరో షారుక్ ఖాన్ కుమారుడు ఆర్యన్ ఖాన్ దర్శకుడిగా పరిచయమైన సిరీస్ ఇది. ఇందులో తనను తప్పుగా చూపించారంటూ సమీర్ వాంఖడే ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలోనే షారుక్, రెడ్ చిల్లీ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థపై పరువు నష్టం దావా వేసిన సంగతి తెలిసిందే. గురువారం ఈ దావాపై విచారణ జరిపిన దిల్లీ హైకోర్టు దీన్ని కొట్టివేసింది. ఈ దావాను విచారించడానికి దిల్లీ హైకోర్టుకు ప్రాంతీయ అధికార పరిధి లేదని, ముంబయిలోని కోర్టులకు అలాంటి పిటిషన్‌ను పరిష్కరించే అధికారం ఉందని పేర్కొంది. దీంతో ఈ సిరీస్ నిర్మాతలకు ఊరట లభించింది.

తెలుగులోనూ చెప్పాల్సిన కథ


సృజన్ యరబోలు

ఎన్నిసార్లు చూసినా మళ్లీ మళ్లీ చూడాలనుకునే కథతోనే 'ఓం శాంతి శాంతి శాంతిః' చిత్రం తెరకెక్కిందన్నారు సృజన్ యరబోలు. తెలుగు ప్రేక్షకుల అభిరుచులకు తగ్గట్టుగా, ఓ ఒరిజినల్ సినిమాలా రూపొందించామని చెప్పారు. ఆయనతోపాటు ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణని, అనూప్ చంద్రశేఖరన్, సాధిక్ షేక్, నవీన్ శనివారపు కలిసి నిర్మించిన చిత్రమిది. తరుణ్‌భాస్కర్, ఈషారెబ్బా జంటగా నటించారు. ఏఆర్ సజీవ్ దర్శకుడు. మలయాళంలో విజయవంతమైన 'జయ జయ జయ జయ హే' చిత్రానికి రీమేక్‌గా రూపొందిన ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు నిర్మాత సృజన్ యరబోలు. "ఇంటింటి రామాయణంలా ప్రతి ఇంట్లో జరిగే కథ ఇది. మాతృక చిత్రం చూడగానే మా ఊళ్లో నేను చూసిన దృశ్యాలు కళ్లముందు మెదిలాయి. ఆడవాళ్లపై చేయి చేసుకోవడాన్ని మనం చూస్తుంటాం. కానీ వాళ్లు ఎదురు తిరిగితే పరిస్థితి ఎలా ఉంటుందో ఇందులో చూపించిన తీరు చాలా నచ్చింది. తెలుగులోనూ చెప్పాల్సిన కథ అని ఆ క్షణమే అనిపించింది. చాలా మంది రీమేక్ రీమేక్ అంటున్నారు కానీ, మనం చాలాసార్లు విన్న రామాయణం కథని మరోసారి తెరకెక్కిస్తే రీమేక్ అంటామా? ఆసక్తిగా వెళ్లి చూస్తాం కదా. ఇది కూడా అంతే ఆసక్తిని రేకెత్తించే కథ. తరుణ్‌భాస్కర్, ఈషా రెబ్బా పాత్రల్లో జీవించారు. మొదట ఈ సినిమాకి దర్శకత్వం కూడా చేయమని తరుణ్‌కి చెప్పా. కానీ ఆయన రీమేక్స్ చేయనని చెప్పారు. దాంతో '35 చిన్న కథ కాదు' సినిమాకి పనిచేసిన ఏఆర్ సజీవ్‌కి ఆ బాధ్యతల్ని అప్పజెప్పాం. చాలా బాగా తెరకెక్కించాడు" అన్నారు సృజన్.

అల్లు అర్జున్ సరసన శ్రద్ధ?


అల్లు అర్జున్


శ్రద్ధా కపూర్

తమిళ దర్శకులతో వరుసగా సినిమాలు చేస్తున్నారు అల్లు అర్జున్. ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో సినిమా చేస్తున్న ఆయన, ఇటీవల లోకేశ్ కనగరాజ్ కథకి పచ్చజెండా ఊపిన సంగతి తెలిసిందే. ఆ ప్రాజెక్ట్‌ని ఇటీవలే అధికారికంగా ప్రకటించారు. అందులో కథానాయికగా బాలీవుడ్ భామ శ్రద్ధా కపూర్ పేరుని పరిశీలిస్తున్నట్టు సమాచారం. అల్లు అర్జున్ సినిమా అంటే పాన్ ఇండియా హంగులు ఖాయం. అందుకు తగ్గట్టుగానే నటీనటుల ఎంపిక జరుగుతోందని, ఆ లెక్కల మేరకే శ్రద్ధాకపూర్ పేరుని పరిశీలిస్తున్నారని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఏప్రిల్‌లో అల్లు అర్జున్ పుట్టినరోజు. ఆ సందర్భంగా ఆయన సినిమాలకి సంబంధించిన పలు విషయాలు అధికారికంగా వెల్లడయ్యే అవకాశాలు ఉన్నాయి.

ఇంకా సంగీతం తెలియదు.. అందుకే నేటికీ పనిచేస్తున్నా

– ఇళయరాజా



ఇప్పటి వరకు 1541 చిత్రాలకు పాటలు, నేపథ్య సంగీతం అందించినప్పటికీ తనకు ఇంకా సంగీతం తెలియదని.. అందుకే ఇప్పటికీ తాను పనిచేస్తూనే ఉన్నానని అన్నారు ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా. ఎన్నో వేల పాటలకు ప్రాణం పోసిన ఆయన్ను ప్రతిష్ఠాత్మక పద్మపాణి అవార్డు వరించిన సంగతి తెలిసిందే. తాజాగా మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో జరుగుతోన్న 11వ అజంతా ఎల్లోరా అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో ఈ పురస్కారాన్ని అందుకున్నారు ఇళయరాజా. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "నేను నా 1541వ చిత్రానికి నేపథ్య సంగీతం పూర్తి చేసి ఇప్పుడే ఇక్కడికి వచ్చా. ఒక పాట లేదా ట్యూన్‌ను నేను ఎలా స్వరపరుస్తానని ప్రేక్షకులు నన్ను అడుగుతారు. నాకు సంగీతం తెలియదని వారికి చెబుతాను. అందుకే ఇప్పటికీ పనిచేస్తున్నా. నాకు సంగీతం గురించి అంతా తెలిసి ఉంటే.. నేను దానిలో ప్రావీణ్యం సంపాదించానని భావించి ఇంట్లోనే ఉండిపోయేవాణ్ని" అని అన్నారు.

వెంకీ చిత్రంలో మరో హీరో


వెంకటేశ్

మరోసారి సంక్రాంతికే వచ్చి, వినోదాలు పంచేందుకు వెంకటేశ్ - అనిల్ రావిపూడి సిద్ధమైనట్టు తెలుస్తోంది. 'ఎఫ్ 2' మొదలుకొని 'మన శంకరవర ప్రసాద్‌గారు' వరకూ వరుసగా విజయాల్ని అందుకున్న కలయిక వీళ్లది. సంక్రాంతి పండగ ఈ ఇద్దరికీ బాగా అచ్చొచ్చింది. అందుకే మళ్లీ సంక్రాంతినే లక్ష్యంగా చేసుకుని ఈ ఇద్దరూ కలిసి సినిమా చేయబోతున్నట్టు తెలుస్తోంది. త్వరలోనే ఆ చిత్రం గురించి అధికారికంగా వివరాలు వెల్లడయ్యే అవకాశాలు ఉన్నాయి. అయితే తాజాగా ఈచిత్రం గురించి ఓ ఆసక్తికరమైన విషయం వెలుగులోకి వచ్చింది. ఇందులో వెంకటేశ్‌తోపాటు, మరో కథానాయకుడు కూడా ఉంటాడని సమాచారం. ఆ పాత్ర కోసం కార్తి, ఫహద్ ఫాజిల్ తదితర పేర్లని పరిశీలిస్తున్నట్టు ప్రచారం సాగుతోంది.

కొహరా నుంచి కొత్త కేసుతో.. సీజన్ 2


'కొహరా సీజన్ 2'

క్రైమ్ థ్రిల్లర్‌గా విడుదలై 2024లో ప్రేక్షకుల్ని మెప్పించిన సిరీస్ 'కొహరా'. ఇప్పుడీ సిరీస్ రెండో సీజన్‌తో మరోసారి ప్రేక్షకుల్ని అలరించేందుకు సన్నద్ధమైంది. మోనా సింగ్, బరున్ సోబ్తి ప్రధాన పాత్రల్లో 'కొహరా సీజన్ 2' రూపొందుతోంది. సుదీప్ శర్మ, ఫైసల్ రెహమాన్ ఈ సిరీస్‌కు దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా కొహరా నుంచి కొత్త కేసు బయటపడుతోందంటూ సిరీస్ బృందం సామాజిక మాధ్యమాల వేదికగా అధికారిక ట్రైలర్‌ను ఆవిష్కరించింది. 'ఆడవాళ్లు చాలా వింతైన స్వభావం కలిగిన వాళ్లు మేడమ్' 'మగవాళ్లేం తక్కువ కాదు..' 'నా భర్త నాలుగు రోజులుగా కనిపించడం లేదు.. అయినా నన్ను నేను నిరూపించుకోవడానికి ఇక్కడ 16 గంటలు డ్యూటీ చేస్తున్నాను.. ఇకేం చేయాలి?' లాంటి సంభాషణలతో సాగుతున్న ఈ ట్రైలర్ ఉత్కంఠభరితమైన సన్నివేశాలతో సిరీస్‌పై ఆసక్తిని రేకెత్తించేలా ఉంది. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఈ సిరీస్ ఫిబ్రవరి 11 నుంచి వీక్షకులకు అందుబాటులోకి రానుంది. ఈ సీజన్ ప్రధానంగా ఒక మహిళ హత్య చుట్టూ తిరిగే థ్రిల్లింగ్ కథాంశంతో తెరకెక్కినట్లు ట్రైలర్‌తో స్పష్టమవుతోంది.

నీ మాయలో పడేట్టుగా...


'అసురగణ రుద్ర'

నరేశ్ అగస్త్య కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'అసురగణ రుద్ర'. సంగీర్తన విపిన్, ఆర్యన్ రాజేశ్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. మురళీ కాట్రగడ్డ దర్శకత్వం వహిస్తున్నారు. మురళీ కమ్ముల, వంశీ కమ్ముల నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలోని 'నీ మాయలో పడేట్టుగా...' అంటూ సాగే పాటని ఇటీవల విడుదల చేశారు. శేఖర్‌చంద్ర స్వరపరిచిన ఈ పాటని చైతు సత్సంగి రచించగా, రమ్య బెహరా, సిద్ధార్థ్ మేనన్ ఆలపించారు. "కొత్తగా పెళ్లయిన జంట చేసుకున్న ఒక ప్రేమ వేడుకలాంటి పాట ఇది. సంగీత ప్రేమికుల మనసుల్లో ప్రత్యేక స్థానం సొంతం చేసుకుంటుంద"ని తెలిపాయి సినీ వర్గాలు. మురళీశర్మ, శత్రు, రవి వర్మ, శుభలేఖ సుధాకర్, ప్రియాంక శర్మ, ఆర్యన్ రాజేశ్, అమిత్‌శర్మ, దేవిప్రసాద్, ఆమని, నిఖిల్ దేవదూల, బేబి శ్రీదేవి తదితరులు నటించిన ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: అమర్‌నాథ్ బొమ్మిరెడ్డి.

ప్రేమికుల రోజునే.. ప్రేమకి ఇన్సూరెన్స్


కృతి శెట్టి

ప్రేమికుల రోజునే.. లవ్‌కి ఇన్సూరెన్స్ చేయించడానికి సిద్ధమవుతోందట కథానాయిక కృతి శెట్టి. ఇదంతా ఆమె నటించిన 'ఎల్ఐకే' (లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ) గురించే. కృతి, తమిళ హీరో ప్రదీప్ రంగనాథన్ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రమిది. భారీ బడ్జెట్‌తో టైమ్ ట్రావెల్ నేపథ్యంలో విఘ్నేశ్ శివన్ తెరకెక్కించారు. గతేడాదే థియేటర్లలోకి రావాల్సిన ఈ సినిమా అనుకోని కారణాలతో పలు మార్లు వాయిదా పడిన సంగతి తెలిసిందే. ఇప్పుడు దీన్ని ప్రేమికుల రోజు సందర్భంగా ఫిబ్రవరి 12న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్ణయం తీసుకున్నట్లు చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఈ రొమాంటిక్ ప్రేమకథలో ఎస్‌జే సూర్య, గౌరీ కిషన్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు.

పొద్దుపోయేలోగా హంతకుడిని పట్టుకుంటా!


రాజ్ బి.శెట్టి

పొద్దుపోయేలోగా ఎలాగైనా హంతకుడిని పట్టుకొని నిజం చెప్పిస్తా అంటూ శపథం చేస్తున్నారు కన్నడ నటుడు రాజ్ బి.శెట్టి. మరి ఆయన మాట మీద నిలబడ్డారో లేదో తెలుసుకోవాలంటే 'రక్కసపురదోల్' సినిమా చూడాల్సిందే. రాజ్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రంతోనే రవి సారంగ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ చిత్రం ఫిబ్రవరి 6న థియేటర్లలోకి రాబోతుంది. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమాలను పరుగులు పెట్టిస్తోంది చిత్రబృందం. ఇందులో భాగంగానే తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసింది. ఇందులో పోలీసు అధికారిగా కనిపిస్తూ సినీప్రియుల దృష్టిని ఆకట్టుకుంటున్నారు రాజ్ బి.శెట్టి. ఓ హత్య కేసు నేపథ్యంలో దీన్ని తీర్చిదిద్దినట్లు ట్రైలర్‌తో స్పష్టమవుతోంది. ఈ ఇన్వెస్టిగేటివ్ క్రైమ్ థ్రిల్లర్‌లో స్వాతిష్ట కృష్ణన్, అర్చన, గోపాలకృష్ణ దేశ్‌పాండే తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. కె.రవివర్మ నిర్మించారు.

సంగీత దర్శకుడు నల్లూరి సుధీర్‌కుమార్ మృతి



దూరదర్శన్‌లో తొలితరం టీవీ సీరియళ్ల సంగీత దర్శకుడు, లలిత సంగీత గాయకుడు నల్లూరి సుధీర్ కుమార్(71).. గురువారం ఉదయం హైదరాబాద్‌లోని తన ఇంట్లో గుండెపోటుతో మృతి చెందారు. తెలుగు నాట అనేక టీవీ సీరియళ్లకు, రేడియో కార్యక్రమాలకు సంగీత దర్శకుడిగా సుధీర్‌కుమార్ విశేష సేవలందించారు. 1980 నుంచి 2000 వరకు టీవీ సంగీత దర్శకుడిగా ఆయన పేరు మారుమోగింది. దూరదర్శన్‌లో ప్రసారమైన కిట్టిగాడు, అనగనగా ఒక శోభ.. తదితర సీరియళ్లతో పాటు దేశభక్తి పాటలు, టీవీలో ప్రసారమైన వాణిజ్య ప్రకటనలు, పలు రాజకీయ పార్టీల పాటలకు సంగీత దర్శకుడిగానూ పని చేశారు. 'అగ్ని ప్రవేశం' తెలుగు సినిమాకు తొలిసారి సంగీత దర్శకుడిగా వ్యవహరించారు. ఆ తర్వాత అమ్మో అల్లుడా, కూతురు, అత్తా నీ కొడుకు జాగ్రత్త తదితర సినిమాలకు సంగీతం అందించారు. పలు కన్నడ సినిమాల్లోనూ నటించారు. టీవీ సంగీత దర్శకుడిగా ఆరు నంది అవార్డులను సుధీర్‌కుమార్ సొంతం చేసుకున్నారు. ఆయనకు భార్య విజయలక్ష్మి, కుమార్తెలు రమ్యశ్రుతి, శ్రావ్యశ్రుతిలు ఉన్నారు. ఆయన పెద్ద కుమార్తె రమ్యశ్రుతి గాయకురాలిగా రాణిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా మచిలీపట్నంలో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు సుధీర్‌కుమార్ కుమార్తె రమ్యశ్రుతి 'న్యూస్‌టుడే'కు తెలిపారు. –న్యూస్‌టుడే, బర్కత్‌పుర

పసిడి.. వెండి ధరలు అధికంగానే!

ఈ ఏడాదిపై ఆర్థిక సర్వే అంచనా



అంతర్జాతీయ అనిశ్చితుల కారణంగా పసిడి, వెండి ధరలు ఈ ఏడాదీ అధిక స్థాయుల్లోనే కొనసాగొచ్చని ఆర్థిక సర్వే అంచనా వేసింది. అయితే 2025 స్థాయిలో, ఈ లోహాల ధరల వృద్ధి కొనసాగకపోవచ్చని విశ్లేషకులు చెబుతున్నట్లు పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా శాంతి పవనాలు వీచి, వాణిజ్య యుద్ధాలకు పరిష్కారం లభిస్తేనే వీటి ధరలు చల్లబడతాయని పేర్కొంది. సురక్షిత పెట్టుబడిగా భావిస్తున్న పసిడి, వెండిలోకి పెట్టుబడులను మదుపర్లు మళ్లిస్తున్నారు. అందువల్లే 2025లో వీటి ధరలు జీవనకాల గరిష్ఠాలకు చేరాయని తెలిపింది. గురువారం ఎంసీఎక్స్‌లో వెండి ఫ్యూచర్స్ ధర ఒకదశలో కిలో రూ.4 లక్షలకు మించగా, 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1.8 లక్షలను అధిగమించింది. సర్వేలో మరిన్ని వివరాలు..

ఇంటి రుణాలు నాలుగింతలు



కరోనా పరిణామాల అనంతరం సొంత ఇంటి కొనుగోళ్లు పెరగడంతో, గృహ రుణాలకు గిరాకీ అధికమైంది. పదేళ్ల కిందటితో పోలిస్తే ఇవి 2025 మార్చి చివరకు నాలుగింతలై రూ.37 లక్షల కోట్లకు చేరాయి. 2015 మార్చిలో ఇవి రూ.10 లక్షల కోట్లలోపే ఉన్నాయి. ఇంటి రుణాలు-జీడీపీ వాటా 2015లో 8% కాగా, 2024-25 కల్లా ఇది 11 శాతానికి చేరింది.
✦ గత దశాబ్దకాలంలో వార్షిక జీడీపీకి స్థిరాస్తి రంగం 7% వాటాను అందజేసింది. రెరా, జీఎస్‌టీ, అందరికీ ఇళ్లు, తక్కువ వడ్డీ రేట్లు, రుణ ప్రక్రియ సులభతరం కావడం, అందుబాటు గృహ నిధి.. వంటివి ఇందుకు సహకరించాయి.

పారిశ్రామిక క్లస్టర్లను బలోపేతం చేయాలి



అంతర్జాతీయంగా పోటీనివ్వాలంటే భారత్ తన పారిశ్రామిక క్లస్టర్ వ్యూహాన్ని మరింత బలోపేతం చేయాలి. అధిక ఉత్పాదకత, సంస్కరణలతో కూడిన వ్యవస్థను పునర్నిర్మించాలని ఆర్థిక సర్వే సూచించింది. కొన్ని దశాబ్దాలుగా వివిధ పథకాల కింద పారిశ్రామిక క్లస్టర్ల నిర్మాణానికి భారత్ కృషి చేసింది. ఐఎఫ్ఎస్‌సీఏ, గిఫ్ట్ సిటీ తరహాలో సంస్థాగత వ్యవస్థలతో కలవడం వల్ల మరింత సాధికారత లభిస్తుందని వెల్లడించింది.

ఐపీఓ మార్కెట్ అదుర్స్



2025-26లో మన దేశ ప్రాథమిక క్యాపిటల్ మార్కెట్లు అద్భుతంగా రాణించాయి. అనిశ్చిత పరిస్థితుల్లోనూ.. ఐపీఓల్లో అంతర్జాతీయ అగ్రగామిగా నిలిచాం. బలమైన సూక్ష్మఆర్థిక మూలాలు, దేశీయ మదుపర్ల ప్రాతినిధ్యం, సెబీ సంస్కరణలు ఇందుకు తోడ్పడ్డాయి. 2025 ఏప్రిల్- డిసెంబరు మధ్య 94 ఐపీఓల ద్వారా కంపెనీలు రూ.1.60 లక్షలకోట్లు సమీకరించాయి.

విమానాశ్రయాలు మరీ తక్కువ



భారత పౌర విమానయానం స్థిర వృద్ధి బాటలో వెళుతోందని ఆర్థిక సర్వే పేర్కొంది. 2014లో విమానాశ్రయాల సంఖ్య 74 కాగా.. ఇపుడు 164కు చేరాయి. 2024-25లో 41.2 కోట్ల మంది దేశీయ విమానాశ్రయాల ద్వారా ప్రయాణించారు. ప్రస్తుతం పది లక్షల మందికి 0.11 చొప్పున విమానాశ్రయాలు మనదేశంలో ఉన్నాయి. అమెరికా (47.35)లో చాల ఎక్కువ కాగా, చైనా (0.39) కంటే మన దగ్గర తక్కువే. కాబట్టి మరింత వృద్ధికి అవకాశాలున్నాయి.

ద్రవ్యోల్బణం పెద్దగా పెరగదు



పసిడి, వెండి ధరలు పెరుగుతున్నా, 2026-27లో ద్రవ్యోల్బణం పెద్ద ఆందోళనకరంగా మారదు. బలమైన వ్యవసాయ దిగుబడులు, స్థిరమైన అంతర్జాతీయ కమొడిటీ ధరల వల్ల ఆర్‌బీఐ లక్ష్యంలోపే ద్రవ్యోల్బణం కొనసాగుతుందని పేర్కొంది. ప్రాథమిక లోహాల ధరల పెరుగుదల, కరెన్సీ హెచ్చుతగ్గులు, అంతర్జాతీయ అనిశ్చితుల వంటివి ద్రవ్యోల్బణాన్ని పెంచే అంశాలు.

ప్రపంచానికి రాగి కొరత!




కృత్రిమ మేధ (ఏఐ) డేటా సెంటర్ల నిమిత్తం విద్యుత్ గిరాకీ అధికమవుతోంది. విద్యుత్తు సరఫరాకు రాగి కావాలి. ప్రపంచం త్వరలోనే రాగి కొరతను ఎదుర్కోనుందని ఆర్థిక సర్వే హెచ్చరించింది. ఇండోనేషియా, కాంగో, చిలీ గనుల్లో అంతరాయాల కారణంగా.. రాగి ధరలు హెచ్చుతగ్గులకు లోనుకానున్నాయని తెలిపింది. ఒక గిగావాట్ విండ్ టర్బైన్‌కు 2866 టన్నుల రాగి కావాలి.

'స్వదేశీ' ముఖ్యమే కానీ..



ఎగుమతుల విషయంలో ఎదురవుతున్న అవాంతరాల దృష్ట్యా భారత్ 'స్వదేశీ' బాట పట్టడం అత్యంత అవసరమని ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. అయితే అది క్రమశిక్షణ కలిగిన వ్యూహంతో ఉండాలి మినహా, అన్ని దిగుమతులకూ అడ్డుకట్ట వేయడం మంచిది కాదని ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. దీర్ఘకాల పోటీతత్వాన్ని రక్షించేందుకు, దిగుమతులన్నిటికీ ప్రత్యామ్నాయాన్ని వెతకలేమని స్పష్టం చేసింది.
✦ దిగుమతుల విషయంలో తెలివైన, షరతులతో కూడి రక్షణాత్మక విధానాలు అవసరం అని తెలిపింది. సామర్థ్యం, ఆవిష్కరణతత్వానికి భంగం కలగకుండా చూసుకోవాలని పేర్కొంది.

ఔషధ రంగం స్ఫూర్తిగా..



దేశీయ ఔషధ రంగం నుంచి భారత కార్పొరేట్ రంగం స్ఫూర్తిపొందాలని ఆర్థిక సర్వే పేర్కొంది. అంతర్జాతీయ టారిఫ్ విధానాలను ఎలా తట్టుకోవాలో ఈ రంగం చూపించిందని తెలిపింది. ప్రత్యామ్నాయ ఉత్పత్తి మార్గాలను అభివృద్ధి చేసుకోవడం ద్వారా, భారత ఫార్మా కంపెనీలు పేటెంట్ డ్రగ్స్‌ను సులువుగా, చట్టబద్ధంగా రెప్లికేట్ చేయగలిగాయి.

ఎఫ్‌టీఏల మద్దతు



పలు దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏలు) ఖరారు చేయడంపై భారత్ దృష్టి పెట్టింది. మన దేశ వాణిజ్య వ్యూహాలకు ఎఫ్‌టీఏలు తోడ్పడనున్నాయి. అంతర్జాతీయ అనిశ్చితుల నేపథ్యంలో పలు దేశాల మార్కెట్లలోకి అడుగుపెట్టేందుకు ఇవి వీలు కల్పించనున్నాయి. ఎగుమతుల జోరును కొనసాగించడానికి, కొత్త దేశాల విపణుల్లోకి అడుగుపెట్టడానికి ఇవి దోహదపడనున్నాయి.

ఆర్థిక మూలాలను రూపాయి ప్రతిబింబించడం లేదు

డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ 92 స్థాయికి పడిపోయింది. డాలర్‌కు గిరాకీ, అంతర్జాతీయ పరిస్థితులు ఇందుకు కారణమవుతున్నాయి. అయితే మన దేశ బలమైన ఆర్థిక మూలాలను రూపాయి కచ్చితంగా ప్రతిబింబించడం లేదని సర్వే స్పష్టం చేసింది. రూపాయి విలువ, వాస్తవ పరిస్థితుల కంటే తక్కువగా ఉందని పేర్కొంది. ద్రవ్యోల్బణం అదుపులో ఉండి, వృద్ధి అంచనాలు సానుకూలంగా ఉన్నప్పటికీ.. రూపాయి క్షీణత భారత్‌లో పెట్టుబడులపై ప్రభావం చూపుతోంది. చెల్లింపుల సమతుల్యతను కొనసాగించడానికి, మన దేశం విదేశీ మూలధనంపై ఆధారపడుతోంది.

ప్రమాదంలో ఆహార భద్రత



ఇంధన భద్రత వ్యూహంలో భాగంగా, పెట్రోల్‌లో కొంతమేర ఇథనాల్ కలిపే కార్యక్రమాన్ని మనదేశం చేపట్టింది. దీంతో దేశానికి రూ.1.44 లక్షల కోట్లకు పైగా విదేశీ మారకపు ద్రవ్యం ఆదా అయింది. 2025 ఆగస్టుకు దాదాపు 245 లక్షల మెట్రిక్ టన్నుల ముడిచమురును ఇథనాల్ భర్తీ చేసింది. కానీ ఈ ప్రక్రియను వేగంగా అమలు చేయడం వల్ల, ఊహించని పరిణామాలు ఏర్పడుతున్నాయని సర్వే హెచ్చరించింది. మొక్కజొన్న ఆధారిత ఇథనాల్‌కు అనుకూలంగా ప్రభుత్వ ధరల నిర్ణయాలు ఉండటంతో, రైతులు పప్పులు, నూనెగింజల సాగుకు దూరమవుతున్నారు. ఇది దీర్ఘకాలిక ఆహార భద్రత, పోషకాహారంపై ఆందోళనలను లేవనెత్తుతోంది.

ఒకేసారి మారథాన్, స్ప్రింట్‌గా



ప్రపంచ భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో భారత్ ఒకేసమయంలో 'మారథాన్, స్ప్రింట్'గా పరుగులు పెట్టాలని లేదా స్ప్రింట్ లాగా మారథాన్ పరుగుతీయాలని ఆర్థిక సర్వే సూచించింది. రాబోయే సంవత్సరాల్లో పెట్టుబడులు, సరఫరా వ్యవస్థలు, వృద్ధి అంశాలపై భౌగోళిక రాజకీయ అంశాల ప్రభావం ఉంటుంది. ప్రపంచ రూపురేఖలను ఇవి మార్చివేసే అవకాశం ఉంది. స్వల్పకాలంలో పరిష్కారాలను కోరుకునే బదులు, బలమైన, వినూత్న ఆవిష్కరణలతో వికసిత్ భారత్ దిశగా అడుగులు వేయాలి. విధానపరమైన విశ్వసనీయత, అంచనాలు, పరిపాలనాపరమైన క్రమశిక్షణ చాలా కీలకంగా మారొచ్చు.

అడ్డంకిగా అరుదైన ఖనిజాలు



అంతర్జాతీయ ఇంధన మార్పులకు ఇప్పటి వరకు టెక్నాలజీపరమైన అడ్డంకులు ఎదురయ్యేవి. అయితే ఇప్పుడు కీలక ఖనిజాలు, రాగి, అరుదైన భూ అయస్కాంతాల వంటి 'వ్యూహాత్మక అడ్డంకులు'గా మారుతున్నాయని సర్వే పేర్కొంది. కీలక సరఫరా దేశాల ఎగుమతి ఆంక్షల కారణంగా తక్కువ కర్బన ఆర్థిక వ్యవస్థలను, ఇంధన భద్రతా, భౌగోళికరాజకీయ పరిస్థితులను శాసిస్తున్నాయని తెలిపింది. ఇండోనేషియా, కాంగో, చిలీ దేశాల్లో ఉత్పత్తి అవాంతరాల వల్ల రాగి ధరలు పరుగులు తీశాయి. లిథియం, కోబాల్ట్, నికెల్, రాగి వంటి లోహాలు, అరుదైన భూ అయస్కాంతాలకు గిరాకీ ఒక్కసారిగా పెరగడంతో ఇంధన మార్పులపై ప్రభావం పడింది.

వారసత్వ కట్టడాల వద్ద లైవ్ ఈవెంట్లు



పర్యాటక రంగానికి ఊతమివ్వాలంటే వారసత్వ కట్టడాల వద్ద లైవ్ ఈవెంట్లు నిర్వహించాలని ఆర్థిక సర్వే సూచించింది. ఆయా ప్రాంతాల వద్ద విదేశీ కరెన్సీలోల చెల్లింపులకు ఆంక్షలు ఉండరాదని తెలిపింది. మీడియా-వినోదం, పర్యాటక, అనుబంధ సేవలకు కాన్సర్ట్ ఎకానమీ అనేది వృద్ధిని తీసుకురాగలదని అభిప్రాయపడింది. లైవ్ ఎంటర్‌టైన్‌మెంట్ అనుమతులకు ఏకగవాక్ష విధానాన్ని తీసుకురావాలని తెలిపింది.
✦ అంతర్జాతీయంగా మొత్తం మ్యూజిక్ ఆదాయాల్లో లైవ్ మ్యూజిక్ వాటా మూడో వంతు ఉంది. అమెరికా ఒక్కటే 130 బి. డాలర్లను ఈ విభాగంలో ఆర్జించింది. 2019లోనే 9 లక్షల ఉద్యోగాలను సృష్టించింది.

వాహన ఎగుమతులు రయ్ రయ్



వాహన పరిశ్రమ ఎగుమతుల్లో గణనీయ వృద్ధి నమోదైంది. 2024-25లో ప్రయాణికులు, వాణిజ్య, ద్విచక్ర, త్రిచక్ర విభాగాల్లో 53 లక్షల వాహనాలు ఎగుమతి అయ్యాయి. 2025-26 ప్రథమార్ధంలో రెండంకెల వృద్ధి నమోదైంది. పలు అంతర్జాతీయ మార్కెట్లలో భారత్ తయారీ వాహనాలకు ఆదరణ పెరగడాన్ని ఇది సూచిస్తోంది. కొవిడ్ అనంతరం గిరాకీ పుంజుకోవడంతో వృద్ధి, విక్రయాల్లో మంచి వృద్ధి కనిపించింది. 2014-15 నుంచి 2024-25 మధ్య గత దశాబ్ద కాలంలో వాహన పరిశ్రమ ఉత్పత్తి 33% పెరిగింది. తయారీ, విడిభాగాల పరిశ్రమల మద్దతుతో వాహన పరిశ్రమ ప్రత్యక్షంగా, పరోక్షంగా 3 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తోంది.

ఎఫ్‌డీఐల కోసం ఆ వ్యూహం



దేశంలో పెట్టుబడులను బలోపేతం చేసేందుకు బహుముఖ వ్యూహం అవసరమని ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. అంతర్జాతీయ ఒడుదొడుకులు తీవ్రమైన నేపథ్యంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)ను కొనసాగించడం కీలక సవాల్‌గా మారింది. ఆర్థిక వృద్ధి విజయ గాథలో తదుపరి అధ్యాయంగా ఎఫ్‌డీఐ సవాల్‌ను మలచడానికి నిర్ణయాత్మకంగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని తెలిపింది. ప్రభుత్వ లక్ష్యాలు, ఆర్థిక పరిస్థితులు స్పష్టంగానే ఉన్నప్పటికీ.. ఎఫ్‌డీఐ పెట్టుబడులు రావాల్సిన దాని కంటే తక్కువగానే ఉన్నాయి.

ఎఫ్‌పీఐలు అమ్మేస్తున్నారు..



విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్ల (ఎఫ్‌పీఐ) పెట్టుబడులు 2025-26లో ఊగిసలాటకు గురయ్యాయి. 2025 డిసెంబరు నాటికి 3.9 బి.డాలర్ల మేర బయటకు వెళ్లాయి. అమెరికా, తైవాన్, కొరియా వంటి ఏఐ మార్కెట్లకు ఈ పెట్టుబడులు మళ్లాయి. 2025 ఏప్రిల్-డిసెంబరులో ఎఫ్‌పీఐలు నికర విక్రేతలుగా నిలిచారు. భారత డెట్ సెక్యూరిటీల్లో వీరు కొనుగోళ్లు జరిపినా.. ఈక్విటీల్లో ఎక్కువ విక్రయాలు చేశారు.
✦ 2025 డిసెంబరు నాటికి ఎఫ్‌పీఐల చేతుల్లో రూ.81.4 లక్షల కోట్ల ఆస్తులున్నాయి. 2025 మార్చితో పోలిస్తే ఇవి 10.4% పెరగడం ఊరటనిచ్చే అంశం.

ఉక్కు రంగానికి ధరల సవాళ్లు



అంతర్జాతీయ ఉక్కు ధరల్లో అసమానతలు, ముడి వస్తువుల రూపంలో దేశీయ ఉక్కు పరిశ్రమ సవాళ్లు ఎదుర్కొంటోంది. మన దేశ పారిశ్రామికీకరణ, మౌలిక సదుపాయలకు ఉక్కు రంగం వెన్నెముకగా ఉంది. ప్రపంచంలో రెండో అతి పెద్ద ఉక్కు ఉత్పత్తిదారుగా మన దేశం నిలిచింది. గత అయిదేళ్లలో ఈ రంగంలో గణనీయ మార్పులకు గురైంది. బలమైన దేశీయ గిరాకీ, తయారీ రంగాల అండతో స్థిరంగా పురోగతి సాధిస్తోంది. 2025-26 అక్టోబరు- అక్టోబరులో నికర ఉక్కు ఎగుమతిదారుగా కూడా నిలిచింది. తక్కువ అంతర్జాతీయ ధరలతో ఎగుమతులపై మార్జిన్లు క్షీణించడం, చౌక దిగుమతులు ఇందుకు కారణమయ్యాయి.

రూ.13,759 కోట్ల ప్రోత్సాహకాలు



మొబైల్ ఫోన్ తయారీకి ఊతమిచ్చేందుకు ప్రోత్సాహక పథకం కింద ఇచ్చిన రూ.13,759 కోట్ల ఫలితంగా, 2020 సెప్టెంబరుకు మొత్తం ఉత్పత్తి రూ.9.34 లక్షల కోట్లకు చేరింది. ఎగుమతులు రూ.5.12 లక్షల కోట్లకు చేరాయి. ఇటీవలి కాలంలో భారత ఎలక్ట్రానిక్స్ రంగం నిర్మాణాత్మక మార్పులను చవిచూసింది. ఎగుమతుల్లో 2021-22లో ఏడో అతిపెద్ద దేశం నుంచి 2024-25లో మూడో స్థానానికి ఎదిగాం. 2024-25లో దేశంలో ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి 19% పెరిగి 11.3 లక్షల కోట్లకు చేరింది. ఎగుమతులు 37.5% వృద్ధితో రూ.3.3 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. దిగుమతులు కూడా 15% పెరిగి రూ.8.4 లక్షల కోట్లుగా ఉన్నాయి.

స్వచ్ఛ ఇంధన లక్ష్యాలకు సవాళ్లు



స్వచ్ఛ ఇంధనం దిశగా అడుగులు వేస్తున్న మన దేశానికి, ముడివస్తువుల కొరత, ఇంధన నిల్వ అవసరాలు వంటి ప్రధాన అడ్డంకులుగా మారాయి. ఇంధన వనరులను విస్తరించడం, లభ్యతను పెంచడం, గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించడానికి భారత్ బహుముఖ వ్యూహాన్ని అమలు చేస్తోంది. ఇదే సమయంలో శిలాజేతర ఇంధనాల వాటాను పెంచడం, ఇంధన సామర్థ్యాలను మెరుగుపరచడం, ఇంధన వ్యవస్థల్లో స్థిరత్వం తెచ్చేందుకు చర్యలు చేపడుతోంది. దేశ అభివృద్ధి, స్థిరత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఈ వ్యూహాలు ఉన్నాయి. 2030 నాటికి నేషనల్లీ డిటర్‌మైన్డ్ కాంట్రిబ్యూషన్ (ఎన్‌డీసీ) లక్ష్యాలు సాధించడానికి సమగ్ర విధానాలను అమలు చేస్తున్నారు.

ఈనాడు బిజినెస్

4% తగ్గిన కోరమాండల్ లాభం

హైదరాబాద్: కోరమాండల్ ఇంటర్నేషనల్, అక్టోబరు- డిసెంబరులో రూ.488.47 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.507.91 కోట్లతో పోలిస్తే ఇది 4% తక్కువ. అధిక వ్యయాలు ఇందుకు కారణమని కంపెనీ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.7,048.86 కోట్ల నుంచి 26% పెరిగి రూ.8,862.64 కోట్లకు చేరింది. వ్యయాలు కూడా రూ.6,357.26 కోట్ల నుంచి 29% పెరిగి రూ.8,209.88 కోట్లుగా నమోదయ్యాయి. 'వర్షాకాలం ముగింపు ఆలస్యమవ్వడం, ముడి సరకు ధరలు పెరగడం, రూపాయి క్షీణత లాంటి సవాళ్లు ఎదురైనా.. సమీక్షా త్రైమాసికంలో మెరుగైన పనితీరును కంపెనీ కనబర్చింద'ని కోరమాండల్ ఇంటర్నేషనల్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ ఎస్ శంకరసుబ్రమణియన్ తెలిపారు. రూ.1 ముఖ విలువ గల ఒక్కో షేరుకు రూ.9 మధ్యంతర డివిడెండు చెల్లించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది.

48% తగ్గిన టాటా మోటార్స్ లాభం



దిల్లీ: టాటా మోటార్స్, డిసెంబరు త్రైమాసికంలో రూ.705 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.1,335 కోట్లతో పోలిస్తే ఇది 48% తక్కువ. కొత్త లేబర్ కోడ్ అమలు, కంపెనీ విభజన ప్రక్రియ కోసం ఏక కాల కేటాయింపులు చేయడంతో సమీక్షా త్రైమాసికంలో నికర లాభం తగ్గిందని కంపెనీ తెలిపింది. కార్యకలాపాల మొత్తం ఆదాయం రూ.18,819 కోట్ల నుంచి రూ.21,847 కోట్లకు పెరిగింది. కొత్త లేబర్ కోడ్ అమలుకు రూ.603 కోట్లు, కంపెనీ విభజన కోసం రూ.962 కోట్లు, కొనుగోలు వ్యయం కోసం రూ.82 కోట్ల కేటాయింపులు చేసింది.

కెనరా బ్యాంకు లాభం రూ.5,254 కోట్లు



ఈనాడు, హైదరాబాద్: కెనరా బ్యాంక్ డిసెంబరు త్రైమాసికంలో రూ.5,254 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.4,214 కోట్లతో పోలిస్తే ఇది 25% అధికం. వడ్డీయేతర ఆదాయం భారీగా పెరగడం, రిటెయిల్ రుణాలు పుంజుకోవడం, మొండి బాకీలు తగ్గడం ఇందుకు దోహదం చేశాయి. బ్యాంకు నికర వడ్డీ ఆదాయం రూ.9,252 కోట్లకు చేరింది. సమీక్షా త్రైమాసికంలో అన్ని విభాగాల్లోనూ బ్యాంకు మంచి పనితీరును కనబర్చిందని బ్యాంకు తాత్కాలిక ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ హర్దీప్ సింగ్ అహ్లూవాలియా చెప్పారు. రుణాల్లో 13.59%, డిపాజిట్లలో 12.95% వృద్ధి నమోదయినట్లు పేర్కొన్నారు. బంగారం రుణాల పోర్ట్‌ఫోలియో రూ.2.21 లక్షల కోట్లకు చేరిందని, 30% వృద్ధి నమోదవుతోందన్నారు. రిటెయిల్ రుణాల్లోనూ 31% వృద్ధి కనిపిస్తోందని వివరించారు.

బ్లూస్టార్ ఎండీగా బి.త్యాగరాజన్ పునర్నియామకం

ఎయిర్ కండీషనర్ల సంస్థ బ్లూస్టార్, డిసెంబరు త్రైమాసికంలో రూ.80.55 కోట్ల ఏకీకృత నికరలాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.132.46 కోట్ల కంటే ఇది 39.2% తక్కువ. కార్యకలాపాల ఆదాయం రూ.2807.36 కోట్ల నుంచి 4.2% అధికమై రూ.2925.31 కోట్లకు చేరింది. సంస్థ ఎండీగా బి.త్యాగరాజన్‌ను 2026 ఏప్రిల్ 1 నుంచి 2027 మే 24 వరకు పునర్నియమించడానికి బోర్డు ఆమోదం తెలిపింది.

కోడి గుడ్లు

30న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	515
వరంగల్	517
విజయవాడ	550
తూ/ప గోదావరి	515
విశాఖపట్నం	515
చిత్తూరు	573

2035కు 2,250 విమానాలు

35,000 మంది పైలట్లు అవసరం: ఎయిర్‌బస్ అంచనా



ఈనాడు, హైదరాబాద్: భారత విమానయాన రంగం మరింతగా వృద్ధి చెంది.. 2035 నాటికి దేశంలో వాణిజ్య విమానాల సంఖ్య 2,250కి చేరుతుందని విమాన తయారీ దిగ్గజ సంస్థ ఎయిర్‌బస్ వెల్లడించింది. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద పౌర విమానయాన విపణిగా అవతరించనుందని తెలిపింది. 2025లో ఉన్న విమానాల సంఖ్యతో పోలిస్తే, 100 సీట్ల కంటే ఎక్కువ సామర్థ్యం గల విమానాల సంఖ్య 3 రెట్లు పెరగడం ప్రపంచ విమానయాన చరిత్రలోనే అత్యంత వేగవంతమైన విస్తరణల్లో ఒకటిగా నిలవనుందని పేర్కొంది. జీ20 దేశాలలో వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ, మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం చేస్తున్న భారీ వ్యయం, భారతీయ వినియోగదారుల ప్రవర్తనలో వస్తున్న మార్పులు ఈ గిరాకీని నడిపిస్తున్నాయి. వచ్చే దశాబ్దంలో తలసరి విమాన ప్రయాణాలు 0.13 నుంచి 0.29కి పెరుగుతాయని పేర్కొంది. 2035 నాటికి పైలట్ల అవసరం ప్రస్తుత 12,000 మంది నుంచి 35,000 కు చేరుకుంటుంది. సాంకేతిక సిబ్బంది 11,000 నుంచి 34,000కు చేరతారు.

కీలకమైన హబ్‌గా..: వింగ్స్ ఇండియా 2026లో ఎయిర్‌బస్ ఇండియా, దక్షిణాసియా ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ జుర్గెన్ వెస్టర్‌మీర్ మాట్లాడుతూ 'భారత్ దేశీయ రవాణాకే పరిమితం కాకుండా, అంతర్జాతీయ విమాన రవాణాకు కీలకమైన హబ్‌గా మారనుంది. దేశీయ రవాణాకు ఏ320 విమానాలు, అంతర్జాతీయ రవాణా కోసం ఏ321ఎక్స్‌ఎల్‌ఆర్, ఏ350 విమానాలతో మద్దతు ఇచ్చేందుకు ఎయిర్‌బస్ సిద్ధంగా ఉందని తెలిపారు.

రూ.87,000 కోట్లకు ఎంఆర్‌ఓ మార్కెట్: విమానాల సంఖ్య 3 రెట్లు పెరిగితే.. నిర్వహణ, మరమ్మతు, సమగ్ర సేవల (ఎంఆర్‌ఓ) రంగానికి భారత్ ఒక ప్రధాన కేంద్రంగా మారనుంది. ఎయిర్‌ఫ్రేమ్‌లు, ఇంజిన్‌లు, విడిభాగాల మార్కెట్ 2035 నాటికి మూడు రెట్లు పెరిగి రూ.87,000 కోట్ల (9.5 బిలియన్ డాలర్ల)కు చేరుకోనుందని జుర్గన్ పేర్కొన్నారు.

శక్తి ఏవియేషన్ నుంచి ఎల్410: భారత్‌లో ఎల్410 ఎన్‌జీ విమానాలను ప్రవేశపెట్టేందుకు శక్తి ఏవియేషన్, ఆమ్నిపోల్ గ్రూపు మధ్య ఒప్పందం కుదిరింది. భారత్‌లో విమాన తయారీకి సంబంధించి ఫైనల్ అసెంబ్లీ లైన్ ఏర్పాటు, సాంకేతిక బదిలీ అంశాలను ఇరు సంస్థలూ పరిశీలిస్తున్నాయి. చిన్న, సరైన సౌకర్యాలు లేని రన్‌వేల నుంచి ఎగరగలిగే సామర్థ్యం ఉన్న ఈ 19 సీట్ల విమానం, దేశంలోని మారుమూల ప్రాంతాల అనుసంధానానికి, ప్రభుత్వ ఉడాన్ పథకానికి ఉపయోగపడుతుందని శక్తి ఏవియేషన్ ఛైర్మన్ మాణిక్యం తెలిపారు.

భారత్‌లో తయారీ.. ఐఎల్114-300: హైదరాబాద్‌కు చెందిన ఫ్లెమింగో ఏరోస్పేస్, రష్యాకు చెందిన యునైటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్ కార్పొరేషన్ (యూఏసీ) మధ్య వ్యూహాత్మక ఒప్పందం కుదిరింది. 68 సీట్ల సామర్థ్యం గల ఐఎల్-114-300 ప్రాంతీయ విమానాలు ఆరింటిని ఫ్లెమింగో కొనుగోలు చేయనుంది. ఇందుకోసం దాదాపు రూ.180 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. 2028 నుంచి ఈ విమానాల డెలివరీ ప్రారంభం అవుతుంది. వీటిని మన విమానయాన సంస్థలకు అవసరమైన విధంగా మార్చి, ఈ సంస్థ అందిస్తుంది.

ఎయిరిండియా భారీ విస్తరణ

ఎయిర్‌బస్, బోయింగ్‌లతో కీలక ఒప్పందాలు



ఈనాడు, హైదరాబాద్: టాటా గ్రూపు ఆధ్వర్యంలోని ఎయిరిండియా తన విమాన శ్రేణిని బలోపేతం చేసుకునే దిశగా మరో భారీ ముందడుగు వేసింది. అంతర్జాతీయంగా తన కార్యకలాపాలను విస్తరించడంతో పాటు, పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని తట్టుకునేందుకు ఎయిర్‌బస్, బోయింగ్ సంస్థలతో మరిన్ని ఒప్పందాలను, హైదరాబాద్‌లో జరుగుతున్న వింగ్స్ ఇండియా-2026 వేదికగా గురువారం వెల్లడించింది.

ఎయిర్‌బస్ ఆర్డర్‌లో మార్పు: గతంలో ఎయిర్‌బస్ సంస్థకు ఆర్డర్ చేసిన 210 ఏ321 నియో విమానాల్లో.. 15 విమానాలను అత్యంత అధునాతన ఏ321 ఎక్స్‌ఎల్‌ఆర్ (ఎక్స్‌ట్రా లాంగ్ రేంజ్) రకానికి మారుస్తున్నట్లు ప్రకటించింది. ఎక్స్‌ఎల్‌ఆర్ విమానాలు 2029-30 మధ్య ఎయిరిండియాకు చేరతాయి. ఒకసారి ఇంధనం నింపితే 4,700 నాటికల్ మైళ్ల (సుమారు 8,700 కిలోమీటర్లు) వరకు ఇవి ప్రయాణిస్తాయి. మరిన్ని నాన్-స్టాప్ అంతర్జాతీయ సర్వీసులు ప్రారంభించేందుకు ఉపయోగపడతాయని ఎయిరిండియా సీఈఓ క్యాంప్‌బెల్ విల్సన్ పేర్కొన్నారు.

మరో 30 బోయింగ్ విమానాలు..: బోయింగ్ నుంచి కొత్తగా 30 విమానాలు కొనుగోలు చేస్తున్నట్లు ఎయిరిండియా ప్రకటించింది. ఇందులో 737-8 రకం విమానాలు 20 కాగా, 737-10 రకం 10 విమానాలు ఉన్నాయి.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం(నష్టం) 2025-26	నికర లాభం(నష్టం) 2024-25	మొత్తం ఆదాయం 2025-26	మొత్తం ఆదాయం 2024-25
హడ్కో	713	735	3505.57	2770.14
వోల్టాస్	84.46	130.76	3071	3105
కేపీఐటీ టెక్	133	187	1617	1478
నిప్పన్ లైఫ్	404	295	705	588
డిక్సన్ టెక్నాలజీస్	321	216	10672	10454
టీడీ పవర్ సిస్టమ్స్	55	37	483	321
క్వెస్‌కార్ప్	55	42	3930	4019
జీహెచ్‌సీఎల్	106	168	773	807
ఆర్‌ఈసీ[1]	4052	4076	15059	14287
దీపక్ ఫర్టిలైజర్స్	141	253	2876	2592
స్విగ్గీ	(1065)	(799)	6148	3993
ఐఈఎక్స్	119	107	183	161
జిలెట్‌ఇండియా[2]	172	126	790	686
మహీంద్రా హాలిడేస్	1.4	35.42	753	678

1) మధ్యంతర డివిడెండ్ రూ.4.6 2) మధ్యంతర డివిడెండ్ రూ.180

అంతర్జాతీయంగా పెరిగింది.. ఇక్కడ తగ్గింది

పసిడి గిరాకీపై డబ్ల్యూజీసీ నివేదిక

బంగారం ధర దూసుకెళ్తున్నా, గతేడాదిలో అంతర్జాతీయంగా బంగారానికి గిరాకీ పెరిగిందని.. భారత్‌లో మాత్రం 11% తగ్గిందని ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) తాజా నివేదికలో వెల్లడించింది. ఈ ఏడాదిలో మన దేశంలో పసిడికి మరింత క్లిష్టపరిస్థితులే ఏర్పడనున్నాయని పేర్కొంది. ఈ నివేదిక ప్రకారం.. మన దేశంలో 2025లో 710.9 టన్నుల పసిడికి గిరాకీ ఏర్పడింది. 2024 గిరాకీ 802.8 టన్నుల కంటే ఇది 11% తక్కువ. విలువ మాత్రం రూ.5,75,930 కోట్ల నుంచి 30% పెరిగి రూ.7,51,490 కోట్లకు చేరింది. అధిక ధరల వల్ల, 2026లో పసిడికి గిరాకీ 600-700 టన్నులకు పరిమితం కావచ్చని, వినియోగదార్ల కొనుగోలు ధోరణి మారడం ఇందుకు కారణమంది.
✦ 2025 అక్టోబరు-డిసెంబరులో పసిడికి దేశీయంగా గిరాకీ 241.3 టన్నులకు పరిమితమైంది. 2024-25 ఇదే కాలంలో లభించిన గిరాకీ 265.8 టన్నుల కంటే, ఇది 9% తక్కువ. ధరలు రికార్డు స్థాయికి చేరడంతో విలువ మాత్రం రూ.2,03,070 కోట్ల నుంచి 49% పెరిగి రూ.3,03,470 కోట్లకు చేరింది. ఇదే సమయంలో ఆభరణాలకు గిరాకీ 23% తగ్గి 145.3 టన్నులకు పరిమితమైంది.

సూచీలకు 'ఆర్థిక సర్వే' జోష్

సెన్సెక్స్ ▲ 222	నిఫ్టీ ▲ 76
82566	25419

స్టాక్ మార్కెట్‌కు ఆర్థిక సర్వే జోష్ ఇచ్చింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి వృద్ధి రేటు 6.8- 7.2 శాతంగా ఉండొచ్చని అంచనా వేయడంతో, మదుపర్ల సెంటిమెంటు బలపడింది. ఫలితంగా ఒడుదొడుకుల ట్రేడింగ్‌లోనూ, మూడో రోజూ సూచీలు లాభాల్లో ముగిశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ ఎలాంటి మార్పులేకుండా 91.99 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు ధర 2.85% పెరిగి 70.35 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆర్థిక ఫలితాల ప్రభావంతో ఎల్అండ్‌టీ షేరు లాభపడగా, మారుతీ సుజుకీ షేరు డీలాపడింది. డిసెంబరు త్రైమాసికానికి ఆదాయంలో 10% వృద్ధి ప్రకటించడంతో ఎల్అండ్‌టీ షేరు బీఎస్‌ఈలో 3.66% పెరిగి రూ.3,932.45 వద్ద ముగిసింది. మారుతీ సుజుకీ షేరు బీఎస్‌ఈలో 2.54% నష్టంతో రూ.14,499.50 వద్ద ముగిసింది. బీఎస్‌ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.43,000 కోట్లు పెరిగి రూ.459.96 లక్షల కోట్ల (5 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. ✦ ఐపీఓ ద్వారా రూ.2,000 కోట్లు సమీకరించే నిమిత్తం, సెబీకి ముసాయిదా పత్రాలను టర్టిల్‌మింట్ ఫిన్‌టెక్ సొల్యూషన్స్ సమర్పించింది.

రూ.200కే ఎయిర్‌ట్యాక్సీ సేవలు!

ఈనాడు, హైదరాబాద్: ఏవియేషన్ టెక్నాలజీ సంస్థ నల్వా ఏరో, విద్యుత్తు ఎయిర్ ట్యాక్సీ సేవలను ప్రారంభించేందుకు గ్లోబల్ వెక్ట్రా హెలికార్ప్, పవన్ హన్స్ లిమిటెడ్, హిమాలయన్ హెలీ సర్వీసెస్ తదితర హెలికాప్టర్ ఆపరేటర్లతో వింగ్స్ ఇండియా వేదికగా ప్రాథమిక ఒప్పందం కుదుర్చుకుంది. ఎంపిక చేసిన కొన్ని స్వల్ప దూరాలకు కేవలం రూ.200 కే ఎయిర్‌ట్యాక్సీ సేవలను అందించాలని ఈ సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా హిమాలయన్ హెలీ సర్వీసెస్ నుంచి నల్వా ఏరోకు విమానాల తయారీ కోసం ముందస్తు ఆర్డర్లు వచ్చాయి. చార్‌ధామ్ యాత్రలు, ఎయిర్ అంబులెన్స్ సేవలు, నగరాల మధ్య రవాణా తదితర అవసరాల కోసం, వీటిని వినియోగించాలని సంస్థలు ప్రణాళిక వేస్తున్నాయి. 2028 నాటికి ఈ సేవలను అందుబాటులోకి తెచ్చేలా నల్వా ఏరో ప్రణాళికలు వేస్తోంది.

ప్రాక్టీస్ ప్రశ్నలు

అరిథ్‌మెటిక్

బహుభుజులు

1. ఒక అష్టభుజిలో కర్ణాల సంఖ్య?
   1) 15 2) 18 3) 19 4) 20
2. కింది ఏ బహుభుజిలో కర్ణాల సంఖ్య.. భుజాల సంఖ్యకు రెట్టింపు ఉంటుంది?
   1) షడ్భుజి 2) సప్తభుజి
   3) దశభుజి 4) పంచభుజి
3. ఒక క్రమ బహుభుజిలో ఒక్కో అంతర కోణం 108° అయితే దానిలోని భుజాల సంఖ్య?
   1) 5 2) 6 3) 7 4) 8
4. ఒక క్రమ బహుభుజిలో అంతర కోణం, బాహ్యకోణాలు 3 : 2 నిష్పత్తిలో ఉన్నాయి. ఆ బహుభుజి పేరు?
   1) పంచభుజి 2) షడ్భుజి
   3) సప్తభుజి 4) అష్టభుజి
5. ఒక షడ్భుజిలో ఒక శీర్షం నుంచి గీయగల కర్ణాల సంఖ్య?
   1) 9 2) 3 3) 6 4) 5
6. 3 సెం.మీ., 4 సెం.మీ., 5 సెం.మీ., 8 సెం.మీ., 10 సెం.మీ. అంచులుగా ఉన్న 5 లోహపు ఘనాలను కరిగించి ఒక పెద్ద ఘనం రూపొందించారు. దాని అంచు (సెంటీమీటర్లలో)?
   1) 15 2) 12 3) 10 4) 16

సమాధానాలు
1–4, 2–2, 3–1, 4–1, 5–2, 6–2.

ఆధునిక ప్రపంచంలో అందరి జీవితాలను ప్రభావితం చేస్తున్న అంశాల్లో అంతరిక్ష సాంకేతికత ఒకటి. ఇది కమ్యూనికేషన్, రవాణా, వ్యవసాయం, రక్షణ తదితర రంగాల ప్రగతిలో కీలకంగా మారి దేశ భవితవ్యాన్ని నిర్దేశిస్తోంది. ఇందుకు తగినట్లుగానే భారత్ అగ్ర దేశాలతో పోటీపడుతూ అంతరిక్ష ప్రయోగాలను ప్రతిష్ఠాత్మకంగా కొనసాగిస్తోంది. దేశానికి సాంకేతిక, వాణిజ్యపరమైన సేవలందించడంలో ఇప్పటికే విజయవంతమైన భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ మానవ సహిత మిషన్లు, సొంతంగా అంతరిక్ష కేంద్రం నిర్మాణం మొదలైన బృహత్ ప్రణాళికలతో ముందుకు సాగుతోంది. ఇటీవల కాలంలో క్లిష్టతరమైన డాకింగ్, బాహుబలి రాకెట్ ప్రయోగాలతో తన ఖ్యాతిని మరింత విస్తరించుకుంది. ఈ విధంగా వర్తమాన ఇస్రో ప్రయోగాలు, ఫలితాలను అభ్యర్థులు పరీక్షల కోణంలో చదువుకోవాలి. గతంలో చేసిన ప్రయోగాల్లో విజయాలతో పాటు వైఫల్యాలను గుర్తుంచుకోవాలి.



అంతరిక్ష సేవల్లో అగ్ర దేశాలతో పోటీ!



బ్లూబర్డ్-2 ఉపగ్రహాన్ని తీసుకెళుతున్న ఎల్‌వీఎం3-ఎం6 వాహక నౌక

జనరల్ స్టడీస్
సైన్స్ అండ్ టెక్నాలజీ

ఎల్‌వీఎం3-ఎం6-బ్లూబర్డ్-2 మిషన్

అమెరికాకు చెందిన ఏఎస్టీ స్పేస్ మొబైల్ అనే సంస్థకు సంబంధించిన బ్లూబర్డ్-2 అనే ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టారు. ఈ ప్రయోగాన్ని 2025, డిసెంబరు 24న ఎల్‌వీఎం3-ఎం6 అనే వాహక నౌక ద్వారా నిర్వహించారు. ఇది పూర్తిగా వాణిజ్య పరమైన ప్రయోగం. ఎల్‌వీఎం3 అనే వాహకనౌకను జీఎస్ఎల్‌వీ-ఎంకే-3 అని కూడా పిలుస్తారు. అత్యధిక బరువును మోసుకెళ్లే ఈ వాహక నౌకను 'బాహుబలి రాకెట్' అంటారు. దీనికి మొదటి భాగంలో ఎస్200 అనే ఘనఇంధనం ఉన్న రాకెట్ బూస్టర్‌లు ఉంటాయి. ప్రారంభదశలో రాకెట్ పైకి వెళ్లడానికి కావాల్సిన శక్తిని అందిస్తాయి. మూడు దశలున్న ఈ రాకెట్‌లో చివరి దశను సీ25 క్రయోజనిక్ దశ అంటారు. దీనిలో సీఈ-20 ఇంజిన్‌ను ఉపయోగిస్తారు. సాధారణంగా సమాచార ఉపగ్రహాలను 36,000 కి.మీ. జియోస్టేషనరీ కక్ష్యలోకి ప్రవేశపెట్టడానికి ఎల్‌వీఎం-3ని వాడతారు. కానీ ప్రస్తుత ఎల్‌వీఎం-3-ఎం6ను బ్లూబర్డ్-2 అనే ఉపగ్రహాన్ని దిగువ భూకక్ష్య (లో ఎర్త్ ఆర్బిట్)లోకి ప్రవేశపెట్టడానికి వాడారు. ఈ ఉపగ్రహం బరువు 6,100 కేజీలు. ఇదే భారతదేశం నుంచి ఇప్పటి వరకూ దిగువ భూకక్ష్యలోకి ప్రవేశపెట్టిన అత్యధిక బరువు ఉన్న ఉపగ్రహం. ఇది సమాచార ఉపగ్రహం.

★ ఇస్రో ప్రయోగాలు ★

పీఎస్ఎల్‌వీ-సీ62-ఈఓఎస్-ఎన్1 మిషన్: దీని ద్వారా పీఎస్ఎల్‌వీ-సీ62 వాహక నౌకను ఉపయోగించి ఈఓఎస్-ఎన్1 అనే ఉపగ్రహాన్ని 2026, జనవరి 12న కక్ష్యలో ప్రవేశపెట్టాలని భావించారు. కానీ వాహకనౌకలో మూడో దశలో ఏర్పడిన లోపంతో వాహక నౌక ఈఓఎస్-ఎన్1 తోపాటు 15 ఇతర ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టలేకపోయింది. అందుకే ఈ మిషన్ విఫలమైందని చెప్పవచ్చు.



ఈఓఎస్–ఎన్1–ఉపగ్రహ ప్రత్యేకతలు: దీనిని 'అన్వేష ఉపగ్రహం' అని కూడా పిలుస్తారు. ఇది డీఆర్‌డీఓకు చెందిన ఆధునిక హైపర్ స్పెక్ట్రల్ భూపరిశీలన ఉపగ్రహం. శత్రు దేశాలు దాచిన యుద్ధ ట్యాంకులు, ఇతర సామగ్రిని గుర్తించడానికి సిద్ధం చేశారు. సరిహద్దుల వద్ద పొరుగు దేశాల సైన్యం కదలికలు, వాటి నిర్మాణాలను గమనించడం కోసం డిజైన్ చేశారు.

పీఎస్ఎల్‌వీ-సీ61/ఈఓఎస్-09 మిషన్




ఈ మిషన్‌ను 2025, మే 18న చేపట్టారు. పీఎస్ఎల్‌వీ-సీ61 ద్వారా ఈఓఎస్-09 ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టాలని భావించారు. కానీ మూడో దశలో తలెత్తిన లోపంతో రాకెట్ విఫలమైంది. ఈ విధంగా వరుసగా రెండుసార్లు పీఎస్ఎల్‌వీ-సీ61, పీఎస్ఎల్‌వీ-సీ62 విఫలమవడం ఇస్రోకు ఇదే మొదటిసారి.


జీఎస్ఎల్‌వీ-ఎఫ్16 నిస్సార్ మిషన్: ఇస్రో, నాసా కలిసి చేపట్టిన మొదటి ప్రయోగం నిస్సార్ మిషన్. దీని పూర్తి పేరు నాసా ఇస్రో సింథటిక్ అపెర్చర్ రాడార్ (ఎన్ఐఎస్ఏఆర్). ఈ ఉపగ్రహాన్ని జీఎస్ఎల్‌వీ-ఎఫ్16 వాహక నౌక ద్వారా 2025, జులై 30న కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. ఇది భూమిపై నేల, మంచు పర్వతాల్లో వచ్చే మార్పులను, గ్రీన్‌లాండ్, అంటార్కిటికా మంచులో ఏర్పడే పరిణామాలను, చిత్తడి నేలల్లో స్వభావాన్ని, అడవుల్లోని వృక్షాల బయోమాస్ వివరాలను తెలియజేస్తుంది.

పీఎస్ఎల్‌వీ-సీ60 స్పాడెక్స్ మిషన్: ఈ ప్రయోగం 2024, డిసెంబరు 30న నిర్వహించారు. పీఎస్ఎల్‌వీ - సీ60 వాహక నౌక ద్వారా ఒక్కొక్కటి 220 కిలోల బరువు ఉన్న (స్పేస్ క్రాఫ్ట్ అంతరిక్ష నౌకలను) విడివిడిగా 470 కి.మీ. కక్ష్యలో ప్రవేశపెట్టారు. వీటిలో ఒకటి ఎస్‌డీఎక్స్01. ఇది ఛేజర్ లేదా లక్ష్యం వైపుగా కదిలేది. రెండోది ఎస్‌డీఎక్స్02, ఇది టార్గెట్ లేదా లక్ష్యం. ఇవి రెండూ కక్ష్యలో తిరుగుతూ నెమ్మదిగా వేగాన్ని నియంత్రించుకుంటూ ఒకదాంతో మరొకటి కలుసుకున్నాయి. దీనినే 'డాకింగ్ ప్రక్రియ' అంటారు. ఇలా రెండు అంతరిక్ష నౌకలను కలపడం, విడదీయడం లాంటి సాంకేతికత ఉన్న నాలుగో దేశంగా భారత్ నిలిచింది.

జీఎస్ఎల్‌వీ-ఎఫ్15/ఎన్‌వీఎస్-02 మిషన్: జీఎస్ఎల్‌వీ-ఎఫ్15 అనేది భారతదేశ జీఎస్ఎల్‌వీ 17వ, శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి జరిపిన 100వ ప్రయోగం. ఈ మిషన్‌లో భాగంగా జీఎస్ఎల్‌వీ-15 అనే వాహక నౌక ద్వారా 2025, జనవరి 29న ఎన్‌వీఎస్-02 అనే ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. ◆ ఇండియన్ రీజినల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం (ఐఆర్ఎన్ఎస్ఎస్) అయిన 'నావిక్‌'లో భాగంగా రెండో తరం నావిగేషన్ ఉపగ్రహాలు ఎన్‌వీఎస్ పేరుతో ప్రారంభమయ్యాయి. వీటిలో ఎన్‌వీఎస్-01ను జీఎస్ఎల్‌వీ-ఎఫ్12 వాహక నౌక ద్వారా 2023, మే 29న కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. రెండోది ప్రస్తుత మిషన్‌లో భాగంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టిన ఎన్‌వీఎస్-02 ఉపగ్రహం.




ఎల్‌వీఎం3-ఎం5-సీఎంఎస్-03 మిషన్: ఈ ప్రయోగాన్ని 2025, నవంబరు 2న నిర్వహించారు. ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్ ద్వారా సీఎంఎస్-03 అనే మల్టీబ్యాండ్ సమాచార ఉపగ్రహాన్ని జియో సింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లో ప్రవేశపెట్టారు. ఆ ఉపగ్రహం ద్వారా సముద్రాలు, నేలపై సమాచార సేవలు అందుతాయి. సీఎంఎస్-03 ఉపగ్రహం బరువు 4,400 కిలోలు. ఇప్పటివరకు భారతదేశం తన సొంత వాహక నౌకతో జియో సింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లో ప్రవేశపెట్టిన అత్యధిక బరువు ఉన్న ఉపగ్రహం ఇదే.



శుభాంశు శుక్లా

ఎక్సియమ్-04 మిషన్: ఈ మిషన్‌లో భారతవ్యోమగామి శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి వెళ్లి విజయవంతంగా తిరిగి వచ్చారు. దీనిని 2025, జూన్ 25న స్పేస్ ఎక్స్ సంస్థకు చెందిన ఫాల్కన్-09 రాకెట్ ద్వారా నిర్వహించారు. అంతరిక్ష స్టేషన్‌లోకి ఇస్రో ద్వారా వెళ్లిన భారతీయుడిగా శుభాంశు శుక్లా రికార్డు సృష్టించారు.



రచయిత: డాక్టర్ బి. నరేష్

TENTH English — From the Diary of Anne Frank



Q.No. 1-5: Read the following Passage carefully.

Mr. Keesing had a good laugh at my arguments, but when I proceeded to talk my way through the next lesson, he assigned me a second essay. This time it was supposed to be on An Incorrigible Chatterbox. I handed it in, and Mr. Keesing had nothing to complain about for two whole lessons. However, during the third lesson he'd finally had enough. Anne Frank, as punishment for talking in class, wrote an essay entitled "Quack, Quack, Quack, said Mistress Chatterbox''. The class roared. I had to laugh too, though I'd nearly exhausted my ingenuity on the topic of chatterboxes. - (From the Diary of Anne Frank)

Now, answer the following questions. 5 x 2 = 10 M

1. Why did Mr. Keesing assign Anne a second essay?
2. What was the title of Anne's third punishment essay?
3. How many lessons passed before Mr. Keesing punished Anne again?
   A) One B) Two C) Three
4. What does the title "Quack, Quack, Quack said Mistress Chatterbox''. Suggest about Keesing's attitude?
   A) Annoyed B) Playful C) Sad
5. What state was the speaker's ingenuity nearly in?
   A) Exhausted B) Growing C) Beginning

Final Exams-2026 IMPORTANT Q & A

Answers: 1: Because she again talked her way through the next lesson.
2: "Quack, Quack, Quack, said Mistress Chatterbox." 3: B) Two, 4: B) Playful, 5: A) Exhausted

Q.No. 6-10: Read the following stanza carefully.

But he's locked in a concrete cell, his strength behind bars, stalking the length of his cage, ignoring visitors.
He hears the last voice at night, the patrolling cars,
And stares with his brilliant eyes at the brilliant stars .
(A Tiger in the Zoo)

Now, answer the following questions. 5 x 1 = 5 M

More Imp Q & A

6. He is locked in a concrete cell. Who does 'he' refer to?
7. Where was 'his strength' locked?



Writer: A. Madhu babu




పదివేల మంది కళాకారులతో బాగురుంబా!

పురాతన పెయింటింగ్ ప్రేరణతో డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలు తయారుచేసిన ఇంజిన్ లేని నౌక పద్నాలుగు వందల కిలోమీటర్లు ప్రయాణించింది. భారత గణతంత్ర దినోత్సవ అతిథులుగా ఈసారి ఇద్దరు ఐరోపా సమాఖ్య నేతలు హాజరయ్యారు. గిరిజన ప్రాంతాల్లో స్థానిక స్వయంపాలన కోసం తీసుకొచ్చిన 'పెసా' చట్టం ఝార్ఖండ్ రాష్ట్రంలో పాతికేళ్ల తర్వాత అమల్లోకి వచ్చింది. ఇజ్రాయెల్ దాడులతో ధ్వంసమైన గాజా పునర్నిర్మాణం కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆధ్వర్యంలో శాంతి మండలి ఏర్పాటైంది. నాలుగు దశాబ్దాలుగా ఉగాండా అధ్యక్షుడిగా కొనసాగుతున్న యోవెరీ ముసేవెనీ మరోసారి ఎన్నికయ్యారు. సీనియర్ నటి శారదకు కేరళ ప్రభుత్వం అత్యున్నత సినిమా పురస్కారాన్ని ప్రకటించింది. బిహార్‌లో అతిపెద్ద శివలింగం కొలువు తీరింది. ఈ విధంగా ఇటీవల కాలంలో చోటు చేసుకున్న జాతీయ, అంతర్జాతీయ పరిణామాలపై, వార్తల్లో నిలిచిన ప్రధాన సంఘటనలపై పోటీ పరీక్షార్థులు అవగాహన పెంచుకోవాలి. తాజా నియామకాలు, వివిధ దేశాల క్షిపణి పరీక్షలు, సాంకేతిక ఆవిష్కరణలు, ఇస్రో ప్రయోగాలు, వెల్లడైన ముఖ్య నివేదికల వివరాలను తెలుసుకోవాలి.

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో సరైంది?
   ఎ) ఏఐ సాంకేతికత వినియోగించుకునే ప్రభుత్వ ఆస్పత్రి దేశంలో తొలిసారి గ్రేటర్ నోయిడాలో ప్రారంభమైంది.
   బి) మురికివాడల రహిత నగరంగా గుజరాత్‌లోని సూరత్ నిలవనుంది.
   సి) దేశంలో తొలిసారి రాత్రివేళల్లో సఫారీ లఖ్‌నవూలోని కుక్రెయిల్ అటవీ ప్రాంతంలో అందుబాటులోకి రానుంది.
   డి) దేశంలో తొలిసారి పరిశ్రమలో ఎలక్ట్రిక్ బల్క్ ట్యాంక్ లారీల వినియోగం మై హోం ఇండస్ట్రీస్ మహా సిమెంట్ కర్మాగారం (అనకాపల్లి జిల్లా, యలమంచి మండలం ములకలపల్లి)లో జరిగింది.
   1) ఎ, బి, సి, డి 2) బి, సి, డి
   3) ఎ, సి, డి 4) ఎ, బి, సి
   నోట్: దేశంలో తొలి మురికివాడల రహిత నగరం చండీగఢ్.
2. కేరళ ప్రభుత్వం ఇచ్చే అత్యున్నత సినిమా పురస్కారం 'జేసీ డానియల్ అవార్డు–2024' పొందిన నటి?
   1) శారద 2) రాశి 3) కాంచన 4) గౌతమి
3. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) కమిషనర్‌గా ఎవరు నియమితులయ్యారు?
   1) ప్రవీణ్ కుమార్
   2) శత్రుజీత్ సింగ్ కపూర్
   3) రాకేష్ అగర్వాల్ 4) ప్రవీణ్ వశిష్ఠ
   నోట్: 1) బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ ప్రవీణ్ కుమార్
   2) ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ డైరెక్టర్ జనరల్ శత్రుజీత్ సింగ్ కపూర్
   3) నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) డైరెక్టర్ రాకేష్ అగర్వాల్
4. భారత 92వ గ్రాండ్ మాస్టర్ ఎవరు?
   1) ఆర్. వైశాలి
   2) దివ్య దేశ్‌ముఖ్
   3) ఆర్యన్ వర్షినే
   4) అర్జున్ ఇరిగైశ్
   నోట్: దిల్లీ నుంచి 8వ గ్రాండ్ మాస్టర్



ఆర్యన్ వర్షినే

5. ఇటీవల భారత్‌లో పర్యటించిన షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ ఏ దేశ అధ్యక్షుడు?
   1) కువైట్ 2) సౌదీ అరేబియా
   3) యూఏఈ 4) ఖతర్
   నోట్: 1) 2026, జనవరి 19న భారత్‌లో పర్యటించారు.
   2) 2032 నాటికి పరస్పర వాణిజ్యాన్ని రూ.18 లక్షల కోట్లకు పెంచుకోవాలని తీర్మానించారు.
6. దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే 2025–26 విజేత?
   1) ముంబయి 2) విదర్భ
   3) సౌరాష్ట్ర 4) బరోడా
7. యూఎన్ఓ సెక్రటరీ జనరల్ అవార్డు పొందిన భారత ఆర్మీ అధికారిణి ఎవరు?
   1) సోఫియా ఖురేషి
   2) గణేవ్ లాల్జీ
   3) మేఘనా దేవ్
   4) స్వాతి శాంత కుమార్



స్వాతి శాంత కుమార్

   నోట్: ఉత్తమ పనితీరు కనబరిచినందుకు భారతీయ రైల్వే మహిళా ఆర్‌పీఎఫ్ ఆఫీసర్ చందనా సిన్హాను అత్యుత్తమ పురస్కారంతో గౌరవించింది. (అతి విశిష్ట్ రైల్ సేవా పురస్కారం)
8. ఏ దేశ అధ్యక్షుడిగా 7వ సారి యోవెరీ ముసేవెనీ ఎన్నికయ్యారు?
   1) మంగోలియా 2) పెరూ
   3) చిలీ 4) ఉగాండా
   నోట్: 1) 1996 నుంచి ఉగాండా అధ్యక్షుడిగా యోవెరీ ముసేవెనీ ఉన్నారు.
   2) బెలారస్ అధ్యక్షుడిగా 7వ సారి అలెగ్జాండర్ లుకాషెంకో 2025, మార్చి 25న ప్రమాణ స్వీకారం చేశారు. (1994 నుంచి అధ్యక్షుడు)
9. నేషనల్ స్టార్టప్ డే ఎప్పుడు నిర్వహిస్తారు?
   1) జనవరి 18 2) జనవరి 15
   3) జనవరి 16 4) జనవరి 19
10. బాధ్యతాయుత దేశాల సూచీ–2026లో భారత్ ర్యాంకు ఎంత?
    1) 16వ 2) 18వ 3) 24వ 4) 32వ
    నోట్: సింగపూర్, స్విట్జర్లాండ్, డెన్మార్క్‌లు వరుసగా తొలి మూడు ర్యాంకుల్లో ఉన్నాయి.
11. దేశంలో మొదటిసారిగా సౌరశక్తితో నడిచే ఏటీఎం వ్యాన్‌ను ప్రారంభించిన బ్యాంకు?
    1) ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు
    2) త్రిపుర గ్రామీణ బ్యాంకు
    3) పంజాబ్ గ్రామీణ బ్యాంకు
    4) తెలంగాణ గ్రామీణ బ్యాంకు
12. బాగురుంబా నృత్యానికి సంబంధించి సరైంది?
    1) నాగాలాండ్ రాష్ట్ర నృత్యం
    2) అస్సాం బోడో తెగ సంప్రదాయ నృత్యం
    3) మణిపుర్ కుకి రాష్ట్ర నృత్యం
    4) మేఘాలయ రాష్ట్ర నృత్యం
    నోట్: ఇటీవల ప్రధాని మోదీ అస్సాం రాష్ట్ర పర్యటన సందర్భంగా 10 వేల మంది కళాకారులు ఒకేసారి ఈ నృత్యం చేశారు.
13. 77వ రిపబ్లిక్ డే (2026) అతిథులుగా ఎవరు వచ్చారు?
    1) ఆంటోనియో కోస్టా (యూరోపియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్)
    2) ఉర్సులా వాన్ డెర్ లేయన్ (యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్)
    3) 1, 2 4) డొనాల్డ్ ట్రంప్
    నోట్: 1) 1956, 1968, 1974, 2026 రిపబ్లిక్ డేకు ఇద్దరు అతిథులుగా హాజరయ్యారు.
    2) 2018లో ఆసియాన్ దేశాల నుంచి 10 మంది అతిథులు హాజరయ్యారు.
14. కింది వాటిలో సరైంది?



    ఎ) ఐఎన్ఎస్‌వీ కౌండిన్య నౌక ఎలాంటి ఇంజిన్ లేకుండా గుజరాత్‌లోని పోరుబందర్ నుంచి ఒమన్ రాజధాని మస్కట్ వరకు 17 రోజుల్లో 1400 కి.మీ. ప్రయాణించింది.
    బి) అజంతా గుహల్లో ఉన్న 5వ శతాబ్దం నాటి పెయింటింగ్‌లోని ఓ నౌక నుంచి ప్రేరణ పొంది దీన్ని రూపొందించారు.
    సి) లోహాలు, మేకులను ఉపయోగించకుండా చెక్క, కొబ్బరి పీచు, తాళ్లతో తయారుచేశారు. అందుకే ఈ నౌకను 'స్టిచ్డ్ షిప్' అని పిలుస్తున్నారు.
    డి) ఈ నౌకను డీఆర్‌డీఓ తయారుచేసింది.
    1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, డి
    3) బి, సి, డి 4) ఎ, బి, సి
15. కింది వాటిలో సరైంది?
    ఎ) అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఛైర్మన్‌గా గాజా శాంతి మండలి ఏర్పాటైంది.
    బి) గాజా శాంతి మండలి కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్‌గా నరేంద్ర మోదీ వ్యవహరిస్తారు.
    సి) ఈ గాజా శాంతి మండలిలో స్టీవ్ విట్కాఫ్, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్, బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్, ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగా సభ్యులు.
    డి) పునరాభివృద్ధి ప్రణాళికను వేగంగా అమలు చేసేందుకు 15 మందితో ఈ కమిటీ ఏర్పాటైంది.
    1) ఎ, బి, సి, డి 2) ఎ, సి, డి
    3) బి, సి, డి 4) ఎ, బి, డి
    నోట్: 1) గాజా శాంతి మండలి కార్యనిర్వాహక కమిటీకి డైరెక్టర్ జనరల్‌గా యూఎన్ఓ మాజీ ప్రత్యేక సమన్వయకర్త, బల్గేరియా మాజీ దౌత్యవేత్త మ్లాదెనోవ్ వ్యవహరిస్తారు.
    2) 'నేషనల్ కమిటీ ఫర్ ది అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ గాజా' తొలి సమావేశం కైరోలో జరిగింది.
16. ప్రపంచంలోనే అతి పెద్ద శివలింగాన్ని ఇటీవల ఏ రాష్ట్రంలో ప్రతిష్ఠించారు?



    1) ఉత్తర్‌ప్రదేశ్ 2) బిహార్
    3) కేరళ 4) గోవా
    నోట్: 1) బిహార్‌లోని ఈస్ట్ చంపారన్ జిల్లాలో విరాట్ రామాయణ్ మందిర్‌లో ప్రతిష్ఠించారు.
    2) 33 అడుగుల పొడవు, 210 టన్నుల బరువు ఉంటుంది.
17. 2025లో శ్రీలంకను సందర్శించిన విదేశీయుల్లో ఏ దేశీయులు మొదటి స్థానంలో ఉన్నారు?
    1) అమెరికా 2) చైనా
    3) ఇండియా 4) ఇండోనేసియా
    నోట్: 1) 23 లక్షల మంది భారతీయులు 2025 లో శ్రీలంకను సందర్శించారు.
18. ఏ దేశ నూతన ప్రధానిగా షయ మోహసేన్ జిందానీ నియమితులయ్యారు?
    1) యెమెన్ 2) కువైట్
    3) ఖతర్ 4) యూఏఈ
19. 'అటామిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డు ఛైర్మన్‌గా డీకే శుక్లా స్థానంలో ఎవరు నియమితులయ్యారు?
    1) ఎం.కె. బాలన్
    2) ఆర్.కె. సురిందర్
    3) ఎ.కె. రాజన్
    4) ఎ.కె. బాలసుబ్రమణియన్
20. కమలా హైడ్రో ప్రాజెక్టును రూ.26,069.50 కోట్ల వ్యయంతో కమల నదిపై ఏ రాష్ట్రంలో నిర్మించనున్నారు?
    1) మేఘాలయ 2) మణిపుర్
    3) అరుణాచల్ ప్రదేశ్ 4) అస్సాం
    నోట్: సుబన్సిరి నదికి కమలా ప్రధాన ఉపనది
21. 2025–26 ఆర్థిక సంవత్సరానికి ఏ రాష్ట్ర గ్రామీణ స్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం నుంచి మొదటి విడతను కేంద్రం విడుదల చేసింది?
    1) మిజోరాం 2) అరుణాచల్‌ప్రదేశ్
    3) సిక్కిం 4) మేఘాలయ
22. 'ఎల్‌వై – 80(ఎన్) క్షిపణి'ని ఏ దేశం ఇటీవల పరీక్షించింది?
    1) రష్యా 2) ఉక్రెయిన్
    3) పాకిస్థాన్ 4) ఇజ్రాయెల్
    నోట్: 1) ఎల్‌వై-80 క్షిపణి వ్యవస్థ చైనాకు చెందింది. దీన్ని పాకిస్థాన్ ఉపయోగిస్తుంది.
    2) ఉపరితలం నుంచి గగనతల లక్ష్యాలను ఛేదిస్తుంది.
    3) ఒరెష్నిక్ అనేది రష్యా క్షిపణి.
23. 25 ఏళ్ల తర్వాత 'పెసా' (పంచాయత్ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్డ్ ఏరియాస్) చట్టాన్ని అమలు చేసిన రాష్ట్రం?
    1) ఉత్తరాఖండ్ 2) మేఘాలయ
    3) ఉత్తర్‌ప్రదేశ్ 4) ఝార్ఖండ్
24. భారతదేశ మొదటి సార్వభౌమ ఏఐ పార్కు ఏ రాష్ట్రంలో ఏర్పాటైంది?
    1) తమిళనాడు
    2) గోవా
    3) కర్ణాటక
    4) ఉత్తరాఖండ్



రచయిత: బి. ధన్‌మోహన్ రెడ్డి

సమాధానాలు
1-1; 2-1; 3-4; 4-3; 5-3; 6-2; 7-4; 8-4; 9-3; 10-1; 11-2; 12-2; 13-3; 14-4; 15-2; 16-2; 17-3; 18-1; 19-4; 20-3; 21-3; 22-3; 23-4; 24-1.

అవయవాల పనితీరు.. నాడీ వ్యవస్థతో సమన్వయం!

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
బయాలజీ

జంతువుల్లో నాడీ వ్యవస్థ అనేది ఉద్దీపనలను (Stimuli) గ్రహించి, వాటికి ప్రతిస్పందించేలా సహాయపడుతుంది. ఇది జంతువుల స్థాయి ఆధారంగా సరళత నుంచి సంక్లిష్టం వరకు మారుతూ ఉంటుంది. నాడీ వ్యవస్థ లేకపోతే జంతువులు తమను తాము రక్షించుకోలేవు, ఆహారాన్ని సంపాదించుకోలేవు. అదేవిధంగా మారుతున్న వాతావరణంలో మనుగడ సాగించలేవు. పరిణామక్రమంలో జీవి ఎంత సంక్లిష్టంగా ఉంటే, దాని నాడీ వ్యవస్థ అంత అభివృద్ధి చెంది ఉంటుంది. వివిధ జంతు జాతుల్లో వ్యవస్థితమయ్యే నాడీ వ్యవస్థలు వివిధ రకాలుగా ఉంటాయి.





జంతువుల్లో నాడీ వ్యవస్థ

అకశేరుకాలు (ఇన్‌వర్టిబ్రేట్స్)

అకశేరుకాల్లో నాడీ వ్యవస్థ పరిణామక్రమం కింది విధంగా ఉంటుంది.

ప్రోటోజోవా: వీటికి ప్రత్యేకమైన నాడీ వ్యవస్థ ఉండదు. కానీ ఇవి స్పర్శ, రసాయన మార్పులకు సాధారణ కణ ప్రతిస్పందనను చూపుతాయి.
ఉదా: అమీబా

పొరిఫెరా: వీటిలో కూడా నిర్దిష్టమైన నాడీ కణాలు ఉండవు.
ఉదా: స్పంజికలు

సిలెంటిరేటా/నిడేరియా: వీటిలో మొదటిసారిగా నాడీ వ్యవస్థ ప్రారంభమైంది. ఇది నాడీ వల (Nerve Net) రూపంలో ఉంటుంది. మెదడు ఉండదు.
ఉదా: హైడ్రా

మొలస్కా: వీటిలో నాడీ సంధులు లేదా గాంగ్లియా ఒకదానితో ఒకటి కలిసి ఉంటాయి.
ఉదా: నత్త

ప్లాటీహెల్మింథిస్: వీటిలో నిచ్చెన లాంటి నాడీ వ్యవస్థ ఉంటుంది. తల భాగంలో నాడీ కణాల సముదాయం గాంగ్లియాగా ఏర్పడి మెదడులా పని చేస్తుంది.
ఉదా: ప్లనేరియా

అనెలిడా: వీటిలో నాడీ వలయం (నర్వ్ రింగ్), ఉదర నాడీ దండం ఉంటాయి.
ఉదా: వానపాము

ఆర్థ్రోపోడా: వీటిలో నాడీ వ్యవస్థ బాగా అభివృద్ధి చెంది ఉంటుంది. మెదడు, ఉదర నాడీ దండం, అనేక జ్ఞానేంద్రియాలు (సంక్లిష్ట నేత్రాలు, యాంటినా) ఉంటాయి. **ఉదా:** బొద్దింక

నాడీ వ్యవస్థ ప్రాధాన్యత

జంతు రాజ్యంలో జీవుల మనుగడకు, పరిణామానికి నాడీ వ్యవస్థ అత్యంత కీలకమైంది. దీని ప్రాధాన్యతను కింది అంశాల ద్వారా తెలుసుకోవచ్చు. అవి:

ఉద్దీపనలకు ప్రతిచర్య: జంతువులు తమ పరిసరాల్లో జరిగే మార్పులను (వేడి, వెలుతురు, శబ్దం, స్పర్శ) గుర్తించి, వాటికి తక్షణమే స్పందించడానికి నాడీ వ్యవస్థ సహాయపడుతుంది.
ఉదా: శత్రువును చూడగానే పారిపోవడం లేదా ఆహారం వాసన రాగానే దాని వైపు వెళ్లడం.

అవయవాల మధ్య సమన్వయం: శరీరంలోని వివిధ భాగాలు ఒకదానితో ఒకటి కలిసి పనిచేసేలా నాడీ వ్యవస్థ సమన్వయపరుస్తుంది.
✦ నడుస్తున్నప్పుడు కాళ్లు, చేతులు, కళ్లు, మెదడు అన్నీ సమన్వయంతో పనిచేస్తేనే అది సాధ్యమవుతుంది.

హోమియోస్టాసిస్ నిర్వహణ: శరీర అంతర్గత వాతావరణాన్ని (ఉదాహరణకు ఉష్ణోగ్రత, రక్తపోటు, pH స్థాయులు) స్థిరంగా ఉంచడంలో నాడీ వ్యవస్థ ప్రధాన పాత్ర పోషిస్తుంది.
✦ శరీర ఉష్ణోగ్రత పెరిగినప్పుడు మెదడు సంకేతాల ద్వారా స్వేద గ్రంథులను ఉత్తేజితం చేసి చెమట పట్టేలా చేస్తుంది. తద్వారా శరీరం చల్లబడుతుంది.

అసంకల్పిత చర్యల నియంత్రణ: ఆలోచించకుండానే జరిగే అతి ముఖ్యమైన పనులను నాడీ వ్యవస్థ నియంత్రిస్తుంది.
ఉదా: హృదయ స్పందన, శ్వాసక్రియ, జీర్ణక్రియ.
✦ ఈ ప్రక్రియలు నిరంతరం సాగడానికి మజ్జాముఖం (మెడుల్లా అబ్లాంగేట) లాంటి మెదడు భాగాలు తోడ్పడతాయి.

అభ్యసనం, జ్ఞాపకశక్తి: ముఖ్యంగా ఉన్నత స్థాయి జంతువుల్లో (క్షీరదాలు) నాడీ వ్యవస్థ గత అనుభవాలను గుర్తుంచుకోవడానికి, నేర్చుకోవడానికి, తెలివైన నిర్ణయాలు తీసుకోవడానికి ఉపయోగపడుతుంది.
ఉదా: ఒక జంతువు ఏ ప్రాంతంలో ప్రమాదం ఉందో గుర్తుంచుకుని, మళ్లీ అక్కడికి వెళ్లకుండా ఉండటం.

సంక్లిష్ట ప్రవర్తన: జంతువుల సామాజిక ప్రవర్తన, ప్రత్యుత్పత్తి కాలంలో చూపే ప్రవర్తన, వలస వెళ్లడం లాంటి పనులన్నీ నాడీ వ్యవస్థ ద్వారానే నిర్దేశితమై ఉంటాయి.



రచయిత
డా.కొర్లాం సాయివెంకటేష్,
అసిస్టెంట్ ప్రొఫెసర్

సకశేరుకాలు (వర్టిబ్రేట్స్)

సకశేరుకాల్లో నాడీ వ్యవస్థ ఎక్కువగా అభివృద్ధి చెంది ఉంటుంది. దీన్ని ప్రధానంగా మూడు భాగాలుగా విభజించవచ్చు. అవి:

కేంద్ర నాడీ వ్యవస్థ (CNS): మెదడు, వెన్నెముక.

పరిధీయ నాడీ వ్యవస్థ (PNS): మెదడు, వెన్నెముక నుంచి వచ్చే నాడులు.

స్వయం చోదిత నాడీ వ్యవస్థ (ANS): అనిచ్ఛాకృత చర్యలను నియంత్రిస్తుంది.

✦ వివిధ సకశేరుక వర్గాల్లో నాడీ వ్యవస్థ పరిణామాన్ని విశ్లేషిస్తే, సకశేరుకాల్లో మెదడు పరిణామం క్రమంగా పెరగడం గమనించవచ్చు.

చేపలు (పిసిస్):
వీటిలో మెదడు చాలా సరళంగా ఉంటుంది.
✦ ఘ్రాణ లంబికలు (అల్ఫాక్టోరి లోబ్స్) ఉంటాయి. ఇవి చాలా పెద్దవిగా ఉండి, వాసనను గుర్తించడంలో తోడ్పడతాయి.
✦ మధ్య మెదడులో దృష్టిని నియంత్రించే దృక్ లంబికలు ఉంటాయి.
ఉదా: షార్క్, రోహు.

ఉభయచరాలు:
మెదడు చేపల కంటే కొంచెం అభివృద్ధి చెంది ఉంటుంది.
✦ ముందు మెదడులో మస్తిష్క అర్ధగోళాలు (సెరిబ్రల్ హెమిస్ఫియర్స్) ఏర్పడటం ప్రారంభమవుతుంది.
ఉదా: కప్ప



సరీసృపాలు:
వీటిలో సెరిబ్రం (మస్తిష్కం) పరిమాణం పెరుగుతుంది.
✦ పాముల్లో నాలుక ద్వారా వాసనను గ్రహించే జాకబ్‌సన్ అవయవాలు (Jacobson's Organs) నాడీ వ్యవస్థతో అనుసంధానితమై ఉంటాయి.
ఉదా: పాము, బల్లి, మొసలి.

పక్షులు:
పక్షుల్లో సమతౌల్యత చాలా ముఖ్యం. అందుకే వీటిలో వెనుక మెదడు (సెరిబెల్లం - అనుమస్తిష్కం) బాగా అభివృద్ధి చెంది ఉంటుంది.
✦ వీటిలో దృక్ లంబికలు పెద్దవిగా ఉంటాయి. అందుకే వీటికి చూపు చాలా తీక్షణంగా ఉంటుంది.
ఉదా: పావురం, గద్ద.



క్షీరదాలు:
సకశేరుకాలన్నింటిలో అత్యంత సంక్లిష్టమైన మెదడు క్షీరదాల్లో ఉంటుంది.
✦ మస్తిష్కం చాలా పెద్దదిగా ఉండి, ఆలోచన, జ్ఞాపకశక్తి, తెలివితేటలను నియంత్రిస్తుంది.
✦ మస్తిష్కంపై ముడతలు ఉండటం వల్ల నాడీ కణాల సంఖ్య పెరుగుతుంది.
ఉదా: మానవుడు, కుక్క, ఏనుగు.

మాదిరి ప్రశ్నలు

1. నాడీ వ్యవస్థ నిర్మాణాత్మక, క్రియాత్మక ప్రమాణం ఏది?
   1) నెఫ్రాన్ 2) న్యూరాన్ 3) సైటాన్ 4) ఆక్సాన్
2. చేపల్లో నీటిలోని వాసనను కనిపెట్టడానికి ఏ భాగం సహాయపడుతుంది?
   1) అనుమస్తిష్కం 2) మజ్జాముఖం 3) ఘ్రాణ లంబికలు 4) మస్తిష్కం
3. పక్షులు ఎగిరేటప్పుడు శరీర సమతౌల్యతను నియంత్రించే మెదడు భాగం?
   1) మస్తిష్కం 2) అనుమస్తిష్కం 3) హైపోథాలమస్ 4) దృక్ లంబికలు
4. పాములు, బల్లుల్లో వాసనను గుర్తించే జాకబ్‌సన్ అవయవం ఎక్కడ ఉంటుంది?
   1) కళ్లలో 2) చెవుల్లో 3) నోటి పైభాగం (అంగిలి)లో 4) తోక భాగంలో
5. మానవ మెదడును రక్షించే మూడు పొరలను ఏమంటారు?
   1) పెరికార్డియం 2) ప్లూరా 3) మెనింజిస్ 4) పెరిటోనియం
6. మెదడును బాహ్య ఘాతాల నుంచి రక్షించే ద్రవం?
   1) ప్లాస్మా 2) లింఫ్ 3) మస్తిష్క మేరుద్రవం 4) సైనోవియల్ ద్రవం

సమాధానాలు: 1-2, 2-3, 3-2, 4-3, 5-3, 6-3

906 Word of the Day

Outright

Telugu meaning: పరిపూర్ణమైన, కచ్చితంగా
English meaning: The word outright (ఔట్‌రైట్) describes something done completely, openly, or without any conditions or hesitation.
Synonyms: Complete, Absolute
Antonyms: Conditional, Limited
Usage: **1. (As an Adjective):** He made an outright refusal to participate in any activity that compromised his principles.
2. (As an Adverb): The proposal was rejected outright by the committee because it violated several regulations.

నోటిఫికేషన్స్

ఎంబీఏ ప్రవేశాలు

నాగ్‌పుర్‌లోని విశ్వేశ్వరయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఎన్ఐటీ) అడ్వాన్స్‌డ్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం సీట్లు 20. ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసేందుకు చివరి తేదీ 13 ఫిబ్రవరి 2026.

అప్రెంటిస్ పోస్టులు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాలికట్ (ఎన్ఐటీసీ) సెంటర్ ఫర్ కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ (సీసీఈఎస్‌డీ) ద్వారా అప్రెంటిస్ ట్రైనీల నియామకం కోసం అధికారిక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. మొత్తం పోస్టుల సంఖ్య 50. అర్హులైన అభ్యర్థులు 2026 ఫిబ్రవరి 9లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు చేశారా..? కింది ఉద్యోగాలకు నేడే (జనవరి 30) చివరి తేదీ


☛ ఐఐటీ దిల్లీలో 17 రిసెర్చ్ సైంటిస్ట్ పోస్టులు. ఎమ్మెస్సీ/ఎంటెక్/ఎంబీఏ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉన్నవారు అర్హులు.

☛ ఎయిమ్స్ రిషికేశ్‌లో ఫీల్డ్ డేటా కలెక్టర్ పోస్టులు. ఇంటర్ ఉత్తీర్ణులు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

అమరవీరుల దినోత్సవం

జనవరి 30 — చరిత్రలో ఈనాడు



భారతదేశ స్వాతంత్ర్యోద్యమాన్ని ముందుండి నడిపిన ప్రముఖ వ్యక్తుల్లో గాంధీజీ ముఖ్యులు. ఈయన శాంతి, సత్యాగ్రహాలను ఆయుధాలుగా చేసుకుని బ్రిటిషర్లను గడగడలాడించారు. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా ఉద్యమించేలా ప్రజలను సంఘటితం చేయడంలో విజయం సాధించారు. గాంధీజీ ఇచ్చిన ఒక్క పిలుపుతో యావత్ ప్రజానీకం ఆయన అడుగుజాడల్లో నడిచింది. హింసతో సాధించేదేదీ లేదు, అహింసతోనే విజయం పొందొచ్చు అన్న గాంధీ సిద్ధాంతం దేశానికి స్వరాజ్యం తెచ్చింది. విశ్వవ్యాప్తంగా ఉన్న ఎందరో పోరాట యోధులకు ప్రేరణగా నిలిచి, శాంతి మార్గంలో నడిచేలా చేసింది. జాతిపితగా ప్రసిద్ధిగాంచిన మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఏటా మన దేశంలో జనవరి 30న 'అమరవీరుల దినోత్సవం'గా (Martyrs' Day) నిర్వహిస్తారు. జాతీయోద్యమంలో గాంధీజీ పాత్రను స్మరించుకోవడంతోపాటు స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగాలు చేసిన వీరులను గౌరవించుకోవడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

నేపథ్యం..
మహాత్మా గాంధీ 1948, జనవరి 30న దిల్లీలోని బిర్లా భవన్‌లో జరిగిన ప్రార్థనా సమావేశంలో పాల్గొన్నారు. ఆ సమయంలో నాథూరాం గాడ్సే ఆయనపై కాల్పులు జరపగా, అక్కడికక్కడే మరణించారు. భారత జాతీయోద్యమంలో ఆయన పోషించిన పాత్ర, సహకారాన్ని గుర్తుంచుకునే ఉద్దేశంతో ఏటా ఆయన వర్ధంతిని 'అమర వీరుల దినోత్సవం'గా నిర్వహిస్తారు. గాంధీజీ ఆదర్శాలు, దేశానికి స్వేచ్ఛావాయువులు అందించేందుకు అమరవీరులు చేసిన త్యాగాలను ఈ రోజు ప్రతిబింబిస్తుంది.


❖ స్వాతంత్ర్యోద్యమంలో బ్రిటిష్‌వారి చేతిలో మరణించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల త్యాగాలను స్మరించుకునేందుకు కూడా మన దేశంలో ఏటా మార్చి 23న అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహిస్తారు.

గాంధీజీ చేపట్టిన కొన్ని ముఖ్య ఉద్యమాలు, గతంలో ఎస్ఎస్‌సీ, యూపీఎస్సీ ఫారెస్ట్ గార్డ్, ఎన్‌టీపీసీ సీబీటీ తదితర పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - ఇండియన్ ఎకానమీ

భారతదేశంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు

దేశ ఆర్థికాభివృద్ధిలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు కీలకపాత్ర పోషిస్తాయి. రుణం లేని ఆర్థిక వనరులను అందించడం, సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, ఉపాధి అవకాశాల పెరుగుదల లాంటివి ఎఫ్‌డీఐల వల్ల కలిగే ప్రయోజనాలు. అందుకే భారత ప్రభుత్వం పన్నులు, ప్రత్యేక పెట్టుబడి ప్రోత్సాహకాల ద్వారా విదేశీ పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నం చేస్తోంది. విదేశీ మూలధనం - ఆవశ్యకత, రకాలు; ఎఫ్‌డీఐలను అనుమతించడానికి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు మొదలైనవాటిపై పోటీపరీక్షార్థికి అవగాహన అవసరం.



విదేశీ మూలధనం
అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పారిశ్రామికీకరణ వేగవంతం కావాలంటే తొలిదశలో యంత్రాలు, పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానం, ముడిపదార్థాలు మొదలైనవాటిని దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం విదేశీ మారక ద్రవ్యం అవసరం.

రకాలు
విదేశీ మూలధనం ఆరు రకాలు. అవి:
1. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు
2. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు
3. భాగస్వామ్యం
4. ప్రభుత్వాల మధ్య రుణాలు
5. అంతర్జాతీయ విత్తసంస్థల నుంచి రుణాలు
6. విదేశీ బ్యాంకుల నుంచి రుణాలు

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి సదుపాయ పోర్టల్
విదేశీ పెట్టుబడి అభివృద్ధి మండలి (ఎఫ్ఐపీబీ) స్థానంలో 2017, జూన్‌లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి సదుపాయ పోర్టల్‌ను నెలకొల్పారు.

1991 నూతన పారిశ్రామిక విధానం - విదేశీ పెట్టుబడి, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 2.0, దేశంలోకి ఎఫ్‌డీఐల ప్రవాహం మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Indian Army Day is observed on...

SSC Exams Special
General Awareness

Current Affairs

1. Which of the following statements is correct regarding India's first open-sea marine fish farming project?
   A) It was launched along the Gujarat coast in the Arabian Sea
   B) It was launched at North Bay in the Andaman and Nicobar Islands
   C) It was launched in Chilika Lake, Odisha
   D) It was launched in the Gulf of Mannar, Tamil Nadu
2. Which of the following statements is correct regarding the World Economic Forum (WEF) Annual Meeting 2026?
   A) The annual WEF summit was held at Davos, Switzerland, and was addressed by world leaders including the US President amid Europe - US tensions
   B) The WEF meeting was shifted to New York due to diplomatic tensions in Europe
   C) The summit focused exclusively on Asian economic cooperation
   D) The meeting was cancelled due to disagreements over climate policy
3. Which of the following statements is correct regarding the BRICS Plus naval exercise "Will for Peace 2026"?
   A) India hosted the BRICS Plus naval exercise while holding the BRICS chair
   B) India participated partially by sending naval observers
   C) The exercise was jointly conducted by all BRICS members in Brazil
   D) India skipped the BRICS Plus naval exercise "Will for Peace 2026" hosted by South Africa despite holding the BRICS chair
4. Which of the following statements is correct regarding Indian Army Day 2026?
   A) Indian Army Day is observed on 26 January to mark the formation of the Indian Army
   B) Indian Army Day commemorates the appointment of the first Defence Minister of India
   C) Indian Army Day 2026 marks the 70th anniversary of the Indian Army
   D) Indian Army Day 2026 is observed on 15 January. In 1949, on this day, K.M. Cariappa became the first Indian commander in chief.

History

5. Which of the following statements correctly describes the accession and political ideas of Ghiyasuddin Balban?
   A) Ghiyasuddin Balban succeeded Bughra Khan in 1287 and introduced the theory of kingship
   B) Ghiyasuddin Balban ascended the throne in 1266 after the death of Nasir-ud-din Mahmud and was the first Muslim ruler to formulate the theory of kingship
   C) Nasir-ud-din Mahmud ruled till 1287 and developed the theory of kingship
   D) The theory of kingship was first introduced by rulers of the Tughlaq dynasty
6. Which of the following correctly describes the Battle of Buxar?
   A) It was fought between the British East India Company and the combined forces of Mir Qasim, Shuja-ud-Daulah, and Mughal Emperor Shah Alam II
   B) It was fought only between the British and the Nawab of Bengal, Siraj-ud-Daulah
   C) It marked the defeat of the British East India Company by the Mughal Empire
   D) It was fought between the Marathas and the British East India Company

Geography

7. Which of the following statements correctly describes the soil requirements for gram cultivation?
   A) Gram grows best only in waterlogged clayey soils
   B) Well-drained medium to black cotton soils are most suitable, and it can also grow in light alluvial soils rich in organic matter
   C) Gram can be grown only in laterite soils with high rainfall
   D) Sandy desert soils without organic matter are ideal for gram
8. Which of the following statements correctly explains the objective of land ceiling policies in India?
   A) Land ceiling aims to promote large landholdings for higher productivity
   B) Land ceiling reduces inequality in land ownership, and the Urban Land Ceiling Act, 1976 sought equitable land distribution in urban agglomerations
   C) The Urban Land Ceiling Act, 1976 applied only to rural agricultural land
   D) Land ceiling policies increase income inequality by restricting land use

General Science

9. Which of the following statements correctly describes the nutritional value of eggs?
   A) Eggs are mainly a source of carbohydrates and lack essential vitamins
   B) Eggs are rich in high-quality proteins and contain vitamins B2, B12, D, along with minerals like selenium and iodine
   C) Eggs provide only fats and are deficient in amino acids
   D) Eggs contain proteins but no vitamins or minerals

Scan the QR code for Key

These model questions were prepared by subject experts.

భారత్‌తో ఒప్పందం కుదుర్చుకుంటారా..!

- ఈయూపై అమెరికా మండిపాటు

న్యూయార్క్: భారత్-ఐరోపా సమాఖ్య(ఈయూ)ల మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై అమెరికా అక్కసు వెళ్లగక్కుతోంది. ఈ ఒప్పందం.. భారత్‌కే లాభదాయకంగా ఉందంటూ అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్ ఇటీవల వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఏకంగా అగ్రరాజ్య ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఒప్పందంపై తన తీవ్ర అసంతృప్తిని వ్యక్తంచేశారు. ఉక్రెయిన్‌తో యుద్ధం చేస్తున్న రష్యా దగ్గర నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌తో యూరోపియన్లు సయోధ్య కుదుర్చుకోవడం తనను తీవ్ర నిరాశకు గురిచేసిందని పేర్కొన్నారు. ఉక్రెయిన్‌లో యుద్ధం కొనసాగుతున్నప్పటికీ వాణిజ్య ప్రయోజనాలకే ఈయూ ప్రాధాన్యం ఇచ్చిందంటూ మండిపడ్డారు. "వాళ్లకు ఏది ఉత్తమమైందో వారు అది చేయాలి. కానీ యూరోపియన్లు నన్ను చాలా నిరాశపరిచారు" అని అన్నారు. గతేడాది భారత దిగుమతులపై అమెరికా భారీగా సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. తమలాగే భారత్‌పై అదనపు సుంకాలు విధించేందుకు అప్పుడు ఈయూ విముఖత వ్యక్తం చేసిందన్నారు. సొంత వాణిజ్య ఒప్పందం కోసం ముందుకు వెళ్లాలనే ఉద్దేశంతోనే, వారు ఆ పని చేయలేదన్నారు. ఉక్రెయిన్ ప్రజల కంటే వాణిజ్య ప్రయోజనాలకే ఐరోపా ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. "రష్యా చమురు భారత్‌కు వెళుతోంది. దాన్ని శుద్ధి చేసి భారత్ చమురు ఉత్పత్తులు తయారుచేస్తోంది. ఇప్పుడు యూరోపియన్లు వాటిని కొనుగోలు చేస్తున్నారు. దీంతో రష్యా యుద్ధానికి వారు పరోక్షంగా నిధులు సమకూరుస్తున్నారు" అని బెసెంట్ ఆరోపించారు. ఈ వాణిజ్య ఒప్పందం ముందు కూడా బెసెంట్ ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. ఉక్రెయిన్ కంటే ఐరోపాకు వాణిజ్య ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. అవసరమైతే తాము కూడా రష్యా చమురును కొనుగోలు చేసే దేశాలపై ఇందుకు పొందవచ్చని, కానీ అలా చేయడానికి అమెరికా సిద్ధంగా లేదని బెసెంట్ వ్యాఖ్యానించారు.


అమెరికాకు పాక్షిక షట్‌డౌన్ ముప్పు!

- ఐసీఈ సంస్కరణలపై డిమాండ్లను ఆమోదించకపోతే నిధులకు బ్రేక్..
- బిల్లును అడ్డుకున్న డెమోక్రాట్లు

వాషింగ్టన్: ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) తాము సూచించిన సంస్కరణలను ఆమోదించకపోతే నిధుల విడుదల బిల్లును అడ్డుకుంటామని హెచ్చరించిన అమెరికా సెనెట్‌లోని డెమోక్రాట్లు అన్నంత పని చేశారు. గురువారం ఒకవైపు రిపబ్లికన్లతో చర్చలు జరుగుతుండగానే మరోవైపు సెనెట్‌లో బిల్లుకు వ్యతిరేకంగా ఓటేశారు. దీంతో హోంలాండ్ భద్రత, ఇతర విభాగాలకు నిధులు నిలిచిపోనున్నాయి. ఇది పాక్షిక షట్‌డౌన్‌కు దారి తీయనుంది. మినియాపొలిస్‌లో ఇటీవల ఇద్దరు ఆందోళనకారులను ఐసీఈ అధికారులు కాల్చడంతో మరణించడంతో సెనెట్ డెమోక్రాట్లు తమ డిమాండ్ల చిట్టాను ప్రభుత్వం ముందుంచారు. ఐసీఈకి సంస్కరించకపోతే నిధుల విడుదల బిల్లు ఆమోదించేది లేదని డెమోక్రాట్లు స్పష్టం చేశారు. సెనెట్ డెమోక్రటిక్ పార్టీ నేత చక్ షూమర్ అంతకుముందు స్పష్టం చేశారు. 'చట్టాన్ని అమలు చేసే అధికారులకు అమెరికా ప్రజలు మద్దతిస్తారు. సరిహద్దు భద్రతా దళాలకూ మద్దతుగా నిలుస్తారు. కానీ వీధుల్లో భయభ్రాంతులకు గురిచేసే, అమెరికా పౌరులను చంపే ఐసీఈ అధికారులను ఉపేక్షించబోరు' అని పేర్కొన్నారు.

ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు నాకుంది

- సైన్యానికి సాయం చేయొద్దని పిలుపివ్వలేదు
- సుప్రీంకోర్టులో వాతావరణ ఉద్యమకారుడు వాంగ్‌చుక్



దిల్లీ: ప్రభుత్వాన్ని విమర్శించే, ప్రశ్నించే హక్కు తనకుందని జోధ్‌పుర్ సెంట్రల్ జైలులో ఉన్న వాతావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ (59) సుప్రీంకోర్టుకు గురువారం తెలిపారు. తనపై మోపిన అభియోగాలు అబద్ధమని పేర్కొన్నారు. తనకు ప్రభుత్వాన్ని విమర్శించే హక్కుతో పాటు, ఆందోళన చేసే హక్కు కూడా ఉందని అన్నారు. వీడియోలలోని ఎంపిక చేసిన కొన్ని దృశ్యాల ఆధారంగా తనను అక్రమంగా నిర్బంధించారని తెలిపారు. "అరబ్ వసంతంలోలా భారత ప్రభుత్వాన్ని కూలదోయాలని వాంగ్‌చుక్ పేర్కొన్నట్లు పోలీసులు చెబుతున్నారు. వీడియో చూడండి. ఆయన ఎక్కడా చెప్పలేదు. ఆ వీడియో.. ట్రాన్స్‌క్రిప్షన్ మీద సమర్పిస్తాం" అని జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ పి.బి.వరాలె ధర్మాసనం ముందు వాంగ్‌చుక్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. 2010, 2018 మధ్య పశ్చిమాసియా, ఉత్తర, తూర్పు ఆఫ్రికా దేశాల్లో అక్కడి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రజలు తిరుగుబాటు చేశారు. దీన్నే 'అరబ్ వసంతం' అంటారు. ప్రభుత్వం తమకు సాయం చేయబోతే, యుద్ధ సమయంలో భారత సైన్యానికి సాయం చేయకూడదని లద్దాఖ్ ప్రజలకు వాంగ్‌చుక్ పిలుపునిచ్చారని చెబుతున్న వాదనల్లో నిజం లేదని సిబల్ తెలిపారు. వాంగ్‌చుక్ కదులుతో సమస్య ఉందని న్యాయస్థానానికి విన్నవించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. గ్లాస్‌పెరంటిజాలపై ప్రభుత్వ వైద్యుడితో ఆయనకు చికిత్స అందించాలని ఆదేశించింది. కేంద్రపాలిత ప్రాంతం లద్దాఖ్‌కు రాష్ట్ర హోదాను కల్పించాలని డిమాండ్ చేస్తూ 2025 సెప్టెంబరులో లేలో జరిగిన ఆందోళనల నేపథ్యంలో జాతీయ భద్రతా చట్టం (ఎన్‌ఎస్‌ఏ) కింద వాంగ్‌చుక్‌ను నిర్బంధించారు. దీన్ని సవాల్ చేస్తూ వాంగ్‌చుక్ భార్య గీతాంజలి పిటిషన్ వేశారు.

10 లక్షల మందికి 22 మంది జడ్జీలు

- రాజ్యసభలో కేంద్రం వెల్లడి

దిల్లీ: దేశంలో ప్రతి 10 లక్షల మంది జనాభాకు 22 మంది చొప్పున న్యాయమూర్తులు ఉన్నారని కేంద్రం గురువారం పార్లమెంటులో తెలిపింది. 2011 జనాభా లెక్కల్ని, ఇప్పుడు అన్ని న్యాయస్థానాల్లో ఉన్న న్యాయమూర్తుల సంఖ్యను దీనికి పరిగణనలో తీసుకున్నామని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ రాజ్యసభకు రాతపూర్వకంగా తెలిపారు. (10 లక్షల మందికి 50 మంది జడ్జీలు ఉండాలని 1987లో లా కమిషన్ సిఫార్సు చేసింది.) తాజా గణాంకాల ప్రకారం దేశంలో విచారణలో ఉన్న ఖైదీల సంఖ్య 3,89,910 అని చెప్పారు.

✦ బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై జరుగుతున్న దాడుల ఘటనల్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని విదేశీ వ్యవహారాల శాఖ సహాయమంత్రి కీర్తివర్ధన్‌సింగ్ రాజ్యసభలో తెలిపారు. నిందితులపై బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

✦ గత ఏడాది దేశంలో 18వేల ఉద్యోగ మేళాలు నిర్వహించి 2.22 కోట్ల మందికి ఉద్యోగాలు ఇచ్చినట్లు కేంద్రం రాజ్యసభలో తెలిపింది.

✦ దేశంలో ప్రస్తుతం పైలట్లు-విమానాల నిష్పత్తి సరిపడినంతగా ఉందని పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ తెలిపింది.

గాజాలో అమెరికా పాత్ర ప్రశంసనీయం

ఐరాసలో అగ్రరాజ్యాన్ని అభినందించిన భారత్

ఐరాస: గాజాలో నెలకొన్న దీర్ఘకాలిక సంఘర్షణను పరిష్కరించడానికి అమెరికా చేసిన కృషిని భారత్ ప్రశంసించింది. పాలస్తీనా పౌరుల బాధలను, కష్టాలను తగ్గించడానికి అంతర్జాతీయ సమాజం నిరంతర మద్దతు, నిబద్ధత అవసరమని తెలిపింది. ఈ మేరకు పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితిపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో జరిగిన చర్చలో భారతదేశ శాశ్వత ప్రతినిధి, రాయబారి పర్వతనేని హరీశ్ వ్యాఖ్యానించారు. "ఐరాస భద్రతా మండలి తీర్మానం అమలుకు సంబంధించి ఇటీవల జరిగిన పురోగతిని భారత్ గమనించింది. గాజాలోని దీర్ఘకాలిక సంఘర్షణను పరిష్కరించడానికి కృషి చేస్తున్న అమెరికాను భారత్ ప్రశంసిస్తోంది. గాజా సమస్యలపాలైన ప్రజలకు ఉపశమనం కల్పించడానికి చోటు లేదు. అది ఏ రూపంలో, ఎక్కడ ఉన్నా ఖండించాల్సిందే. భారత్ ఎల్లప్పుడూ సార్వభౌమాధికార, స్వతంత్ర పాలస్తీనా దేశానికి మద్దతు ఇస్తూ వస్తోంది. ఇజ్రాయెల్, పాలస్తీనా పక్కపక్కనే గుర్తింపు పొందిన సరిహద్దుల్లో శాంతి, భద్రతలతో జీవించాలి. ఇదే ఈ దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం. 1988లో పాలస్తీనాను దేశంగా గుర్తించిన మొదటి అరబ్ యేతర దేశం భారత్. ఇజ్రాయెల్- పాలస్తీనా మధ్య ఉద్రిక్తతలు తగ్గడానికి చర్చలు, దౌత్యమే పరిష్కారమని మేం బలంగా విశ్వసిస్తున్నాం" అని హరీశ్ తెలిపారు. లెబనాన్‌లో శాంతి, స్థిరత్వం, అభివృద్ధికి కూడా భారత్ కట్టుబడి ఉందని స్పష్టంచేశారు.

మహారాష్ట్ర జడ్పీ ఎన్నికల్లో స్వల్ప మార్పు

ముంబయి: ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ దుర్మరణంతో మహారాష్ట్రలో జిల్లా పరిషత్తులు, పంచాయతీ సమితుల ఎన్నికల షెడ్యూలులో కొద్దిగా మార్పులు చోటుచేసుకున్నాయి. బుధ, గురు, శుక్రవారాలను ప్రభుత్వం సంతాప దినాలుగా ప్రకటించడమే దీనికి కారణం. 12 జిల్లా పరిషత్తులు, 125 పంచాయతీ సమితులకు ఫిబ్రవరి 5న ఓటింగు జరగాల్సి ఉండగా, అది ఫిబ్రవరి 7న జరుగుతుంది. మిగిలినవాటికి 7న జరగాల్సిన ఓట్ల లెక్కింపు 9న జరుగుతుందని మహారాష్ట్ర ఎన్నికల సంఘం గురువారం ప్రకటించింది.

వదినమ్మకు దాదా పదవి..చీలిక వర్గాల ఏకీకరణ

- అజిత్ అస్తమయం అనంతరం నేతల మనోగతం

ముంబయి: మరాఠా ఉద్దండ నేత అజిత్ పవార్ మరణించిన నేపథ్యంలో మహారాష్ట్ర రాజకీయాల్లో రెండు వాదనలు వినిపిస్తున్నాయి. అజిత్ భార్య సునేత్రా పవార్‌కు ఉపముఖ్యమంత్రిగా రాష్ట్ర మంత్రి మండలిలో స్థానం కావాలంటున్న ఎన్సీపీ నేతలు తమ పార్టీ చీలిక వర్గమైన శరద్ పవార్ నాయకత్వంలోని ఎన్సీపీ (ఎస్పీ)తో ఏకం కావాలనీ కోరుతున్నారు. సునేత్ర ముందుకు వచ్చి మహారాష్ట్ర అధికార కూటమి 'మహాయుతి'లో భాగమైన పార్టీ నేతృత్వ పగ్గాలు చేపట్టాలని ఎన్సీపీ నాయకులు గురువారం డిమాండ్ చేశారు. "రాజ్యసభ సభ్యురాలైన సునేత్రా పవార్‌కు ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారు. అజిత్ దాదాకు అదే సరైన నివాళి" అని సీనియర్ ఎన్సీపీ నేత, రాష్ట్ర మంత్రి నరహరి జిర్వాల్ అన్నారు. "మేం మా పార్టీ నాయకత్వంతో ఈ విషయం చర్చించి నిర్ణయం తీసుకుంటాం" అని ఆయన చెప్పారు. ఎన్సీపీ చీలికవర్గాలు రెండూ తిరిగి ఏకం అవుతాయా అన్న ప్రశ్నకు "ఇరు వర్గాలూ స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఏకమయ్యాయి. విడివిడిగా ఉండటంలో అర్థం లేదని అందరూ గుర్తించారు. మేం ఒకటి కావాలి" అని మంత్రి జిర్వాల్ బదులిచ్చారు. సునేత్రా పవార్ తన భర్త వారసత్వాన్ని కొనసాగించి పార్టీ కార్యకర్తల బాగోగులు చూసుకోవాలని అజిత్ పవార్‌కు సన్నిహితుడైన ప్రమోద్ హిందూరావ్ అన్నారు. చీలిక వర్గాలు రెండూ ఏకం కావాలని అజిత్ పవార్ స్వయంగా చెప్పారని శరద్ పవార్ వర్గం రాష్ట్ర అధ్యక్షుడు శశికాంత్ శిందే అన్నారు. పునరేకీకరణకై ప్రాథమిక స్థాయి చర్చలు ఇప్పటికే పూర్తయ్యాయని ఆయన తెలిపారు. శరద్ పవార్ వర్గం భాజపా నేతృత్వంలోని అధికార మహాయుతి కూటమిలో భాగస్వామి అవుతుందా అన్న ప్రశ్నకు బదులిస్తూ 'దానిపై ఇప్పుడే ఏమీ చెప్పలేం. అజిత్ దాదా ఆకాంక్ష మేరకు ఏదైనా సానుకూల పరిణామం చోటు చేసుకుంటుందేమో చూద్దాం" అని శిందే వ్యాఖ్యానించారు. పునరేకీకరణపై అజిత్ పవార్, శరద్ పవార్‌లు నిర్ణయం తీసుకునే దశలో ఈ పరిణామం జరిగిందని మాజీ మంత్రి నవాబ్ మాలిక్ అన్నారు. "ఇకపై రాజకీయాల్లో ఎలాంటి మార్పులు వస్తాయో చెప్పలేం. కుటుంబం ఐక్యంగా నిలవాలని, ఇరు వర్గాలూ ఒకటి కావాలని అందరూ కోరుకుంటున్నారు" అని ఆయన అన్నారు. అజిత్ మరణం నేపథ్యంలో అందరూ షాక్‌లో ఉన్న ప్రస్తుత స్థితిలో రాజకీయాల్ని గురించి మాట్లాడలేం అని ఎన్సీపీ మంత్రి ఛగన్ భుజ్‌బల్ అన్నారు. రెండున్నర నెలల పాటు చర్చలు జరిపాక రెండు వర్గాలూ ఏకం కావాలన్న నిర్ణయానికి వచ్చాయి అని ఎన్సీపీ (ఎస్పీ) నేత ఏక్‌నాథ్ ఖడ్సే అన్నారు. రానున్న జడ్పీ ఎన్నికల్లో రెండు పార్టీలూ కలిసి పోటీ చేయాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. సునేత్రా పవార్ 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్సీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. శరద్ పవార్ కుమార్తె, వరసకు తన మరదలైన సుప్రియా సూలే చేతిలో ఆమె ఓడిపోయారు.



మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ అంత్యక్రియల సందర్భంగా బారామతిలో ఆయన భార్య సునేత్ర పవార్‌కు అభివాదం చేస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా. చిత్రంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ తదితరులు

రహదారుల వెంట గోశాలల నిర్మాణాన్ని పరిశీలించండి

- ఎన్‌హెచ్‌ఏఐకి సూచించిన సుప్రీంకోర్టు

దిల్లీ: రహదారులపైకి వచ్చే పశువులను తరలించి, సంరక్షించడం కోసం గోశాలల/పశుశాలల నిర్మాణాన్ని పరిశీలించాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ)కు సుప్రీంకోర్టు సూచించింది. నిర్ణీత దూరంలో రహదారుల వెంట నిర్మించే ఈ గోశాలల వల్ల తప్పిపోయి వచ్చే/ వదిలివేసిన పశువుల కారణంగా జరిగే ప్రమాదాలను నివారించవచ్చని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి.అంజరియా ధర్మాసనం అభిప్రాయపడింది. గోశాలలను నిర్మించేలా రహదారుల నిర్మాణ కాంట్రాక్టర్లను ఒప్పించాలని, అందుకుగాను వారికయ్యే అదనపు వ్యయాన్ని చెల్లించే విషయాన్నీ పరిశీలించాలని ధర్మాసనం పేర్కొంది. కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యత నిధులను ఆయా పశువుల సంరక్షణకు వినియోగించేలా చేయవచ్చనీ తెలిపింది. రహదారులపైకి వచ్చే పశువుల సమాచారం ఇవ్వడానికి వీలుగా ఓ యాప్‌ను అభివృద్ధిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ఎన్‌హెచ్‌ఏఐని ధర్మాసనం కోరింది. వీధికుక్కలపై గత నవంబరు7న జారీ చేసిన ఉత్తర్వులను సవరించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై తీర్పును ధర్మాసనం గురువారం రిజర్వు చేసింది. ఆ నాటి ఆదేశాల అమలులో పంజాబ్, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, తమిళనాడు ప్రభుత్వాల చర్యలపై అసంతృప్తి వ్యక్తం చేసింది.

కోర్టుల్లో పెండింగ్ వ్యాజ్యాల తగ్గింపునకు ఆధునిక సాంకేతికతలు

- ప్రారంభించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్

దిల్లీ: న్యాయస్థానాల్లో పెరిగిపోతున్న పెండింగ్ వ్యాజ్యాల సత్వర పరిష్కారానికి దోహదపడేలా, కోర్టు పాలనా వ్యవహారాల సామర్థ్యాన్ని పెంపొందించేందుకు భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ గురువారం ఆధునిక సాంకేతిక సదుపాయాలను ప్రారంభించారు. కోర్టుల సామర్థ్యాన్ని పెంచడానికి కృత్రిమ మేధ(ఏఐ)ని వినియోగించుకోనున్నట్లు సీజేఐ తెలిపారు. 'ట్రయల్ కోర్టులు, హైకోర్టుల్లో పెండింగ్ కేసుల వివరాలు ఎప్పటికప్పుడు తెలిసేలా డిజిటల్ భాగస్వామ్య వేదికను ప్రారంభించాం' అని వెల్లడించారు. న్యాయస్థానాల పాలనా వ్యవహారాల్లో వివిధ చెల్లింపులను సులభతరం చేసేందుకు గాను 'ఆన్‌లైన్ పేమెంట్స్ వ్యవస్థ'ను అందుబాటులోకి తెచ్చామన్నారు. కోర్టుల ప్రాంగణాల్లో న్యాయవాదులు, పిటిషనర్ల వాహనాల పార్కింగ్‌కు అనుమతుల జారీ కోసం 'పార్క్ ఆథరైజేషన్ రికార్డ్ కీపర్ (పార్క్)' యాప్‌ను సీజేఐ ప్రారంభించారు.

ఎక్కడికైనా వెళ్లి చావు అనడం ఆత్మహత్యకు ప్రేరేపించినట్లు కాదు: కేరళ హైకోర్టు

కొచ్చి: ఎక్కడికైనా వెళ్లి చావు అన్నంత మాత్రాన ఆత్మహత్యకు ప్రేరేపించినట్లు కాదని కేరళ హైకోర్టు పేర్కొంది. ఈ మేరకు ఓ వ్యక్తిపై మోపిన అభియోగాలను కొట్టివేసింది. ఉద్రిక్త వాతావరణంలో చేసిన వ్యాఖ్యలుగా వాటిని చూడాలని న్యాయస్థానం పేర్కొంది. ఈ కేసులో ఓ వివాహితతో నిందితుడు ఆదూర్‌కు సంబంధం ఉంది. అతను మరో మహిళను పెళ్లి చేసుకోనున్నాడని ఆ వివాహిత మహిళకు తెలిసింది. దీంతో ఆమె.. ఆదూర్‌ను నిలదీసింది. ఈ సందర్భంగా జరిగిన వాగ్వాదంలో ఎక్కడికైనా వెళ్లి చావు అని ఆదూర్ వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆ వివాహిత, తన ఐదున్నరేళ్ల కుమార్తెతో కలిసి బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆదూర్‌పై ఐపీసీ సెక్షన్ 306, ఇతర సెక్షన్ల కింద అభియోగాలు నమోదయ్యాయి. వీటిని కొట్టివేయాలంటూ ఆదూర్ వేసిన పిటిషన్‌ను ట్రయల్ కోర్టు తిరస్కరించింది. దీంతో అతను హైకోర్టును ఆశ్రయించారు. "ఈ కేసులో చనిపోయిన వారిని ఆత్మహత్యకు ప్రేరేపించాలన్న ఉద్దేశం నిందితుడికి లేదు. ఆ ఉద్రిక్త వాతావరణంలో 'ఎక్కడికైనా వెళ్లి చావండి' అని వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి నేరాలకు ఐపీసీలోని 306 సెక్షన్ వర్తించదు" అని హైకోర్టు పేర్కొంది. అభియోగాల నుంచి నిందితుడికి విముక్తి కల్పించింది.

విమానంలో 'గగన్' లేదా..?

- దర్యాప్తులో అనుమానాలు

ముంబయి: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదానికి సంబంధించి కొత్త విషయాలు బయటికొస్తున్నాయి. అజిత్ ప్రయాణించిన విమానంలో శాటిలైట్ ఆధారిత భద్రతా వ్యవస్థ 'గగన్' లేకపోవచ్చని ప్రాథమిక దర్యాప్తులో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదానికి ఇది కూడా ఓ కారణమై ఉండొచ్చని దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. విమానాల్లో ఈ భద్రతా వ్యవస్థను తప్పనిసరిగా అమర్చాలన్న నిబంధనలు అమల్లోకి రావడానికి 28 రోజుల ముందు అజిత్ ప్రయాణించిన విమానం రిజిస్టర్ అయినట్లు తెలుస్తోంది. దీంతో 'గగన్ గైడెన్స్ సిస్టమ్' అందులో ఉండకపోవచ్చని సమాచారం.



ఏంటీ 'గగన్' వ్యవస్థ..?

సాధారణంగా ప్రధాన విమానాశ్రయాల్లో ఇన్‌స్ట్రుమెంట్ ల్యాండింగ్ సిస్టమ్ (ఐఎల్ఎస్) సాయంతో విమానాలు ల్యాండ్ అవుతాయి. ఇది భూ ఆధారిత టెక్నాలజీ. దృశ్యస్పష్టత తక్కువగా ఉన్న పరిస్థితుల్లో పైలట్‌కు ల్యాండింగ్ విషయంలో కచ్చితమైన మార్గదర్శకత్వాన్ని అందిస్తుంది. ఈ సాంకేతికతను 'ఇన్‌విజిబుల్ గ్లైడ్ పాత్'గా పేర్కొంటారు. వర్షం లేదా పొగమంచు కమ్మేసినప్పుడు పైలట్లు సజావుగా రన్‌వేపై దిగడానికి ఇది దోహదపడుతుంది. అయితే, చాలా ఖర్చుతో కూడుకున్న సాంకేతికత. బారామతి వంటి చిన్న విమానాశ్రయాల్లో ఈ సదుపాయం అందుబాటులో లేదు. ఈ నేపథ్యంలో చిన్న ఎయిర్‌పోర్టుల కోసం కేంద్రం స్వదేశీ పరిజ్ఞానంతో శాటిలైట్ ఆధారిత గగన్ (జీపీఎస్ ఎయిడెడ్ జియో అగ్మెంటెడ్ నావిగేషన్) వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. గ్రౌండ్ పరికరాలతో అవసరం లేకుండా ఈ గగన్ వ్యవస్థ శాటిలైట్ సమాచారాన్ని ఆధారంగా చేసుకుని పైలట్లకు ల్యాండింగ్ సమయంలో మార్గనిర్దేశం చేస్తుంది.

అప్పుడు సమకూర్చిన అంబులెన్సులోనే ఇప్పుడు పార్థివదేహం తరలింపు

బారామతి: అజిత్ పవార్ గతంలో చేసిన సాయం ఇప్పుడు పలువురికి కన్నీళ్లు తెప్పిస్తోంది. బారామతి మున్సిపల్ కౌన్సిల్‌లో అంబులెన్సు పాతదైపోయిందంటూ అప్పట్లో అజిత్ పవార్ దృష్టికి వచ్చింది. దీనిపై వెంటనే స్పందించిన ఆయన అధికారులను ఆదేశించడంతో ఎలాంటి జాప్యం లేకుండా కొత్త అంబులెన్సును ఏర్పాటు చేశారు. ఇప్పుడు అదే వాహనంలో ఆయన పార్థివదేహాన్ని ఆస్పత్రి నుంచి తరలించినట్లు అంబులెన్సు డ్రైవర్ నజీమ్ కాజీ పేర్కొన్నారు.



బారామతిలో గురువారం నిర్వహించిన అజిత్ పవార్ అంతిమయాత్రలో పాల్గొన్న ప్రజలు

భద్రతపరంగా ఎలాంటి ఆందోళనల్లేవు: రామ్మోహన్‌నాయుడు

దిల్లీ: విమాన ప్రమాదంపై లోతుగా దర్యాప్తు జరుగుతోందని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. విమాన ఆపరేటర్‌కు సంబంధించి ఎలాంటి భద్రతాపరమైన ఆందోళనలు లేవని వివరించారు. ప్రమాదంపై దర్యాప్తును వేగవంతం చేసేందుకు సహకారం అందించాలని కోరుతూ ఆయన మహారాష్ట్ర ప్రభుత్వానికి గురువారం లేఖ రాశారు. లీర్‌జెట్-45 విమానం కుప్పకూలిన ఘటనపై ఆ విమాన తయారీ రంగ సంస్థ బంబార్డియర్ సంతాపం వ్యక్తం చేసింది. దర్యాప్తునకు అన్ని విధాలుగా సహకరిస్తామని తెలిపింది. ప్రమాద ఘటనపై వదంతులకు దూరంగా ఉండాలని 'భారత విమానయాన పైలట్ల సంఘం' విజ్ఞప్తిచేసింది.

లార్డ్ దేశాయ్ పేరుతో విద్యార్థి నిధి

లండన్: భారత సంతతికి చెందిన ప్రసిద్ధ ఆర్థిక శాస్త్ర నిపుణుడు, విద్యావేత్త లార్డ్ మేఘ్‌నాథ్ దేశాయ్ సంస్మరణార్థం లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్‌కు చెందిన విద్యార్థులు ఒక విద్యార్థి సహాయక నిధిని ఏర్పాటు చేశారు. 84 సంవత్సరాల వయసులో మేఘ్‌నాథ్ దేశాయ్ గత సంవత్సరం జులై నెలలో మరణించారు. 'లార్డ్ దేశాయ్ స్టూడెంట్ సపోర్ట్ ఫండ్' పేరుతో ఆయన జ్ఞాపకార్థం ఏర్పాటైన ఈ నిధి విద్యార్థులకు ఆలంబన అందించనుంది.

ఫారం-7 దుర్వినియోగంపై కాంగ్రెస్ ఫిర్యాదు

దిల్లీ: ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) కార్యక్రమం నడుస్తున్న 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో భాజపా కార్యకర్తలు ఫారం-7ను దుర్వినియోగం చేస్తూ వెనుకబడిన కులాలు, ఇతర బలహీన వర్గాల పేర్లను జాబితాల నుంచి తొలగిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. నియోజకవర్గాల వారీగా తొలగించిన పేర్లు, మొత్తం దాఖలైన ఫారం-7ల గురించి వివరాలను అందించాలని పార్టీ ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్ గురువారం ఎన్నికల సంఘానికి రాసిన లేఖలో డిమాండ్ చేశారు. సర్ కార్యక్రమంలో క్లెయిములు, అభ్యంతరాలను స్వీకరిస్తున్న ప్రస్తుత సమయంలో ఫారం-7లు విరివిగా దాఖలయ్యాయని ఆయన వివరించారు. ఓటర్ల జాబితాలో ఫలానా వారి పేర్లను చేర్చకూడదని కానీ, చేర్చిన పేర్లలో అనర్హులను తొలగించాలని కానీ డిమాండ్ చేయడానికి ఈ దరఖాస్తులను ఉపయోగిస్తారు.

దిల్లీలో పెరిగిన గుండెపోటు మరణాలు

దిల్లీ: దేశ రాజధానిలో గుండెపోటు, హృదయ సంబంధ రుగ్మతల వల్ల మరణాలు పెరుగుతున్నాయి. 2024లో ఈ తరహా మరణాల్లో 50 శాతం పెరుగుదల కనిపించింది. 2023లో దిల్లీలో హృద్రోగాల వల్ల మరణాలు 22,385 కాగా, 2024లో 34,539కి పెరిగాయి. గడచిన రెండు దశాబ్దాలలో దిల్లీలో 3,29,857 మరణాలు గుండెపోటు, ఇతర హృదయ రుగ్మతల వల్ల సంభవించినవేనని దిల్లీ ప్రభుత్వ తాజా నివేదిక తెలిపింది. వీటిలో అత్యధికంగా 1,03,972 మరణాలు 45-64 ఏళ్ల వయోవర్గంలో సంభవించగా, 65 ఏళ్లు పైబడినవారిలో 92,048 మరణాలు సంభవించాయి. 25-44 ఏళ్ల వర్గంలో 46,129 మరణాలు సంభవిస్తే, 14,321 మరణాలు 14 ఏళ్ల లోపు వారిలో సంభవించాయి. అనువంశిక లక్షణాలు హృదయ సంబంధ వ్యాధులకు కారణమవుతాయనే మాట నిజమే కానీ, ఆధునిక జీవనశైలి వల్ల ఈ ముప్పు పెరిగిపోతోందని ఇక్కడి బీఎం బిర్లా హార్ట్ ఆస్పత్రికి చెందిన డాక్టర్ మధురిమా ఘోష్ వివరించారు. ధూమపానం, టీవీకి అతుక్కుపోవడం, తగినంత శారీరక శ్రమ చేయకపోవడం, అధిక ఒత్తిడి, చాలినంతగా నిద్రపోకపోవడం, వాయు కాలుష్యం.. అన్నీ కలిసి దిల్లీలో గుండెపోటు కేసులను పెంచుతున్నాయని శ్రీ బాలాజీ యాక్షన్ మెడికల్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ అమర్ సింఘాల్ వివరించారు.

23 మంది భారతీయ మత్స్యకారుల విడుదల

దిల్లీ: సముద్ర జలాల్లో చేపలు పడుతూ పొరపాటున బంగ్లాదేశ్ పరిధిలోని జలాల్లోకి ప్రవేశించి బందీలుగా మారిన 23 మంది భారతీయ మత్స్యకారులు గురువారం చెర నుంచి విడుదలయ్యారు. బందీల పరస్పర ఇచ్చిపుచ్చుకోలు ఒప్పందంలో భాగంగా బంగ్లాదేశ్‌కు చెందిన 128 మంది మత్స్యకారులను భారత్ విడుదల చేసిందని విదేశీ వ్యవహారాల శాఖ అధికారిక ప్రకటన తెలియజేసింది. మత్స్యకారులతోపాటు వారి పడవలనూ విడుదల చేసినట్టు భారత ప్రభుత్వ ప్రకటన పేర్కొంది. బంగ్లాదేశ్ చెరలో ఉన్న భారతీయ మత్స్యకారుల బాగోగులను ప్రభుత్వం జాగ్రత్తగా గమనించిందని వెల్లడించింది.

చైనాకు 'నిఫా' భయం.. విమానాశ్రయాల్లో స్క్రీనింగ్

బీజింగ్: చైనాకు 'నిఫా' వైరస్ భయం పట్టుకుంది. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా భారత్ సహా వైరస్ ప్రభావిత ప్రాంతాల నుంచి వస్తున్న ప్రయాణికులకు విమానాశ్రయాల్లో స్క్రీనింగ్ ప్రక్రియ ప్రారంభించింది. చైనా అధికారులు స్వాబ్ పరీక్షలు నిర్వహిస్తున్నారని బీజింగ్ చేరుకున్న కొంతమంది భారతీయ ప్రయాణికులు తెలిపినట్లు 'పీటీఐ' వార్తాసంస్థ పేర్కొంది. ఇప్పటివరకైతే తమ దేశంలో నిఫా కేసులు నమోదు కాలేదని చైనా వ్యాధి నియంత్రణ, నిర్మూలనా కేంద్రం వెల్లడించింది. భారత్‌లోని పశ్చిమ బెంగాల్‌లో ప్రస్తుతం ఈ వైరస్ ఉందని, అయితే.. ఆ రాష్ట్రంతో చైనాకు సరిహద్దు లేదని తెలిపింది.

వ్యర్థాల నిర్వహణకు కొత్త నిబంధనలు

దిల్లీ: ఘన వ్యర్థాల నిర్వహణకు సంబంధించి కేంద్రం కొత్త నిబంధనల్ని రూపొందించింది. ఇవి ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయని కేంద్ర పర్యావరణశాఖ మంత్రి భూపేందర్ యాదవ్ వెల్లడించారు. కొత్త నిబంధనల ప్రకారం.. వ్యర్థాలను నాలుగు రకాలుగా వర్గీకరించడం తప్పనిసరి చేశారు. తడి, పొడి, పారిశుద్ధ్య, ప్రత్యేక సంరక్షణ జనిత వ్యర్థాలుగా వర్గీకరించారు. 20వేల చదరపు మీటర్ల ఫ్లోర్ ఏరియా కలిగిన భవనాల్లో నిర్వాహకులు.. రోజుకు 40వేల లీటర్ల నీటిని వినియోగించే సంస్థలు.. రోజూ 100 కిలోల ఘన వ్యర్థాలు ఉత్పత్తి చేసే సంస్థల్ని భారీ వ్యర్థ ఉత్పాదకులుగా (బల్క్ వేస్ట్ జనరేటర్లు) గుర్తిస్తారు. ఇలాంటి సంస్థలు ఉత్పత్తి చేసిన వ్యర్థాల సేకరణ, రవాణా, ప్రాసెసింగ్ ప్రక్రియలు కచ్చితంగా జరగాలని కొత్త నిబంధనలు పేర్కొంటున్నాయి.



గురువారం దిల్లీలోని కర్తవ్యపథ్‌లో బీటింగ్ రిట్రీట్ వేడుక

వైభవంగా బీటింగ్ రిట్రీట్

దిల్లీ: గణతంత్ర వేడుకలకు ముగింపు పలుకుతూ గురువారం దిల్లీలోని రైసినా హిల్ ప్రాంతంలో "బీటింగ్ రిట్రీట్" కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆపరేషన్ సిందూర్ విజయాన్ని, ఒకటిన్నర శతాబ్దాల వందేమాతర గీతం ప్రాశస్త్యాన్ని, భారత సైనికుల శౌర్యాన్ని ఈ సందర్భంగా వీర జవానులు ఎలుగెత్తి చాటారు. వాయుసేన, నౌకాదళం, సైనిక, పారామిలిటరీ బలగాల బ్యాండ్‌లు మైమరపించే దేశభక్తి గీతాల స్వరాలను వినిపించాయి. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తన సంప్రదాయ అధికారిక వాహనమైన గుర్రపు బగ్గీలో విచ్చేశారు. ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, త్రిదళాధిపతి అనిల్ చౌహాన్, త్రివిధ దళాల అధిపతులు, ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. "కదం కదం బఢాయేజా" అనే దేశభక్తి గీతంతో ప్రారంభమైన ఈ కార్యక్రమం ఆద్యంతం వీక్షకుల్ని అలరించింది.

పంజాబ్‌లో 42 కిలోల డ్రగ్స్ స్వాధీనం

ఛండీగఢ్: పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో భారీగా మాదకద్రవ్యాలు పట్టుబడ్డాయి. దాదాపు 42 కిలోల హెరాయిన్‌ను పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. పెద్ద ఎత్తున మాదకద్రవ్యాలను సరఫరా చేస్తున్నారనే సమాచారం రావడంతో ఆపరేషన్ నిర్వహించిన పోలీసులు.. హెరాయిన్‌తో పాటు 4 గ్రనేడ్లు, ఓ తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ మాఫియాతో సంబంధమున్న ఓ ఇద్దరు స్థానికులను అరెస్టుచేశారు. ✦ దిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఓ ప్రయాణికుడి వద్ద దాదాపు రూ.10 కోట్ల విలువైన గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 26న బ్యాంకాక్ నుంచి వచ్చిన అతడి వద్ద 9.48 కిలోల గంజాయి లభ్యమైంది. ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు.



అంగన్‌వాడీ కార్యకర్త ఒడిలో శిశువు మృతదేహం

తల్లికి దూరమైంది.. చలి చంపేసింది!

పుట్టిన కాసేపటికే తల్లి ప్రేమకు దూరమైన ఓ పసి కందు చలికి చిక్కి ప్రాణాలు కోల్పోయింది. గురువారం తెల్లవారుజామున అనకాపల్లి జిల్లాలోని కృష్ణదేవిపేట ఆర్టీసీ బస్టాండుకు వచ్చిన ప్రయాణికులకు అక్కడి చప్టాపై ఓ శిశువు కనిపించింది. చుట్టు పక్కల ఎవరూ లేకపోవడంతో కొందరికి అనుమానం వచ్చి చూడగా కదలికలు కనిపించలేదు. వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై రుషికేశ్వరరావు, గొలుగొండ ఐసీడీఎస్ సిబ్బంది వచ్చి శిశువును స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు చలికి తాళలేక శిశువు అప్పటికే ప్రాణాలు కోల్పోయిందని నిర్ధారించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

– న్యూస్‌టుడే, కృష్ణదేవిపేట

దివ్యాంగుల వాహనాల పంపిణీకి నిధుల విడుదల

'ఈనాడు' కథనానికి స్పందన

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా దివ్యాంగులకు త్రిచక్ర వాహనాల పంపిణీకి వీలుగా ఆర్థికశాఖ నిధులు విడుదల చేసింది. తొలి విడతగా 875 వాహనాలు అందించేందుకు ప్రభుత్వం సెప్టెంబరులో టెండర్ల ప్రక్రియను పూర్తి చేసింది. టెండరు నిబంధనల ప్రకారం గుత్తేదారు సంస్థకు మొత్తం వ్యయంలో 50 శాతం చెల్లించాలి. పంపిణీకి ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా ఆర్థికశాఖ నిధులు విడుదల చేయకుండా జాప్యం చేసింది. దీనిపై 'దివ్యాంగులకు త్రిచక్ర వాహనాల పంపిణీ ఎప్పుడు?' శీర్షికతో 'ఈనాడు'లో ఈ నెల 24న కథనం ప్రచురితమైంది. స్పందించిన ప్రభుత్వం రూ.5 కోట్ల నిధుల్ని విడుదల చేసింది. అదే రోజు 'వినికిడి పరికరాల పంపిణీలో జాప్యం' శీర్షికతో ప్రచురితమైన కథనానికి కూడా సర్కారు స్పందించి నిధులు విడుదల చేసింది. మొత్తంగా రూ.7 కోట్లు విడుదలైనట్లు దివ్యాంగుల, వృద్ధుల సంక్షేమశాఖ అధికారులు తెలిపారు.

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలు

ప్రభుత్వ సలహాదారు మంతెన సత్యనారాయణరాజు సూచన

ఈనాడు, అమరావతి: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలు బోధించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రకృతి వైద్య సలహాదారు మంతెన సత్యనారాయణరాజు సూచించారు. అమరావతిలోని మంతెన సత్యనారాయణ ఆరోగ్యాలయాన్ని వైద్యారోగ్య- కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, కమిషనర్ వీరపాండియన్, సెకండరీ హెల్త్ సంచాలకుడు చక్రధర్‌బాబు, ఎన్టీఆర్ వైద్య సేవ సీఈవో, ఆయుష్ కమిషనర్ దినేష్‌కుమార్, ఎయిడ్స్ నియంత్రణ మండలి పీడీ నీలకంఠారెడ్డి తదితరులు గురువారం సందర్శించారు. మంతెనతో సమావేశమై యోగా- నేచురోపతి ద్వారా ప్రజల ఆరోగ్య సంరక్షణ దిశగా చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఆరోగ్య రంగంలో చేపట్టాల్సిన విధానపరమైన మార్పులు, అవగాహన కార్యక్రమాలు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సత్యనారాయణరాజు వివరించారు. పాఠశాలల్లో రోజూ 30 నిమిషాల యోగాభ్యాసం, 15 నిమిషాలు ధ్యానం చేసేలా బోధన వేళల పట్టికలో చేర్చాలని సూచించారు. యోగా, నేచురోపతిపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు పూర్తి స్థాయిలో సహకరిస్తానని మంతెన పేర్కొన్నారు.

అభివృద్ధి వైపు దేశం పరుగులు

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

ఈనాడు, అమరావతి: రాష్ట్రపతి ప్రసంగం ద్వారా దేశం అభివృద్ధి వైపు పరుగులు పెడుతున్నట్లు అర్థమవుతోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా మారిందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీఎం జన్‌మన్ యోజన, ధర్తీ అబా గిరి జన గ్రామ ఉత్కర్ష్ అభియాన్‌లతో గిరిజన ప్రాంతాల్లోనూ అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. ఈ రెండు పథకాలకే ప్రభుత్వం రూ.లక్ష కోట్లకు పైగా వెచ్చిస్తున్నట్లు మాధవ్ తెలిపారు.

ప్రభుత్వ అన్యాయాలను నిలదీయండి: జగన్

ఈనాడు, అమరావతి: వైకాపా పంచాయతీరాజ్ విభాగం 2026 డైరీలను ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ తాడేపల్లిలోని తన కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. 'స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులపై తెదేపా ప్రభుత్వ అన్యాయాలను ఎదుర్కోవడానికి పంచాయతీ రాజ్ విభాగం క్రియాశీలకంగా పనిచేయాలి. పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుంది' అని ఆ విభాగం ప్రతినిధులకు జగన్ చెప్పారు. కార్యక్రమంలో ఆ విభాగం అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం నిర్ణయంతో సంక్షోభంలో పొగాకు పరిశ్రమ

మాజీ సీఎం జగన్‌ను కలిసిన రైతులు

ఈనాడు, అమరావతి: వర్జీనియా పొగాకు, సిగరెట్లపై కేంద్రం విధించిన అధిక ఎక్సైజ్ డ్యూటీ, జీఎస్టీ పెంపుతో తామంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పొగాకు రైతులు వాపోయారు. ఏలూరు జిల్లా చింతలపూడి నియోజకవర్గానికి చెందిన రైతులు గురువారం మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. 'కేంద్రం నిర్ణయం వల్ల పొగాకుకు డిమాండ్ తగ్గి, ధరలు పడిపోతున్నాయి. కొనుగోళ్లు పడిపోయి, మా జీవనోపాధి దెబ్బతింటోంది. అధిక పన్నులు ఉపసంహరించుకునేలా కేంద్రంపై ఒత్తిడి తేవాల'ని కోరుతూ వినతిపత్రం అందించారు. పొగాకు రైతుల సంక్షోభాన్ని ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే వైకాపా ఎంపీలు లేవనెత్తుతారని జగన్ వారికి హామీ ఇచ్చారు. చింతలపూడి వైకాపా సమన్వయకర్త కంభం విజయరాజు, ఎన్ఎల్ఎస్ వర్జీనియా పొగాకు రైతు సంఘం అధ్యక్షుడు సత్రం వెంకట్రావు, ఉపాధ్యక్షుడు అట్లూరి సతీష్ తదితరులు జగన్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

90 లేఖలు రాసినా ఎమ్మెల్సీకి పీఏను ఇవ్వలేరా?

- మాజీ ఎమ్మెల్యే ఫొటోలు వేస్తారు.. ఎమ్మెల్సీని గుర్తించరా?
- ఎమ్మెల్సీకి ప్రభుత్వ అతిథిగృహం కేటాయించరాదనే నిబంధనలెక్కడున్నాయి
- అధికారులపై శాసనమండలి ప్రివిలేజెస్ కమిటీ మండిపాటు
- విచారణకు హాజరుకాని నలుగురు తహసీల్దార్లకు నోటీసులు

ఈనాడు, అమరావతి: 'ఒక శాసనమండలి సభ్యుడు తనకు పీఏని ఇవ్వాలని ఆరుసార్లు వ్యక్తిగతంగా వచ్చి కలిసి కోరినా, 90 సార్లు లేఖలు రాసినా, వాట్సప్‌లో సందేశాలు పంపినా ఒక్క పీఏనూ ఆయనకు కేటాయించలేరా' అని అధికారులపై శాసనమండలి ప్రివిలేజెస్ కమిటీ తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. గురువారం అసెంబ్లీ కమిటీహాల్లో ఈ కమిటీ సమావేశమైంది. ప్రస్తుత సీడ్‌యాప్ ఛైర్మన్ దీపక్‌రెడ్డి గతంలో ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు వైకాపా హయాంలో మూడేళ్లు తనకు పీఏను ఇవ్వకుండా అధికారులు ఇబ్బంది పెట్టారంటూ చేసిన ఫిర్యాదుపై కమిటీ విచారించింది. అప్పట్లో అనంతపురం కలెక్టర్‌గా పనిచేసిన గంధం చంద్రుడు కమిటీ ముందు హాజరై వివరణ ఇచ్చారు. 'నేను కలెక్టర్‌గా అక్కడకు వెళ్లేసరికే ఈ అంశం నానుతోంది. నాకు పూర్తిగా తెలియదు. పొరపాటైంది' అని చంద్రుడు చెప్పినట్లు తెలిసింది. మూడేళ్లు ఇవ్వకపోవడమేంటని కమిటీ ఛైర్మన్ బీటీ నాయుడు ప్రశ్నించారు. నాటి అనంతపురం డీఆర్‌ఓ గాయత్రీదేవి స్పందిస్తూ.. 'అప్పట్లో కొందరు సిబ్బంది పేర్లను ఎమ్మెల్సీకి సూచించాం. వారిలో ఆయన ఎంచుకున్నవారు పదోన్నతుల జాబితాలో ఉండడంతో వెళ్లలేదు. అలా కొంత జాప్యం జరిగింది.. పొరపాటైంది' అని చెప్పారని సమాచారం.

మాజీ ఎమ్మెల్యేకిచ్చిన గౌరవం కూడా ఎమ్మెల్సీకివ్వరా

వైకాపా హయాంలో ఉరవకొండలో వైఎస్సార్ చేయూత పథకం అమలు సమయంలో ఆహ్వానాలు, వేదికల వద్ద వైకాపా మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఫొటోలు వేశారని, ఎమ్మెల్సీగా ఉన్న తనను కనీసం ఆహ్వానించలేదని నాటి వైకాపా ఎమ్మెల్సీ శివరామిరెడ్డి చేసిన ఫిర్యాదుపై కమిటీ విచారించగా.. బెలుగుప్ప, ఉరవకొండ మండలాల నాటి ఎంపీడీఓలు డీఎంకే బాషా, దామోదర్‌రెడ్డి వివరణ ఇచ్చారు. పరిస్థితులను బట్టి అలా చేశామని వారు చెప్పినట్లు తెలిసింది. ఒకే పార్టీకి చెందినవారైనా, మాజీ ఎమ్మెల్యేకు ఇచ్చిన గౌరవం సిటింగ్ ఎమ్మెల్సీకి ఇవ్వకపోవడమేంటని కమిటీ అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

ఆ నిబంధనలేంటో మాకూ చెప్పండి

తాను ఇటీవల విశాఖపట్నం వెళ్లినప్పుడు ప్రభుత్వ అతిథిగృహంలో బసచేస్తానని మూడుసార్లు అడిగినా డీఆర్‌ఓ స్పందించలేదని, పైగా ఎమ్మెల్సీలకు ఇవ్వడానికి రూల్స్ అంగీకరించవని.. కర్నూలు నుంచి వచ్చినవాళ్లకు అసలు ఇవ్వబోమని డీఆర్‌ఓ చెప్పారని ప్రివిలేజెస్ కమిటీ ఛైర్మన్ బీటీ నాయుడు కమిటీ సమావేశంలో ప్రస్తావించారు. దీనిపై విశాఖ డీఆర్‌ఓ భవానీశంకర్ వివరణ ఇవ్వబోగా.. 'ఎమ్మెల్సీలకు అతిథిగృహం కేటాయించరాదనే నిబంధనలు ఎక్కడున్నాయో చెప్పండి. కర్నూలు వాళ్లకైతే ఇవ్వరా? ఇదేం వితండవాదం?' అని కమిటీ ప్రశ్నించినట్లు సమాచారం. పొరపాటైందని డీఆర్వో చెప్పబోగా కమిటీ తీవ్ర అసహనం వ్యక్తం చేసింది.

కమిటీ ముందుకు రాని తహసీల్దార్లు

2021లో గురజాల, దాచేపల్లి, పిడుగురాళ్ల, మాచవరం మండలాల్లో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాల్లో తహసీల్దార్లు తనకు ప్రొటోకాల్ ఇవ్వలేదని అప్పటి ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి చేసిన ఫిర్యాదుపై వివరణ ఇవ్వాలని ఆయా మండలాల్లో అప్పట్లో పనిచేసిన తహసీల్దార్లకు కమిటీ నోటీసులు పంపినా.. గురువారం వారెవరూ రాలేదు. తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసిన కమిటీ, వారికి చివరిసారి నోటీసులు ఇవ్వాలని, అప్పటికీ స్పందించకపోతే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని పల్నాడు జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది.

* ప్రొటోకాల్ పాటించకుండా తమను అవమానించారంటూ ఎమ్మెల్సీలు ఇసాక్ బాషా, రమేష్ యాదవ్‌లు చేసిన ఫిర్యాదులపై బాధ్యులైన అధికారులు కమిటీ ముందుకొచ్చి వివరణ ఇచ్చారు.

రాష్ట్రంలో పెరిగిన విదేశీ విద్యార్థులు

- మహిళా కార్మిక శక్తిలోనూ మెరుగే
- ఆర్థిక సర్వేలో వెల్లడి

ఈనాడు, అమరావతి: దేశానికి వచ్చే వివిధ దేశాల విద్యార్థుల సంఖ్య ఆంధ్రప్రదేశ్, పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్, గుజరాత్‌లలో పెరిగిందని కేంద్ర ఆర్థిక సర్వే వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం గురువారం ఆర్థిక సర్వే-2025-26ను విడుదల చేసింది. గతంలో విదేశీ విద్యార్థులను ఆకర్షించడంలో ప్రధాన కేంద్రాలుగా ఉన్న కర్ణాటక, తమిళనాడులలో ప్రస్తుతం ప్రవేశాలు తగ్గగా.. కొత్తగా దక్షిణాదిలో ఏపీలో విదేశీ విద్యార్థుల నమోదు పెరిగింది. ఆయా రాష్ట్రాలు పాటిస్తున్న విధానాలు, సంస్థాగత సామర్థ్యం, అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల ప్రవేశాల పెంపునకు దోహదం చేస్తున్నాయి. భారత్‌కు వస్తున్న వారిలో నేపాల్, అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్, భూటాన్‌లాంటి పొరుగు దేశాలకు చెందిన వారే ఎక్కువ. వీరు 13 రకాల కోర్సుల్లోనే ప్రవేశాలు పొందుతున్నారు. ఎక్కువగా బీటెక్, బీబీఏ, బీఎస్సీ కోర్సుల్లో చేరుతున్నారు.

◆ దేశానికి వచ్చే విదేశీ విద్యార్థుల సంఖ్య 2000-01లో 7 వేలలోపు ఉండగా.. 2020 నాటికి సుమారు ఇది 49 వేలకు చేరింది. అయినప్పటికీ ఇది మొత్తం ఉన్నత విద్యలో నమోదైన విద్యార్థుల్లో కేవలం 0.10 శాతమే.

◆ మరోపక్క విదేశాలకు అత్యధికంగా విద్యార్థులను పంపించే దేశంగా భారత్ ఉంది. విదేశాల్లో చదువుతున్న భారతీయ విద్యార్థుల సంఖ్య 2016లో 6.85 లక్షలు ఉండగా.. 2025 నాటికి 18 లక్షలకు చేరింది.

ఏపీలో చదువుల పండగ..

విద్యలో ప్రజల భాగస్వామ్యం పెంచితేనే విద్యా సంస్థల్లో ప్రవేశాలు పెరిగి, పిల్లలు చదవడానికి ప్రోత్సాహం లభిస్తుందని ఆర్థిక సర్వే పేర్కొంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1999-2002లోనే తల్లిదండ్రులను భాగస్వామ్యం చేసే కార్యక్రమాలు అమలు చేశారు. ఏపీలో 'చదువుల పండగ', అస్సాంలో 'అలోకోర్ జాత్రా'లాంటి కార్యక్రమాలు, సమాజంలో చైతన్యం తీసుకొచ్చాయి. ప్రవేశాలు, పిల్లల ప్రాథమిక సాక్షరత నైపుణ్యాలు పెరుగుతాయని రుజువు చేసే ఇలాంటి కార్యక్రమాలు ఏపీలో ఎప్పుడో అమలు చేశారని ఆర్థిక సర్వే వెల్లడించింది.

మహిళా కార్మిక శక్తి..

ఏపీ, పశ్చిమబెంగాల్, కర్ణాటక, గుజరాత్‌లలో మహిళల కార్మిక శక్తి ఎక్కువగా ఉంది. మహిళలు నిర్వహించే సంస్థలు ఎక్కువగా ఉన్నచోట పని చేసే మహిళల సంఖ్య మరింత ఎక్కువగా ఉంది. ఆర్థిక కార్యకలాపాల్లో మహిళా భాగస్వామ్యం మెరుగుపడుతున్నా.. ఇప్పటికీ నిర్మాణాత్మక అడ్డంకులను ఎదుర్కొంటున్నారు. మహిళా కార్మిక శక్తి రేటు దేశవ్యాప్తంగా 2017-18లో 23.3% ఉండగా.. 2023-24నాటికి 41.7శాతానికి చేరింది. మహిళలు నిర్వహించే సంస్థల వాటా పెరిగింది. మహిళల భాగస్వామ్యాన్ని ఇంకా పెంచేందుకు బహుముఖ విధాన దృక్పథం అవసరమని ఆర్థిక సర్వే సూచించింది.

పరిశ్రమలకు సింగిల్‌విండో అనుమతుల్లో పురోగతి

- ఆన్‌లైన్‌లో దరఖాస్తు.. పురోగతి పరిశీలన
- తగ్గిన జాప్యం.. పెరిగిన పారదర్శకత
- సిమెంట్ ఉత్పత్తి చేసే రాష్ట్రాల జాబితాలోనూ రాష్ట్రం కీలకం
- కేంద్ర ఆర్థిక సర్వే నివేదికలో ప్రస్తావన

ఈనాడు, అమరావతి: పరిశ్రమలకు అవసరమైన అనుమతులను ఏపీ ప్రభుత్వం సింగిల్‌విండో విధానంలో వేగంగా అందిస్తోందని కేంద్ర ఆర్థికసర్వే-2025-26 అభిప్రాయపడింది. పర్యావరణ అనుమతులు ఇచ్చేందుకు పట్టే సమయాన్ని బిజినెస్ రిఫార్మ్ యాక్షన్ ప్లాన్-2024 (బీఆర్ఏపీ) ద్వారా తగ్గించిందని నివేదికలో ప్రస్తావించింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే విధానాన్ని తీసుకొచ్చిందని ఆర్థికసర్వే నివేదికలో ప్రస్తావించింది. 'బీఆర్ఏపీ-2024 ద్వారా సింగిల్‌విండో విధానంలో పరిశ్రమలకు క్లియరెన్స్‌లు, ఆన్‌లైన్‌లో భూమి రిజిస్ట్రేషన్, పర్యావరణ అనుమతులు ఇచ్చే విధానాన్ని ఏపీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఆన్‌లైన్ కన్సెంట్ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్‌ను బలోపేతం చేసింది. దీనివల్ల అనుమతుల కోసం డిజిటల్ విధానంలో దరఖాస్తు చేసి.. ఆన్‌లైన్‌లో పురోగతిని చూసుకునే వెసులుబాటు సంస్థలకు లభించింది. ఇలాగే తమిళనాడు, కేరళ రాష్ట్రాలూ సుస్థిర విధానాలతో పరిశ్రమలకు అనుకూల పరిస్థితులను కల్పించాయి' అని నివేదికలో పేర్కొంది.

సిమెంటు ఉత్పత్తిలో రాష్ట్రానికి గుర్తింపు

దేశంలో సిమెంటు ఉత్పత్తి చేసే రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ రెండోస్థానంలో ఉందని ఆర్థికసర్వే ప్రస్తావించింది. దేశంలో ఉత్పత్తయ్యే 85% సిమెంటు.. 11 రాష్ట్రాల నుంచే వస్తోందని తెలిపింది. ఆ జాబితాలో రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మధ్యప్రదేశ్, గుజరాత్, తమిళనాడు, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, పశ్చిమబెంగాల్ ఉన్నాయి. దేశంలో సిమెంట్ పరిశ్రమ వార్షిక స్థాపిత సామర్థ్యం 690 మిలియన్ టన్నులు. 2025 ఆర్థిక సంవత్సరంలో సుమారు 453 మిలియన్ టన్నుల సిమెంట్ ఉత్పత్తి జరిగిందని సర్వే పేర్కొంది.

దేశంలో మూడు బల్క్‌డ్రగ్ పార్కులు.. ఒకటి ఏపీలో

దేశంలో ప్రపంచ ప్రమాణాలతో మూడు బల్క్‌డ్రగ్ పార్కులను కేంద్రం అభివృద్ధి చేస్తే.. వాటిలో ఒకటి ఏపీలో ఉందని ఆర్థికసర్వే పేర్కొంది. మిగిలిన రెండు పార్కులు గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్‌లో ఏర్పాటవుతున్నాయి. ఈ పార్కుల అభివృద్ధికి కేంద్రం రూ.3వేల కోట్లు ఖర్చు చేస్తోంది. కొవిడ్ తర్వాత యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇన్‌గ్రెడియంట్స్, కీ స్టార్టింగ్ మెటీరియల్స్, డ్రగ్ ఇంటర్మీడియట్స్ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు కేంద్రం బల్క్‌డ్రగ్ పార్కుల ఏర్పాటుకు నిర్ణయించింది.

మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

- మంత్రి భరత్ సమక్షంలో ఫిక్కీ-ఎఫ్ఎల్‌వో, ఏపీఈడీబీ మధ్య ఎంవోయూ

ఈనాడు-అమరావతి: పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని మంత్రి టీజీ భరత్ అన్నారు. ఏపీ ఆర్థికాభివృద్ధి బోర్డు (ఏపీఈడీబీ), ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ-మహిళా విభాగం (ఫిక్కీ-ఎఫ్ఎల్‌వో) మధ్య గురువారం అవగాహన ఒప్పందం కుదిరింది. మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయంలో మంత్రి టీజీ భరత్ సమక్షంలో సంస్థ వీసీఎండీ అభిషిక్త్ కిషోర్, ఎఫ్ఐసీసీఐ-ఎఫ్ఎల్‌వో జాతీయ అధ్యక్షురాలు పూనమ్ శర్మ, జాతీయ పాలక మండలి సభ్యురాలు ఉజ్వల సింఘానియా, జాతీయ పాలక మండలి సభ్యురాలు మౌర్య బోడా, ఫిక్కీ విజయవాడ చాప్టర్ ఛైర్‌పర్సన్ అమృత కుమార్, సీనియర్ వైస్ ఛైర్‌పర్సన్ సుప్రియలు ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 'మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ ఒప్పందం కింద 30 ఎకరాల్లో మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేస్తాం. దీన్ని ఎఫ్ఐసీసీఐ-ఎఫ్ఎల్‌వో సభ్యులుగా ఉన్న మహిళా పారిశ్రామికవేత్తలు అభివృద్ధి చేస్తారు. తద్వారా మహిళలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. 'ఒక కుటుంబం..ఒక పారిశ్రామికవేత్త' అన్న సీఎం చంద్రబాబు లక్ష్యానికి అనుగుణంగా ఏపీఐఐసీ అవసరమైన అనుమతులు ఇస్తుంది' అని పేర్కొన్నారు.

మెడికల్ మాఫియాకు వ్యతిరేకంగా 14న ఆందోళనలు: సీపీఐ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో మెడికల్ మాఫియాను అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 14న రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య తెలిపారు. విజయవాడలోని దాసరిభవన్‌లో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం గురువారం నిర్వహించారు. 'ఇటీవల పేట్రేగిపోతున్న మెడికల్ మాఫియా నేరుగా ఫార్మసీ కౌన్సిల్‌ను ఆక్రమించిన విధానం తీవ్ర ఆక్షేపణీయం. ఫార్మసిస్టు సంఘాల ఆరోపణలను బట్టి.. మెడికల్ మాఫియాలో అనేక అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. వాటిపై సమగ్ర విచారణ చేపట్టాల'ని ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. వైద్య కళాశాలల పీపీపీ విధానానికి స్వస్తిపలికి ప్రభుత్వం ఆధీనంలోనే కొనసాగించాలని కోరారు. ఫిబ్రవరి 16 నుంచి 18 వరకు కాకినాడలో సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అవసరం మేరకు మాత్రమే భూమి తీసుకోవాలి

'రాజధానికి అవసరం మేరకు మాత్రమే భూమి తీసుకోవాలి కానీ, కార్పొరేట్ కంపెనీలకు పంచేందుకు రైతుల భూములు తీసుకోవడం దారుణం. మొదటి దశలో భూములిచ్చిన రైతులకు న్యాయం చేయక పోగా.. రెండు, మూడు దశల పేరుతో మళ్లీ సమీకరించడం తగదు. 99 పైసలకే ఎకరం చొప్పున కార్పొరేట్ సంస్థలకు లీజుకివ్వడం సరికాదు' అని హితవు పలికారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో పెండింగ్ నీటి పారుదల ప్రాజెక్టులు పూర్తి చేయాలని ఈశ్వరయ్య కోరారు.

ఎఫ్‌పీవో స్థాయిలో ప్రాసెసింగ్ యూనిట్లు

- డ్వాక్రా ఉత్పత్తులకు 'స్వయం' బ్రాండింగ్
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ఈనాడు, అమరావతి: వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపునకుగాను రైతు ఉత్పత్తిదారు సంస్థ (ఎఫ్‌పీవో) స్థాయిలో ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలని అధికారులను సెర్ప్‌శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. 2026-27లో 5 లక్షల సూక్ష్మవ్యాపారాలను ప్రోత్సహించేందుకు తగిన వ్యూహాన్ని సిద్ధం చేయాలన్నారు. 'ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త' లక్ష్యానికి అనుగుణంగా ఇది ఉండాలని చెప్పారు. విజయవాడలోని సెర్ప్ కార్యాలయంలో ఆయన గురువారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల్లో కొబ్బరి, పీచు క్లస్టర్లు, ఇతర జిల్లాల పరిధిలో 3-5 చేనేత క్లస్టర్లు, నాన్-ఫార్మ్ సూక్ష్మ వ్యాపార క్లస్టర్లు, కళాకారుల క్లస్టర్ల ఏర్పాటు కోసం సవివర ప్రాజెక్టు నివేదికలను సిద్ధం చేయాలన్నారు. డ్వాక్రా సంఘాల మహిళలు తయారు చేసే ఉత్పత్తులను 'స్వయం' బ్రాండ్ పేరును ప్రాచుర్యంలోకి తీసుకురావాలని సూచించారు. అన్ని సంఘాలకూ ప్యాకేజింగ్, మార్కెటింగ్‌కు మద్దతు అందించాలన్నారు.

60 లక్షల లీటర్ల కల్తీ నెయ్యితో 22 కోట్ల లడ్డూల తయారీ

నీలాయపాలెం విజయ్‌కుమార్

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వంలో 60 లక్షల లీటర్ల కల్తీ నెయ్యితో 22 కోట్ల లడ్డూలు తయారు చేసి భక్తుల మనోభావాలు దెబ్బతీశారని ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ ధ్వజమెత్తారు. కల్తీ నెయ్యి వినియోగించినట్లు సుప్రీంకోర్టు నియమించిన సిట్ విచారణలో తేలిందని గుర్తు చేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఆయన మాట్లాడారు. "ఉత్తరాఖండ్‌లోని భోలేబాబా డెయిరీ, దాని అనుబంధ సంస్థలు, తమిళనాడులో ఉండే ఏఆర్ డెయిరీ, ఏపీలోని వైష్ణవి డెయిరీ, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లోని మరికొన్ని డెయిరీలు ఈ పాపానికి ఒడిగట్టాయి. మూడున్నరేళ్లలో కమీషన్ల పేరుతో రూ.234 కోట్లు కొట్టేశారు. దీంట్లో అప్పటి తితిదే బోర్డు ఛైర్మన్లు, సభ్యులు, ఈవో, అధికారులు భాగస్వాములు' అని మండిపడ్డారు.

ఎక్సైజ్ శాఖను గాడిలో పెట్టాం

మంత్రి కొల్లు రవీంద్ర



ఏపీ ఎక్సైజ్ ఉద్యోగ సంఘాల డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర. చిత్రంలో ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ

ఈనాడు, అమరావతి: వైకాపా పాలనలో అస్తవ్యస్తమైపోయిన ఎక్సైజ్ శాఖను గాడిలో పెట్టామని ఆ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. పారదర్శక విధానాల ఫలితంగా ఆదాయమూ పెరిగిందని పేర్కొన్నారు. మంగళగిరిలోని ఎక్సైజ్ కమిషనరేట్‌లో గురువారం ఆ శాఖ ఉద్యోగ సంఘాల సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ ఉద్యోగుల పదోన్నతులు సహా ఇతర సమస్యలన్నింటినీ దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఉద్యోగ సంఘాలు రూపొందించిన క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఎక్సైజ్ గెజిటెడ్ ఆఫీసర్స్ సంఘం అధ్యక్షుడు బి.నరసింహులు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ సంఘం అధ్యక్షుడు కామేశ్వరరావు, కానిస్టేబుళ్ల సంఘం అధ్యక్షుడు రమణ సహా ఆయా ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దోపిడీ కోసమే కల్తీ నెయ్యి సరఫరా

వైకాపా హయాంలో శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీ కోసం పాలే లేని కల్తీ నెయ్యి సరఫరా చేయడం కోసం మొత్తం నిబంధనల్నే సడలించారని మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. దేవుడితో ఆటలాడిన జగన్ అందుకు తగ్గ ఫలితం అనుభవించి తీరుతారని హెచ్చరించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "లడ్డూ ప్రసాదాల తయారీకి వాడిన నెయ్యిలో అనేక రసాయనాలు వెలుగు చూశాయి. జంతువుల కొవ్వు కూడా ఉండవచ్చని నిపుణులు అంచనా వేశారు" అని కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

వైకాపా పీఏసీ సభ్యుడిగా చంద్రశేఖర్

ఈనాడు, అమరావతి: పల్నాడు జిల్లా నరసరావుపేట నియోజకవర్గానికి చెందిన గుబ్బా చంద్రశేఖర్ వైకాపా రాజకీయ సలహా కమిటీ (పీఏసీ) సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది.



ఏపీలోని న్యాయాధికారుల్లో 63.46% మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలే

కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో పనిచేస్తున్న న్యాయాధికారుల్లో 63.46% మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు ఉన్నట్లు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ప్రస్తుతం పనిచేస్తున్న 572 మంది న్యాయాధికారుల్లో ఈ సామాజికవర్గాల వారు 363 మంది ఉన్నట్లు వివరించారు. జూనియర్ డివిజన్ సివిల్ జడ్జిల్లో 53 మంది ఎస్సీ, 18 మంది ఎస్టీ, 122 మంది ఓబీసీలు ఉన్నట్లు తెలిపారు. సీనియర్ డివిజన్ సివిల్ జడ్జిల్లో 19 మంది ఎస్సీ, 9 మంది ఎస్టీ, 46 మంది ఓబీసీలు, జిల్లా జడ్జిల్లో 36 మంది ఎస్సీ, ఐదుగురు ఎస్టీ, 55 మంది ఓబీసీలు ఉన్నట్లు కేంద్రమంత్రి వెల్లడించారు.

ఏపీలో భారీగా పెరిగిన టోల్ వసూళ్లు

2025లో ఆంధ్రప్రదేశ్‌లో టోల్‌ట్యాక్స్ వసూళ్లు భారీగా పెరిగాయి. రాష్ట్రంలోని వివిధ టోల్‌గేట్ల ద్వారా 2023లో రూ.3,402 కోట్లు 2024లో రూ.3,495 కోట్లు వసూలుకాగా, 2025లో అది రూ.4,126 కోట్లకు చేరినట్లు నితిన్‌గడ్కరీ తెలిపారు. ఆయన లోక్‌సభలో ఒక ప్రశ్నకు ఈ మేరకు సమాధానం ఇచ్చారు.

రాజమండ్రి ఎయిర్‌పోర్టు కార్గో టెర్మినల్ సామర్థ్యంలో 0.15% మాత్రమే వినియోగం

రాజమండ్రి ఎయిర్‌పోర్టులో ఉన్న కార్గో టెర్మినల్ సామర్థ్యంలో 0.15% మాత్రమే వినియోగం జరుగుతోందని పౌర విమానయానశాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ తెలిపారు. గురువారం లోక్‌సభలో ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు సమాధానం ఇచ్చారు. "ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా రాజమండ్రి ఎయిర్‌పోర్టులో ప్రత్యేక దేశీయ ఎయిర్‌కార్గో సౌకర్యాలు ఏర్పాటుచేసింది. ఇక్కడినుంచి 2024-25లో రొయ్యలు, నర్సరీ మొక్కల రవాణా జరగలేదు. ఏటా 17,200 టన్నుల సరకు రవాణా చేసేలా ఈ టెర్మినల్ నిర్మించగా 2024-25లో 25 టన్నులే రవాణా చేశారు. అందువల్ల అదనంగా కార్గో సౌకర్యాల కల్పన ఉద్దేశం లేదు" అని కేంద్రమంత్రి వెల్లడించారు.

తాడేపల్లిగూడెంలో విమానాశ్రయానికి ప్రీ ఫీజిబులిటీ స్టడీ

తాడేపల్లిగూడెంలో విమానాశ్రయం నిర్మాణానికి ఉన్న అవకాశాలపై ప్రీ ఫీజిబులిటీ స్టడీ చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ నెలలో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)ను కోరినట్లు మంత్రి మురళీధర్ మోహోల్ తెలిపారు. ఇందుకోసం రాష్ట్రప్రభుత్వం నుంచి స్థల వివరాలు కోరినట్లు చెప్పారు. ఆయన లోక్‌సభలో వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు ఈ మేరకు సమాధానం ఇచ్చారు. ఏపీ ప్రభుత్వ విజ్ఞప్తిమేరకు ఏఏఐ ఇప్పటికే కుప్పం, శ్రీకాకుళం, ఒంగోలులో ప్రీ ఫీజిబులిటీ స్టడీ పూర్తిచేసినట్లు తెలిపారు. ఈ మూడు చోట్ల విమానాశ్రయాల నిర్మాణానికి అవసరమైన స్థల అనుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్స్ విధానం కింద పౌరవిమానయాన శాఖకు ప్రతిపాదనలు సమర్పించిందని చెప్పారు. అవి పరిశీలనలో ఉన్నాయన్నారు.

తిరుమల నెయ్యి కల్తీపై వైకాపా అబద్ధాలు

ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

ఈనాడు, దిల్లీ: తిరుమల శ్రీవారి ప్రసాదం తయారీ కోసం కల్తీ నెయ్యి వినియోగించినట్లు సుప్రీంకోర్టు నియమించిన సిట్ తేల్చినప్పటికీ వైకాపా నాయకులు అడ్డగోలుగా అబద్ధాలు ఆడుతున్నారని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ధ్వజమెత్తారు. కోడికత్తి, గులకరాయి, వివేకా హత్య కేసుల్లో అబద్ధాలు ప్రచారం చేసినట్లుగానే తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా కాలేదని ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. ఆయన గురువారం ఉదయం ఇక్కడి ఏపీభవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. 'వైకాపా హయాంలో కల్తీ నెయ్యితో వెంకన్న ప్రసాదం చేశారన్నది నిజమని సిట్ ఛార్జిషీట్‌లో తేల్చింది. తప్పు ఒప్పుకొని ఆ వేంకటేశ్వరస్వామిని, భక్తకోటిని క్షమాపణలు కోరడం మానేసి నెయ్యి కల్తీ జరగలేదన్న అబద్ధంతో మరో మహాపాతకానికి ఒడిగడుతున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక జగన్‌మోహన్‌రెడ్డి అవాకులు చెవాకులు పేలుతున్నారు. సొంత బాబాయిని ఇంట్లోనే చంపేసి, రక్తపు మరకలు తుడిచేసి, శవానికి కుట్లేసి కుటుంబసభ్యులకు తెలియకుండా అంత్యక్రియలు చేయడానికి ప్రయత్నించిన నాయకులు ఇప్పుడు రాష్ట్రంలో రాక్షస పాలన ఉందని చెప్పడం అత్యంత హాస్యాస్పదం. రాక్షస పాలన ఎవరిదో గుర్తించబట్టే ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నది జగన్ ఇప్పటికైనా గుర్తిస్తే మంచిది' అని పేర్కొన్నారు.

పులిచింతల ప్రాజెక్టులో నిర్వహణ పనులకు రూ.2.84 కోట్లు

ఈనాడు, అమరావతి: పులిచింతల ప్రాజెక్టులో కుడివైపున ప్యానెల్ కంట్రోల్ గదిలో అవసరమైన సాంకేతిక ఏర్పాట్లు, డీజిల్ జనరేటర్ సెట్ల ఏర్పాటు, ఇతర నిర్వహణ పనులకు రూ.2.84 కోట్లు ఖర్చు చేసేందుకు వీలుగా ప్రభుత్వం పాలనామోదం ఇచ్చింది. ఈ మేరకు జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు.

అది నకిలీ మద్యమని మాకు తెలియదు

- జనార్దన్‌రావు చెప్పినట్లు చేశాం
- ఎక్సైజ్ పోలీసుల ఎదుట నిందితులు

ఈనాడు, అన్నమయ్య న్యూస్‌టుడే, ములకలచెరువు: 'అది నకిలీ మద్యమని మాకు తెలియదు. కీలక నిందితుడు జనార్దన్‌రావు ఆదేశాల మేరకు నడుచుకున్నాం. పోలీసులు దాడులు చేసే వరకూ ఆ వ్యవహారం గోప్యంగా సాగింది. అప్పుడు పారిపోవడం తప్ప మాకు గత్యంతరం లేదు' అని ములకలచెరువు నకిలీ మద్యం కేసులో ఏ5, ఏ19గా ఉన్న జయచంద్రారెడ్డి పీఏ రాజేశ్, ఎకౌంటెంట్ అన్బురసు ఎక్సైజ్ పోలీసులకు వాంగ్మూలమిచ్చారు. వారిని మదనపల్లె ఎక్సైజ్ కార్యాలయంలో గురువారం దర్యాప్తు అధికారి జోగేంద్ర, సీఐ కిశోర్‌కుమార్ వేర్వేరుగా విచారించారు. నకిలీ మద్యం తయారీలో తమకు సంబంధం లేదని, ఉపాధి కోసం ఉద్యోగులుగా పనిచేశామని వారు చెప్పారు. 'ములకలచెరువులోని రాక్‌స్టార్ వైన్ షాప్, పెద్దతిప్పసముద్రం మండలంలోని ఆంధ్ర వైన్స్ జనార్దన్‌రావు ఆధ్వర్యంలో నడిచేవి. ఆయన అనుచరుడు కట్టా రాజు ఆ దుకాణాలకు మద్యం సరఫరా చేసేవారు. రాక్‌స్టార్ వైన్స్ లావాదేవీలు నేనే చూశాన'ని అన్బురసు తెలిపారు. ఈ కేసులో మిగతా నిందితులు జయచంద్రారెడ్డి, అతని బావమరిది గిరిధర్‌రెడ్డి పాత్రపై పోలీసులు ఆరా తీశారు. రాజేశ్, అన్బురసులను శుక్రవారం మరోసారి విచారించనున్నారు.

పదోన్నతుల నోట్ ఫైల్ ఇవ్వాల్సిందే

ఆర్టీఐ కమిషనర్ ఆదేశాలు

ఈనాడు, అమరావతి: దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్నవారికి 2016 నుంచి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించిన నోట్‌ఫైల్ ఇవ్వాల్సిందేనని సమాచార హక్కు చట్టం కమిషనర్ సీహెచ్ సునీల్ ఆదేశించారు. ఈ ఫైల్ కావాలంటూ ఇదే కార్యాలయంలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర్‌రెడ్డి గతంలో ఆర్టీఐ కింద దరఖాస్తు చేయగా, కమిషనరేట్‌లో అధికారులు వివిధ కారణాలు చూపిస్తూ తిరస్కరిస్తూ వచ్చారు. దీనిపై ఆయన ఏపీ సమాచార కమిషన్‌ను ఆశ్రయించారు. కమిషన్ విచారణ చేపట్టి.. నోట్‌ఫైల్ ఇవ్వాలంటూ నవంబరులోనే ఆదేశించారు. ఇప్పటికీ దరఖాస్తుదారుకు నోట్‌ఫైల్ ఇవ్వలేదు. రాజశేఖర్ మళ్లీ ఆర్టీఐ కమిషన్‌కు ఫిర్యాదు చేయగా.. జనవరి 8న విచారణ చేపట్టింది. నవంబరులో ఆర్టీఐ కమిషనర్ ఇచ్చిన ఆదేశాలపై కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయనున్నట్లు దేవాదాయ కమిషనర్ కార్యాలయ అధికారులు విచారణలో తెలిపారు. దీంతో ఆర్టీఐ కమిషనర్ తీవ్రంగా స్పందించారు. నోట్‌ఫైల్ ఇవ్వాల్సిందేనని, వ్యక్తిగత సమాచారం మినహా మిగిలిన నోట్‌ఫైల్‌ను వచ్చేనెల 10లోపు ఇవ్వాలంటూ తాజాగా ఆదేశించారు. ఇవ్వకపోతే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

బ్లాక్‌బాక్స్ విశ్లేషణ జరుగుతోంది

• 'బారామతి ప్రమాదం'పై రామ్మోహన్ నాయుడు వెల్లడి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: మహారాష్ట్రలోని బారామతిలో జరిగిన విమాన ప్రమాదంపై దర్యాప్తు కొనసాగుతోందని, బ్లాక్‌బాక్స్ విశ్లేషణ జరుగుతోందని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. బేగంపేట విమానాశ్రయంలో జరుగుతున్న 'వింగ్స్ ఇండియా 2026' ప్రదర్శనలో గురువారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సదస్సులో మాట్లాడుతూ.. విమానం ఎగరాలంటే గాలితో పాటు రెక్కల బలం ఎంత అవసరమో.. ఒక దేశ విమానయాన రంగం అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వం, పరిశ్రమ, ప్రజలు, నియంత్రణ సంస్థల మధ్య సమన్వయం అంతే ముఖ్యమన్నారు. ఇక్కడి విమానాలు కొనుగోలు చేయడంతోపాటు భారత్‌లోనే డిజైన్, తయారీతోపాటు మరమ్మతులు సైతం చేస్తామని తెలియజేశారు. రానున్న 15 ఏళ్లలో భారత్‌కు 30 వేల మంది పైలెట్లు అవసరమని, ఈ మేరకు శిక్షణ సంస్థల సంఖ్యను పెంచినట్లు తెలియజేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న విమాన పైలెట్లలో మహిళలు ఐదు శాతం ఉండగా.. భారత్‌లో వారి భాగస్వామ్యం 15 శాతం మేర ఉండటం విశేషమన్నారు.

రక్తపరీక్ష లేకుండా మధుమేహం నిర్ధారణ

చెన్నై(అన్నానగర్), న్యూస్‌టుడే: రక్తపరీక్ష లేకుండా రెటీనా చిత్రాల ద్వారా.. కృత్రిమ మేధ(ఏఐ) ఆధారంగా మధుమేహాన్ని నిర్ధారించవచ్చని వైద్యులు తెలిపారు. దీనికి సంబంధించిన అధ్యయనాన్ని మద్రాస్ డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్, మంగళూరు ఎనపోయా విశ్వవిద్యాలయం, అమెరికాలోని ఎమోరీ విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహించాయి. ఈ ఫలితాలు జీవిఐ అంతర్జాతీయ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. మద్రాస్ డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ వి.మోహన్ మాట్లాడుతూ దేశంలో చాలామందికి మధుమేహం ఉన్నట్లు తెలియదని, క్రమం తప్పక పరీక్ష చేయించుకోకపోవడమే అందుకు కారణమన్నారు. రక్తపరీక్షల అవసరం లేకుండా కంటి వెనుక భాగంలో ఉన్న రెటీనా చిత్రాలను తీయడం ద్వారా మధుమేహాన్ని తెలుసుకోవచ్చన్నారు. ఈ చిత్రాలను ఉపయోగించి ఏఐ సాంకేతిక రక్త నాళాల్లో నిర్దిష్ట మార్పులను గుర్తిస్తుందన్నారు.

రాయలసీమ ద్రోహి జగన్‌రెడ్డి

రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి

ఈనాడు, అమరావతి: వైకాపా అధినేత జగన్ రాయలసీమ ద్రోహి అని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి ధ్వజమెత్తారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. బిందు సేద్యంలో 2018లో అనంతపురం జిల్లా దేశంలో రెండో స్థానంలో ఉంటే.. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక బిందు సేద్యాన్ని రద్దు చేశారని మండిపడ్డారు. రాయలసీమ కరవుకు శాశ్వత పరిష్కారం కనుగొనేందుకు తెలుగుగంగ, హంద్రీ-నీవా, గాలేరు నగరి, వెలిగొండ, కేసీ కెనాల్‌లను ఎన్టీఆర్ ప్రారంభించారని గుర్తుచేశారు. ఆ ప్రాజెక్టుల్ని పూర్తి చేసి సీమను ఉద్యానపంటల హబ్‌గా మార్చేందుకు సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు.

జనం.. వనం.. ప్రణమిల్లగ.. వచ్చె వరాల తల్లి

• గద్దెపై కొలువుదీరిన వనదేవత • నిండు జాతరతో మేడారం జనసంద్రం





కుంకుమ భరిణెలో కొలువైన సమ్మక్క తల్లిని చిలకలగుట్ట నుంచి తీసుకొస్తున్న పూజారులు ★ మేడారంలోని గద్దెల ప్రాంగణంలో భక్తజన సందోహం

ఈనాడు, మేడారం: మహా జాతరలో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. గురువారం తెలంగాణలోని మేడారం సమీపంలోని చిలకలగుట్టపై కుంకుమ భరిణె రూపంలో కొలువైన సమ్మక్క తల్లిని ఆదివాసీ పూజారులు పవిత్ర గద్దెపైకి తీసుకొచ్చి కొలువుదీర్చారు. అమ్మ రాకతో మేడారానికి నిండు జాతర కళ వచ్చింది. సమ్మక్క ఆగమన ప్రక్రియ గురువారం తెల్లవారుజాము నుంచే మొదలైంది. తొలుత పూజారుల కుటుంబాలకు చెందిన మహిళలు వచ్చి సమ్మక్క గద్దెను అలంకరించి వెళ్లారు. మేడారం పడమర దిక్కులోని జెండా గుట్ట నుంచి పచ్చి వెదురుకర్ర రూపంలో ఉండే వనదేవతను తీసుకొచ్చి సమ్మక్క గద్దెపై ప్రతిష్ఠించారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో ప్రధాన పూజారులు సిద్ధబోయిన జగ్గారావు, మునీందర్, వడ్డెలు కొక్కెర కృష్ణయ్య బృందం చిలకల గుట్టపైకి చేరుకున్నారు. అక్కడ అమ్మవారిని అలంకరించి వారికి సంప్రదాయ పూజలు కొనసాగించారు. అనంతరం అమ్మవారిని తీసుకొని రాత్రి 10 గంటల సమయంలో గద్దెపై కొలువుదీర్చారు. అనంతరం భక్తులు అధికసంఖ్యలో చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు.



చిలకలగుట్ట నుంచి పూజారులు సమ్మక్కను తీసుకొస్తుండగా ఏకే-47 పేలుస్తూ ఆహ్వానిస్తున్న ములుగు ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ తదితరులు

దారిపొడవునా జయజయధ్వానాలు

అమ్మవారిని తీసుకొస్తుండగా చిలకలగుట్ట నుంచి గద్దెల ప్రాంగణం వరకు దారికి ఇరువైపులా భక్తులు పెద్ద సంఖ్యలో చేరి 'తల్లీ సమ్మక్క.. సల్లంగ చూడమ్మా' అంటూ జయజయధ్వానాలు చేశారు. మహిళలు, ఆడపడుచులు అందమైన ముగ్గులు వేసి అమ్మకు ఘన స్వాగతం పలికారు. జాతరకు సంక్రాంతి పండగ తలపించిందా అన్నట్లు దారంతా రంగవల్లులతో ముస్తాబు చేశారు. వందలాది మంది భక్తులు డోలు, డప్పు చప్పుళ్లకు లయబద్ధంగా నృత్యాలు చేశారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై ఛత్తీస్‌గఢ్‌లో అధ్యయనం

ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్‌తో చర్చించిన లంకా దినకర్

ఈనాడు, అమరావతి: కేంద్ర ప్రాయోజిత పథకాలు, భారత ప్రభుత్వ ప్రధాన కార్యక్రమాలు, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన అమలుపై అధ్యయనానికి.. 20 సూత్రాల కార్యక్రమం అమలు ఛైర్మన్ లంకా దినకర్ ఛత్తీస్‌గఢ్ వెళ్లారు. ఈ నెల 29, 30 తేదీల్లో సాగే పర్యటనలో భాగంగా గురువారం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్‌ను కలిశారు. ప్రధాని మోదీ సంకల్పించిన వికసిత్ భారత్ లక్ష్య సాధనలో ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్‌ల భాగస్వామ్యంపై సీఎంతో చర్చించినట్లు లంకా దినకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'ఏపీకి సంబంధించి విజన్-2047ను వివరించా. సీఎం చంద్రబాబు దార్శనికతను ఛత్తీస్‌గఢ్ సీఎం గుర్తుచేశారు. అక్కడ అమలవుతున్న పీఎంఏవై, జల్ జీవన్ మిషన్, ఆయుష్మాన్, పీఎం గరీబ్ కల్యాణ్ అన్న యోజన, పీఎం గ్రామ సడక్ యోజన, పీఎం జన్మన్ తదితర కార్యక్రమాల అమలుపై చర్చించాం. ఛత్తీస్‌గఢ్‌లో గుర్తించిన ఉత్తమ ఆచరణలు ఏపీలో సంక్షేమ-అభివృద్ధి కార్యక్రమాల బలోపేతానికి ఉపయోగపడతాయి' అని లంకా దినకర్ తెలిపారు.



విష్ణుదేవ్ సాయ్‌కి పుష్పగుచ్ఛం ఇస్తున్న లంకా దినకర్

జగనన్న కాలనీ ముసుగులో కొట్టు సత్యనారాయణ భూకబ్జా

తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుల ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వంలో జగనన్న కాలనీ కోసం అప్పటి మంత్రి కొట్టు సత్యనారాయణ బలవంతంగా స్థలాలు లాక్కున్నారని పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడుకు చెందిన షేక్ మస్తాన్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం ఫిర్యాదు లేఖను అందజేశారు. వివిధ సమస్యలతో వచ్చిన బాధితుల నుంచి మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. తనను వేధిస్తున్న సమీప బంధువులపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన సుస్మిత కోరారు. తన ఇంటి స్థలాన్ని అక్రమంగా స్వాధీనం చేసుకొన్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కర్నూలు జిల్లా కోడుమూరు మండలం పులకుర్తికి చెందిన లక్ష్మన్న ఫిర్యాదు చేశారు.

అజిత్ పవార్ సేవలు చిరస్మరణీయం: లోకేశ్

ఈనాడు, అమరావతి: మహారాష్ట్రలోని బారామతిలో నిర్వహించిన ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ అంత్యక్రియల్లో మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. ఆయన కుటుంబ సభ్యులు, సహచరులు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. 'ఎన్డీఏ బలమైన స్తంభంగా నిలిచిన అజిత్ పవార్‌కు కడసారి నివాళి అర్పించాను. ఆయన కూటమి రాజకీయాలకు చేసిన సేవలు చిరస్మరణీయం' అని లోకేశ్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. లోకేశ్‌తోపాటు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఏపీ ఫైబర్‌నెట్‌కు రూ.54.61 కోట్లు కేటాయింపు

ఈనాడు, అమరావతి: ఏపీ ఫైబర్‌నెట్ లిమిటెడ్‌కు రూ.54.61 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2025-26 బడ్జెట్ నుంచి కేటాయించిన ఈ మొత్తాన్ని సంస్థ తీసుకున్న రుణ చెల్లింపునకు వినియోగించేలా అనుమతించింది. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని సంస్థ ఎండీని ప్రభుత్వం ఆదేశించింది.

ఎంఎస్ఎంఈల బలోపేతానికి సహకరించండి

టాటా స్ట్రైవ్ ప్రతినిధులతో మంత్రి కొండపల్లి సమీక్ష

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని ఏటికొప్పాక, తిరుపతి చెక్కశిల్పాలు, కలంకారీ పెయింటింగ్, కడప మాధవరం చేనేతలకు బ్రాండింగ్, మార్కెటింగ్‌కు అవసరమైన సహకారాన్ని అందించాలని టాటా స్ట్రైవ్ (టాటా కమ్యూనిటీ ఇనీషియేటివ్స్ ట్రస్ట్) ప్రతినిధులను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. కళాకారులు తయారుచేసిన శిల్పాలకు విలువ ఆధారిత మెరుగులు దిద్ది, అంతర్జాతీయంగా గుర్తింపు తెచ్చే అంశాన్ని పరిశీలించాలని పేర్కొన్నారు. టాటా స్ట్రైవ్ ప్రతినిధులతో గురువారం ఉన్నతస్థాయి సమావేశాన్ని మంత్రి నిర్వహించారు. క్లస్టర్ల బలోపేతం, నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ఐటీఐల ఆధునికీకరణ, స్వయం సహాయక సంఘాల మహిళల ఉత్పత్తులు పెంచే అంశాలపై వారితో చర్చించారు. మంత్రి మాట్లాడుతూ.. 'ఎంఎస్ఎంఈలను బలోపేతం చేసేందుకు క్లస్టర్ డెవలప్‌మెంట్ విధానాన్ని అమలుచేయాలి. ప్రభుత్వ ఐటీఐలను డ్యూయల్ వెట్ నమూనా కింద అప్‌గ్రేడ్ చేసి, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాన్ని కల్పించాలి. ఎస్‌హెచ్‌జీ మహిళలు తయారుచేసే ఉత్పత్తులకు బ్రాండింగ్.. మార్కెట్ లింకేజీలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి. క్షేత్రస్థాయిలో పర్యటించి స్థానిక పరిస్థితులపై బృందం అధ్యయనం చేయాలి. ఉత్పత్తుల ప్యాకేజింగ్, బ్రాండింగ్‌లో ఆధునిక విధానాలు అవలంబించడం ద్వారా మార్కెట్‌లో గిరాకీ లభించే అవకాశం ఉంది. ఈ అంశాలపై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి' అని పేర్కొన్నారు. సమావేశంలో టాటా స్ట్రైవ్ పార్టనర్ హెడ్ రాజ్, టాలెంట్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ లీడ్ ఎం.ఎస్.బిజిత జాయిస్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఫీజులను 10వ తేదీలోపు విడుదల చేయాలి

ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాల ఐకాస

ఈనాడు, అమరావతి: విద్యార్థుల ఫీజులను ఫిబ్రవరి పదో తేదీలోపు విడుదల చేయాలని రాష్ట్ర ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్య సంఘాల ఐకాస డిమాండ్ చేసింది. గురువారం జూనియర్, ఐటీఐ, పాలిటెక్నిక్, ఫార్మసీ, బీఈడీ, డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ, నర్సింగ్, పీజీ కోర్సులు నిర్వహించే విద్యాసంస్థల యాజమాన్య సంఘాలన్నీ ఐకాసగా ఏర్పడ్డాయి. ఈ సందర్భంగా ఐకాస నేతలు మాట్లాడుతూ.. ప్రైవేటు విద్యా సంస్థల సమస్యల పరిష్కారం, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలపై చర్చించినట్లు తెలిపారు. ప్రభుత్వం ఫీజు మొత్తాలను విడుదల చేయకపోవడంతో అధ్యాపకులకు జీతాలు ఇవ్వలేకపోతున్నట్లు వెల్లడించారు. ◆ నూతన ఐకాస కన్వీనర్‌గా ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం అధ్యక్షుడు జె.రమణాజీ ఎన్నికయ్యారు. సభ్యులుగా పొన్న జయరాం(డిగ్రీ), కె.శ్రీనివాసరావు(ఐటీఐ), ఎన్.శ్రీనివాసమోహన్(బీఈడీ), బి.శ్రీనివాసరావు(బీఈడీ), వి.జనార్దన్(డీఈడీ), మొహిద్దీన్(వ్యవసాయ), విజయ రమణ(ఫిషరీస్), వీవీ ప్రసాద్(జూనియర్), వైవీఎస్ ఎన్ ప్రసాద్(జూనియర్) ఎన్నికైనట్లు కన్వీనర్ తెలిపారు.

ట్రాన్స్‌కో ప్రాజెక్టులు వేగంగా పూర్తి కావాలి

• రెండు నెలల్లో.. 6 ప్రాజెక్టుల పూర్తికి నిర్ణయం
• ట్రాన్స్‌కో ప్రాజెక్టుల పురోగతిపై మంత్రి గొట్టిపాటి సమీక్ష

ఈనాడు, అమరావతి: ట్రాన్స్‌కో రూ.6 వేల కోట్లతో చేపట్టిన విద్యుత్ ప్రాజెక్టులను నిర్దేశిత వ్యవధిలో పూర్తి చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. రెండు నెలల్లో ఆరు విద్యుత్ ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. సచివాలయంలో ట్రాన్స్‌కో ప్రాజెక్టుల పురోగతిపై గురువారం ఆయన సమీక్షించారు. 'భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టులు అందుబాటులోకి తేవాలి. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ వినియోగం.. ఉత్పత్తిపై దృష్టి సారించాలి. రాజధాని అమరావతి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్న నేపథ్యంలో సీఆర్‌డీఏ పరిధిలో చేపట్టిన పనులను సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలి' అని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వైకాపా ప్రభుత్వంలో ప్రారంభించి.. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల వివరాలను అధికారులు మంత్రికి వివరించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ట్రాన్స్‌కో జేఎండీ సూర్య సాయి ప్రవీణ్‌చంద్ పాల్గొన్నారు.



మురుగు శుద్ధికి రోబో సేవలు

తిరువనంతపురం: చేతులతో పారిశుద్ధ్య పని చేయడాన్ని నిర్మూలించడంతోపాటు సఫాయీ కార్మికుల భద్రత కోసం తిరువనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ జి-స్పైడర్ అనే కృత్రిమ మేధ చాలిత రోబోను నియమించింది. తిరువనంతపురం రైల్వే స్టేషన్ సమీపంలోని అవయిజంచన్ అనే మురుగు కాలువలో దీని సేవల్ని వినియోగిస్తామని ఒక అధికారిక ప్రకటన తెలియజేసింది. స్థానిక స్వపరిపాలన శాఖ మంత్రి ఎం.బి.రాజేశ్ ఈ రోబోను ప్రారంభించారు. కృత్రిమ మేధ సాయంతో కాలువను శుభ్రపరిచే ఈ ప్రాజెక్టును స్థానిక పురపాలక సంస్థ, జెన్ రోబోటిక్ ఇన్నోవేషన్స్ సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి.

ఊడలు, వేర్ల వంతెనలకు యునెస్కో గుర్తింపు కోసం దరఖాస్తు

షిల్లాంగ్: వాగులు, వంకలు దాటడానికి మర్రి జాతి వృక్షాల ఊడలు, వేర్ల సాయంతో మేఘాలయలో గిరిజనులు నిర్మించుకున్న వంతెనలను ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించాలని కోరుతూ యునెస్కోకు దరఖాస్తు చేసినట్లు ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మా తెలిపారు. 'లివింగ్ రూట్ బ్రిడ్జెస్ (సజీవ వేర్ల వంతెనలు)'గా ప్రసిద్ధమైన వీటి సమాచారాన్ని యునెస్కో ప్రపంచ వారసత్వ కేంద్ర డైరెక్టరు లాజారె అస్సొమో ఎలూందూకు భారత రాయబారి విశాల్ వి శర్మ అందించారని వెల్లడించారు. సజీవ వేర్ల వంతెనలకు, వాటి రూపకర్తలైన స్థానిక గిరిజనులకు ప్రపంచ స్థాయి గుర్తింపు లభిస్తుందని భావిస్తున్నామని సీఎం పేర్కొన్నారు.



పరువునష్టం కేసులో దిల్లీ ఎల్జీకి ఊరట

• నిరపరాధిగా తేల్చిన కోర్టు

దిల్లీ: దాదాపు 25 సంవత్సరాల క్రితం సామాజిక కార్యకర్త మేధా పాట్కర్ చేసిన ఫిర్యాదు మేరకు దాఖలైన పరువునష్టం దావాపై విచారణ జరిపిన కోర్టు.. దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనాకు ఊరటనిస్తూ గురువారం ఆదేశాలు జారీ చేసింది. ఆయన్ని నిరపరాధిగా పేర్కొంది. మేధా పాట్కర్ తన అభియోగాన్ని నిరూపించలేకపోయారని కోర్టు స్పష్టం చేసింది. ప్రస్తుతం దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అయిన సక్సేనా 2000 సంవత్సరంలో 'కౌన్సిల్ ఫర్ సివిల్ లిబర్టీస్' (అహ్మదాబాద్)కు అధ్యక్షునిగా ఉండేవారు. "మేధా పాట్కర్, ఆమె నర్మదా బచావో ఆందోళన్‌ల అసలు స్వరూపం" అనే అర్థం వచ్చే శీర్షికతో ఒక ఆంగ్ల పత్రికలో ఆ ఏడాది ఆయన వాణిజ్య ప్రకటన జారీ చేశారు. నాటి నుంచీ సక్సేనాకు, మేధా పాట్కర్‌కు మధ్య పరువునష్టం దావా కొనసాగుతోంది. వాస్తవానికి ఈ ఫిర్యాదు అహ్మదాబాద్‌లో దాఖలైనా 2010లో సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు దాన్ని దిల్లీకి బదిలీ చేశారు. సక్సేనా ప్రచురించిన ప్రకటన- నర్మదా బచావో ఆందోళన్ సమష్టి కార్యకలాపాలపై చేసిన విమర్శే తప్ప మేధా పాట్కర్ వ్యక్తిగత పరువుకు నష్టం కలిగించేదిగా లేదని ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ రాఘవ్ శర్మ పేర్కొన్నారు. ఆ ప్రకటనలో చితరూపా పాటిల్, అరుంధతీ రాయ్‌ల ప్రస్తావన కూడా ఉందన్నారు.

మధ్యాహ్నపు కునుకుతో పునరుత్తేజం

దిల్లీ: మన మెదడు పగలంతా చురుగ్గా ఉంటుంది. కొత్త దృశ్యాలు చూస్తూ, కొత్త సమాచారం అందుకుంటూ ఉంటుంది. ఈ క్రమంలో నాడీ కణాల మధ్య అనుసంధానాలు ఏర్పడతాయి, దృఢపడతాయి. కొత్త విషయాలు నేర్చుకోవడానికి ఈ అనుసంధానాలు కీలకమే కానీ, అధిక సమాచారాన్నీ స్వీకరించి ఉపయోగించే క్రమంలో మెదడు అలసిపోతుంది. రాత్రి పూట నిద్రలో విశ్రాంతి తీసుకుని ఉదయాన్నే మళ్లీ కొత్త పనులకు చురుగ్గా సిద్ధమవుతుంది. మధ్యాహ్నం పూట కాస్సేపు కునుకు తీసినా మెదడు ఇదేవిధంగా పునరుత్తేజితమవుతుందనీ, మళ్లీ కొత్త విషయాలు నేర్చుకోవడానికీ, కొత్త సమాచారాన్ని నిక్షిప్తం చేసుకోవడానికీ సిద్ధమవుతుందని జర్మనీ, స్విట్జర్లాండ్ లలోని ఫ్రీబర్గ్ విశ్వవిద్యాలయ పరిశోధకులు కనుగొన్నారు.

రేపు భారత్, అరబ్ దేశాల మంత్రుల సమావేశం

దిల్లీ: భారత్, అరబ్ దేశాల విదేశాంగ మంత్రుల అత్యున్నత స్థాయి సమావేశానికి మన దేశం ఆతిథ్యమిస్తోంది. శనివారం దిల్లీలో జరిగే ఈ సమావేశంలో ఆర్థిక, ఇంధనం, విద్య, సాంస్కృతిక సంబంధాలపై చర్చిస్తారు. పశ్చిమాసియాలో పరిస్థితులూ ప్రస్తావనకు రానున్నాయి. పదేళ్ల తర్వాత భారత్, అరబ్ దేశాల మంత్రుల స్థాయి సమావేశం జరుగుతోంది. తొలి సమావేశం 2016లో బహ్రెయిన్‌లో జరిగింది. శనివారం జరిగే సమావేశంలో 22 అరబ్ దేశాలకు చెందిన మంత్రులు, అధికారులు పాల్గొననున్నారు.

'ఇజ్రాయెల్, పాలస్తీనాకు భారత్ మధ్యవర్తి కావాలి'

ఇజ్రాయెల్‌తో తమకున్న వివాదంలో భారత్ కీలక మధ్యవర్తిగా వ్యవహరించాలని కోరుకుంటున్నట్లు పాలస్తీనా పేర్కొంది. గాజా పునర్నిర్మాణంలోనూ ఆ దేశం భాగస్వామిగా ఉండాలని ఆకాంక్షించింది. భారత్, అరబ్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన పాలస్తీనా విదేశాంగ మంత్రి వార్సెన్ అఘాబెకియాన్ షాకిన్ గురువారం ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్ ఓ గొప్ప దేశమని, అది కీలక పాత్ర పోషించాలని కోరారు.

లాటిన్ అమెరికా దేశాలు ఏకం కావాలి

పనామా సిటీ: అమెరికా ఇటీవల వెనెజువెలా భూభాగంలోకి ప్రవేశించి ఆ దేశ అధ్యక్షుణ్ని నిర్బంధించిన నేపథ్యంలో లాటిన్ అమెరికా దేశాలు వైరుధ్యాలు వీడి సమైక్యంగా నిలవాల్సిన అవసరం తలెత్తిందని ఆయా దేశాల అధినేతలు భావిస్తున్నారు. ఇక్కడ జరిగిన 'కమ్యూనిటీ ఆఫ్ లాటిన్ అమెరికన్ అండ్ కరీబియన్ స్టేట్స్' (సెల్యాక్) సమావేశంలో బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డసిల్వా ఈ మేరకు తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అయితే అమెరికా పేరును ప్రస్తావించలేదు. లాటిన్ అమెరికా దేశాలు ఇటీవల తమ ప్రాంతంపై ప్రభావం చూపిన విదేశీ సైనిక జోక్యంపై ఒక్క సంయుక్త ప్రకటనా చేయలేకపోయాయి. వెనెజువెలాలోని కారకాస్‌పై అమెరికా జరిపిన బాంబు దాడిని కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో ప్రస్తావించారు. మాజీ అధ్యక్షుడు నికొలాస్ మదురోపై ఆయన స్వదేశంలో విచారణ జరపాలని, అలా కాకుంటే "త్రీ అమెరికాస్ ట్రైబ్యునల్" అనే ప్రాంతీయ న్యాయ వేదిక విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈక్వెడార్, బొలీవియా, గ్వాటెమాలా, చిలీ దేశాల అధినేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

రాత్రిపూట క్యాంపస్ వీడితే తల్లిదండ్రులకు సమాచారం

• ఐఐటీ ఖరగ్‌పూర్ కొత్త మార్గదర్శకాలు

కోల్‌కతా: రాత్రిపూట క్యాంపస్ వదిలి బయటకు వెళ్లే విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకొని పశ్చిమ బెంగాల్‌లోని ఐఐటీ ఖరగ్‌పూర్ కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. విద్యార్థులు బయటకు వెళ్లినపుడు వారి కదలికలపై నిఘా ఉంచి, తల్లిదండ్రులకు ఆ సమాచారం చేరవేయడం తమ ఉద్దేశంగా అధికారులు గురువారం వెల్లడించారు. సంస్థ జారీ చేసిన కొత్త మార్గదర్శకాల ప్రకారం.. రాత్రి 10.00 నుంచి ఉదయం 6.00 గంటల మధ్య విద్యార్థులు క్యాంపస్‌లో లేకపోతే వారి సంరక్షకులకు ఈ సమాచారం చేరవేస్తారు. ఎక్కడికి.. ఎందువల్ల వెళుతున్నారు, ఏ సమయానికి తిరిగి వస్తారనే సమాచారం విద్యార్థులు ఇవ్వాల్సి ఉంటుందని, వారు క్యాంపస్‌కు తిరిగి వచ్చే సమయం కూడా రికార్డు చేస్తామని అధికారులు తెలిపారు. సంస్థ ఐడీ కార్డు లేకుండా ఏ విద్యార్థీ బయటకు వెళ్లకూడదన్న మునుపటి ఆదేశాలు కఠినంగా అమలు చేస్తామని, ఈ నియమాలను ఉల్లంఘిస్తే క్రమశిక్షణ చర్యలు ఉంటాయని ఐఐటీ ఖరగ్‌పూర్ డైరెక్టరు సుమన్ చక్రవర్తి స్పష్టం చేశారు.

రక్తంలో ఆమ్లజని పరీక్షకు ఎంఆర్ఐ

దిల్లీ: శరీరానికి తగినంత రక్తాన్ని గుండె పంపు చేయలేకపోవడాన్ని వైద్య పరిభాషలో గుండె వైఫల్యం అంటారు. ఈ రుగ్మత వల్ల రక్తం ద్వారా వివిధ అవయవాలకు అందాల్సిన ఆమ్లజని, ఇతర పోషకాలు అందక ప్రాణానికే ముప్పు వస్తుంది. గుండెలో ఎడమ జఠరిక నుంచి పంప్ అయ్యే రక్తం వివిధ అవయవాలకు చేరి కుడి జఠరికకు తిరిగివస్తుంది. అందులో ఎంత ఆమ్లజని ఉందో లెక్కించడానికి గుండెకు ఒక ట్యూబును పంపుతారు. ఈ ప్రక్రియ వృద్ధులకు, దుర్బలంగా ఉన్నవారికీ ప్రమాదకరంగా పరిణమించవచ్చు. దీనికి ప్రత్యామ్నాయంగా ఎంఆర్ఐ స్కాన్‌ను ఉపయోగించవచ్చని బ్రిటన్‌కు చెందిన పరిశోధకుడు డాక్టర్ పంకజ్ గర్గ్ తెలిపారు. రక్తంలోని ఆమ్లజని స్థాయులు అయస్కాంత క్షేత్రంలో కూడా పరస్పరం భిన్నంగా ప్రవర్తిస్తాయి. ట్యూబు వేయకుండానే ఎంఆర్ఐ సహాయంతో ఆమ్లజని స్థాయులను గణించవచ్చని పరిశోధనలో తేలిందని ఆయన చెప్పారు.

కశ్మీర్ అందాలకు ఫిదా అయిన ఇన్‌ఫ్లుయెన్సర్

శ్రీనగర్: కశ్మీర్ ప్రకృతి అందాలను చూసి మంత్రముగ్ధుడైన జహంగీర్ చక్రవర్తి.. ఈ ప్రపంచంలో స్వర్గం ఎక్కడైనా ఉంటే అది ఇక్కడే అని అన్నారట. అప్పటి నుంచీ అది లక్షల మందిని ఆకట్టుకుంటూనే ఉంది. ఆ జాబితాలో తాజాగా చేరిన వ్యక్తి 42 ఏళ్ల ఖాలిద్ అల్ అమేరీ అనే ఇన్‌ఫ్లుయెన్సర్. ఈ స్టాన్‌ఫర్డ్ గ్రాడ్యుయేట్.. సోషల్ మీడియా వేదికల్లో 1.8 కోట్ల మంది ఫాలోయర్లను కలిగి ఉన్నారు. డాల్ సరస్సులో షికారా ప్రయాణం, మచ్చలేని తెల్లటి దుప్పట్లో కప్పబడిన పర్వతాలు, లోయలు కశ్మీరానికి స్వర్గ సమానమైన సౌందర్యాన్ని అందిస్తున్నాయని అమేరి పేర్కొన్నారు. నాలుగు రోజులుగా కశ్మీర్‌లో పర్యటిస్తున్న ఆయన అక్కడి ప్రాకృతిక అద్భుత సౌందర్యాన్ని తెలిపే అనేక వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. కశ్మీర్ సందర్శించాల్సిందిగా తన ఫాలోయర్లందరినీ ఆహ్వానిస్తూ.. 'జీవితంలో, పనిలో స్పష్టత సాధించాలంటే హడావిడిని వీడి మందగమనాన్ని అందుకోవాలి. కశ్మీర్ సుందర దృశ్యాలను చూసినప్పుడు ప్రాపంచిక ఆత్రుతలు తొలగి నిశ్శబ్ద కెరటం మనల్ని ఆవహిస్తుంది' అని పేర్కొన్నారు.



ఖాలిద్ అల్ అమేరీ

దిల్లీ శుభ్రతకు సైన్యంలా శ్రమిస్తున్న పేదింటి పిల్లలు

• మార్గదర్శిగా వినయ్‌దాస్



ఈటీవీ భారత్: మురికివాడల కష్టాలు ఆ ప్రాంతాల్లో ఉన్నవాళ్లకే బాగా తెలుస్తాయి. అందుకే వినయ్‌దాస్ దిల్లీ శివారులోని పారిశ్రామిక బెల్టు వజీర్‌పుర్‌ను తన కార్యక్షేత్రంగా ఎంచుకున్నారు. ఈ ప్రాంతాల పిల్లలకు ఉచిత ట్యూషన్లు చెబుతున్న వినయ్‌దాస్.. ఆ పిల్లల భాగస్వామ్యంతో 2018లో స్వచ్ఛతా ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. మొదట్లో 250 మంది విద్యార్థులతో ప్రారంభించి నేడు 1,600 మందితో సైన్యంలా శ్రమిస్తున్నారు. ప్రతి ఆదివారం.. మాస్కులు, గ్లవ్స్ ధరించి.. పారలు, చీపుర్లు, సంచులతో వీరు వీధుల్లోకి వస్తారు. ఒకటొకటిగా మొదలుపెట్టి చుట్టుపక్కల 250 పార్కులు, వీధులు, రహదారులను శుభ్రం చేశారు. ఆయా ప్రాంతాల్లో మొక్కలు నాటుతున్నారు. గతంలో చెత్తకుప్పలతో నిండిన ఈ పార్కుల్లో ఇప్పుడు చిన్నారులు హాయిగా ఆడుకొంటున్నారు. భక్తులు దేవతల విగ్రహాలను నిమజ్జనం చేయకుండా నగర శివార్లలో ఉన్న రావిచెట్ల వద్ద వదిలి వెళుతుండటం గమనించిన వినయ్‌దాస్ ఆ చెట్లపై "ఇది రావిచెట్టు.. దేవుడి వృద్ధాశ్రమం కాదు" అని రాయించారు. 2024లో 'స్వస్తి దాస్ సేవా సమితి' అనే ఎన్జీవో ప్రారంభించి ఈ సేవలు మరింత విస్తరించారు. వీరి కృషిని గుర్తించిన దిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తా తన ఇన్‌స్టాగ్రాం పేజి ద్వారా వివరాలు పంచుకున్నారు.

మహిళ ఉదరం నుంచి 12 కిలోల కణితి తొలగింపు

దిల్లీ: ఇథియోపియాకు చెందిన 67 ఏళ్ల మహిళ ఉదరం నుంచి 12 కిలోల కణితిని గురుగ్రాంలోని ఓ ఆసుపత్రి వైద్యులు శస్త్రచికిత్స ద్వారా తొలగించారు. తీవ్రమైన కడుపునొప్పితో, ఆకలి లేమితో బాధపడుతున్న ఆమె కడుపు భాగం బాగా ఉబ్బిపోయినట్లు ఉండేది. రకరకాల పరీక్షల తర్వాత ఆమె కడుపులో పెద్దస్థాయి కణితి ఉన్నట్లు గుర్తించారు. చుట్టుపక్కల అవయవాలను నొక్కేస్తున్న దీనిని మరింతకాలం వదిలేస్తే ఆమెకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని భావించారు. శస్త్రచికిత్సే ఏకైక పరిష్కారంగా భావించి దానికి సిద్ధమైనా కణితి పరిమాణం దృష్ట్యా దానిలో సవాళ్లు ఎదురయ్యాయి. ఎక్కువ రక్తం పోయే ప్రమాదం ఉందని తెలిసినా ఒక నిర్దిష్ట ప్రక్రియ ద్వారా కణితిని పూర్తిగా తొలగించినట్లు గురుగ్రాంలోని 'ఫోర్టిస్ స్మారక పరిశోధన సంస్థ' వైద్యులు గురువారం విలేకరుల సమావేశంలో తెలిపారు. శస్త్రచికిత్స జరిగిన 9 రోజులకు రోగి పూర్తిగా కోలుకోవడంతో డిశ్చార్జి చేశామని చెప్పారు.

బంగ్లా-పాక్ మధ్య విమాన సర్వీసుల పునరుద్ధరణ

కరాచీ: దశాబ్ద కాలం తర్వాత పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లు తమ మధ్య పౌర విమానయాన సేవల్ని పునరుద్ధరించనున్నాయి. ఇరు దేశాల మధ్య నిరంతర విమాన సేవల్ని కొనసాగించనున్నట్లు అధికారులు తెలిపారు. బిమాన్ బంగ్లాదేశ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం బంగ్లాదేశ్ రాజధాని ఢాకా నగరం నుంచి బయల్దేరి రాత్రి 11 గంటలకు కరాచీ చేరుకుంటుందని స్థానిక విమానయాన వర్గాలు తెలిపాయి. బంగ్లాదేశ్, పాకిస్థాన్ మధ్య బలోపేతం అవుతున్న అనుబంధానికి ఇది సూచన అని ఆ వర్గాలు తెలిపాయి. బంగ్లాదేశ్‌లో ఉద్ధృతంగా సాగిన విద్యార్థి ఉద్యమం 2024 ఆగస్టు 5న షేక్ హసీనా ప్రభుత్వాన్ని కూలదోసిన అనంతరం ఇరుదేశాల మధ్య సంబంధాలు మెరుగుపడ్డాయి.

పంజాబ్ సచివాలయ భవనానికి బాంబు బెదిరింపులు

చండీగఢ్, దిల్లీ: పంజాబ్, హరియాణా సచివాలయ భవనానికి గురువారం బాంబు బెదిరింపు మెయిల్ అందింది. పోలీసులు వెంటనే రంగంలోకి దిగి, ఉద్యోగులను సురక్షితంగా బయటకు తరలించారు. తనిఖీల్లో ఎటువంటి అనుమానాస్పద వస్తువును గుర్తించలేదని తెలిపారు. చండీగఢ్‌లోని పలు పాఠశాలలకు బూటకపు బెదిరింపులు అందిన మరుసటి రోజే సచివాలయ భవనానికి ఈ తరహా మెయిల్స్ రావడం గమనార్హం. మరోవైపు దిల్లీలో గురువారం ఐదు పాఠశాలలకు బెదిరింపులు వచ్చాయి. తనిఖీలు చేపట్టిన అధికారులు వీటిని బూటకంగా తేల్చారు.